
'ప్రతి రైతూ వాణిజ్యవేత్తగా మారాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 171

గురువారం 11-9-2025



ధనాధన్... ఫటాఫట్

యూఏఈ 57 ఆలౌట్. 27 బంతుల్లోనే గెలిచిన భారత్ -14లో



నిఖత్ పరాజయం

క్వార్టర్స్‌లో ఓడిన భారత బాక్సర్. నుపుర్, జైస్మీన్‌లకు పతకాలు ఖాయం -14లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ద్వైపాక్షిక ఒప్పందానికి కృషి

భారత్, అమెరికా సహజ భాగస్వామ్య దేశాలని. ద్వైపాక్షిక ఒప్పందంపై చర్చలను త్వరగా ముగిస్తామని ప్రధాని మోదీ చెప్పారు.

- వివరాలు 6లో▶



ఇక దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్!

దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) చేపట్టేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సిద్ధమవుతోంది.

- వివరాలు 6లో▶



రాజ్యాంగాన్ని చూసి గర్విస్తున్నాం

బలహీన ప్రజాస్వామ్య రాజ్యాలు కుప్పకూలుతున్నాయని. బలీయమైన మన రాజ్యాంగాన్ని చూసి గర్విస్తున్నామని సుప్రీంకోర్టు చెప్పింది.

- వివరాలు 6లో▶



15న కేబినెట్ కీలక భేటీ

రాష్ట్ర మంత్రివర్గం ఈ నెల 15న ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో సమావేశం కానుంది.

- వివరాలు 2లో▶

కాలేజీకి వస్తేనే ఫీజు?

రీయింబర్స్‌మెంట్‌కు 75% హాజరు తప్పనిసరి చేసే యోచన

- పథకానికి ఫేషియల్ రికగ్నిషన్ హాజరుతో లింకు
- ప్రధాన సబ్జెక్టుల్లో కనీసం 60 శాతం మార్కులు తప్పనిసరి
- అలాగే కనీసం సగం సబ్జెక్టులు పాస్ కావాలనే నిబంధన పెట్టే యోచన
- ఎక్కడ తేడా వచ్చినా ఫీజు రీయింబర్స్‌మెంట్ రానట్టే
- అధ్యాపకులకూ ఫేషియల్ రికగ్నిషన్ హాజరు!
- రేపు వైస్ చాన్స్‌లర్లతో మండలి చైర్మన్ సమావేశంలో చర్చ
- పథకానికి కత్తెర వేసేందుకు రంగం సిద్ధం



సాక్షి, హైదరాబాద్

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ఎత్తివేసే ప్రసక్తే లేదని చెబుతున్న ప్రభుత్వం .. చడీచప్పుడు లేకుండా ఆ పథకంలో కోతలు వేసే దిశగా అడుగులేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై గత నెల 21వ తేదీన 'సాక్షి'కథనం ప్రచురించగా, ప్రభుత్వం స్పందించి 'అబ్బే అలాంటిదేమీ లేదు.. నిరాధార వార్త'అంటూ కొట్టిపారేసింది. కానీ వచ్చే శుక్రవారం అన్ని విశ్వవిద్యాలయాల వైస్ చాన్స్‌లర్లతో తెలంగాణ ఉన్నత విద్యా మండలి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసింది. విద్యార్థులు, ఉపాధ్యాయుల ఫేషియల్ రికగ్నిషన్ గుర్తింపు హాజరును ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు ఎలా లింక్ చేయాలి, ఎలా తప్పనిసరి చేయాలి? అనే అంశాన్ని భేటీ ఎజెండాలో ప్రధానంగా చేర్చారు. కొత్తగా కాలేజీలకు డిజీ లాకర్‌ను తీసుకొస్తున్నారు. ఇందులో ఫ్యాకల్టీ, విద్యార్థుల హాజరు శాతం నమోదు అవుతుంది. విద్యార్థుల హాజరు కనీసం 75 శాతం లేకపోతే ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకూడదని ప్రభుత్వం భావిస్తోంది. దీనిపై ఇటీవల అధికారుల సమావేశంలో ముఖ్యమంత్రి సూచనలు మిగతా 3వ పేజీలో ▶




భారీగానే కోత

రాష్ట్రంలో ఏటా 12.50 లక్షల మంది ఫీజు రీయింబర్స్‌మెంట్ పొందుతున్నారు. ఇందులో 5 లక్షల మంది కొత్తవాళ్లు ఉంటారు. అన్ని కోర్సులకు కలిపి ఏటా రూ.2,350 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్‌గా ప్రభుత్వం చెల్లించాల్సి వస్తోంది. ఎస్సీ, ఎస్టీలకు ఎంత ర్యాంకు వచ్చినా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉంటుంది. బీసీలకు మాత్రం 10 వేల లోపు ర్యాంకు వస్తేనే ఇంజనీరింగ్‌లో మొత్తం ఫీజు చెల్లిస్తారు. ఆపై ర్యాంకులకు రూ.35 వేలు మాత్రమే ఇస్తారు. మొదటి ఏడాదిలో 50 శాతం సబ్జెక్టులు ఉత్తీర్ణులు అవ్వని విద్యార్థులు దాదాపు 50 శాతం మంది ఉంటున్నారు. ఉన్నత విద్యలో కొత్తగా ప్రవేశించడం, భయం వల్ల వారికి తక్కువ మార్కులు వస్తున్నాయి. కాలేజీల్లో ఫ్యాకల్టీ లేకపోవడం, కాలేజీకి వచ్చినా తరగతులు జరగకపోవడంతో విద్యార్థులు ఆన్‌లైన్ బాట పడుతున్నారు. ఈ నేపథ్యంలో హాజరును కొలమానంగా తీసుకుంటే చాలామంది విద్యార్థులకు అసౌకర్యం తప్పదని అధికారులే చెబుతున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో కోత వల్ల పెద్ద ఎత్తున వ్యతిరేకత వచ్చే అవకాశం ఉందని ఉన్నతాధికారులు అంటున్నారు.

ఇష్టమొచ్చినట్లు ఎఫ్ఐఆర్‌లా?

పోలీసుల తీరుపై హైకోర్టు అసహనం



సోషల్ మీడియాలో రాజకీయ విమర్శలు చేస్తే కేసులు పెడతారా?

- సుప్రీంకోర్టు, హైకోర్టులు జారీ చేసిన మార్గదర్శకాలను ఉల్లంఘిస్తారా?
- రాజ్యాంగంలో రాజకీయ విమర్శలకు రక్షణ ఉందన్న న్యాయమూర్తి
- పోలీసుల తీరుతో కేసులు, కోర్టుల్లో పిటిషన్లు పెరుగుతున్నాయని వ్యాఖ్య
- ఇష్టారాజ్యంగా, ఆటోమేటిక్‌గా, మెకానికల్‌గా అరెస్టులు అనుమతించబడవని స్పష్టీకరణ... కేసు నమోదుకు ముందే ప్రాథమిక దర్యాప్తు చేయాలన్న కనీస విధిని మరిచిపోవద్దంటూ హితవు
- నల్లబాలుపై 3 పోలీస్‌స్టేషన్లలో నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ల కొట్టివేత

సాక్షి, హైదరాబాద్: రాజకీయ ప్రేరేపిత ఫిర్యాదులతో, సోషల్ మీడియాలో చేసిన విమర్శలు ఆధారంగా చేసుకుని ఇష్టమొచ్చినట్లు కేసులు నమోదు చేయడంపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. పోలీసుల తీరుతో కేసులతో పాటు కోర్టుల్లో పిటిషన్లు పెరిగిపోతున్నాయని వ్యాఖ్యానించింది. సోషల్ మీడియాలో విమర్శలు చేసినా.. సంబంధం లేని వ్యక్తి వచ్చి ఫిర్యాదు చేసినా కేసులు నమోదు చేస్తారా అని నిలదీసింది. కనీస చట్టాలు పట్టించుకోరా?.. సుప్రీంకోర్టు, హైకోర్టులు జారీ చేసిన మార్గదర్శకాలను ఉల్లంఘిస్తారా? అని ప్రశ్నించింది. కేసులు నమోదు చేసే ముందు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సూచనలు తీసుకోవాలని సూచించింది. కేసు నమోదుకు ముందే ప్రాథమిక దర్యాప్తు చేయాలన్న కనీస విధిని మరిచిపోవద్దని హెచ్చరించింది. బీఆర్‌ఎస్ పార్టీ పెట్టిన సోషల్ మీడియా పోస్టులను రీ పోస్టు చేసిన దుర్గం శశిధర్‌గౌడ్ అలియాస్ నల్లబాలుపై పోలీసులు నమోదు చేసిన కేసులను కొట్టివేస్తూ బుధవారం తీర్పునిచ్చింది.

కేసు పూర్వాపరాలు..

సోషల్ మీడియా (ఎక్స్)లో కాంగ్రెస్ పార్టీపై, సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ నల్లబాలుపై పోలీసులు మూడు ఎఫ్ఐఆర్‌లను నమోదు చేశారు. 'నో విజన్.. నో మిషన్, ఓన్లీ ట్వంటీ పర్సంట్..', మిగతా 5వ పేజీలో ▶

న్యూస్‌రీల్

మైనార్టీ గురుకులాల్లో తగ్గుతున్న విద్యార్థులు



తెలంగాణ మైనార్టీ గురుకుల విద్యా సంస్థల్లో విద్యార్థుల సంఖ్య భారీగా తగ్గుతోంది. ఒకసారి ఇంటికి వెళ్లిన విద్యార్థులు తిరిగి బడికి రావడం లేదని తెలుస్తోంది. దీంతో హాజరుశాతం క్రమంగా తగ్గుతోంది.

- వివరాలు 12లో▶

సరైన చర్యలతో రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట



సరైన చర్యలు, జాగ్రత్తలు తీసుకుంటే రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నివారించవచ్చని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, రోడ్డు భద్రతా కమిటీ చైర్మన్ జస్టిస్ అభయ్ మనోహర్ సప్రే అన్నారు.

- వివరాలు 11లో▶

దసరా తర్వాత 'వైన్స్'కు దరఖాస్తులు!



రానున్న రెండేళ్ల కాలానికి గాను వైన్‌షాపుల నిర్వహణ కోసం దసరా పండుగ తర్వాత దరఖాస్తులు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ యోచిస్తోంది. ఈ ఏడాది నవంబర్ 30తో ప్రస్తుత షాపులకు గడువు ముగియనుంది.

- వివరాలు 3లో▶

సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ఏర్పాటు



రాష్ట్ర ప్రభుత్వం, ఉద్యోగుల మధ్య సహకారాన్ని పెంపొందించి.. సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేకంగా తెలంగాణ సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ఏర్పాటైంది. ఈ మేరకు సీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు.

- వివరాలు 2లో▶

కలంపై కూటమి కత్తి.. ఖండిద్దాం గొంతెత్తి

సాక్షి ఎడిటర్, పాత్రికేయులకు వెల్లువెత్తుతున్న సంఘీభావం

ఏపీ పోలీసుల కేసులపై ముక్తకంఠంతో ఖండన



- పత్రికాస్వేచ్ఛను హరించేలా ఏపీలో కూటమి ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తున్న తీరును తెలంగాణకు చెందిన పలు రాజకీయ పార్టీల నేతలు, జర్నలిస్టు సంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ తీరు పత్రికల గొంతునొక్కడమేనన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. 16లో



సీతారామకు 'క్లియరెన్స్'!

- త్వరలో సీడబ్ల్యూసీకి రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తు
- ఇప్పటికే ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు
- ఇన్వెస్ట్‌మెంట్ క్లియరెన్స్ లభిస్తే కేంద్రం నుంచి నిధులు

3లో

గాంధీ సరోవర్‌కు 'రక్షణ' భూములివ్వండి

రాజ్‌నాథ్ సింగ్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

మూసీ, ఈసా నదుల సంగమ స్థలిలో ప్రాజెక్టు చేపట్టనున్నట్లు వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న 'గాంధీ సరోవర్' ప్రాజెక్టు కోసం రక్షణ శాఖకు చెందిన భూములను బదలాయించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. జాతీయ సమైక్యత, గాంధేయ విలువల స్ఫూర్తిని చాటేలా నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టుకు కేంద్రం సంపూర్ణ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా బుధవారం రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సీఎం భేటీ అయ్యారు.

98.20 ఎకరాలు కేటాయించండి

మూసీ, ఈసా నదుల సంగమ స్థలిలో గాంధీ సరోవర్ ప్రాజెక్టును చేపట్టనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్టులో భాగంగా 'గాంధీ సర్కిల్ ఆఫ్ యూనిటీ'నిర్మించ తలపెట్టామని, ఇందుకుగాను అక్కడున్న 98.20 ఎకరాల రక్షణ శాఖ భూములు రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించాలని కోరారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టులో గాంధీ సిద్ధాంతాలను ప్రచారం చేసే నాలెడ్జ్ హబ్, ధ్యాన గ్రామం, చేనేత ప్రచార కేంద్రం, మ్యూజియం, శాంతి విగ్రహం వంటివి ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ల్యాండ్ స్కేపింగ్, ఘాట్లు, ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే వినోద ప్రదేశాలను కూడా అభివృద్ధి చేస్తామని రేవంత్ చెప్పారు. దీనిపై రాజ్‌నాథ్ సింగ్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. కాగా ఈ సమావేశంలో ఎంపీలు పోరిక బలరాం నాయక్, కడియం కావ్య, చామల కిరణ్ కుమార్ రెడ్డి, మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఈవీ నరసింహారెడ్డి, కేంద్ర ప్రాజెక్టులు, పథకాల సమన్వయకర్త డాక్టర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు.



బుధవారం ఢిల్లీలో కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

ఇందిరమ్మ రాజ్యమంటే ఇళ్లు కూల్చడమే..



కాంగ్రెస్‌కు ఓటువేస్తే మీ ఇళ్లను కూల్చడానికి లైసెన్స్ ఇచ్చినట్టే

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఆ పార్టీకి బుద్ధి చెప్పండి
- బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్

శ్రీనగర్‌కాలనీ (హైదరాబాద్): ఇందిరమ్మ రాజ్యమంటే ఇళ్లు కూలగొట్టడమేనని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి జరిగే ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు ఓటువేస్తే మీ ఇళ్లను కూలగొట్టడానికి లైసెన్స్ ఇచ్చినట్టేనని స్థానిక ప్రజలను హెచ్చరించారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కోరారు. బుధవారం తెలంగాణ భవన్‌లో జూబ్లీహిల్స్ నియోజకవర్గ రహమత్‌నగర్ డివిజన్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

డబ్బున్న పెద్దల జోలికెళ్లదు..

'కాంగ్రెస్ పార్టీలో చేరలేదనే అక్కసుతో బీఆర్‌ఎస్ కార్యకర్త సర్దార్ ఇంటిని కూల్చేశారు. దీంతో ఆయన మానసికంగా కుంగిపోయి ఆత్మహత్య చేసుకున్నాడు. హైడ్రా ఇల్లు కూలగొడుతుందన్న భయంతో కూకట్‌పల్లిలోని బుచ్చమ్మ అనే మహిళ ప్రాణాలు తీసుకుంది. డబ్బున్న పెద్దల జోలికి ఈ ప్రభుత్వం పోదు. దుర్గం చెరువులో అక్రమంగా ఇల్లు కట్టుకున్న రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి ఇంటిని కూల్చే దమ్ము అధికారులకు ఉందా?

ఎలాగైనా గెలిచేందుకు అడ్డదారులు

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎలాగైనా గెలవాలని కాంగ్రెస్ అడ్డదారులు తొక్కుతోంది. తమకు ఓటు వేయకపోతే మిగతా 3వ పేజీలో ▶

ఇంకాజోక్



• మోసాలు, అబద్ధాలతో..

అట్టర్‌ఫ్లాప్ సినిమాకు బలవంతపు విజయోత్సవాలా?



చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజం

- ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ పేరుతో ఈనాడులో ఇచ్చిన అడ్వర్టైజ్‌మెంట్‌ను, ఈరోజు ఇచ్చిన అడ్వర్టైజ్‌మెంట్‌ను చూస్తే బాబు మోసం కళ్లకు కట్టినట్లు కనిపిస్తోంది
- ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, 50 ఏళ్లకే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పింఛన్ హామీలను సూపర్ సిక్స్ నుంచి లేపేశారు
- 18 ఏళ్లు నిండిన ప్రతి ఆడబిడ్డకు నెలకు రూ.1,500 చొప్పన రెండేళ్లలో రూ.36 వేలు చెల్లించావా? ఇది మోసం కాదా?
- 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు నెలకు రూ.4 వేల చొప్పన రెండేళ్లలో 96 వేల పెన్షన్ చెల్లించావా? ఇది మోసం కాదా?
- నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల చొప్పన రెండేళ్లలో రూ.72 వేలు చెల్లించావా? ఇది మోసం కాదా?
- అన్నదాత సుఖీభవ కింద ఒక్కో రైతుకు రూ.40 వేలు ఇవ్వాల్సి ఉంటే కేవలం రూ.5 వేలే ఇచ్చావ్.. ఇది మోసం కాదా?
- తల్లికి వందనంలో ఆంక్షల పేరుతో 30 లక్షల మందికి ఎగరగొట్టావ్
- ఇచ్చిన అరకొర మందికి కూడా రూ.9 వేలు, రూ.10 వేలు ఇచ్చావ్
- ఏటా 3 సిలిండర్లు అన్నావ్.. రెండేళ్లలో 6 సిలిండర్లు ఇవ్వాల్సి ఉంటే కేవలం ఒక్కటే ఇచ్చావ్.. ఇది మోసం కాదా?
- ఎక్కడికైనా ఉచిత బస్సు అన్నావ్.. ఇప్పుడు సవాలక్ష ఆంక్షలు పెట్టావ్.. ఇది మోసం కాదా?.. జగన్ ఇస్తున్న సంక్షేమ పథకాలన్నీ కొనసాగిస్తానని ప్రతి ఎన్నికల సభలో చెప్పావ్..
- ఇప్పుడు ఆ పథకాలన్నీ రద్దు చేశావ్.. ఇది మోసం కాదా?

12లో




నేపాల్ ప్రధానమంత్రిగా జస్టిస్ సుశీల!

- మధ్యంతర ప్రభుత్వ అధినేతగా నియమించాలని యువత సూచన

కల్లోల నేపాల్‌లో మధ్యంతర ప్రభుత్వ ఏర్పాటు దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ అధినేతగా ఎవరిని ఎంపిక చేయాలన్న దానిపై 'జనరేషన్ జెడ్' ఆన్‌లైన్‌లో సంప్రదింపులు ప్రారంభించింది. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుశీల కర్కీని తాత్కాలిక ప్రధానిగా నియమించాలని చాలామంది సూచిస్తున్నారు. -6లో

రోజుకు 54,794 పిడుగులు!



వర్షం పడుతోందంటే మెరుపులు, పిడుగు పడడం సహజం. పిడుగు శబ్దం ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. కిలోమీటర్ల దూరంలో పడ్డా మన పక్కనే పడినట్టు ఉంటుంది. 2024-25లో ఇలా మనదేశంలో ఎన్ని పిడుగులు పడ్డాయో తెలుసా? 2 కోట్లకుపైగానే! అంటే రోజుకు సగటున 54,794! 2025-26లో జూలై 30 నాటికి దేశ వ్యాప్తంగా పిడుగుల వల్ల 1,626 మంది మనుషులు, 52,367 మూగజీవాలు ప్రాణాలు కోల్పోయాయి.

ఒక డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత పెరిగితే తేమ 7 శాతం పెరుగుతుంది. ఫలితంగా పిడుగులు 10-12 శాతం పెరుగుతాయని అధ్యయనాలు చెబుతున్నాయి. భారత్‌లో వేసవికాలంలో భానుడి ప్రతాపం, అలాగే అరేబియా సముద్రం, బంగాళాఖాతం వేడెక్కడం వంటివి కూడా పిడుగులకు అనువైన పరిస్థితులు సృష్టిస్తున్నాయి. బంగాళాఖాతం సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు 4 డిగ్రీలు పెరిగిందని, తూర్పు రాష్ట్రాల్లో తుపాన్లకు కారణమయ్యే తేమకు ఆజ్యం పోస్తున్నాయని క్లైమేట్ రెసీలియెంట్ అబ్జర్వింగ్ సిస్టమ్స్ ప్రమోషన్ కౌన్సిల్ (సీఆర్‌ఓపీసీ) వ్యవస్థాపకులు సంజయ్ శ్రీవాస్తవ వెల్లడించారు. పర్యావరణ విపత్తుల వల్ల కలిగే నష్టాలను తగ్గించేందుకు పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థ ఇది.

46 శాతం పిడుగుపాటు మరణాలే!


ఈ ఏడాది ఏప్రిల్–జూలై మధ్య వర్షాలు, పిడుగుల కారణంగా దేశవ్యాప్తంగా 1,626 మంది మరణించారని కేంద్ర హోంశాఖ ఇటీవల రాజ్యసభలో వెల్లడించింది. 1967 నుంచి 2020 వరకు పిడుగుపాటుతో భారత్‌లో 1,01,000 మంది మరణించారని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) డేటా చెబుతోంది. 2002–24 మధ్య దేశంలో వాతావరణ సంబంధ మరణాలలో దాదాపు 46 శాతం పిడుగుల వల్ల సంభవించాయని ఎన్‌సీఆర్‌బీ తెలిపింది. ఐఎండీ, సీఆర్‌ఓపీసీ ప్రకారం 2019–20లో 51.7 లక్షల పిడుగుపాటు సంఘటనలు నమోదయ్యాయి. 2024–25లో ఈ సంఖ్య 2 కోట్లకుపైగా పెరిగింది.

- 2024-25లో 2 కోట్లకుపైగా ఘటనలు నమోదు
- దేశంలో 5 ఏళ్లలో నాలుగురెట్లు పెరిగిన పిడుగుపాట్లు
- ప్రకృతి వైపరీత్య మరణాల్లో అధిక శాతం వీటి కారణంగానే
- క్రమంగా నగరాలకూ విస్తరిస్తున్న పిడుగు ప్రమాదాలు

సాక్షి, స్పెషల్ డెస్క్

ముందస్తు హెచ్చరికలు

ఐఎండీ ప్రస్తుతం 86 శాతం కచ్చితత్వంతో పిడుగులను అంచనా వేస్తోంది. పిడుగులు పడే అవకాశం ఉందని అయిదు రోజుల ముందే హెచ్చరిస్తోంది. జిల్లాల పేర్లను రెండు రోజుల ముందుగా వెల్లడిస్తోంది. ప్రమాదం సంభవించే అవకాశం ఉన్నరోజున ప్రభావిత ప్రాంతాల వివరాలతో ప్రతి మూడు గంటలకు హెచ్చరికలు జారీ చేస్తోంది. ఐఎండీ, ఐఐటీ మద్రాస్ భాగస్వామ్యంతో పిడుగులు అధికంగా పడే ప్రాంతాలను సీఆర్‌ఓపీసీ గుర్తించింది. ముప్పు నివారణ ప్రణాళికలో భాగంగా దామినీ యాప్, వాట్సాప్ గ్రూప్స్ ద్వారా పంచాయతీ నియమించిన భద్రతా సమన్వయకర్తలకు రియల్–టైమ్ హెచ్చరికలను పంపుతున్నారు. జాతీయ పిడుగుపాటు నష్టనివారణ కార్యక్రమం కింద హెచ్చరికల కోసం మైక్రోఫోన్స్, సీసీటీవీ కెమెరాలు, లౌడ్‌స్పీకర్లతో కూడిన స్మార్ట్ స్తంభాలను గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నారు. తాటి చెట్లను నాటడం మొదలు అనేక అవగాహన ప్రచారాలు కూడా చేపట్టారు.



పట్టణ ప్రాంతాల్లోనూ..

నగరవాసులు కమ్యూనికేషన్ సిస్టమ్స్ వంటి విద్యుదయస్కాంత మౌలిక సదుపాయాలను ఎక్కువగా వాడుతున్నారని ఇది పిడుగు ప్రమాదాన్ని పెంచుతుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ మహపాత్ర చెబుతున్నారు. కాంక్రీట్, తారు, గాజు వంటివి వేడిని గ్రహించి, ప్రసరింపజేయడం వల్ల కలిగే ఉష్ణ ప్రభావం నగరాలను గ్రామీణ ప్రాంతాల కంటే వేడిగా మారుస్తోందట. ఈ పరిస్థితులు పిడుగుపాట్లకు దారితీస్తున్నాయట.

విమానయాన సంస్థలకు..

వర్షాకాలంలో పిడుగుపాట్ల వల్ల ఏటా దాదాపు 2,000 విమానాలను దారి మళ్లిస్తున్నారు. దీనివల్ల విమానయాన సంస్థలకు ఏటా సుమారు రూ.300 కోట్ల నష్టం వాటిల్లుతోందట.

క్లుప్తంగా...

అణచివేతపై ధిక్కార పతాక ఐలమ్మ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: అణచివేత.. దమనకాండలపై ఎగురవేసిన ధిక్కార పతాక.. చాకలి ఐలమ్మ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఢిల్లీలోని తన అధికార నివాసంలో సీఎం.. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ గడ్డపై దొరల అహంకారానికి... నిరంకుశత్వానికి వ్యతిరేకంగా 80 ఏళ్ల క్రితమే జంగ్ సైరన్ ఊదిన యోధురాలు ఐలమ్మ అని సీఎం అభివర్ణించారు. సమ్మక్క... సారక్క... చాకలి ఐలమ్మల స్ఫూర్తితోనే తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించామని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎంపీలు పోరిక బలరాం నాయక్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ నేత రోహిన్ రెడ్డి పాల్గొన్నారు.

ఎల్లంపల్లికి బీఆర్‌ఎస్‌కు ఏం సంబంధం?

చెప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



సాక్షి, హైదరాబాద్: ఎల్లంపల్లి ప్రాజెక్టును తామే నిర్మించినట్టుగా మాజీ మంత్రి హరీశ్ రావు తెగ ఊదరగొడుతున్నారని, అసలు ఎల్లంపల్లి ప్రాజెక్టుతో బీఆర్‌ఎస్‌కు ఏం సంబంధం ఉందని చెప్పదండి కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రశ్నించారు. ఆ ప్రాజెక్టు కాంగ్రెస్ పార్టీ మానస పుత్రిక అని, ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసింది, పూర్తి చేసింది కూడా కాంగ్రెస్ ప్రభుత్వమేనని చెప్పారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రారంభోత్సవానికి ఇద్దరు ముఖ్యమంత్రులను ఆహ్వానించిన కేసీఆర్.. ఎల్లంపల్లిని ఎందుకు అలా ప్రారంభించలేదన్నారు. 2004, జూలై 28న అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని, ఆ ప్రాజెక్టు ద్వారానే 10 టీఎంసీల నీటిని జీహెచ్‌ఎంసీకి తరలిస్తున్నామని చెప్పారు.

సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్
కౌన్సిల్ ఏర్పాటు

టీసీఎస్‌జేఎస్సీని ఏర్పాటు చేస్తూ సీఎస్ ఆదేశాలు

- 30 మందిని సభ్యులుగా నియమించిన ప్రభుత్వం
- 15 మంది అధికారులు.. 15 మంది ఉద్యోగ సంఘాల సభ్యులు
- 2014లో ఉద్యోగ సంఘాల గుర్తింపును రద్దు చేసిన ప్రభుత్వం
- తెలంగాణ రాష్ట్రంలో తొలిసారి సీఎస్‌జేఎస్సీ ఏర్పాటు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ఉద్యోగుల మధ్య సహకారాన్ని పెంపొందించి.. సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేకంగా తెలంగాణ సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్(టీసీఎస్‌జేఎస్సీ) ఏర్పాటైంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే.రామకృష్ణారావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన తర్వాత తొలిసారి టీసీఎస్‌జేఎస్సీ ఏర్పాటైంది. ఉమ్మడి రాష్ట్రంలో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ఉన్నప్పటికీ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత ఉద్యోగ సంఘాల గుర్తింపు రద్దు చేయడంతో ఇది ఏర్పాటు కాలేదు. ఈ అంశంపై ఉద్యోగ సంఘాలు చాలాకాలంగా పోరాడుతుండడంతో స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. టీసీఎస్‌జేఎస్సీ ఏర్పాటుకు ఆదేశించారు. మొత్తం 30 మంది సభ్యులతో ఈ కౌన్సిల్ కొనసాగుతుంది. ప్రస్తుత క్యాలెండర్ సంవత్సరానికిగాను దీనిని నియమించినట్లు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే, ప్రతి సంవత్సరం సీఎస్‌జేఎస్సీని రెన్యువల్ చేసే సంప్రదాయం ఉమ్మడి రాష్ట్రంలో ఉండేది.

అధికారులు, సంఘాలు సగం సగం

కొత్తగా ఏర్పాటు చేసిన టీసీఎస్‌జేఎస్సీలో 30 మంది సభ్యులను ప్రభుత్వం నియమించింది. వీరిలో 15 మంది అధికారులు, మిగిలిన 15 మంది ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఉన్నారు. ఈ కౌన్సిల్‌కు చైర్మన్‌గా సీఎస్ లేదా ఆ ర్యాంకులో ఉన్న అధికారిని ప్రభుత్వం నామినేట్ చేస్తుంది. సభ్యులుగా ఎంఏయూడీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్, ఆర్థికశాఖ, జీఏడీ, విద్యాశాఖ, న్యాయశాఖ, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ, ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శులు, పాఠశాల విద్యాశాఖ కమిషనర్, ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్, జనరల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం (సర్వీస్ వెల్ఫేర్)లోని అడిషనల్, జాయింట్, డిప్యూటీ సెక్రటరీలు, ఇతర సెక్రటరీలు ఉంటారు. ఉద్యోగుల నుంచి రెండు రకాలుగా సభ్యులను ఎంపిక చేశారు. ఇందులో శాశ్వత సభ్యులు, రొటేషన్ ఆధారిత సభ్యులకు అవకాశం కల్పించారు. శాశ్వత సభ్యులుగా తెలంగాణ నాన్–గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్, తెలంగాణ సెక్రటేరియట్ అసోసియేషన్, ప్రోగ్రెస్సివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్, స్టేట్ టీచర్స్ యూనియన్, తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్, తెలంగాణ క్లాస్ ఫోర్త్ ఎంప్లాయిస్ సెంట్రల్ అసోసియేషన్లకు అవకాశం ఇచ్చారు. రొటేషన్ ఆధారంగా తెలంగాణ స్టేట్ యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్, తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్, తెలంగాణ సెక్రటేరియట్ ఆఫీసర్స్ అసోసియేషన్, డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్, తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్, తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం, స్కూల్ టీచర్స్ ఫెడరేషన్, గవర్నమెంట్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్లకు అవకాశం కల్పించారు. ఇదే తరహాలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయిలో కూడా ఈ కౌన్సిల్స్ కొనసాగుతాయి.

ఉద్యోగ జేఏసీ హర్షం

ఉద్యోగ సంఘాలకు గుర్తింపునివ్వడంతో పాటు తెలంగాణ టీసీఎస్‌జేఎస్సీ ఏర్పాటు చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దశాబ్దాలుగా గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల గుర్తింపును 2014లో కేసీఆర్ ప్రభుత్వం దుర్మార్గంగా రద్దు చేసిందని విమర్శించారు. జేఏసీ పక్షాన ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఇతర మంత్రులకు సీఎస్, ఇతర ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

15న కేబినెట్ కీలక భేటీ

జీవోతో బీసీ రిజర్వేషన్ల పెంపుపై నిర్ణయం?

- పంచాయతీ ఎన్నికల నిర్వహణపై చర్చ
- తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్ నిర్మాణానికి ఆమోదం!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మంత్రివర్గం ఈ నెల 15న సచివాలయంలో సమావేశం కానుంది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ భేటీలో ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్ నిర్మాణం, పంచాయతీ ఎన్నికల నిర్వహణ, ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచేందుకు ఎదురవుతున్న అడ్డంకులు తదితర అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నారు.

బీసీ రిజర్వేషన్లు..పంచాయతీ ఎన్నికలు

సెప్టెంబర్ 30 లోగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలంటూ హైకోర్టు విధించిన గడువు ముంచుకొస్తోంది. అయితే ఈ ఎన్నికల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని భావిస్తున్న ప్రభుత్వం..అందుకు వీలుగా రాష్ట్ర పంచాయతీరాజ్, మున్సిపాలిటీ చట్టాల సవరణ బిల్లులను శాసనసభలో ఆమోదించి గవర్నర్ ఆమోదం కోసం పంపింది. గవర్నర్ ఆమోదముద్ర వేసిన తర్వాతే బిల్లులు చట్ట రూపం దాల్చి అమల్లోకి రానున్నాయి. అయితే బిల్లులను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదిస్తారా? లేక మళ్లీ రాష్ట్రపతి పరిశీలన కోసం పంపిస్తారా? అన్న అంశంపై స్పష్టత కొరవడింది. ఒక వేళ గవర్నర్ బిల్లులను ఆమోదించని పక్షంలో ఏం చేయాలన్న అంశంపై మంత్రివర్గ సమావేశంలో చర్చించనున్నారు. చట్ట సవరణ సాధ్యంకాని పక్షంలో ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ (ప్రభుత్వ జీవో) ద్వారా బీసీ రిజర్వేషన్లను పెంచి పంచాయతీరాజ్ ఎన్నికలకు వెళ్లే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఈ నేపథ్యంలో కేబినెట్ భేటీలో దీనిపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

'తుమ్మిడిహెట్టి బరాజ్'పై ముందుకు..!

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్ అంశంపై మంత్రివర్గంలో చర్చించి ఆమోదించనున్నట్టు తెలిసింది. ఈ ప్రాజెక్టును గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు, వార్ధా ప్రాజెక్టు పేర్లతో రెండుగా విభజించి కేవలం కాళేశ్వరం నిర్మాణాన్ని మాత్రమే చేపట్టింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగు, తాగునీటి సరఫరా కోసం ప్రతిపాదించిన వార్ధా ప్రాజెక్టును పక్కన పెట్టి దాని స్థానంలో తుమ్మిడిహెట్టి బరాజ్ నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. శ్రీశైలం ఎడమగట్టు కాల్వ సొరంగం పనులు పునరుద్ధరణపై కూడా కేబినెట్ చర్చించనుంది. రాష్ట్రంలో యూరియా కొరత, కొత్త రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ గృహాల నిర్మాణం, ఉద్యోగుల సమస్యలు, ఉద్యోగ నియామకాలు తదితర అంశాలను మంత్రివర్గం పరిశీలించే అవకాశం ఉంది.

చమురు, గ్యాస్ భద్రత మరింత బలోపేతం

ఓఎస్‌సీసీ భేటీలో డీజీపీ జితేందర్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని చమురు, గ్యాస్ సంస్థల భద్రతను మరింత బలోపేతం చేయాలని డీజీపీ జితేందర్ అభిప్రాయపడ్డారు. సైబర్ రక్షణ, అత్యవసర ప్రతిస్పందన విధానాలు, దొంగతనాల నిరోధం, ఇంటర్–ఏజెన్సీ సమన్వయాన్ని పెంపొందించడంపై పలు సూచనలిచ్చారు. గెయిల్ (ఇండియా) ఆధ్వర్యంలో ఆన్‌షోర్ సెక్యూరిటీ కోఆర్డినేషన్ కమిటీ (ఓఎస్‌సీసీ) భేటీ బుధవారం డీజీపీ కార్యాలయంలో జరిగింది. డీజీపీ జితేందర్, అదనపు డీజీపీలు మహేశ్ భగవత్, చారు సిన్హా, గెయిల్ (ఇండియా) లిమిటెడ్ సలహాదారు సౌరభ్ టోలంబియా హాజరయ్యారు. చమురు, గ్యాస్ రంగం భద్రతా చర్యలను సమీక్షించడం, పెంచడం, చట్టాలను అమలు చేసే సంస్థలు, జిల్లా అధికారులు, పరిశ్రమ వాటాదారుల మధ్య సమన్వయాన్ని పెంపొందించడమే లక్ష్యంగా చర్చించారు. ఈ సందర్భంగా క్షేత్ర స్థాయిలో తాము ఎదుర్కొంటున్న కార్యాచరణ సవాళ్లు, భద్రతా సమస్యలను చమురు, గ్యాస్ కంపెనీల ప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. పోలీసులు, జిల్లా యంత్రాంగం మద్దతు ఎప్పటికప్పుడు అవసరమని, వారు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. ఆ మేరకు అన్ని చర్యలు తీసుకుంటామని డీజీపీ హామీ ఇచ్చారు.

సాదా బైనామాలకు మోక్షం!

క్రమబద్ధీకరణకు నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం

భూభారతి చట్టం ప్రకారం అధికారాలు కల్పిస్తూ జీవో

11 లక్షల ఎకరాలకు సంబంధించిన 9.89 లక్షల దరఖాస్తులకు త్వరలో పరిష్కారం

సాక్షి, హైదరాబాద్: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్య పరిష్కారానికి మార్గం సుగమం అయింది. సాదా బైనామాలను క్రమబద్ధీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. భూభారతి చట్టంలోని సెక్షన్ 6 (సబ్ సెక్షన్ 1) ప్రకారం..ఈ మేరకు అధికారాలు కల్పిస్తూ రెవెన్యూ శాఖ కార్యదర్శి డీఎస్ లోకేశ్‌కుమార్ బుధవారం జీవో ఎం.ఎస్. నంబర్ 106 విడుదల చేశారు. ఈ ఉత్తర్వుల మేరకు.. 2014 జూన్ 2వ తేదీ కంటే ముందు అన్ రిజిస్టర్డ్ డాక్యుమెంట్ ద్వారా (సాదా బైనామా) వ్యవసాయ భూముల క్రయవిక్రయ లావాదేవీలు జరిపి, 2020 అక్టోబర్ 12 నుంచి అదే ఏడాది నవంబర్ 10 వరకు ప్రభుత్వానికి చేసుకున్న దరఖాస్తులను (సాదా బైనామాలను) పరిష్కరిస్తారు. అయితే 12 ఏళ్లుగా ఈ భూములు తమ కబ్జాలో ఉన్నట్టు ఆధారాలు చూపించాల్సి ఉంటుంది. ఇటీవల సాదా బైనామాల పరిష్కారానికి కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నోటిఫికేషన్ ప్రకారం ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న 9.89 లక్షల దరఖాస్తులకు త్వరలోనే మోక్షం కలుగుతుందని, దాదాపు 11 లక్షల ఎకరాల భూమికి యాజమాన్య హక్కులు కల్పిస్తూ 13–బీ సర్టిఫికెట్లు జారీ చేస్తారని రెవెన్యూ వర్గాలు పేర్కొంటున్నాయి.



కటాఫ్ తేదీపై విస్మయం

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన సాదా బైనామాల క్రమబద్ధీకరణ నోటిఫికేషన్‌లో కటాఫ్ తేదీని 2024 జూన్ 2గా పేర్కొనడంపై విస్మయం వ్యక్తమవుతోంది. భూభారతి చట్టంలో పేర్కొన్న ప్రకారం.. 2014 జూన్ 2 కంటే ముందు సాదా బైనామాలు చేసుకున్న వారికి మాత్రమే క్రమబద్ధీకరించుకునే అవకాశం ఉంది. కానీ ఈ చట్టం ప్రకారమే జారీ చేసిన తాజా నోటిఫికేషన్‌లో మాత్రం.. 2024 జూన్ 2 కంటే ముందు అన్ రిజిస్టర్డ్ డాక్యుమెంట్ ద్వారా జరిపిన లావాదేవీలను క్రమబద్ధీకరిస్తామని పేర్కొనడం గమనార్హం.

నిషేధిత భూముల జాబితా
సిద్ధం చేస్తున్నాం

హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిన సీఎస్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల చట్టంలోని సెక్షన్ 22ఏ కింద నిషేధిత జాబితాలో చేర్చిన ప్రభుత్వ భూములతోపాటు దేవాదాయ శాఖ, వక్ఫ్‌బోర్డు భూముల జాబితాను సిద్ధం చేస్తున్నామని హైకోర్టుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తెలిపారు. ఈ మేరకు జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ ధర్మాసనానికి జీపీ మురళీధర్‌రెడ్డి ద్వారా బుధవారం అఫిడవిట్ సమర్పించారు. రాష్ట్రంలో తీవ్ర వర్షాలు, వరదల కారణంగా ఈ నెల 3న విచారణకు హాజరు కాలేకపోయానని, అఫిడవిట్ సమర్పణకు వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనుమతించిన న్యాయమూర్తి.. తదుపరి విచారణకు హాజరు నుంచి మినహాయింపు ఇచ్చారు. అలాగే కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశిస్తూ, విచారణను ఈ నెల 17కు వాయిదా వేశారు. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం వట్టినాగులపల్లిలోని శంకర్‌హిల్స్ కాలనీలోని 475 గజాల భూమి కొనుగోలుకు సంబంధించి సేల్ డీడ్ స్వీకరించకపోవడాన్ని సవాల్ చేస్తూ గుప్తా రియాల్టీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం విదితమే. గత విచారణ సందర్భంగా సీఎస్‌పై అసహనం వ్యక్తం చేసిన న్యాయమూర్తి.. బుధవారం నిషేధిత జాబితాపై అఫిడవిట్ వేయాలని లేదా విచారణకు తప్పకుండా హాజరు కావాలని ఆదేశించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ అనిల్‌కుమార్ మరోసారి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా సీఎస్ తరపున అఫిడవిట్‌ను జీపీ సమర్పించారు. కోర్టు ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నామని, జీఓ 98 ప్రకారం కమిటీ ఏర్పాటు చేశామని, ఈ నెల 1న జిల్లా కలెక్టర్‌కు నిషేధిత భూముల జాబితా కోసం మెమో జారీ చేశామని అఫిడవిట్‌లో సీఎస్ పేర్కొన్నారు. దీన్ని నమోదు చేసుకున్న న్యాయమూర్తి.. కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులు, రెవెన్యూ ముఖ్య కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, జిల్లా రిజిస్ట్రార్, శేరిలింగంపల్లి జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌ను ఆదేశించారు.

వణికించిన పిడుగులు

రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది మంది మృతి



పార్వతి (ఫైల్)



సౌభాగ్య (ఫైల్)



సర్వేష్ (ఫైల్)



దారావత్ మహేష్ (ఫైల్)



పాయం నర్సయ్య (ఫైల్)



గుడిపూడి వీరభద్రరావు (ఫైల్)

గుండాల/సత్తుపల్లి రూరల్/మధిర/అయిజ/పెంబి: రాష్ట్రాన్ని బుధవారం పిడుగులు వణికించాయి. ఉమ్మడి ఖమ్మం, జోగులాంబ గద్వాల, నిర్మల్ జిల్లాలలో పిడుగుపాటుకు తొమ్మిది మృతి చెందారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం చీమలగూడెం గ్రామానికి చెందిన రైతు పాయం నర్సయ్య (48) మొక్కజొన్న చేనులో కోతులను తరిమేందుకు వెళ్లాడు. సాయంత్రం 4 గంటల సమయంలో ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. దీంతో చేలో ఉన్న మంచెపైకి ఎక్కాడు. మంచెను ఆనుకుని ఉన్న చెట్టుపై పిడుగు పడటంతో నర్సయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఘటనలో ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం సత్యనారాయణపురం గ్రామానికి చెందిన దారావత్ మహేశ్ (32) బుధవారం గ్రామ శివారులో గేదెలు మేపుతుండగా పిడుగు పడటంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ఆయనను సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మధిర మున్సిపాలిటీ పరిధిలోని మడుపల్లి గ్రామానికి చెందిన రైతు గుడిపూడి వీరభద్రరావు (53) భార్య పద్మతో కలిసి తన మిరప తోటలో కలుపు తీసేందుకు వెళ్లాడు. సాయంత్రం 4 గంటల సమయంలో వీరభద్రరావుకు అతి సమీపంలోనే పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం భూంపురం గ్రామానికి చెందిన సర్వేష్ (18), పార్వతి (35), పులికల్ గ్రామానికి చెందిన సౌభాగ్య (38)తో పాటు రాజు, జ్యోతి, మరో ఇద్దరు అదే గ్రామానికి చెందిన తిమ్మప్ప పొలంలో సీడ్ పత్తి పనులు చేసేందుకు వెళ్లారు. సాయంత్రం ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో సర్వేష్, పార్వతి, సౌజన్య దగ్గరలో ఉన్న తాటిచెట్టు కిందకు వెళ్లారు. అదే సమయంలో చెట్టుపై పిడుగుపడటంతో ముగ్గురూ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. వారిని గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు.

పత్తి చేనులో కలుపుతీస్తుండగా..: పత్తి చేనులో కలుపు తీస్తున్న ముగ్గురిని పిడుగుపాటు బలితీసుకుంది. నిర్మల్ జిల్లా పెంబి మండలం నాగాపూర్ గ్రామానికి చెందిన బండారి వెంకటి (50), ఆయన మేనల్లుడు ఆలకుంట ఎల్లయ్య (37), అతని భార్య లక్ష్మి (32) బుధవారం ఉదయం గుమ్మెనఎంగ్లాపూర్ గ్రామశివారులోని పత్తిచేనులో కలుపుతీయడానికి వెళ్లారు. సాయంత్రం 5 గంటల సమయంలో ఉరుములు, మెరుపులతో వర్షం ప్రారంభమైంది. దీంతో ముగ్గురూ చేనులోని మంచె కిందకు వెళ్లారు. అంతలోనే మంచెపై పిడుగు పడటంతో ముగ్గురూ అక్కడికక్కడే మృతిచెందారు.

నేపాల్‌లోని తెలంగాణవాసుల కోసం హెల్ప్‌లైన్

- ఢిల్లీ తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- అందరూ క్షేమం.. వదంతులు నమ్మొద్దు: మంత్రి జూపల్లి

సాక్షి, న్యూఢిల్లీ/హైదరాబాద్: నేపాల్‌లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో అక్కడ ఉన్న తెలంగాణ వాసులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు తక్షణమే స్పందించిన అధికార యంత్రాంగం, ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ప్రత్యేక ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసింది. సహాయం లేదా సమాచారం కోసం వందన (రెసిడెంట్ కమిషనర్ ప్రైవేట్ సెక్రటరీ): +91 9871999044, జి.రక్షిత్ నాయక్ (లైజన్ ఆఫీసర్): +91 9643723157, సిహెచ్. చక్రవర్తి (ప్రజా సంబంధాల అధికారి): +91 9949351270లను సంప్రదించాలని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం సూచించారు. ప్రస్తుతం నేపాల్‌లోని తెలంగాణ వాసులంతా క్షేమంగా ఉన్నారని తెలిపారు. ముందు జాగ్రత్త చర్యగా భారత విదేశాంగ శాఖ, నేపాల్‌లోని భారత రాయబార కార్యాలయంతో రాష్ట్ర అధికారులు నిరంతరం సమన్వయం చేస్తున్నట్లు వెల్లడించారు. అక్కడి పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు వదంతులను నమ్మవద్దని, అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని సూచించారు.

ఆ దంపతులు బాధితులే

సృష్టి ఫెర్టిలిటీ కేసులో సరోగసీ దంపతులకు హైకోర్టు ఊరట



సాక్షి, హైదరాబాద్: సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసులో సరోగసీ పేరుతో డాక్టర్ నమ్రత చేతిలో మోసపోయిన పిటిషనర్ దంపతులను బాధితులుగానే చూడాలని హైకోర్టు అభిప్రాయపడింది. కొందరు దంపతులకు సరోగసీ ద్వారా సంతానం పొందేలా చేస్తామని నమ్మించి వేరేవాళ్లకు పెట్టిన బిడ్డలను అక్రమంగా అప్పగించారని డాక్టర్ నమ్రత ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ కేసులో కొందరు శిశువులను అధికారులు గుర్తించి శిశువిహార్‌కు తరలించారు. దీంతో తమ బిడ్డను తమకు అప్పగించాలని హైదరాబాద్ పుప్పాలగూడకు చెందిన ఓ మహిళ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ మాధవీదేవి ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. శిశువును పిటిషనర్‌కు తిరిగి అప్పగించాలని అధికారులను ఆదేశించింది. అవసరమైతే అధికారులు శిశువును ఎప్పుడైనా వెళ్లి చూడవచ్చని వెసులుబాటు ఇచ్చింది. ఈ ఉత్తర్వులు ఇతర కేసులకు వర్తించవని స్పష్టం చేసింది. తదుపరి విచారణను న్యాయమూర్తి ఈ నెల 15కు వాయిదా వేశారు. ఆలోగా కౌంటర్ దాఖలు చేయాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి, శిశువిహార్ సూపరింటెండెంట్, సిట్‌కు నోటీసులు జారీ చేశారు.

క్లుప్తంగా...

దోచుకున్న సొమ్ము రికవరీ చేయాల్సిందే

బీఆర్‌ఎస్‌ అవినీతి అక్రమాలపై విచారణ సాగుతోంది: కోమటిరెడ్డి



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ కొనసాగుతోందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. ఆ విచారణ సంస్థల నివేదికల ఆధారంగానే చర్యలు ఉంటాయని వెల్లడించారు. నల్లగొండలో బుధవారం నిర్వహించిన సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం తనను కలిసిన మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్ట్, ఫార్ములా ఈ కార్ రేస్ వంటివాటిపై విచారణ సంస్థలే చర్యలు తీసుకుంటాయని మంత్రి స్పష్టంచేశారు. పక్క రాష్ట్రాల్లో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతరులు రోజూ నలుగురైదుగురు అరెస్టు అవుతున్నారని, ఇక్కడ ఎవరైనా అలా అరెస్టు అయ్యారా? అని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వచ్చి 21 నెలలు అవుతోందని, ఎవరిపై కేసులు పెట్టలేదని, కాంగ్రెస్‌ ప్రభుత్వ ప్రజా పాలనలో కక్ష సాధింపు రాజకీయాలకు తావులేదని స్పష్టం చేశారు. విచారణ అనంతరం చట్ట ప్రకారం చర్యలు చేపడతామని, ఎంతటి వారైనా దోచుకున్న సొమ్మును కక్కించాలన్నదే తమ లక్ష్యమన్నారు.

ఆర్థిక వృద్ధికి ప్రజాప్రభుత్వం కృషి

- తలసరి ఆదాయం రూ.3.87 లక్షలకు చేరడం పట్ల టీపీసీసీ చీఫ్‌ హర్షం
- సీఎం, డిప్యూటీ సీఎంలకు అభినందన లేఖ



సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణ రాష్ట్రంలో ఆర్థిక వృద్ధికి కాంగ్రెస్‌ పార్టీ నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం కృషి చేస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్‌ తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను తెలంగాణ రాష్ట్ర తలసరి ఆదాయం దేశంలోనే అత్యధికంగా రూ.3.87 లక్షలకు చేరడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కలకు బుధవారం ఆయన అభినందన లేఖలు రాశారు. 'ఆర్థిక క్రమశిక్షణ, సమగ్ర ఆర్థిక విధానాలు, వ్యవసాయం, పారిశ్రామిక, సేవల రంగాల సమతుల్యతలు ఆర్థికాభివృద్ధికి దోహదం చేశాయి. పంట రుణ మాఫీతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఆర్థిక ప్రణాళికలు రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడంలో సహకరించాయి. మీ కృషితో సాధించిన విజయం పట్ల రాష్ట్రంలోని ప్రతి కాంగ్రెస్‌ కార్యకర్త గర్వపడుతున్నారు'అని లేఖలో మహేశ్‌గౌడ్‌ కొనియాడారు.


ఇద్దరం రాజీనామా చేద్దాం..

కిషన్‌రెడ్డికి ఎమ్మెల్యే రాజాసింగ్‌ సవాల్‌



సాక్షి, హైదరాబాద్‌: 'కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని రాజీనామా చేయమనండి, నేను రాజీనామా చేస్తాను. ఇద్దరిలో ఎవరు గెలుస్తారో చూద్దాం'అంటూ గోషామహల్‌ ఎమ్మెల్యే రాజాసింగ్‌ సవాలు విసిరారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్ర నాయకత్వంపై పలు ఆరోపణలు చేశారు. 'రాజాసింగ్‌ ఏకనిరంజన్, హైదరాబాద్‌లో ఉన్న ఏకైక ఎమ్మెల్యే. అయినా మర్యాద లేదు. కొంతమంది నా మిత్రులు బీజేపీ కార్యాలయంలో ప్రెస్‌మీట్‌ పెట్టి రాజాసింగ్‌కు బీజేపీతో ఏం సంబంధం అంటున్నారు. నేను రాజీనామా చేసింది పార్టీలో కొన్ని తప్పులు జరుగుతున్నాయని మాత్రమే. పార్టీని నమ్ముకున్న వారి కోసం నేను కొట్లాడుతున్నా. పార్టీకి రూరల్‌ నాయకులు అవసరం లేదా. మొన్న ఏర్పాటుచేసిన కమిటీలో 10 నుంచి 12 మంది సికింద్రాబాద్‌ పార్లమెంటుకు చెందినవారే ఉన్నారు. ఇది రాంచందర్‌రావు కమిటీనా? కిషన్‌రెడ్డి కమిటీనా? ఇలాంటి కమిటీలతో బీజేపీ తెలంగాణలో అధికారంలోకి వస్తుందా?'అని ప్రశ్నించారు. 'రాష్ట్ర అధ్యక్షుడిని రబ్బర్‌ స్టాంపుగా మార్చి డమ్మీ చేయకండి. పార్టీలో పొరపాట్లు జరుగుతున్నాయి.. సరిచేసుకోండని చెబుతున్నా. యూపీ సీఎం యోగితో పాటు చాలామంది పెద్దల ఆశీర్వాదం నాకుంది'అని రాజాసింగ్‌ పేర్కొన్నారు.

'పార్టీపై విమర్శలు చేస్తే తీవ్ర పరిణామాలుంటాయ్‌'



సాక్షి, హైదరాబాద్‌: బీజేపీ గురించి అనవసర విమర్శలు చేసినా, పార్టీ నాయకులను అవహేళన చేసినా రాబోయే రోజుల్లో పరిణామాలు తీవ్రంగా ఉంటాయని బీజేపీ ప్రధాన కార్యదర్శి వేముల అశోక్‌ హెచ్చరించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, బీజేపీపై, నూతన కమిటీల విషయంలో కొంతమంది తప్పుడు వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే రాజాసింగ్‌ వంటి కొంతమంది పార్టీని బలహీనపరిచే కుట్రతో సొంత లాభం కోసం వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ కొత్త కమిటీల్లో గోషామహల్‌ కార్యకర్తలకు చోటులేదని, కేవలం సికింద్రాబాద్‌ కమిటీలా ఉందంటూ ఆయన చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. ఇప్పుడు రాజాసింగ్‌ బీజేపీ కార్యకర్త కాదని చెప్పారు.



మిరుదొడ్డి రైతు వేదిక వద్ద రైతుల ఆందోళన



యూరియా కోసం వచ్చిన వారిని కుర్చీలో కూర్చోబెట్టి మాట్లాడుతున్న ఏవో



కొనసాగుతున్న యూరియా కష్టాలు

- టోకెన్ల కోసం రైతుల మధ్య వాగ్వాదం
- ఓపిక నశించి రోడ్లపైకి వచ్చి ఆందోళనలు
- ఆదిలాబాద్‌ జిల్లాలో యూరియా కోసం రైతుల భిక్షాటన.. మంచిర్యాల జిల్లాలో రైతులకు కుర్చీలు వేసి యూరియా పంపిణీ

సాక్షి నెట్‌వర్క్‌: రాష్ట్రంలో రైతులకు యూరియా కష్టాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఒక్క బస్తా యూరియా దొరికినా మహాభాగ్యం అనుకుంటూ రాత్రి, పగలు క్యూలైన్లలో అన్నదాతలు నిరీక్షిస్తున్నారు. కొన్నిచోట్ల ఓపిక నశించి ఆందోళనలకు దిగుతున్నారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డిలోని రైతు వేదిక ఎదుట బుధవారం యూరియా టోకెన్ల కోసం రైతుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. కొందరు రైతు వేదికలోకి చొచ్చుకెళ్లి ఫర్నిచర్‌ ధ్వంసం చేశారు.హనుమకొండ జిల్లా పరకాలలో టోకెన్లు ఇచ్చి యూరియా పంపిణీ చేయకపోవడంతో వ్యవసాయ మార్కెట్‌ ఎదుట ఆందోళన చేశారు. ఆదిలాబాద్‌ జిల్లా ఇచ్చోడ మండలం ముఖరా(కె)లో రైతులు బుధవారం యూరియా కోసం భిక్షాటన చేస్తూ ప్రభుత్వ తీరుపై నిరసన తెలిపారు. కరీంనగర్‌ జిల్లా గంగాధర మండలం కురిక్యాల గ్రామంలో బుధవారం సాయంత్రం రైతు సాయిల్ల రాజమల్లు యూరియా బస్తా కోసం లైన్‌లో నిలబడి సొమ్మసిల్లి పడిపోయాడు. తోటి రైతులు వెంటనే రాజమల్లును ఆసుపత్రికి తరలించారు. కాగా, మంచిర్యాల జిల్లా దండేపల్లి నెల్కి వెంకటాపూర్‌ పీఏసీఎస్‌ వద్ద రైతులకు కుర్చీలు వేసి కూర్చోబెట్టి యూరియా పంపిణీ చేశారు. రెండో విడతలో పంటకు యూరియా ఎంత మోతాదులో వేయాలనే దానిపై అధికారులు అవగాహన కూడా కల్పించారు.

యూరియా బారులు

సూర్యాపేట జిల్లా ఆత్మకూర్‌ (ఎస్‌) మండలం నెమ్మికల్‌లోని మన గ్రోమోర్‌ కేంద్రం వద్ద సుమారు 400 ఫీట్ల వరకు రైతులు పట్టాదారు పాస్‌పుస్తకాలు, ఆధార్‌కార్డు జిరాక్స్‌ ప్రతులు లైన్‌లో ఉంచి నిరీక్షించారు. ఈ కేంద్రానికి 666 బస్తాల యూరియా రాగా ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున పంపిణీ చేశారు.

– సాక్షి స్టాఫ్‌ ఫొటో గ్రాఫర్‌ సూర్యాపేట

జెన్‌కోకు జీఎస్టీ షాక్‌

- బొగ్గుపై 13 శాతం పెరగనున్న జీఎస్టీ
- టన్నుకు రూ.630 అదనం
- ఏటా రూ.425 కోట్ల జీఎస్టీ వడ్డింపు
- ఈ మొత్తం విద్యుత్‌ వినియోగదారులపైకే..
- ఈఆర్‌సీ అనుమతి కోసం జెన్‌కో కసరత్తు
- వచ్చే ఏడాది విద్యుత్‌ బిల్లుల భారం



సాక్షి, హైదరాబాద్‌: విద్యుత్‌ వినియోగదారులకు జీఎస్టీ షాక్‌ తగలబోతోంది. వస్తు సేవల పన్నుకు సంబంధించి కేంద్రం తీసుకున్న తాజా నిర్ణయం విద్యుత్‌ ఉత్పత్తి సంస్థలపై ప్రభావం చూపుతోంది. జెన్‌కో వాడే బొగ్గు ప్రస్తుతం 5 శాతం జీఎస్టీ పరిధిలో ఉంది. కొత్త శ్లాబులు అమలులోకి వస్తే ఇది 18 శాతానికి పెరుగుతుంది. అదనంగా 13 శాతం భారం పడుతుంది. దీనివల్ల ప్రతి టన్ను బొగ్గుపై అదనంగా రూ.630 భారం పడే అవకాశం ఉంది. ప్రభుత్వ రంగ సంస్థ జెన్‌కో కాకుండా, పలు ప్రైవేటు సంస్థలతో విద్యుత్‌ పంపిణీ సంస్థలు విద్యుత్‌ కొనుగోలు ఒప్పందాలు చేసుకున్నాయి. ఇవి కూడా దేశీయ, విదేశీ బొగ్గును కొనుగోలు చేస్తున్నాయి. వీటిపై పడే జీఎస్టీ భారాన్ని విద్యుత్‌ వినియోగదారులే భరించాల్సి ఉంటుంది. పెరిగే భారం ఎంత అనేది అధికారులు లెక్కగట్టాల్సి ఉంది. ఈ మొత్తానికి చార్జీలు పెంచుకునేందుకు విద్యుత్‌ నియంత్రణ మండలి (టీజీఈఆర్‌సీ) అనుమతి తీసుకోవాలి. ఆ తర్వాత పెరిగిన బొగ్గు విలువను వార్షిక ఆదాయ, అవసర నివేదికలో పొందుపరుస్తారు. దీన్ని ఈఆర్‌సీ ఆమోదించిన తర్వాత వచ్చే ఏడాది కొత్త టారిఫ్‌లలో విద్యుత్‌ బిల్లుల రూపంలో ప్రజలపై భారం పడే అవకాశం ఉంది.

భారం రూ.300 కోట్లపైనే..!

టీజీ జెన్‌కో ప్లాంట్లకు ఏడాదికి 29 మిలియన్‌ టన్నుల బొగ్గు అవసరం ఉంటుంది. అయితే, పవన, సౌర విద్యుత్‌తోపాటు, బహిరంగ మార్కెట్లో చౌకగా విద్యుత్‌ లభిస్తుండటంతో విద్యుత్‌ సంస్థలు వాటిని కొనుగోలు చేస్తున్నాయి. దీంతో జెన్‌కో ప్లాంట్లను బ్యాక్‌ డౌన్‌ చేస్తున్నారు. ఏడాది పొడవున గరిష్టంగా 65%ప్లాంట్‌ లోడ్‌ ఫ్యాక్టర్‌ (పీఎల్‌ఎఫ్‌)తో పనిచేస్తున్నాయి. దీంతో ఏటా 15 మిలియన్‌ టన్నుల వరకు బొగ్గు అవసరం ఉంటోంది. ప్రతి టన్ను బొగ్గును సింగరేణి నుంచి సగటున రూ.5 వేల చొప్పున కొనుగోలు చేస్తున్నారు. జీఎస్టీ పెరగడం వల్ల అదనంగా టన్నుకు రూ.630 చెల్లించాలి. 15 మిలియన్‌ టన్నులకు రూ.945 కోట్ల వరకు భారం పడుతుంది. అయితే, బొగ్గుపై కొంత రాయితీ ఇవ్వాలన్నది కేంద్రం నిర్ణయం. ఇది తీసివేసినా ఏడాదికి రూ.300 కోట్ల పైనే భారం పడొచ్చని అంచనా వేస్తున్నారు. పీపీఏలున్న ప్రైవేటు సంస్థలపై పడే జీఎస్టీ భారం మరో రూ.125 కోట్లు ఉండొచ్చని అంచనా. మొత్తంగా రూ.425 కోట్ల మేర భారం ఉండొచ్చని చెబుతున్నారు.

పరిస్థితిని సమీక్షిస్తున్నాం



జీఎస్టీ శ్లాబులు మారడం వల్ల బొగ్గుపై వ్యయం పెరుగుతుంది. ఇది జెన్‌కోకు ఏమేర భారం కలిగిస్తుందనేది పరిశీలిస్తున్నాం. అధికారికంగా శ్లాబులు అమలులోకి వచ్చిన తర్వాత పెరిగే భారాన్ని విద్యుత్‌ నియంత్రణ కమిటీకి వివరిస్తాం. కమిషన్‌ ఆదేశాల మేరకు ముందుకు వెళ్తాం.

– హరీశ్, టీజీ జెన్‌కో సీఎండీ

ప్రజలకు ఇది భారమే



పవన, సౌర విద్యుత్‌ ప్రాజెక్టులపై జీఎస్టీని తగ్గించారు. కొత్తగా వచ్చే వాటికే ఇవి వర్తిస్తాయి. కాబట్టి ప్రస్తుతం ఎలాంటి ఉపయోగం లేదు. మరోవైపు థర్మల్‌ విద్యుత్‌ కేంద్రాలు వాడే బొగ్గుపై జీఎస్టీ పెంచారు. సెస్‌ తగ్గించినా జీఎస్టీ భారమే ఎక్కువ. ఈ భారం మొత్తం ప్రజలపైనే పడుతుంది. రాబోయే కాలంలో విద్యుత్‌ చార్జీలు పెరిగే అవకాశం ఉంటుంది.

– ఎం వేణుగోపాలరావు, సెంటర్‌ ఫర్‌ పవర్‌ స్టడీస్‌ కన్వీనర్‌

వరద పనుల యూసీలు కూడా ఇవ్వరా?

అధికార యంత్రాంగం వైఖరిపై మంత్రి పొంగులేటి అసంతృప్తి

ఈనెల 13లోగా అన్ని విభాగాలు యూసీలివ్వాలని ఆదేశం



సాక్షి, హైదరాబాద్‌: ప్రకృతి విపత్తుల కారణంగా సంభవించిన నష్టాన్ని పూడ్చుకునేందుకు చేపట్టిన పనులకు వినియోగ ధ్రువపత్రాలు (యూసీ) ఇవ్వడంలో నిర్లక్ష్యం ఎందుకని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ప్రశ్నించారు. యూసీలను సకాలంలో కేంద్రానికి పంపడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటివరకు జరిగిన అన్ని పనులకు సంబంధించిన యూసీలను ఆయా విభాగాలు ఈనెల 13వ తేదీలోగా సమర్పించాలని ఆదేశించారు. ఇటీవల రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలు, ముఖ్యంగా కామారెడ్డి, మెదక్‌ జిల్లాల్లో వరదల కారణంగా దెబ్బతిన్న ప్రాంతాల్లో సహాయక చర్యలపై బుధవారం ఆయన సచివాలయం నుంచి సమీక్షించారు. భారీ వర్షాల కారణంగా జరిగిన ప్రాణ, ఆస్తి నష్టం, ఇప్పటివరకు తీసుకున్న సహాయక చర్యల గురించి శాఖల వారీగా ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. సహాయక చర్యలను మరింత వేగవంతం చేయాలని, పరిహారాన్ని వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు. పరిహారం కోసం ఒక్క బాధితుడు కూడా ఎదురుచూసే పరిస్థితి లేకుండా చర్యలు తీసుకోవాలని, చెరువులు, కుంటలు, రోడ్ల మరమ్మతులకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వర్షాల కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న జిల్లాలకు రూ.10 కోట్లు, సాధారణ నష్టం జరిగిన జిల్లాలకు రూ.5 కోట్ల చొప్పున విడుదల చేయాలని, సహాయక చర్యలను ఆయా జిల్లాల కలెక్టర్లతో సమన్వయం చేసుకుంటూ అన్ని శాఖల అధిపతులు పర్యవేక్షించాలని ఆదేశించారు. రానున్న రెండు రోజుల పాటు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు చేస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొంగులేటి సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్‌ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలపై మంత్రి పొంగులేటి సమీక్ష

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలోని జర్నలిస్టులకు అక్రెడిటేషన్, హెల్త్‌ పాలసీలతో పాటు అవార్డులు, దాడుల నివారణ, హైపవర్‌ కమిటీ తదితర అంశాలపై రాష్ట్ర సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం సమీక్ష జరిపారు. ప్రెస్‌ అకాడమీ చైర్మన్‌ కె.శ్రీనివాస్‌రెడ్డి, ఐఅండ్‌పీఆర్‌ స్పెషల్‌ కమిషనర్‌ సి.హెచ్‌. ప్రియాంక, సీపీఆర్‌వో జి.మల్సూర్‌లతో సమీక్ష జరిపిన ఆయన, నిజమైన జర్నలిస్టులకు మేలు జరిగేలా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. జర్నలిస్టుల సమస్యలపై కార్మిక, ఆరోగ్య, హోం, ఆర్థికశాఖ అధికారులతో త్వరలో మరోసారి సమావేశం నిర్వహించాలని ఈ సందర్భంగా నిర్ణయించారు.

రాధాకృష్ణన్‌ను కలిసిన జస్టిస్‌ సుదర్శన్‌రెడ్డి

ఉప రాష్ట్రపతిగా ఎన్నికవడంపై అభినందనలు



సాక్షి, న్యూఢిల్లీ: నూతన ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన సీపీ రాధాకృష్ణన్‌ను జస్టిస్‌ బి.సుదర్శన్‌రెడ్డి కలిశారు. బుధవారం ఢిల్లీలోని మహారాష్ట్ర సదన్‌లో రాధాకృష్ణన్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఉప రాష్ట్రపతిగా విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. 'అత్యున్నతమైన హోదాలో ఉన్న మీరు దేశానికి మంచి సేవలందించాలి. అందర్నీ సమానంగా చూడాలి'అని జస్టిస్‌ సుదర్శన్‌రెడ్డి అన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సింఘాల్‌

తిరుమల: టీటీడీ ఈవోగా అనిల్‌ కుమార్‌ సింఘాల్‌ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన 2017 మే నుంచి 2020 అక్టోబర్‌ వరకు ఈవోగా పని చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు రెండోసారి అవకాశం రావడంతో తనకు మరింత బాధ్యత పెరిగిందని అనిల్‌ వ్యాఖ్యానించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు సాంకేతిక వినియోగంపై దృష్టి పెడతామని తెలిపారు.

కాలేజీకి వస్తేనే ఫీజు?

▶ మొదటి పేజీ తరువాయి

చేసినట్టు తెలిసింది. దీనికి అనుగుణంగానే వీసీల సమావేశంలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌ కోతపై వ్యూహ రచన చేయబోతున్నట్టు సమాచారం.

ముందు హాజరు.. తర్వాత మార్కులు

ప్రస్తుతానికి ముఖ గుర్తింపు హాజరు విధానం ద్వారా ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ఫిల్టర్‌ చేయాలని భావిస్తున్నారు. ఈ దశలో విద్యార్థుల నుంచి అభ్యంతరాలు రాకపోతే తర్వాత దశలకు వెళ్లే అవకాశం ఉందని అధికార వర్గాలు అంటున్నాయి. ఇంజనీరింగ్, డిగ్రీ మొదలుకొని అన్ని సాంకేతిక, సాధారణ కోర్సుల్లో ఒక సంవత్సరంలో 50% సబ్జెక్టులు పాసవ్వడంతో పాటు, 75% హాజరు ఉండాలన్న కొత్త నిబంధన తీసుకురావాలన్నది ముఖ్యమంత్రి సూచనగా చెబుతున్నారు. సాంకేతిక విద్యలో కోర్సులోని ప్రధాన సబ్జెక్టుల్లో విద్యార్థి కనీసం 60% మార్కులు తెచ్చుకుంటేనే రీయింబర్స్‌మెంట్‌ అమలు చేయాలనే ప్రతిపాదన కూడా ఉన్నట్టు తెలిసింది. ఉదాహరణకు సీఎస్‌ఈ ఎమర్జింగ్‌ కోర్సు తీసుకున్న విద్యార్థి డేటాసైన్స్‌ సబ్జెక్టుల్లో 60% మార్కులు తెచ్చుకుని తీరాలి. అదే విధంగా బీకాంలో కామర్స్‌ సబ్జెక్టుల్లో మంచి మార్కులు రావాల్సి ఉంటుంది.

అధికారుల అంతర్మథనం

దివంగత సీఎం వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి తీసుకొచ్చిన ఈ పథకం ద్వారా అనేక మంది పేదలు ఉన్నత చదువులకు వెళ్లారు. తర్వాత ప్రభుత్వాలు ఈ పథకంలో మార్పులు తెచ్చేందుకు సాహసించలేదు. ఈ నేపథ్యంలో పథకంలో కోతకు అడుగులు వేయాల్సి రావడంపై అధికారులు మదనపడుతున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ బకాయిలు ప్రస్తుతం దాదాపు రూ.8వేల కోట్ల వరకు పేరుకు పోయా యి. వీటిని రాబట్టుకునేందుకు కాలేజీలు ఆందోళనలకు సిద్ధమవుతున్నాయి.

దసరా తర్వాత 'వైన్స్‌కు' దరఖాస్తులు!

- నెలన్నర ముందే నోటిఫికేషన్‌ ఇవ్వనున్న ఎక్సైజ్‌ శాఖ
- ఈసారి రూ.3,500 కోట్లకు పైగా ఆదాయం వస్తుందని అంచనా
- కొత్త షాపుల ఏర్పాటు తర్వాతే బదిలీలు, పదోన్నతులు

సాక్షి, హైదరాబాద్‌: రానున్న రెండేళ్ల కాలానికి వైన్‌షాపుల నిర్వహణ కోసం దసరా పండుగ తర్వాత దరఖాస్తులు తీసుకోవాలని ఎక్సైజ్‌ శాఖ యోచిస్తోంది. ఈ ఏడాది నవంబర్‌ 30తో ప్రస్తుత షాపులకు గడువు ముగియనున్న నేపథ్యంలో అక్టోబర్‌ 5వ తేదీ తర్వాత కొత్త పాలసీ ప్రకారం నోటిఫికేషన్‌ ఇచ్చే ఆలోచనలో ఆ శాఖ అధికారులున్నారు. దరఖాస్తులు చేసుకునేందుకు తగినంత సమయం ఇవ్వడం ద్వారా ఎక్కువ దరఖాస్తులు వచ్చేలా చూడాలన్న ఆలోచనతోనే దసరా ముగిసిన వెంటనే నోటిఫికేషన్‌ ఇవ్వాలని భావిస్తున్నట్టు సమాచారం. అయితే రాష్ట్రంలో 2,620 వైన్‌షాపులుండగా ఆ సంఖ్యను పెంచుతారా లేదా అన్న దానిపై ఇంకా స్పష్టత రాలేదని తెలుస్తోంది. రాష్ట్రంలో ఎంత జనాభాకు ఒక వైన్‌షాపు ఉండాలో 2011 జనాభా లెక్కల ఆధారంగా నిర్ధారించారు. ఆ తర్వాత జనగణన జరగక పోవడంతో ఇప్పటికీ ఆ సంఖ్యనే కొనసాగిస్తున్నారు. కానీ ఈసారి షాపుల సంఖ్యను పెంచే అవకాశాలున్నాయని ఎక్సైజ్‌ వర్గాలంటున్నాయి.

గత పాలసీతో రూ.2,920 కోట్ల ఆదాయం

గత రెండేళ్ల పాలసీ ప్రకారం వైన్‌షాపుల నిర్వహణకు ఆహ్వానించిన దరఖాస్తుల రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి రూ.2,920 కోట్ల మేరకు ఆదాయం వచ్చింది. ఈసారి ఆదాయం రూ.3,500 కోట్లు దాటుతుందనే అంచనాలో ఎక్సైజ్‌ శాఖ ఉంది. దరఖాస్తు ఫీజును రూ.3 లక్షలకు పెంచి, తగిన సమయం కూడా ఇస్తే ఈ ఆదాయం మరింత పెరుగుతుందని అధికారులు అంటున్నారు. ఈ నేపథ్యంలో ఈసారి దరఖాస్తుల స్వీకరణకు నెలన్నర రోజులు గడువు ఇచ్చే అవకాశముందని తెలుస్తోంది. మరోవైపు ఆదాయార్జిత శాఖల్లో ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతినిచ్చినప్పటికీ ఇప్పుడప్పుడే స్థానచలనం అవసరం లేదనే భావనలో ఎక్సైజ్‌ శాఖ ఉన్నతాధికారులున్నట్టు తెలుస్తోంది. ఈసారి వైన్‌షాపుల ఏర్పాటు కోసం దరఖాస్తుల ప్రక్రియ ముగిసి, కొత్త షాపులు ప్రారంభమైన తర్వాత బదిలీలతో పాటు పెండింగ్‌లో ఉన్న పదోన్నతులను కూడా చేపట్టే యోచనలో ఉన్నట్టు సమాచారం.

యూరియా సమస్య పట్టించుకోని ప్రభుత్వాలు

అసెంబ్లీలో బురద రాజకీయాలకే ప్రాధాన్యం: హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్‌: యూరియా కోసం రాష్ట్ర రైతాంగం అల్లాడుతుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు నెపం మోపుకోవడం తప్ప చేస్తున్నదేమీలేదని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర అసెంబ్లీలో రైతు సమస్యలు పక్కనపెట్టి బురద రాజకీయాలకు ప్రాధాన్యం ఇచ్చారని బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఈ ప్రభుత్వానికి రైతుల కష్టాలపై చర్చించే సమయం, సామర్థ్యమూ లేదని ధ్వజమెత్తారు. 'పత్తి పూత దశలో0 ఉంది.. ఇప్పుడు యూరియా వేయకపోతే దిగుబడి రాదు'అని ఒక రైతు అంటుంటే..'వరి పొట్ట దశలో ఉంది.. యూరియా చల్లకపోతే పంట వేసి వ్యర్థం'అని మరొక రైతు వాపోతున్నాడని హరీశ్‌రావు పేర్కొన్నారు. కాంగ్రెస్‌ చేతగాని, దద్దమ్మ పాలనతో పంట పొలాల్లో ఉండాల్సిన రైతులు యూరియా కోసం నడిరోడ్ల వెంట బారులు తీరుతున్నారని, భారత దేశ చరిత్రలో యూరియా కోసం రైతులు ఇంతగా తిప్పలు పడ్డ పరిస్థితులు ముందెన్నడూ లేవని హరీశ్‌రావు పేర్కొన్నారు. 'జై కిసాన్‌'అని నాటి కాంగ్రెస్‌ అంటే, 'నై కిసాన్‌'అని నేటి రేవంత్‌ అంటున్నాడని ఎద్దేవా చేశారు. రాష్ట్రం నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు, 8 మంది కాంగ్రెస్‌ ఎంపీలు ఉన్నా తెలంగాణకు శుష్క ప్రియాలు శూన్య హస్తాలేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్‌ పాలనలో సకాలంలో యూరియా సరఫరా కాగా.. ఇప్పుడెందుకు సరఫరా చేయలేక చేయలేకపోతున్నారని ప్రశ్నించారు. పాలకులు మారగానే పాలసీలు మారిపోతాయా? అని నిలదీశారు. పనికిమాలిన డైవర్షన్‌ పాలిటిక్స్‌ మాని, యూరియా సమస్యకు వెంటనే పరిష్కారం చూపాలని మాజీ మంత్రి డిమాండ్‌ చేశారు.

ఇందిరమ్మ రాజ్యమంటే ఇళ్లు కూల్చడమే..

▶ మొదటి పేజీ తరువాయి

సంక్షేమ పథకాలు ఆపివేస్తామంటూ ప్రజలను బెదిరిస్తోంది. హైడ్రా పేరుతో బిల్డర్ల దగ్గర దోచుకున్న అవినీతి సొమ్మును ఉప ఎన్నికల్లో పంచి గెలవడానికి సీఎం రేవంత్‌రెడ్డి కుట్ర పన్నుతున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఓటు అడిగే హక్కు ఆ పార్టీకి లేదు..'అని కేటీఆర్‌ ధ్వజమెత్తారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే మోదీకి వేసినట్లే..

'ప్రధాని మోదీని పెద్దన్నలా భావించి ఆయన మార్గదర్శకత్వంలో నడుస్తున్న బీజేపీ సీఎం రేవంత్‌రెడ్డి అన్న సత్యాన్ని మైనార్టీలు ఇప్పటికైనాగుర్తించాలి. రాహుల్‌ను తీవ్రంగా వ్యతిరేకించే బీజేపీని రేవంత్‌రెడ్డి తన పార్టీగా భావిస్తున్నారని, కాంగ్రెస్‌ భావజాలానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నారని ప్రజలు గమనించాలి. తెలంగాణలో కాంగ్రెస్‌కు ఓటువేస్తే మోదీ, బీజేపీకి ఓటు వేసినట్లే. రాష్ట్ర చరిత్రలో తొలిసారి మైనార్టీ మంత్రి ప్రభుత్వంలో లేరంటే.. మైనార్టీలకు కాంగ్రెస్‌ పార్టీ ఇచ్చే గౌరవం ఏమిటో గుర్తించాలి.

మాగంటి కుటుంబానికి అండగా నిలవాలి: బీఆర్‌ఎస్‌ మైనార్టీలకు సముచిత స్థానం ఇచ్చింది. బీఆర్‌ఎస్‌తోనే మైనార్టీల సంక్షేమం సాధ్యం. ప్రజలు అన్నీ గమనించి, ప్రజల మనిషిగా చిరస్థాయిగా నిలిచిన దివంగత మాగంటి గోపీనాథ్‌కు నివాళిగా..సంక్షేమాన్ని చేతల్లో చూపించిన బీఆర్‌ఎస్‌ పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలి. మాగంటి గోపీనాథ్‌ జూబ్లీహిల్స్‌లో ఏ ఒక్కరికి కష్టం వచ్చినా అండగా నిలబడే వాడు. ఆయన కుటుంబానికి ప్రజలు అండగా నిలవాలి. కారు గుర్తుకు ఓటువేసి హస్తానికి తగు బుద్ధి చెబుతూ రేవంత్‌రెడ్డి అహంకారాన్ని బొందపెట్టాలి..'అని కేటీఆర్‌ పిలుపునిచ్చారు. గత ఎన్నికల్లో హైదరాబాద్‌లో అన్ని సీట్లను బీఆర్‌ఎస్‌కు అందించారని, అదే స్ఫూర్తితో జూబ్లీహిల్స్‌లో గెలిపించి, హైదరాబాద్‌ గులాబీ అడ్డా అన్న సందేశాన్ని ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈనెల 14వ తేదీ నుంచి కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి, మాగంటి చేసిన పనులను, ఆయన సేవలను ఓటర్లకు గుర్తు చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీమంత్రి గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్యేలు వినయ్‌భాస్కర్, పి.విష్ణువర్ధన్‌రెడ్డి, కోరుకంటి చందర్, మాగంటి సతీమణి సునీత, రహమత్‌నగర్‌ ఇన్‌చార్జి టి.రవీందర్‌రావు పాల్గొన్నారు.

సీతారామకు 'క్లియరెన్స్‌'!

- త్వరలో సీడబ్ల్యూసీకి రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తు
- ఇప్పటికే ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు
- ఇన్వెస్ట్‌మెంట్‌ క్లియరెన్స్‌ లభిస్తే కేంద్రం నుంచి నిధులు

సాక్షి, హైదరాబాద్‌: సీతారామ ఎత్తిపోతల పథకానికి ఇన్వెస్ట్‌మెంట్‌ క్లియరెన్స్‌ కోసం రాష్ట్ర ప్రభుత్వం త్వరలో కేంద్ర జల సంఘానికి (సీడబ్ల్యూసీ) దరఖాస్తు చేయనుంది. ప్రాజెక్టు అధికారులు ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసి నీటిపారుదల శాఖ ఈఎన్సీ (జనరల్‌) కార్యాలయానికి సమర్పించారు. సీతారామ ఎత్తిపోతల పథకం–సీతమ్మసాగర్‌ బహుళార్థక సాధక ప్రాజెక్టుకు సాంకేతిక అనుమతులు జారీ చేస్తూ సీడబ్ల్యూసీలోని టెక్నికల్‌ అడ్వయిజరీ కమిటీ (టీఏసీ) గత ఏప్రిల్‌లో నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టుకు ఇన్వెస్ట్‌మెంట్‌ క్లియరెన్స్‌ను సాధిస్తే ప్రధానమంత్రి క్రిషి సించాయ్‌ యోజన (పీఎంకేఎస్‌వై) పథకం కింద కేంద్ర ప్రభుత్వ నిధులను రాబట్టుకోవడానికి అవకాశం ఉంటుంది. సీతారామ ఎత్తిపోతల పథకానికి ఇప్పటికే పర్యావరణ అనుమతులుండగా, సీతమ్మసాగర్‌కు ఇంకా రావాల్సి ఉంది. దీంతో ఈ ప్రాజెక్టుకు ఇన్వెస్ట్‌మెంట్‌ క్లియరెన్స్‌ వచ్చే అవకాశాలు లేవు. ఈ నేపథ్యంలోనే సీతారామ ప్రాజెక్టుకు మాత్రమే ఇన్వెస్ట్‌మెంట్‌ క్లియరెన్స్‌ కోసం దరఖాస్తు చేయాలని నీటిపారుదల శాఖ నిర్ణయం తీసుకుంది. గతంలో ఈ రెండు ప్రాజెక్టులు ఒకే ప్రాజెక్టుగా ఉండేవి. సీతారామ–సీతమ్మసాగర్‌ బహుళార్థక సాధక ప్రాజెక్టు పేరుతో గత ప్రభుత్వం డీపీఆర్‌ కూడా సిద్ధం చేసింది. అయితే ఇప్పుడవి వేర్వేరు ప్రాజెక్టులుగా మారాయి.

ప్రతిపాదనలు పరిశీలించి సిఫారసు

రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలను సీడబ్ల్యూసీ పరిశీలించి కేంద్ర జలశక్తి శాఖ పరిధిలోని కేంద్ర జలవనరుల శాఖకు ఇన్వెస్ట్‌మెంట్‌ క్లియరెన్స్‌ కోసం సిఫారసు చేయనుంది. ఈ సిఫారసుల ఆధారంగా ప్రాజెక్టుకు ఇన్వెస్ట్‌మెంట్‌ క్లియరెన్స్‌ విషయంలో జలవనరుల శాఖ నిర్ణయం తీసుకోనుంది. అంతకుముందు ప్రాజెక్టు అంచనా వ్యయం ఎంత? ఇప్పటివరకు చేసిన ఖర్చు ఎంత? చేయాల్సిన ఖర్చు ఎంత? రాష్ట్ర బడ్జెట్‌లో ఏటా కేటాయించిన నిధులు ఎంత? వంటి అంశాలను సీడబ్ల్యూసీ పరిశీలించనుంది. ఇతర సాగునీటి ప్రాజెక్టులపై ఎలాంటి ప్రభావం పడకుండా ప్రతిపాదిత ప్రాజెక్టు నిర్మాణం సాధ్యమేనా? అనే అంశాలనూ సమీక్షించనుంది.

మొత్తం 4 ప్రాజెక్టులపై దృష్టి

సీతారామతో పాటు మోడికుంటవాగు, చనాకా–కొరాటా, చిన్నకాళేశ్వరం.. మొత్తం 4 ప్రాజెక్టులకు ఇన్వెస్ట్‌మెంట్‌ క్లియరెన్స్‌లు సాధించి పీఎంకేఎస్‌వై కింద కేంద్ర నిధులు రాబట్టుకోవడానికి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది.

ఇప్పటికే 57 శాతం పనులు పూర్తి

గత ప్రభుత్వం 2016 ఫిబ్రవరి 18వ తేదీన రూ.7,926.14 కోట్ల అంచనాలతో సీతారామ ప్రాజెక్టుకు పరిపాలన అనుమతులు ఇవ్వగా, ఆ తర్వాత 2018 ఆగస్టులో రూ.13,057 కోట్లకు అంచనాలను సవరించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సీతారామ ప్రాజెక్టు ద్వారా 67.05 టీఎంసీల గోదావరి జలాలను తరలించి భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్‌ జిల్లాల్లో మొత్తం 7.87 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరుతో పాటు తాగునీరు సరఫరా చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రాజెక్టులో భాగంగా మొత్తం 757 మెగావాట్ల సామర్థ్యంతో 11 పంప్‌హౌస్‌లు, 36.57 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో సీతమ్మసాగర్‌ బరాజ్‌ను నిర్మిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తైతే సాగర్, పాలేరు, వైరా ప్రాజెక్టుల కింద ఆయకట్టుకు సాగునీటి కొరత తీరుతుంది. ఇప్పటివరకు రూ.11,320 కోట్ల వ్యయంతో 57 శాతం పనులు పూర్తయ్యాయి. ఈ పథకాన్ని 2026 నాటికి పూర్తి చేసి రబీ పంటలకు సాగునీరు అందించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఇన్వెస్ట్‌మెంట్‌ క్లియరెన్స్‌ లభిస్తే పీఎంకేఎస్‌వై కింద కేంద్ర ప్రభుత్వ నిధులను రాబట్టుకుని మిగులు పనులు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.



యవ్వనం సంతోషంగా ఎందుకు ఉంటుందంటే, అందాన్ని చూడగల మానసిక సామర్థ్యం యవ్వనానికి ఉంటుంది. ఆ సామర్థ్యాన్ని జీవితేచ్ఛను నింపే అభిరుచులు, లేదా వ్యాపకాలతో నిలుపుకోగలిగితే ఎప్పటికీ వృద్ధాప్యం దరిచేరదు.

– ఫ్రాంజ్ కాఫ్కా, జర్మనీ రచయిత

సాక్షి

గురువారం, 11 సెప్టెంబర్ 2025

కూటమి సర్కారు బరితెగింపు

జనం పక్షాన నిలిచిన కలంపై ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం కత్తిగట్టింది. గత పదిహేను నెలల పాలనలో వరస కుంభకోణాలూ, వంచనలూ తప్ప చేసిందేమీ లేదని బట్టబయలవుతున్నకొద్దీ దిక్కుతోచక 'సాక్షి'పైనా, ఎడిటర్ ఆర్. ధనంజయరెడ్డిపైనా అక్రమ కేసులతో రెచ్చిపోతోంది. రాజ్యాంగానికి లోబడి ప్రజాస్వామ్యబద్ధంగా పాలించాల్సిన బాధ్యతను పక్కనబెట్టి రాష్ట్రాన్ని పోలీసు రాజ్యంగా మారుస్తోంది. పత్రికలపై కక్షగట్టడంలో ప్రభుత్వ నైచ్యం హద్దులు దాటింది. ప్రభుత్వ వ్యతిరేక వార్తలు వస్తే వెనువెంటనే కేసులు రిజిస్టర్ చేయాలంటూ కూటమి సర్కారు మౌఖిక ఆదేశాలిచ్చిందంటున్నారు. అందులో భాగంగానే సోమవారం ఏపీ పోలీసులు హైదరాబాద్‌లోని 'సాక్షి' కార్యాలయానికొచ్చి ఎడిటర్ ధనంజయరెడ్డికి నోటీసులు అందజేశారు. గత మే నెలలోనే కూటమి ప్రభుత్వం ఈ అరాచకానికి నాంది పలికింది. విజయవాడలో ధనంజయరెడ్డి ఇంట్లోకి ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) తప్పుడు సాకులతో అక్రమంగా చొరబడి,'మద్యం కేసు నిందితులు మీ ఇంట్లో ఉన్నారేమో తెలుసుకోవటానికి వచ్చామ'ంటూ మూడు గంటలపాటు హడావుడి సృష్టించింది. తలుపులు మూసి, సోదాలు చేసి, దౌర్జన్యంతో ఫోన్ లాక్కొనే ప్రయత్నం చేసింది.

ఈ ప్రభుత్వం వాస్తవాలను ఏ మాత్రం సహించే స్థితిలో లేదు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఆఖరుకు వార్తలను, వ్యాఖ్యలను కవర్ చేసినా కూడా ఎడిటర్, రిపోర్టర్లపై కేసులు పెడుతోంది. విద్య, వైద్యం, వ్యవసాయం సహా అన్ని రంగాల్లోని వైఫల్యాలపై ప్రశ్నిస్తున్నందుకే ఇలా కక్షగట్టింది. అసలే స్కాంలు చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. ఎక్కడిదాకో ఎందుకు... 2015 మొదలుకొని 2019 వరకూ అధికారం వెలగబెట్టినప్పుడు ఏటా రూ. 1,300 కోట్ల చొప్పున అయిదేళ్లలో ఖజానాకు వేల కోట్ల రూపాయల మేర గండికొట్టిన ఘనుడాయన. ఇది ఎవరో చేసిన ఆరోపణ కాదు. కాగ్ ఆధ్వర్యంలోని ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ నిశితంగా గమనించి బట్ట బయలు చేసిన చేదు నిజం. దీన్నంతటిని వెలుగులోకి తెస్తున్నందునే 'సాక్షి'పై సర్కారు వారి అక్కసు. ఇదొక్కటే కాదు... అక్రమ మార్గాల్లో అధికారాన్ని చెరబట్టింది మొదలు కూటమి పెద్దలు చేయని అరాచకం లేదు. ఇసుక దోపిడీ, భూకబ్జాలు, పేరూ ఊరూ లేని సంస్థలకు విలువైన భూముల్ని కారు చౌకగా కట్టబెట్టడాలూ, మహిళలపై అఘాయిత్యాలూ.... ఒకటేమిటి, కూటమి సర్కారు చేస్తున్న సమస్త అరాచకాలనూ 'సాక్షి' బయట పెడుతోంది. అందుకే తప్పుడు కేసులు బనాయించి నోరుమూయించాలని చూస్తోంది.

మనది ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామిక దేశం. ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్ నిత్యం రాజకీయ చైతన్యంతో తొణికిసలాడే ప్రాంతం. ఇలాంటిచోట ఎంతకైనా బరి తెగించి పాలిద్దామని, నిజాలు బయటపెడుతున్నవారి నోరు నొక్కుదామని చూడటం తెలివితక్కువతనం. దేశంలో ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించినప్పుడు కూడా మీడియాపైనా, ఎడిటర్లపైనా ఈ స్థాయిలో కక్ష తీర్చుకున్న దాఖలాలు లేవు. గతంలో 'సాక్షి' కార్యాలయాలను లక్ష్యంగా చేసుకుని టీడీపీ మూకలు దాడులు చేశాయి. ఈమధ్య పోలీసులే ఆ బాధ్యత తీసుకుంటున్నారు. ఇటీవల విజయవాడలోని 'సాక్షి' ప్రధాన కార్యాలయంలోకి అర్ధరాత్రి చొరబడి అరాచకం సృష్టించారు. ఇప్పుడిక వార్త ప్రచురించటాన్ని కూడా నేరంగా పరిగణించి నోటీసులు జారీ చేయటం, అక్రమ కేసులు బనాయించటం మొదలైందన్నమాట! ఒక పార్టీ నాయకుడు నిర్వహించిన మీడియా సమావేశం వివరాలు ప్రచురించటం నేరమెలా అవుతుందో సర్కారు చెప్పగలదా?

మన రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కుల్లో పత్రికా స్వేచ్ఛ అంతర్భాగం. పత్రికా స్వేచ్ఛ అంటే సమాచారాన్ని తెలుసుకోవటానికి ప్రజలకుండే హక్కు. దీన్ని కాలరాయాలని చూస్తే ప్రజాస్వామ్య శక్తులు సహించవు. 'సాక్షి' గొంతు నొక్కితే తమ అరాచకాలను ప్రశ్నించేవారుండరని కూటమి ప్రభుత్వం కలలుగంటోంది. అందుకే నోటీసులతో, తప్పుడు కేసులతో బెదిరిస్తోంది. పాలకుల అక్రమాలనూ, అన్యాయాలనూ, అరాచకాలనూ బట్టబయలు చేయటం, ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయటం 'సాక్షి' కర్తవ్యం. పాలకుల చవకబారు ఎత్తుగడలకు భయపడి దీన్నుంచి వైదొలగే ప్రశ్నే లేదు.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** బ.చవితి సా.4.10 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** అశ్వని రా.6.13 వరకు, తదుపరి భరణి, **వర్జ్యం:** ప.2.29 నుండి 3.59 వరకు, తదుపరి రా.3.10 నుండి 4.39 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.54 నుండి 10.42 వరకు, తదుపరి ప.2.45 నుండి 3.33 వరకు, **అమృత ఘడియలు:** ఉ.11.25 నుండి 12.56 వరకు.

సూర్యోదయం : 5.50
సూర్యాస్తమయం: 6.04
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

జాతి సేవలో మునుముందుకు...

సందర్భం



నరేంద్ర మోదీ
భారత ప్రధాని

ఈ రోజు సెప్టెంబరు 11... ఈ తేదీ మనకు రెండు విభిన్న చారిత్రక సంఘటనలను గుర్తు చేస్తుంది.

మొదటిది... షికాగోలో 1893నాటి స్వామి వివేకానంద ప్రసంగం. 'సిస్టర్స్ అండ్ బ్రదర్స్ ఆఫ్ అమెరికా' అన్న ఆయన పలకరింపు ఆ సమావేశ మందిరంలోని వేలాది ప్రేక్షకుల హృదయాలను పులకరింపజేసింది. భారత అజరామర ఆధ్యాత్మిక వారసత్వాన్ని, సార్వత్రిక సోదరభావన ప్రాధాన్యాన్ని ఈ అంతర్జాతీయ వేదికపై నుంచి ఆయన ప్రపంచానికి పరిచయం చేశారు. రెండోది... ఉగ్రవాద-తీవ్రవాద దుశ్చర్యల ఫలితంగా ఈ సౌహార్ద భావనను తుత్తునియలు చేస్తూ సాగిన 9/11 నాటి భీకర దాడులు.

ఇదే రోజుకు మరో ప్రత్యేకత కూడా ఉంది... 'వసుధైవ కుటుంబకం' సూత్రంతో ప్రేరణ పొంది, సామాజిక మార్పు–సామరస్యం, సోదరభావ స్ఫూర్తి బలోపేతం లక్ష్యంగా తన జీవితాన్ని అంకితం చేసిన ఒక మహనీయుడి జన్మదినమిది. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)తో అనుబంధంగల లక్షలాది మంది ఆయనను సగౌరవంగా... ప్రేమాభిమానాలతో పరమ 'పూజ్య సర్‌సంఘ్ చాలక్' అని పిలుచుకుంటారు. అవును... నేను చెబుతున్నది శ్రీ మోహన్ భాగవత్ గురించే! ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో ఆయన 75వ జన్మదిన వేడుక నిర్వహించుకోవడం యాదృచ్ఛికం. ఈ సందర్భంగా నా శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆ దైవం ఆయనకు దీర్ఘాయుష్షు ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను.

> సామాజిక శ్రేయస్సు కోసం మోహన్ జీ 'పంచ పరివర్తన్' అందించారు. సామాజిక సామరస్యం, కుటుంబ విలువలు, పర్యావరణ అవగాహన, జాతీయ భావన, పౌర విధులు ఇందులోని అంశాలు. ఇవి భారతీయులకు స్ఫూర్తినిస్తాయి.

మోహన్ భాగవత్ కుటుంబంతో నా అనుబంధం ఎంతో లోతైనది. ఆయన తండ్రి దివంగత మధుకర్ రావు భాగవత్‌తో సన్నిహితంగా పనిచేసే అదృష్టం నాకు దక్కింది. ఈ అనుభవాన్ని నా రచన 'జ్యోతిపుంజ్'లో విస్తృతంగా వివరించాను. న్యాయ వ్యవస్థతో తన అనుబంధంతో పాటు, దేశ ప్రగతి కోసం ఆయన తనను తాను అంకితం చేసుకున్నారు. గుజరాత్ రాష్ట్రవ్యాప్తంగా 'ఆర్ఎస్ఎస్'ను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించారు. దేశ పురోగమనంపై మధుకర్ రావు తపన ఎంతటిదంటే– తన కుమారుడు మోహన్ రావును భారత పునరుజ్జీవనం దిశగా కృషికి పురిగొల్పింది. మధుకర్ రావు ఒక పరుసవేది కాగా, మోహన్ రావు రూపంలో మరో 'మణి'ని తీర్చిదిద్దారు.

తొలి అడుగులు

మోహన్ 1970 దశకం మధ్య భాగంలో ఆర్ఎస్ఎస్ ప్రచారక్ అయ్యారు. 'ప్రచారక్' అంటే– ఏదో ఒక సిద్ధాంతం ఆధారంగా సంబంధిత ప్రబోధాలను ప్రచారం చేసే బాధ్యతగా కొందరు అపార్థం చేసుకోవచ్చు. కానీ, ఆర్ఎస్ఎస్ పనితీరు గురించి తెలిసిన వారికి 'ప్రచారక్' అనేది సంస్థలో కీలక పని సంప్రదాయమనే వాస్తవం చక్కగా తెలుసు. గడచిన వంద సంవత్సరాలుగా దేశభక్తి ప్రేరణగా వేలాది యువత 'భారతదేశమే ప్రధానం' లక్ష్యంగా దాన్ని సాకారం చేసే దిశగా తమ జీవితాలను అంకితం చేశారు. ఇందు కోసం వారు ఇల్లూవాకిలీ సహా కుటుంబ బంధాలన్నిటినీ వదులుకుని దేశమాత సేవలో తరించారు.

ఆయన 'ఆర్ఎస్ఎస్'లో ప్రవేశించిన తొలినాళ్ల సమయాన్ని భారత చరిత్రలో అంధకార యుగంగా అభివర్ణించవచ్చు. ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత క్రూర ఎమర్జెన్సీ విధించిన సమయమది. ప్రజాస్వామ్య సూత్రాలను గౌరవిస్తూ, దేశం ప్రగతి పథంలో పయనించాలని ఆకాంక్షించే ప్రతి వ్యక్తీ దీన్ని ప్రతిఘటిస్తూ ఉద్యమంలో దూకడం అత్యంత సహజం. అదే తరహాలో మోహన్ సహా అసంఖ్యాక 'ఆర్ఎస్ఎస్' స్వయంసేవకులు కూడా ఇలాగే చేశారు. మహారాష్ట్రలోని గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లో... ముఖ్యంగా విదర్భలో ఆయన విస్తృతంగా పనిచేశారు. తద్వారా పేదలు, అణగారిన వర్గాల సమస్యలను ఆకళింపు చేసుకునే అవకాశం ఆయనకు లభించింది.

అనంతర కాలంలో భాగవత్ 'ఆర్ఎస్ఎస్'లో వివిధ బాధ్యతలు నిర్వర్తించారు. ఆ యా విధుల నిర్వహణలో ఆయన అసమాన నైపుణ్యం ప్రదర్శించారు. ముఖ్యంగా 1990 దశకంలో 'అఖిల భారతీయ శారీరక్ ప్రముఖ్' అధిపతిగా మోహన్ పనిచేసిన కాలాన్ని చాలామంది స్వయంసేవకులు నేటికీ ఎంతో ప్రేమాభిమానాలతో స్మరించుకుంటుంటారు. ఆ సమయంలో ఆయన బిహార్ రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో సంఘ్ నిర్మాణం కోసం అవిరళ కృషి చేశారు. జనజీవనంలోని క్షేత్రస్థాయి సమస్యలపై ఆయన అవగాహనను ఈ



నేడు ఆర్ఎస్ఎస్ సర్‌సంఘ్‌చాలక్ మోహన్ భాగవత్ 75వ జన్మదినం

అనుభవాలు మరింత పెంచాయి. అటుపైన 20వ శతాబ్దారంభంలో ఆయన 'అఖిల భారతీయ ప్రచార ప్రముఖ్'గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం 2000లో 'సర్‌కార్యవాహ్' అయ్యారు. ఈ రెండు పదవుల్లోనూ తనదంటూ ప్రత్యేక పనిశైలిని ఆచరణలో పెట్టారు. అత్యంత సంక్లిష్ట పరిస్థితులను సులువుగా, కచ్చితత్వంతో నిభాయించారు. ఆ తర్వాత 2009లో 'సర్‌సంఘ్‌చాలక్'గా ఆర్ఎస్ఎస్ పగ్గాలు చేపట్టిన నాటి నుంచీ అందరికీ ఉత్తేజమిచ్చే విధంగా పని చేస్తున్నారు.

ఈ పదవీ నిర్వహణ సంస్థాగత బాధ్యతను మించిన కర్తవ్యం. సంస్థ ఉద్దేశాలు, నిర్దేశాలపై స్పష్టత, భరతమాతపై అపార ప్రేమగల అసాధారణ వ్యక్తులు త్యాగం, అచంచల నిబద్ధతతో ఈ బాధ్యతలకు కొత్త నిర్వచనమిచ్చారు. మోహన్ భాగవత్ ఈ గురుతర బాధ్యతను అనితర సాధ్యంగా నిర్వహించడంతోపాటు స్వీయ శక్తిసామర్థ్యాలు, మేధస్సు జోడించి కరుణార్ద్ర నాయకత్వాన్ని ఆచరణాత్మకంగా చూపారు. 'దేశమే ప్రధానం' అన్న సూత్రమే వీటన్నిటికీ ప్రేరణ!

ప్రత్యేక కార్యశీలత్వం

అవిచ్ఛిన్నత, అన్వయం... మోహన్ జీ మనఃపూర్వకంగా భావించిన, తన కార్యశైలిలో ఇముడ్చుకున్న ముఖ్యమైన అంశాలపై ఆలోచిస్తే ఈ రెండూ నాకు స్ఫురిస్తాయి. మనం గర్వించే సంస్థాగత భావజాల పరంగా రాజీపడకుండా, అదే సమయంలో మారుతున్న సామాజిక అవసరాలకూ అనుగుణంగా... సంక్లిష్టమైన అంశాల్లోనూ ఆయన సమర్థంగా సంస్థను ముందుకు నడిపారు. ఆయనకు యువతతో సహజమైన అనుబంధం ఉంది. ఎప్పుడూ పెద్ద సంఖ్యలో యువతను సంఘ్‌పరివార్‌లో భాగస్వాములను చేయడంపై దృష్టి సారించారు. ఆయనెప్పుడూ బహిరంగ చర్చల్లో పాల్గొంటూ, ప్రజలతో సంభాషిస్తూ కనిపిస్తారు. నేటి గతిశీల, డిజిటల్ ప్రపంచంలో ఇది అత్యంత ప్రయోజనకరమైన అంశం.

స్థూలంగా చెప్పాలంటే, వందేళ్ల ఆర్ఎస్ఎస్ ప్రస్థానంలో భాగవత్ జీ బాధ్యతలు నిర్వర్తించిన కాలం అత్యంత విప్లవాత్మక సమయమని చెప్పక తప్పదు. యూనిఫాంలో మార్పు నుంచి శిక్షా వర్గలలో (శిక్షణ శిబిరాలు) మార్పుల వరకు... ఆయన నేతృత్వంలో అనేక ముఖ్యమైన మార్పులు వచ్చాయి.

మానవత్వం విపత్తుతో తలపడిన కోవిడ్ కాలంలో మోహన్ జీ కృషి నాకు ఎప్పటికీ గుర్తుంటుంది. జీవితకాలంలో మునుపెన్నడూ చూడని ఆ విపత్తు వేళ ఆర్ఎస్ఎస్ సాంప్రదాయక కార్యకలాపాల కొనసాగింపు సవాలుగా మారింది. సాంకేతికత వినియోగాన్ని పెంచాలని మోహన్ జీ సూచించారు. ప్రపంచవ్యాప్త సవాళ్ల నేపథ్యంలో... సంస్థాగత యంత్రాంగాలను అభివృద్ధి చేస్తూనే, అంతర్జాతీయ పరిణామాలనూ నిశితంగా పరిశీలించారు.

స్వీయ రక్షణ చర్యలతోపాటు ప్రజా రక్షణను కర్తవ్యంగా భావిస్తూ.. ఆపన్నులను ఆదుకునేందుకు కోవిడ్ సమయంలో స్వయంసేవకులంతా శక్తివంచన లేకుండా కృషి చేశారు. అనేక చోట్ల వైద్య శిబిరాలు నిర్వహించాం. కష్టపడి పనిచేసే స్వయంసేవకులను కూడా కోల్పోయాం. కానీ మోహన్ జీ స్ఫూర్తి వల్ల వారి దృఢ సంకల్పం ఎప్పుడూ సడలలేదు.

ఈ ఏడాది మొదట్లో నాగ్‌పూర్‌లో మాధవ్ నేత్ర చికిత్సాలయ ప్రారంభోత్సవం సందర్భంగా... ఆర్ఎస్ఎస్ ఒక అక్షయవటం లాంటిదనీ, అది మన దేశ సంస్కృతినీ, సామూహిక చైతన్యాన్నీ శక్తిమంతం చేస్తుందనీ నేను వ్యాఖ్యానించాను. ఈ అక్షయవట మూలాలు లోతైనవి, బలమైనవి. ఎందుకంటే అవి విలువలతో కూడుకున్నవి. ఈ విలువలను పెంపొందించడానికీ, ముందుకు తీసుకెళ్లడానికీ మోహన్ భాగవత్ జీ అంకితభావంతో వ్యవహరించిన విధానం నిజంగా స్ఫూర్తిదాయకం.

మోహన్ జీ వ్యక్తిత్వంలో మరో అద్భుత లక్షణం ఆయన మృదు భాషణం. ఆయన అందరి మాటా వింటారు. ఈ లక్షణం విస్తృత దృక్పథానికి నిదర్శనం. ఇదే ఆయన వ్యక్తిత్వానికి, నాయకత్వానికి శోభనిచ్చింది.

పంచ పరివర్తన్

వివిధ ప్రజా కార్యక్రమాలపై ఆయన చూపించిన ఆసక్తి గురించి కూడా నేను రాయాలనుకుంటున్నాను. 'స్వచ్ఛ భారత్ మిషన్' నుంచి 'బేటీ బచావో బేటీ పఢావో' వరకు.. ఈ కార్యక్రమాల్లో ఉత్సాహంగా భాగస్వామ్యం వహించాలని మొత్తం ఆర్ఎస్ఎస్ కుటుంబానికీ ఆయన ఎప్పుడూ చెప్పేవారు. సామాజిక శ్రేయస్సు కోసం మోహన్ జీ 'పంచ పరివర్తన్' అందించారు. సామాజిక సామరస్యం, కుటుంబ విలువలు, పర్యావరణ అవగాహన, జాతీయ భావన, పౌర విధులు ఇందులోని అంశాలు. జీవితంలోని ప్రతి దశలో ఇవి భారతీయులకు స్ఫూర్తినిస్తాయి. బలమైన, సంపన్నమైన దేశాన్ని చూడాలని ప్రతి స్వయంసేవక్ కలలుగంటాడు. దాన్ని సాకారం చేయడం కోసం... స్పష్టమైన దార్శనికత, నిర్ణయాత్మక కార్యాచరణ రెండూ కావాలి. మోహన్ జీలో ఈ రెండు లక్షణాలూ పుష్కలంగా ఉన్నాయి.

> మోహన్ జీ వ్యక్తిత్వంలో మరో అద్భుత లక్షణం ఆయన మృదు భాషణం. ఆయన అందరి మాటా వింటారు. ఈ లక్షణం విస్తృత దృక్పథానికి నిదర్శనం. ఇదే ఆయన వ్యక్తిత్వానికి, నాయకత్వానికి శోభనిచ్చింది.

భాగవత్ జీ ఎప్పుడూ 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' గురించి బలంగా చెప్తారు. భారతదేశ వైవిధ్యాన్ని గట్టిగా నమ్మే వ్యక్తి. దేశంలో భాగమైన అనేక విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలను ఘనంగా చాటుతారు.

తన షెడ్యూల్ వల్ల ఎంత బిజీగా ఉన్నా... మోహన్ జీ సంగీతం, పాటల వంటి అభిరుచులకు ఎప్పుడూ సమయం కేటాయించారు. వివిధ భారతీయ సంగీత వాయిద్యాలలో ఆయన చాలా ప్రజ్ఞాశాలి అని కొద్ది మందికే తెలుసు. చదవడం పట్ల ఆయనకున్న మక్కువ ఆయన ప్రసంగాలు, సంభాషణలలో కనిపిస్తుంది.

మరి కొన్ని రోజుల్లో ఆర్ఎస్ఎస్ 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటుంది. ఈ సంవత్సరం విజయ దశమి, గాంధీ జయంతి, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి, ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు ఒకే రోజున జరగడం కూడా ఒక ఆనందకరమైన యాదృచ్ఛికం. భారత దేశంతోపాటు ప్రపంచవ్యాప్తంగా ఆర్ఎస్ఎస్‌తో అనుబంధం ఉన్న లక్షలాది మందికి ఇది ఒక చారిత్రాత్మక ఘట్టం అవుతుంది. ఈ సమయంలో మోహన్ జీ వంటి తెలివైన, కష్టపడి పనిచేసే సర్‌సంఘ్‌చాలక్ సంస్థను నడిపిస్తున్నారు. మనం అంతరాలకూ, హద్దులకూ అతీతంగా ఎదిగి, ప్రతి ఒక్కరినీ మనవారిగా భావిస్తే సమాజంలో నమ్మకం, సోదరభావం, సమానత్వం బలపడుతుందని చాటిన మోహన్ జీ వసుధైక కుటుంబానికి సజీవ ఉదాహరణగా చెబుతూ నేను ముగిస్తున్నాను. దీర్ఘాయుష్షుతో, ఆరోగ్యంతో మోహన్ జీ భరతమాత సేవలో ముందుకు సాగాలని కోరుకుంటున్నాను. ◆

సోషల్ టాక్

కుతూహలం



విజయం అనేది ప్రమాదకరమైన స్థితి. ఎందుకంటే మీరు దాని నుండి ఇక ఏమీ నేర్చుకోరు. పైగా అది సులభంగా మీ ఆత్మసంతృప్తికి దారితీస్తుంది. గుర్తుంచుకోండి. నేర్చుకోవాలన్న కుతూహలం కోల్పోనంత వరకే మీరు విజేతగా నిలువగలరు.

– పాల్ బల్కే, ఛైర్మన్, నెస్లే

వినండి



వాస్తవ ప్రపంచంలో పరిష్కారాలు స్పష్టంగా ఉండకపోవచ్చు. దాంతో మీరు అయోమయంలో పడిపోతారు. మీరు మీ నమ్మకాలకు కట్టుబడి ఉన్నప్పటికీ, ఇతరుల మాట వినగలిగితే, అప్పుడు మీరు నిజంగా విజయం సాధిస్తారు.

– జేక్ సల్లివాన్, యూఎస్ మాజీ ఎన్.ఎస్.ఎ.

దార్శనికులు



నేను మీటింగ్‌లలో ఒక మూల కూర్చుని ధీరూభాయ్ అంబానీ, జెఆర్‌డి టాటా, ఆదిత్య బిర్లా వంటి నాయకులు తమ వాటాదారులతో ఎలా వ్యవహరిస్తారో, ఎలా సంభాషిస్తారో చూశాను. ఆ దార్శనికుల నుండి వ్యాపారం గురించి చాలా నేర్చుకున్నాను.

– సజ్జన్ జిందాల్, ఎండీ, జె.ఎస్.డబ్ల్యు

పెద్ద ప్రపంచం



మీరు మీ కెరీర్ వెలుపల ఉన్న వ్యక్తులను కూడా నిత్యం కలుస్తూ ఉండాలి. అందుకోసం కొంత సమయం తీసి పెట్టుకోవాలి. మీ ప్రపంచంలో మీరు ఉండిపోతే, బయట ఇంకా పెద్ద ప్రపంచం ఉందన్న సంగతిని మీరు గుర్తించలేరు.

– జనమేజయ సిన్హా, రచయిత

అభివృద్ధికి మార్గం



క్రమంగా మనంతట మనం ఆలోచించే సామర్థ్యం కోల్పోతున్నాం. సూచనల ద్వారా జీవించడానికి అలవాటు పడుతున్నాం. ఆలోచనతో పని లేకుండా జీవించడం నేర్చుకుంటే వ్యక్తిగా అభివృద్ధి చెందలేం.

– సుసన్నా కాన్‌స్టాంటైన్, రచయిత్రి

ఓటమి మేలు




ఎంతటి ఘోరమైన ఓటమి అయినా, విజయానికి తోడ్పడుతుంది. విజయం లాగే ఓటమి కూడా ఆత్మను కవ్వంలా చిలుకుతుంది. కీర్తిని బయటికి తెస్తుంది.

– అల్ గోర్, యూఎస్ వ్యాపారవేత్త

భూదానోద్యమ పితామహుడు

ఇన్ బాక్స్

మహాత్మా గాంధీ ఆధ్యాత్మిక వారసునిగా, భూదానోద్యమ పితామహులుగా ప్రసిద్ధికెక్కిన ఆచార్య వినోబా భావే 1895 సెప్టెంబర్ 11న మహారాష్ట్రలో రత్నగిరి జిల్లాలో జన్మించారు. బెనారస్ యూనివర్సిటీలో గాంధీజీ ఉపన్యాసానికి ప్రేరేపితుడై గాంధీజీ అనుచరునిగా మారారు. గాంధీజీ వినోబాను 'ప్రథమ వ్యక్తి సత్యాగ్రహి'గా జాతికి పరిచయం చేశారు. భారతదేశంలో సమ సమాజ నిర్మాణానికి గాంధీజీ ఆశించిన 'గ్రామ స్వరాజ్య లక్ష్యసాధన'కు వినోబాజీ 1951లో శివరాంపల్లి సర్వోదయ సమ్మేళన అనంతరం శాంతి యాత్రను నిర్వహించారు. ఇందులో భాగంగా ఏప్రిల్ 18న నల్లగొండ జిల్లా పోచంపల్లి గ్రామంలో ప్రార్థన సమావేశంలో వెదిరె రామచంద్రారెడ్డి తన 100 ఎకరాల భూమిని వినోబాకు సమర్పించారు. ఈ విధంగా ప్రారంభించిన 'శాంతి యాత్ర' పోచంపల్లి నుండి 'భూదాన యాత్ర'గా మారింది.



వినోబా భావే

యాత్రలో భూస్వాముల నుండి భూమి సేకరించి భూమి లేని వారికి పంపిణీ చేసే కార్యక్రమం చేపట్టారు. సోషలిస్టు పార్టీ నేత జయప్రకాష్ నారాయణ్ అహింసాయుత మార్గం ద్వారా శోషణ రహిత సమ సమాజ స్థాపనకు ఈ భూదానోద్యమం దోహద పడగలదని ఆశించి, సోషలిస్ట్ పార్టీ కార్యకర్తలందరూ ఈ భూదానోద్యమంలో పాల్గొనవలసిందిగా పిలుపునిచ్చారు. 1954లో మహబూబ్‌నగర్ జిల్లాలో జయప్రకాష్ నారాయణ్ నాగర్ కర్నూల్, వనపర్తి తాలూకాల్లోని భూస్వాముల నుండి భూమి సేకరించి భూమి లేని వారికి పంచారు.


బిహార్, ఒరిస్సా, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో భూదాన పాదయాత్ర కొనసాగింది. భూదాన యాత్ర ఖర్చులకు నిధులు 'గాంధీ స్మారక నిధి' నుండి అందేవి. వినోబా రెండో పర్యాయం పాదయాత్ర (1956) సమయంలో మహబూబ్ నగర్ జిల్లాలో 'పాల్మాకుల' గ్రామంలో వినోబా క్యాంపును భారత రాష్ట్రపతి డా॥ రాజేంద్ర ప్రసాద్ సందర్శించి వెళ్లారు. 1956 మార్చి 7వ తేదీన ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ స్వయంగా మాధవరావు పల్లి గ్రామానికి వచ్చి వినోబాను కలిసి భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు గురించి, బొంబాయి మహానగర సమస్య పరిష్కారం గురించి చర్చించారు. అవిశ్రాంతంగా దేశ సేవలో ఉన్న ఆయన 1982 నవంబరు 15న పవనార్ (వార్ధా) ఆశ్రమంలో అస్తమించారు. వీరి మరణానంతరం భారత ప్రభుత్వం ఆయనకు అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న' ప్రకటించింది. ఆచార్య వినోబాజీ 130వ జయంతి సందర్భంగా వారితో నాకు ఉన్న అనుబంధాన్ని స్మరించుకుంటూ శ్రద్ధాంజలి ఘటిస్తున్నాను.

– జి.వి. సుబ్బారావు, తెలంగాణ గాంధీ స్మారక నిధి అధ్యక్షులు
(నేడు ఆచార్య వినోబా భావే 130వ జయంతి)

డేటా పాయింట్

పోస్టాఫీసు 'పార్శిళ్ల' రికార్డు

భారత తపాలాశాఖ 2023లో 1.30 కోట్లకు పైగా వివిధ లెటర్లను బట్వాడా చేసింది. 2018తో పోలిస్తే ఇది కేవలం 20 శాతమే. కానీ, పార్శిళ్ల విషయంలో రికార్డు సృష్టించింది.



ఆధారం: యూనివర్సల్ పోస్టల్ యూనియన్ 'పోస్టల్ స్టాటిస్టిక్స్ రిపోర్టులు'

అమృతత్వాన్ని సాధించడం

జ్యోతిర్మయం

భారతీయ సాహిత్యం మానవ జీవన ప్రయోజనాన్ని ప్రవచిస్తున్నది. 'భారతము' అనడంలోనే ఉదాత్తత ఉన్నది. 'భా' అంటే ప్రకాశం... 'రతము' అంటే కోరిక. ప్రకాశము అంటే ఉన్నతిని సాధించాలనే తపన. సమున్నత స్థితిని దర్శించి సాధించేందుకు ప్రయత్నం చేసేవారే, భారతీయులు. భారతీయ జీవన విధానంలో భౌతిక, ఆధ్యాత్మిక జీవన సమన్వయత ఓతప్రోతమై కనిపిస్తుంది. భౌతికత, ఆధ్యాత్మికతలు పరస్పర సమన్వయంతో ముడిపడిన జీవితాన్ని రసమయం చేసుకునేందుకు అవసరమైన మార్గాలనూ చూపే క్రమంలో చెప్పబడిన పలు గాథలు ప్రతీకాత్మకమైనవి. అందులో 'గంగావతరణ' గాథ వ్యక్తి జీవితంలో 'ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి' చేరేందుకు చేయవలసిన ప్రయత్నం, సాధనల గూర్చి ప్రబోధిస్తుంది.

సగరుని మనుమడైన భగీరథుడు తన పూర్వీకులకు సద్గతిని ప్రసాదించాలనే సంకల్పంతో గంగాదేవిని గూర్చి తపస్సు చేయడం, గంగ ప్రత్యక్షమై, భగీరథుని కోరిక ప్రకారం భూమిపై 'అవతరించడం' గంగావతరణంగా చెప్పుకుంటాము. అవతరించడం అంటే కిందికి దిగడం. మూలాధారంలో నిద్రావస్థలో ఉండే కుండలినీ శక్తిని సహస్రారానికి చేర్చే ప్రక్రియనే ఆధ్యాత్మిక పరిభాషలో 'అమృతత్వ సాధన' లేదా 'గంగావతరణ సాధన' అంటారు. సాధకుని సాధనా నిష్పత్తిని అనుసరించి ఆధ్యాత్మిక శక్తి అవతరిస్తూ సాధకుడిని ఉన్నత స్థితికి చేర్చడమే సాధన పరమార్థం. భౌతిక జీవితంలో ఉన్నత స్థితికి చేరడం, అభివృద్ధిని సాధించడం, ఆధ్యాత్మిక జీవితంలో అమృతత్వాన్ని సాధించడం లక్ష్యంగా మానవ జీవనం సాగాలనే సత్యాన్ని సుబోధకంగా, ప్రతీకాత్మకంగా బోధిస్తోంది గంగావతరణ గాథ. గంగావతరణ గాథ మానవజాతికి ఏం బోధిస్తున్నది? ప్రయత్నం చేయనిదే ప్రపంచంలో ఏ వ్యక్తీ దేనినీ సాధించలేడు. సుప్త జాతికి పురోగతి లేదు. నిస్వార్థమైన చైతన్యంతో, సదాశయంతో, నిరంతర తపన, కార్యదీక్ష, ఆత్మవిశ్వాసం వంటివి ఆయుధాలుగా ఉదాత్తమైన లక్ష్యాన్ని ఛేదించాలనే సంకల్పంతో పురోగమించే వారికి అసాధ్యమైనదేదీ లేదనే సత్యాన్ని భగీరథుని పాత్ర ద్వారా భారతీయ సాహిత్యం బోధిస్తున్నది.

– పాలకుర్తి రామమూర్తి

క్లుప్తంగా...

నేటి నుంచి తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు

- రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలి
- పార్టీ శ్రేణులకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని పిలుపు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 11 నుంచి 17వ తేదీ వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఉత్స వాల ప్రారంభ సూచికగా గురువారం హైద రాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ఉన్న మఖ్దూం మొహినుద్దీన్ విగ్రహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ఎర్ర చొక్కాలు, ఎర్ర చీరలతో ప్రదర్శన ఉంటుందని ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. ఈ కార్యక్రమాలు గురువారం నుంచి ఆయా జిల్లాలలోని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కేంద్రాలలో జరుగుతాయ ని, ఉత్సవాల్లో రాష్ట్ర, జిల్లా నాయకత్వం పాల్గొంటుందని తెలిపారు. సెప్టెంబర్ 17వ తేదీన ముగింపు ఉత్సవాలను హైదరాబా ద్‌లోని రావి నారాయణ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు సాంబశివరావు వివరిం చారు. కాగా, రైతాంగ పోరాటంపై బీజేపీ దు ష్ప్రచారం చేస్తోందని, పోరాట చరిత్రను వక్రీక రిస్తోందని ఆయన మండిపడ్డారు. బీజేపీ చేస్తున్న దుష్ట పన్నాగాలను ఎండగడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సభలు, సెమినార్లు నిర్వహిం చనున్నట్లు తెలిపారు. నిజాం రాచరిక, భూస్వామ్య వ్యవస్థల కబంధ హస్తాల నుంచి పేదలకు విముక్తి కల్పించేందుకు నాడు కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో మట్టి మనుషులు చేసిన మహత్తర పోరాటం ప్రపంచ చరిత్ర లోనే విశిష్టమైనదని అన్నారు. ఈ పోరాటంలో నాలుగున్నర వేల మంది ప్రజలు మాతృ భూమి స్వాతంత్ర్యం కోసం అసువులు బాసారని గుర్తు చేశారు.

మేడిగడ్డ మరమ్మతుల ప్రకటన భేష్

- మాజీ ఎంపీ వినోద్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: వానాకాలం ముగియగానే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు మర మ్మతులు చేయిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నామని మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్ చెప్పారు. ఆయన బుధవారం తెలంగాణ భవన్‌లో విలేక రులతో మాట్లాడారు. మరమ్మతులు చేయాలం టూ బీఆర్‌ఎస్ మొదట్నుంచి ప్రభుత్వానికి సూచిస్తోందని, ఇప్పటికైనా ఆలస్యం చేయకుం డా మరమ్మతులు చేయాలన్నారు. మేడిగడ్డ బ్యారేజీకే మరమ్మతులు అవసరమని, అన్నా రం, సుందిళ్లకు అవసరం ఉండకపోవచ్చని అభిప్రాయపడ్డారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్‌పై కాంగ్రెస్ పార్టీ సమాధానం చెప్పాలని వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు.

'యూరియా సరఫరాలో కేంద్రం విఫలం'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా యూరి యా కొరత వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్రానికి సరిపడా యూరి యాను సకాలంలో అందించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి ఆరోపించారు. పంటల అవసరాలను దృష్టిలో ఉంచుకొని తక్షణమే సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవ సాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెంటనే కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడిపెంచి రాష్ట్రంలో యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కష్టకాలంలో రైతులకు భరోసా ఇవ్వాల్సిన రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు తమకేం పట్టనట్లు మౌనంగా ఉం టున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

గొర్రెల మందను ఢీకొన్న లారీ

- కాపరి సహా 26 గొర్రెల మృతి

కామారెడ్డి రూరల్: కామారెడ్డి జిల్లా దేవునిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పొందుర్తి వద్ద జాతీయ రహదారి 44పై జరిగిన రోడ్డు ప్రమా దంలో ఒక గొర్రెల కాపరితోపాటు 26 గొర్రెలు మృతి చెందాయి. మరొకరికి తీవ్ర గాయాల య్యాయి. వివరాలివి. మహబూబ్‌నగర్ జిల్లా మరికల్‌కు చెందిన గొర్రెల కాపరులు.. తమ గొర్రెలను మేపేందుకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు సమీపంలోకి వేసవి కాలంలో వచ్చారు. తిరిగి మహబూబ్‌నగర్ వెళ్లిపోతూ.. పొందుర్తి సమీపంలోని పెట్రోల్ బంక్ సమీపంలో బుధ వారం సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో జాతీయ రహదారిపైకి వచ్చారు. అదే సమ యంలో హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ అతి వేగంగా వచ్చి గొర్రెల మందను, ఇద్దరు గొర్రెల కాపరులను ఢీకొంది. ఈ ప్రమాదంలో గుడిగండ్ల రామప్ప అనే గొర్రెల కాపరి అక్కడి కక్కడే మృతి చెందగా, మరో గొర్రెల కాపరి బసాయిల మల్లేష్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. మల్లేష్‌ను చికిత్స నిమిత్తం కామా రెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. దేవునిప ల్లి పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విషయం తెలుసుకున్న కురుమ యువ చైతన్య సమితి ప్రతినిధులు ఉగ్రవాయి మహేశ్, నాగల్ల రాజయ్య, మర్కంటి స్వామి తదితరులు ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి గొర్రెల కాపరిని మెరు గైన చికిత్స కోసం కామారెడ్డిలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

ఇష్టమొచ్చినట్లు ఎఫ్‌ఐఆర్‌లా?

▶ మొదటి పేజీ తరువాయి

'రాష్ట్రానికి తెగులు-కాంగ్రెస్ కీడు', 'సీఎం రేవంత్‌రెడ్డిది 20 ప ర్సంట్ కమీషన్ పాలన', 'ప్రభుత్వానికి విజన్ లేదు-మిషన్ లే దు..' వంటి పోస్టులకు సంబంధించి ఈ 3 కేసులు పెట్టారు. నల్ల బాలును అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఆయన 20 రోజుల పాటు జైల్లో ఉన్నారు. ఈ నేపథ్యంలో రామగుండం, కరీంనగర్, గోదావరిఖని-1 పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసు లను కొట్టివేయాలని కోరుతూ నల్ల బాలు హైకోర్టును ఆశ్రయిం చారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ తుకారాంజీ విచారణ చేపట్టారు.

రాజకీయ విమర్శలపై కేసులా?: పిటిషనర్ తరఫు న్యాయవాది

పిటిషనర్ తరఫున న్యాయవాది టీవీ రమణరావు వాదనలు వినిపించారు. 'నల్ల బాలువి క్రిమినల్ చర్యలు కావు. రాజకీయ విమర్శలు. దీనికే హింస, దురుద్దేశం, అల్లర్లు సృ ష్టించే పోస్టులంటూ రాష్ట్ర ప్రభుత్వం కేసులు పెట్టించింది. పోలీసులు బీఎన్‌ఎస్ (భారతీయ న్యాయ సంహిత) చట్టం లోని సెక్షన్లు 192, 352, 353 కింద కేసులు నమోదు చేయడం చెల్లదు. ఒకవేళ పిటిషనర్ పెట్టిన పోస్టులతో కీర్తి ప్రతిష్టలు దెబ్బతిన్నాయంటే నేరుగా సీఎం లేదా ఆయన పార్టీ ఫిర్యాదు చేయాలి తప్ప ఇతరులు కాదు. థర్డ్ పార్టీ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఎఫ్‌ఐఆర్‌లను నమోదు చేయడం చట్ట విరుద్ధం..' అని పేర్కొన్నారు. ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. 'నల్ల బాలు ఇలాంటి ఇతర కేసుల్లోనూ నిందితు డిగా ఉన్నారు. కావాలని సీఎంను కించపరుస్తూ, ప్రజల్లో సీఎంపై ఆగ్రహం కలిగించేలా పోస్టులు పెట్టారు. కేసుల విచారణను కొనసాగించాలి..' అని కోరారు.

కేసుల కొట్టివేత..పోలీసులకు సూచనలు

వాదనల అనంతరం నల్ల బాలుపై రామగుండం సీసీపీఎస్, కరీంనగర్ సీసీపీఎస్, రామగుండం జీడీకే-1 స్టేషన్లలో నమోదైన కేసులను న్యాయమూర్తి కొట్టేశారు. ఈ సందర్భం గానే పోలీసుల తీరును ఆయన ప్రశ్నించారు. పలు సూచ నలు, ఆదేశాలు జారీ చేశారు.

- పరువు నష్టం కేసులు నమోదు చేసే ముందు ఫిర్యాదుదా రుడు చట్టపరంగా బాధిత వ్యక్తేనా?.. అనేది పోలీసులు ధ్రువీకరించుకోవాలి.
- కాగ్నిజబుల్ (అరెస్టు చేయదగిన) నేరాల్లో తప్ప ఇతర కేసుల్లో సంబంధం లేని మూడో వ్యక్తి వచ్చి ఫిర్యాదు చేస్తే అది చెల్లదు.
- కాగ్నిజబుల్ కేసుల విషయంలో వెంటనే ఎఫ్‌ఐఆర్ నమోదు చేయకుండా ప్రాథమికంగా ఆధారాలు ఉన్నా యో.. లేదో దర్యాప్తు చేయాలి.
- హింస, ద్వేషం, ప్రజల్లో అశాంతిని ప్రేరేపించడానికి సం బంధించి ప్రాథమిక అంశాలు లేనట్లయితే.. ప్రజా శాం తికి ముప్పు, దేశద్రోహం వంటి కేసులను నమోదు చేయవద్దు.
- కేదార్‌నాథ్ సింగ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ బిహార్ కేసు, శ్రేయ సింఘాల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసుల్లో సుప్రీంకోర్టు పేర్కొన్న సూత్రాలను పాటించాలి
- కఠినమైన, అభ్యంతరకరమైన, విమర్శనాత్మక రాజకీయ ప్రసంగానికి సంబంధించిన కేసులను పోలీసులు యాం త్రికంగా నమోదు చేయవద్దు.
- ప్రసంగం హింసను ప్రేరేపించేలా లేదా ప్రజా శాంతికి తక్షణ ముప్పుగా ఉన్నప్పుడు మాత్రమే క్రిమినల్ చట్టాన్ని ప్రయోగించాలి.
- రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఏ) కింద.. రాజకీయ విమర్శకు రక్షణ ఉంది.
- పరువు నష్టం అనేది నాన్‌కాగ్నిజబుల్ నేరంగా పరిగణించి నప్పుడు పోలీసులు నేరుగా క్రిమినల్ కేసు నమోదు చేయలేరు.
- ఫిర్యాదుదారుడిని మేజిస్ట్రేట్‌ను సంప్రదించమని చెప్పాలి. బీఎన్‌ఎస్‌ఎస్ సెక్షన్ 174(2) కింద మేజిస్ట్రేట్ ఆదేశం మేరకు మాత్రమే పోలీసు చర్య తీసుకోవాలి.
- ఇష్టారాజ్యంగా, ఆటోమేటిక్‌గా, మెకానికల్‌గా అరెస్టులు అనుమతించబడవు.
- అర్నేశ్‌కుమార్ వర్సెస్ బిహార్ రాష్ట్రం కేసులో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను విధిగా పాటించాల్సిందే.
- ఫిర్యాదు అనవసరమైనది, రాజకీయ ప్రేరేపితం అని తేలితే.. దర్యాప్తునకు తగిన కారణాలు లేవంటూ బీఎన్ ఎస్‌ఎస్ సెక్షన్ 176(1) కింద పోలీసులు దాన్ని మూసి వేయాలి.

చెంపపెట్టు లాంటి తీర్పు: కేటీఆర్

'బీఆర్‌ఎస్ పార్టీ ట్వీట్లను రీట్వీట్ చేసినందుకు శశి ధర్ గౌడ్‌పై అక్రమ కేసులు నమోదు చేయించిన ప్రభుత్వానికి హైకోర్టు తీర్పు చెంపపెట్టు లాంటిది. సామాజిక మాధ్యమాల్లో పోస్టుల పేరుతో ప్రభు త్వాలు అడ్డగోలుగా కేసులు పెడుతున్నాయి. గత 21 నెలలుగా బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు, సోషల్ మీడియా కార్యకర్తలపై రాజకీయ ప్రేరేపితమైన కేసులు పెట్టి కాంగ్రెస్ వేధిస్తోంది. ఈ వేధింపులు ఇకనైనా ఆపి.. ప్రజాస్వామ్య స్ఫూర్తితో ముందుకు నడవాలి. బీఆర్‌ఎస్ పార్టీ తన కార్యకర్తలకు, కేసీ ఆర్ నాయకత్వాన్ని తిరిగి తీసుకురావడానికి పోరా డుతున్న వారికి ఎప్పుడూ అండగా ఉంటుంది..' అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు.

ఎంపీ వాట్సాప్ డీపీతో ఏమార్చి..

- టీ టైం సీఎఫ్‌ఓ శ్రీనివాస్ నుంచి రూ.92 లక్షలు వసూలు
- సైబర్ క్రైమ్ పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: సైబర్ నేరస్తులు రోజురోజుకూ రెచ్చిపోతున్నారు. కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ ఫొటోను వాట్సాప్ డీపీగా పెట్టుకొని టీ-టైమ్ చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్ శ్రీనివాసరావు గంగిసెట్టి నుంచి రూ.92.5 లక్షలు కొట్టేశారు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సైబరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. టీ టైమ్ పేరుతో దేశవ్యాప్తంగా ఉన్న టీ చెయిన్‌ను ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ స్వయంగా స్థాపించారు. ఉదయ్ శ్రీనివాస్ ఫొటోను వాట్సాప్‌లో డీపీగా ఉపయోగించి సైబర్ నేరస్తులు ఆగస్టు 22న టీ టైం సీఎఫ్‌వో శ్రీనివాసరావుకు తొలుత మెసేజ్ చేశారు. అది తన కొత్త నంబ ర్‌గా పరిచయం చేసుకున్నారు. వాట్సాప్ డీపీ కూడా ఎంపీ శ్రీనివాస్ ఫొటోనే ఉండేసరికి సీఎఫ్‌వో నిజమేనని నమ్మారు. సీఎఫ్‌వోను నమ్మించేందుకు కొన్ని రోజులపాటు కేవలం వాట్సాప్ మెసేజ్‌లలో వ్యాపార లావాదేవీలు, కుశల సమాచారాన్ని అడిగేవారు. దీంతో తనతో రోజూ వాట్సాప్‌లో సంప్రదిస్తున్నది ఎంపీ శ్రీనివాసేనని సీఎఫ్‌ఓ శ్రీనివాసరావు విశ్వసించారు. కొన్ని వారాల తర్వాత పలు దఫాలుగా అత్యవసరం నిమిత్తం వేర్వేరు బ్యాంకు ఖాతాలకు నగదు బదిలీ చేయాలని సైబర్ నేరస్తులు శ్రీనివాసరావును ఆదేశించారు. దీం తో ఆగస్టు 11 నుంచి సెప్టెంబర్ 5 మధ్య 11 దఫాలుగా సీఎఫ్‌ఓ గంగిసెట్టి రూ.92.5 లక్షల నగదును సైబర్ నేరస్తులు సూచించిన వేర్వేరు బ్యాంకు ఖాతాలకు బదిలీ చేశాడు. అయితే ఈనెల 8న ఎంపీ శ్రీనివాస్‌ను సీఎఫ్‌ఓ గంగి శెట్టి నేరుగా కలవడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో మోసపోయానని గ్రహించిన గంగిసెట్టి సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే మొదటి నగదు బదిలీ జరిగిన దాదాపు రెండు వారాల తర్వాత ఫిర్యాదు నమోదు కావడంతో పోలీసులు రూ.7 లక్షలను మాత్రమే స్తంభింపజేయగలిగారు.

రెట్టింపు లాభాల ఆశచూపి.. రూ. 6.76 కోట్లు కొట్టేశారు

- సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు బాధితుల ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్స్ పేరుతో సైబర్ నేరగాళ్లు అందినంతా దోచుకుంటున్నారు. తక్కువ సమయంలో రెట్టింపు లాభాలు వస్తాయని నమ్మిం చి ఇద్దరి నుంచి ఏకంగా రూ.6.76 కోట్లు కొల్లగొట్టారు.

రూ.4 లక్షలు ఇచ్చారు.. రూ.3.61 కోట్లు కొట్టేశారు..

మణికొండ సెక్రటేరియట్ కాలనీకి చెందిన లెనిన్ స్థానికంగా వ్యాపారం చేస్తు న్నాడు. సైబర్ నేరగాళ్లు జులైలో ఆయన వాట్సాప్ నంబర్‌ను ఓ వాట్సాప్ గ్రూప్‌లో యాడ్ చేశారు. ఆ తరువాత స్నేహ సర్దా పేరుతో చాటింగ్‌చేస్తూ షేర్ మార్కెట్ ట్రేడింగ్‌లో ఇన్వెస్ట్ చేయాలని సూచించారు. జూలై 9న మొదటి విడ తగా రూ.12 వేలు పెట్టుబడి పెట్టించారు. ఇందుకు 15 శాతం లాభం వచ్చినట్లు చూపించారు. దీంతో లెనిన్ మరింత డబ్బు పెట్టుబడిగా పెట్టాడు. ఈ క్రమంలో 45 రోజుల వ్యవధిలో మొత్తం రూ.3.61కోట్లు పెట్టుబడి పెట్టాడు. ఇందుకుగాను మొత్తం రూ.27 కోట్లు లాభం వచ్చినట్లు సైబర్ నేరగాళ్లు చూపారు. విత్‌డ్రా చేసు కునేందుకు ప్రయత్నిస్తే వివిధ ట్యాక్స్‌ల పేరుతో మరికొంత డబ్బు వసూలు చేసేందుకు యత్నించారు. దీంతో అనుమానం వచ్చిన లెనిన్.. ఢిల్లీలోని ఐఐఎఫ్ ఎల్ సెక్యూరిటీస్ ఆఫీస్‌కు వెళ్లాడు. వెబ్‌సైట్ గురించి ఆరా తీసి, మోస పోయానని గ్రహించి మంగళవారం నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులకు ఫిర్యాదు చేశాడు.

రూ.3.14 కోట్లు 'సాఫ్ట్'గా స్వాహా..

శేరిలింగంపల్లి రైల్వే స్టేషన్ వెనుకనున్న ఆర్పీ దూబే కాలనీకి చెందిన కల్పన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తోంది. ఈమెను కూడా 'జే7-లెగసీ ఎలైట్'అనే వాట్సాప్ గ్రూప్‌లో చేర్చారు. స్నేహ సర్దా పేరుతో చాటింగ్ చేసి ట్రేడింగ్ చేయాలని సూచించారు. సైబర్ నేరగాళ్లు సూచించిన విధంగా ఆగస్టు 1వ తేదీ నుంచి కల్పన ట్రేడింగ్ చేయడం ప్రారంభించారు. మొదటి విడతగా రూ. 50 వేలు డిపాజిట్ చేశారు. ఇందుకుగాను ట్రేడింగ్ ఖాతాలో దాదాపు 15 శాతం లాభం చూపించారు. పెద్దమొత్తంలో లాభాలు సంపాదించడానికి ఎక్కువ మూలధనాన్ని పెట్టుబడి పెట్టాలని సూచించారు. ఇలా నెల రోజుల వ్యవధిలో రూ.3.14 కోట్లు పెట్టుబడి పెట్టించారు. ఈ పెట్టుబడికిగాను ట్రేడింగ్ ఖాతాలో దాదాపు రూ.23 కోట్లు లాభం కనిపించింది. డబ్బును విత్ డ్రా చేసుకునే ప్రయత్నం చేయడంతో కస్టమర్ కేర్ సపోర్ట్ కోసం 10 శాతం కమీషన్ చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. దీంతోపాటు లాభం మొత్తంలో 3 శాతం భారత ప్రభుత్వా నికి ట్యాక్సులు చెల్లించాలని సూచించారు. అనుమానం వచ్చిన బాధితురాలు ఎన్‌సీఆర్‌పీతో పాటు సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు ఫిర్యాదు చేసింది. ఈ రెండు కేసుల్లో మొత్తం రూ.6.76 కోట్లు సైబర్ నేరగాళ్లు దోచేశారు.

ఎఫ్‌సీఆర్‌ఐలో తేనె ప్రాసెసింగ్ యూనిట్

- ములుగు అటవీ కళాశాలలో రూ.4 కోట్లతో ఏర్పాటు
- రోజుకు 10 టన్నుల తేనె ప్రాసెసింగ్ సామర్థ్యం
- కిలో తేనె ప్రాసెసింగ్‌కు రైతుల నుంచి రూ.22 వసూలు
- శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకంపై రైతులకు శిక్షణ



తేనె ప్రాసెసింగ్ యూనిట్

సాక్షి, సిద్దిపేట: స్వచ్ఛమైన తేనెకు మార్కెట్‌లో మంచి డిమాం డ్ ఉండటం, తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం వస్తుండ డంతో రైతులు 'బీ'కీపింగ్ (తేనెటీగల పెంపకం)పై ఆసక్తి చూపుతున్నారు. అయితే, తేనెను ఎంతబాగా ప్రాసెస్ చేస్తా రన్నదానిపైనే దాని ధర ఆధారపడి ఉంటుంది. ఈ విషయం లో రైతుల సమస్యలు తీర్చేందుకు సిద్దిపేట జిల్లా ములు గులోని అటవీ కళాశాల, పరిశోధన సంస్థ ఎఫ్‌సీఆర్‌ఐ సిద్ధ మైంది. నేషనల్ బీకీపింగ్ అండ్ హనీ మిషన్‌లో భాగంగా ఎఫ్ సీఆర్‌ఐకి ఇంటిగ్రేటెడ్ బీకీపింగ్ డెవలప్‌మెంట్ సెంటర్ (ఐబీ డీసీ) మంజూరైంది. రూ.4 కోట్లతో కళాశాలలో హనీ ప్రాసె సింగ్ యూనిట్‌ను, హనీ టెస్టింగ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. ఇటీవలే ట్రయల్ రన్ నిర్వహించారు. దక్షిణ భారత దేశంలోనే తొలిసారి రోజుకు 10 టన్నుల తేనెను ప్రాసెసింగ్ చేసే సామ ర్థ్యంతో దీనిని ఏర్పాటుచేశారు. తేనెను ప్రాసెసింగ్ చేసి, పరీ క్షించి నాణ్యత సర్టిఫికెట్‌ను సైతం జారీ చేయనున్నారు. నిర్వ హణ ఖర్చుల కోసం రైతుల నుంచి కిలో తేనెకు రూ.22 వసూ లు చేయాలని ఎఫ్‌సీఆర్‌ఐ నిర్ణయించింది. రైతులు తీసుకువ చ్చిన తేనెను వారి బ్రాడింగ్ లేబుల్‌తో ప్యాకింగ్ చేసుకునే అవ కాశం సైతం ఇక్కడ ఉంది. అలాగే బయట కొనుగోలు చేసిన తేనెను సైతం టెస్ట్ చేసి నాణ్యతను తేల్చనున్నారు.

రూ.90కి కిలో తేనె తుట్టె..: తేనె టీగలు వ్యాక్స్ (తేనె తుట్టె)ను తయారు చేసుకునేందుకు దాదాపు 30 రోజుల సమయం పడుతుంది. అలా తేనె ఉత్పత్తికి సమయం వృథా కాకుండా ఉండేందుకు కేజీ వ్యాక్స్‌ను రూ.90 చొప్పున ఇక్కడ విక్రయించనున్నారు. ఒక కేజీకి 16 షీట్ల వ్యాక్స్ వస్తాయి. కళాశాలలో శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకం పై రైతులు శిక్షణ ఇస్తున్నారు. అటవీ కళాశాలలోని ఐబీడీ సీలో ఇప్పటికే తేనె ఉత్పత్తిని ప్రారంభించారు. ఎఫ్‌సీఆర్‌ఐ కేరీస్ పేరిట ట్రేడ్ మార్క్‌ను సైతం తీసుకున్నారు. త్వరలో ధరను నిర్ణయించి మార్కెట్‌లోకి ఎఫ్‌సీఆర్‌ఐ తేనెను విడు దల చేయనున్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



తేనె ప్రాసెసింగ్ యూనిట్‌ను రైతులు సద్వినియోగం చేసుకుని అధిక ఆదాయం పొందాలి. రైతులే స్వయంగా హీట్ పద్ధతితో ప్రాసెసింగ్ చేయడం వలన తేనె ఎక్కువ కాలం నిల్వ ఉండేది కాదు. రైతు మరింత ఆదాయం పొందేందుకు ఈ యూనిట్ దోహదపడుతుం ది. మిషనరీ నిర్వహణ కోసం మాత్రమే చార్జీలు వసూలు చేస్తున్నాం. – శైలజ, ఐబీడీసీ ప్రాజెక్ట్ హెడ్

ఎఫ్‌ఐఆర్ అయినంతమాత్రాన అనుమతి నిరాకరణ చెల్లదు

- మెడికల్ విద్య నిరాకరణపై ఎన్‌ఎంసీకి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఈ విద్యా సంవత్సరానికి మెడికల్ సీట్ల భర్తీ కోసం అనుమతి కోరుతూ నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ ఎంసీ) వద్ద అప్పీల్ చేసుకోవడానికి వరంగల్‌లోని ఫాదర్ కొలంబో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు హైకోర్టు ద్వి సభ్య ధర్మాసనం అనుమతిచ్చింది. ఓ కేసులో ఎఫ్‌ఐఆర్ దాఖ లైనంత మాత్రాన అనుమతి నిరాకరించడం చెల్లదని స్పష్టం చేసింది. మూడు రోజుల్లో కౌన్సిల్ ముందు అప్పీల్ దాఖలు చేసుకోవాలని కాలేజీని ఆదేశించింది. సుప్రీంకోర్టు మార్గదర్శ కాలు, రాష్ట్రంలోని రెండు కాలేజీలకు ఇచ్చిన షరతులతో కూ డిన అనుమతులను పరిగణనలోకి తీసుకుని 10 రోజుల్లో తగిన నిర్ణయం తీసుకోవాలని ఎన్‌ఎంసీకి తేల్చిచెప్పింది. ఈ ఏడాది మెడికల్ సీట్ల భర్తీకి అనుమతి నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ ఫాదర్ కొలంబో కాలేజీ హైకోర్టును ఆశ్రయించింది. విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి.. ఎన్‌ఎంసీ నిర్ణయాన్ని సమర్థిస్తూ ఉత్తర్వు లిచ్చారు. దీన్ని సవాల్ చేస్తూ కాలేజీ అప్పీల్ దాఖలు చేసింది. ఈ అప్పీల్‌పై జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ వాకిటి రామకృష్ణారెడ్డి ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ఎన్‌ఎంసీ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. మౌలిక సదుపాయాల్లో లోపాలు, జూన్ 30న సీబీఐ దాఖలు చేసిన ఎఫ్‌ఐఆర్ కారణంగా సీట్ల భర్తీకి నిరాకరించినట్లు చెప్పారు. ఇన్‌స్టిట్యూట్ ట్రస్టీ అయిన ఫాదర్ జోసెఫ్ కొమ్మారెడ్డి.. కళాశా ల నియంత్రణ అనుమతులను ప్రభావితం చేసేలా డాక్టర్ హరి ప్రసాద్‌కు మధ్యవర్తుల ద్వారా రూ.20 లక్షలు, రూ.46 లక్షలు లంచం ఇచ్చారంటూ ఈ ఎఫ్‌ఐఆర్ నమోదు చేసినట్లు నివేదిం చారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఎన్ ఎంసీ ఏకపక్షంగా వ్యవహరించిందని, కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా సీట్ల భర్తీకి అనుమతి నిరాకరించిందన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఎఫ్‌ఐఆర్ నమోదైనంత మాత్రాన సీట్ల భర్తీని నిరాకరించడాన్ని తప్పుబట్టింది. దీనిపై నిర్ణయం తీసుకోవాలని ఎన్‌ఎంసీని ఆదేశిస్తూ విచారణ ముగించింది.

ఈ ఏడాది భారీగా నష్టపోయాం

- ప్రధాన కార్యదర్శి, ముగ్గురు కేంద్ర కమిటీ సభ్యులను కోల్పోయాం
- ప్రతికూలతను అధిగమించి పార్టీ శ్రేణులు ముందుకు సాగాలి
- 21వ వార్షికోత్సవాలను నిర్వహించాలి
- లేఖ విడుదల చేసిన మావోయిస్టు కేంద్ర కమిటీ



(ఫైల్)

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఆపరేషన్ కగార్ కారణం గా ఏడాది కాలంలో క్షేత్రస్థాయి నుంచి అగ్రనాయకుల వరకు మొత్తంగా 366 మంది విప్లవకారులు మృతి చెంది నట్టు భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ వెల్లడించింది. ఈనెల 21 నుంచి 27 వరకు సీపీఐ (మావోయిస్టు) 21వ వార్షికోత్సవాలను నిర్వహించుకోవా లంటూ పార్టీ శ్రేణులకు నాయకత్వం ఈ నెల 6న జారీ చేసిన లేఖ బుధవారం వెలుగులోకి వచ్చింది. చనిపోయిన వారిలో పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో పాటు ముగ్గురు కేంద్ర కమిటీ సభ్యులు, 17 మంది రాష్ట్ర కమిటీ సభ్యులు, 26 మంది జిల్లా కమిటీ సభ్యులు, 86 మంది ఏరియా కమిటీ /ప్లాటూన్ సభ్యులు, పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ సభ్యులు 152 మంది, స్థానిక నిర్మాణాల సభ్యులు 38 మంది ఉన్నారని అందులో వెల్లడించారు. అలాగే మృతిచెందిన వారిలో వివరాలు తెలియని వారు మరో 43 మంది వరకు ఉన్నట్టు పేర్కొన్నారు. ఈ స్థాయిలో సభ్యులను కోల్పోవడం పార్టీపై ప్రతికూల ప్రభావం చూపు తుందని, అయితే దీనిని అధిగమించి ముందుకు సాగాలని కేడర్‌కు ఆ పార్టీ అగ్రనాయకత్వం పిలుపునిచ్చింది.

అందువల్లే పార్టీకి నష్టాలు..

కేంద్ర కమిటీ రూపొందించిన ఎత్తుగడలను, గెరిల్లా యుద్ధ నియమాలను సరిగా అమలు చేయకపోవడం వల్లనే ఆపరే షన్ కగార్ కారణంగా ఎక్కువగా నష్టపోయినట్టు నాయకత్వం అభిప్రాయం వ్యక్తం చేసింది. కార్యక్షేత్రాన్ని చిన్న ప్రాంతాలకే పరిమితం చేయకుండా విశాల భూభా గాలకు మార్చాలని, కేంద్రీకృత పద్ధతిలో కాకుండా వికేంద్రీ కృత పద్ధతిలో పని చేయాలని కేడర్‌కు సూచించింది. చట్ట బద్ధ, చట్ట వ్యతిరేక, రహస్య - బహిరంగ పోరాటాలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని పేర్కొంది. పట్టణ, మైదాన, అటవీ ప్రాంతాలలో ప్రజలను విప్లవ ఉద్యమం వైపు సమీకరించాలని కోరింది.

మానసిక యుద్ధం

ఎదురు కాల్పుల్లో పోలీసుల వైపు కూడా భారీ నష్టాలు చోటు చేసుకుంటున్నాయని, కానీ వాటిని బయటకు వెల్లడించకుం డా ప్రభుత్వం మానసిక యుద్ధం చేస్తోందని మావోయిస్టు కేంద్ర కమిటీ ఆరోపించింది. కర్రిగుట్టల దగ్గర చేపట్టిన ఆప రేషన్ బ్లాక్ ఫారెస్ట్‌లో 45 – 50 మంది జవాన్లు మరణించా రని, మరో 70 మంది గాయపడ్డారని పేర్కొంది. ఈ ఆప రేషన్ మొదలైన తర్వాత 16 రోజుల పాటు భద్రతా దళాలు అడుగు కూడా ముందుకు వేయలేకపోయాయని, చివరకు తమ నుంచి పారిపోయి సరెండర్ అయిన మాజీ మావోయి స్టును పట్టుకుని, అతడి సాయంతోనే ఆపరేషన్‌లో భద్రతా దళాలు ముందుకుసాగాయని పేర్కొంది. ఇతర ఆపరేషన్ల లోనూ ఇలాంటి పరిస్థితే భద్రతా దళాలకు ఎదురైందని, అం దుకే ప్రతీ గెరిల్లా సభ్యుడికి 30 నుంచి 100 మంది వంతున భద్రతా దళాలను మోహరిస్తున్నారని తెలిపింది.

శాంతి చర్చలకు సిద్ధం

ప్రజా ప్రయోజనాల రీత్యా శాంతి చర్చలకు సిద్ధ మేనని మావోయిస్టు పార్టీ మరోసారి ప్రకటించింది. అయితే అందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆపరే షన్ కగార్‌ను ఆపేయాలని, ఉద్యమ ప్రాంతాల్లో సాయుధ బలగాల క్యాంపులు ఎత్తివేయాలని డిమాం డ్ చేసింది. మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుంచే ఓటు చోరీకి పాల్పడుతున్నారని ఆరోపించింది.

అన్నంలో పురుగులు.. విద్యార్థినుల ఆందోళన

- పాఠశాల ఆవరణలో బైఠాయించి నిరసన
- ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ కేజీబీవీలో ఘటన





పాఠశాల ఆవరణలో బైఠాయించి నిరసన తెలుపుతున్న విద్యార్థినులు. (ఇన్‌సెట్‌లో) పులిహోరలో వచ్చిన పురుగులు

నార్నూర్: అన్నంలో పురుగులు వస్తున్నాయని ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థినులు ఆందోళనకు దిగారు. బుధవారం ఉదయం అల్పాహారంగా అందించిన పులిహోరలో పురుగులు రావడంతో విద్యార్థినులం తా తినకుండా ప్లేట్లను పక్కన పెట్టారు. పాఠశాల ఆవరణలో బైఠాయించి నిరసన తెలిపారు. మధ్యాహ్నం 3:30 గంటల వరకు ఆందోళన కొనసాగించారు. విషయం తెలుసుకున్న ఎం ఈవో పవార్ అనిత అక్కడికి చేరుకుని వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయితే వారు వినిపించుకోకపోవడంతో ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఐటీడీఏ పీవో, డీఈవో ఖుష్బుగుప్తా ఫోన్‌లో వారితో మాట్లాడారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై శాఖాపరంగా చర్యలు తీసుకుం టామని, నాణ్యమైన భోజనం అందేలా చూస్తామని ఆమె హామీ ఇచ్చారు. సమీపంలోని వేరే వసతి గృహం నుంచి సరు కులు తెచ్చి వెంటనే వండి విద్యార్థినులకు పెట్టాలని ఆమె ఎం ఈవోను ఆదేశించారు. అయితే రెండోసారి ఉప్మా అందించగా.. అందులో కూడా పురుగులు రావడంతో విద్యార్థినులు మరోసారి ఆందోళనకు దిగారు. మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని, రోజూ అన్నంలో పురుగులు వస్తున్నాయని విద్యార్థినులు తెలిపారు. సమస్యను ఎస్‌వో హిమబిందు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

పాఠశాలను సందర్శించిన సబ్‌కలెక్టర్

కలెక్టర్ రాజర్షిషా ఆదేశాల మేరకు ఉట్నూర్ సబ్‌కలెక్టర్ యువ రాజ్ మార్మట్ కేజీబీవీని సందర్శించారు. వంట గది, సరుకు లను పరిశీలించారు. నాసిరకం కూరగాయలతో పాటు పరిస రాలు అపరిశుభ్రంగా ఉండడంపై ఎస్‌వో హిమబిందుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇవ్వడంతో విద్యార్థి నులు శాంతించారు. విద్యార్థినుల ఆందోళన విషయం తెలు సుకున్న ఆదివాసీ గిరిజన విద్యార్థి సంఘం, జైభారత్, రాజ్ గోండ్ సేవా సమితి, తుడుందెబ్బ, బీజేపీ నాయకులు పాఠ శాలను సందర్శించారు. విద్యార్థినుల సమస్యలు అడిగి తెలు సుకుంటున్న సమయంలో జీసీడీవో ఉదయశ్రీ జోక్యం చేసుకుని వారిని లోపలికి ఎందుకు వచ్చారని అనడంతో వారంతా ఆందోళనకు దిగారు. సబ్ కలెక్టర్ వారితో మాట్లాడి నచ్చజెప్పారు. తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వ డంతో వారు ఆందోళన విరమించారు.

ఇక దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్!



అక్టోబర్ నుంచే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ

- అన్ని రాష్ట్రాల చీఫ్ ఎలక్టోరల్ అధికారులతో కేంద్ర ఎన్నికల సంఘం భేటీ

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) చేపట్టేందుకు ఎన్నికల సంఘం సిద్ధమవుతోంది. అక్టోబర్ నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉందని ఎన్నికల సంఘం వర్గాలు తెలిపాయి. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల చీఫ్ ఎలక్టోరల్ అధికారులతో(సీఈఓ) కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు బుధవారం ఢిల్లీలో సమావేశమయ్యారు. వర్క్‌షాప్ నిర్వహించారు. దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ ప్రారంభించాలన్న ప్రతిపాదనకు ఈ భేటీలో ఆమోదముద్ర వేశారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను పూర్తిచేసిన సంగతి తెలిసిందే. దీనిపై ప్రతిపక్షాలు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నాయి. అర్హులైన ఓటర్ల పేర్లను తొలగిస్తున్నారని, అనర్హుల పేర్లు చేరుస్తున్నారని మండిపడుతున్నాయి. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ నెగ్గడానికి ఎస్ఐఆర్ పేరిట కుట్రలు సాగిస్తున్నారని బీజేపీ కూటమిపై ఆరోపిస్తున్నాయి. ముఖ్యంగా బడుగు బలహీన వర్గాల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్నారని, వారి హక్కులను కాలరాస్తున్నారని విమర్శిస్తున్నాయి. విపక్షాల అభ్యంతరాలను లెక్కచేయకుండా ఎన్నికల సంఘం ముందుకెళ్తోంది. ఇక దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్‌కు సిద్ధమవుతుండడం గమనార్హం.

ధ్రువపత్రాల జాబితా సిద్ధం చేయండి

బిహార్ ఎన్నికలు ముగియకముందే దేశమంతటా ఎస్ఐఆర్‌పై ఎన్నికల సంఘం అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. బుధవారం జరిగిన వర్క్‌షాప్‌లో సీఈఓల అభిప్రాయాలను కేంద్ర ఎన్నికల సంఘం సేకరించింది. ఎస్ఐఆర్‌కు ఎప్పటిలోగా సిద్ధం కాగలరని ప్రశ్నించగా.. సెప్టెంబర్‌లో ఏర్పాట్లు క్షేత్రస్థాయిలో పూర్తిచేస్తామని, అక్టోబర్ నుంచి ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ప్రారంభించగలమని చాలామంది సీఈఓలు బదులిచ్చారు. కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు ఎస్ఐఆర్‌కు సంబంధించిన వనరులు, సన్నాహాలపై మూడున్నర గంటల పాటు ప్రజంటేషన్ ఇచ్చారు. ఓటర్ల అర్హతను తేల్చడానికి అవసరమైన ధ్రువపత్రాల జాబితాను సిద్ధం చేయాలని సీఈఓలను ఆదేశించారు. స్థానికంగా ఆమోదించే, సులభంగా లభించే ధ్రువపత్రాలను పరిగణనలోకి తీసుకోవాలని యోచిస్తున్నట్లు సమాచారం.

స్పష్టమైన సమగ్ర ఓటర్ల జాబితా కోసమే..

ఎస్ఐఆర్ వెనుక ఎలాంటి దురుద్దేశం లేదని ఎన్నికల సంఘం ఇప్పటికే తేల్చిచెప్పింది. పారదర్శకమైన, అత్యంత కచ్చితత్వంతో కూడిన ఓటర్ల జాబితాను రూపొందించడమే అసలు లక్ష్యమని వెల్లడించింది. మరణించివారి పేర్లను, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినవారి పేర్లను, డూప్లికేట్ ఎంట్రీలను, దేశ పౌరులను కానివారి పేర్లను తొలగించడానికే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు శ్రీకారం చుట్టినట్లు స్పష్టం చేసింది. అర్హులైన ఓటర్ల పేర్లను జాబితాలో చేర్చనున్నట్లు పేర్కొంది. ఓటు వేసేందుకు అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేర్లను ఇందులో చేర్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించింది. సమగ్రమైన, స్పష్టమైన ఓటర్ల జాబితాను రూపొందించాలంటే ఎస్ఐఆర్ తప్ప నిసరి అని ఎన్నికల సంఘం వివరణ ఇచ్చింది. ఇదిలా ఉండగా, 2026లో అస్సాం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో శాసనసభ ఎన్నికలు జరుగనున్నాయి. సవరించిన ఓటర్ల జాబితాలతోనే ఆయా రాష్ట్రాల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలుస్తోంది.

12న ఉప రాష్ట్రపతిగా రాధాకృష్ణన్ ప్రమాణం

సాక్షి, న్యూఢిల్లీ: ఉప రాష్ట్రపతిగా గెలుపొందిన మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారానికి అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 12వ తేదీన ఆయన 15వ ఉప రాష్ట్రపతిగా ప్రమాణస్వీకారం చేయనున్నట్లు తెలిసింది. ఈమేరకు అధికారులు ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నారు. 12వ తేదీన ప్రమాణ స్వీకారంపై సంబంధిత ప్రతిపాదనలను అధికారులు రాష్ట్రపతి ముర్ముకు పంపారు.

మార్స్‌పై గతంలో జీవం!

మరింత బలమైన ఆధారాలను గుర్తించిన నాసా రోవర్

కేప్ కనావెరల్(యూఎస్): అంగారకునిపై కోట్ల సంవత్సరాల క్రితం జీవం మనుగడ ఉండేదన్న వాదనలకు మరింత బలం చేకూరేలా అక్కడి నాసా 'పర్సివరెన్స్'రోవర్ ఒక శిలాజం ఆనవాళ్లను గుర్తించింది. వందల కోట్ల సంవత్సరాల క్రితం ప్రవహించి ఎండిపోయిన ఒక నది ఒడ్డున ఉన్న ఒక శిలపై ప్రత్యేకమైన గుర్తులను పర్సివరెన్స్ రోవర్ కనిపెట్టింది. భూమి మీద మాత్రమే కనిపించే కొన్ని ప్రత్యేక మూలకాల రసాయన, భౌతిక చర్యల కలయికగా ఏర్పడే 'లెపర్డ్‌స్పాట్స్'ను అక్కడ గుర్తించారు. ఆ గుర్తుల్లో అధిక ఇనుప ధాతువు జాడలున్నాయి. నీటి పీల్చుకున్న ఐరన్ ఫాస్ఫేట్(వివియనైట్), గ్రెగైట్(ఐరన్ సల్ఫైడ్)లను దానిపై కనిపెట్టారు. శిథిలమైన కర్బన పదార్థాల్లో వివియనైట్ ఉంటుంది. అలాగే చిన్నపాటి జీవులు సైతం గ్రెగైట్‌ను ఉత్పత్తిచేస్తాయి. ఈ లెక్కన ప్రాచీన జీవికి సంబంధించిన జాడగా ఈ 'లెపర్డ్ స్పాట్'ను భావించవచ్చని నాసా తాత్కాలిక అడ్మినిస్ట్రేటర్ సీన్ డఫీ వ్యాఖ్యానించారు.

నివురుగప్పిన నిప్పులా నేపాల్

హింసాత్మక ఘటనల్లో 30కి పెరిగిన మరణాల సంఖ్య

- 1,033 మందికి గాయాలు
- సైన్యం పహారాలో కొనసాగుతున్న కర్ఫ్యూ
- యాత్రలకు వెళ్లి నేపాల్‌లో చిక్కుకుపోయిన వందలాది మంది భారతీయులు
- బద్దలైన జైళ్లు... పారిపోయిన 13,000 మంది ఖైదీలు
- ఆర్మీ, జెన్ జెడ్ మధ్య ముగిసిన తొలిదఫా చర్చలు



కాఠ్మండులో ఆందోళనకారులు నిప్పుపెట్టడంతో అగ్నికి ఆహుతవుతున్న పలు మంత్రిత్వ శాఖ భవనాలు

కాఠ్మండు/న్యూఢిల్లీ/డెహ్రాడూన్/జైపూర్: హిమాలయాల నేపాల్‌లో సోషల్‌మీడియాపై నిషేధంతో శాంతియుతంగా మొదలైన విద్యార్థుల ఉద్యమం ఉగ్రరూపం దాల్చి డజన్లమందిని పొట్టనబెట్టుకుని బుధవారానికి చాలామటుకు శాంతించింది. కానీ బయటిశక్తుల విధ్వంసకర ఉద్యమ ఎగబోతతో నివురుగప్పిన నిప్పులా తయారై తాత్కాలిక ప్రభుత్వానికి కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. దాంతో సైన్యంరంగంలోకి దిగి దేశవ్యాప్త కర్ఫ్యూను కఠినంగా అమలుచేస్తోంది. ఉద్యమబాట వీడి చర్చల పథంలో సాగాలంటూ విద్యార్థి సంఘాలకు దేశాధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ పిలుపునిచ్చిన నేపథ్యంలో 'జెన్ జెడ్ నేపాల్'విద్యార్థి సంఘం ప్రతినిధులు నేపాల్ సైన్యంతో బుధవారం తొలిదఫా చర్చలు జరిపారు. రెండు గంటలపాటు చర్చించినా ఎలాంటి ఏకాభిప్రాయం కుదర్లేదు. మరోమారు చర్చలు జరపనున్నారు. నేపాల్ మాజీ మహిళా చీఫ్ జస్టిస్ సుశీల కర్కి, కాఠ్మండు మేయర్ బాలేంద్ర షా, మాజీ విద్యుత్ బోర్డ్ సీఈఓ కుల్మాన్ ఘిసింగ్‌లలో ఏవరో ఒకరి సారథ్యంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడాలని విద్యార్థులు డిమాండ్‌చేస్తున్నట్లు తెలుస్తోంది. స్వదేశాన్ని నిరసనోద్యమ అగ్నికీలల్లోకి తోసేశారన్న ఆరోపణలను విద్యార్థులు నిర్ద్వంద్వంగా తోసిపుచ్చారు. శాంతియుతంగా పోరాటంచేస్తుంటే బయటిశక్తులు దూరి విధ్వంసం సృష్టించాయని స్పష్టంచేశాయి. ప్రధాని కేపీ శర్మ ఓలీ తన పదవికి రాజీనామా చేసినా ఆందోళనలు చల్లారకపోవడంతో సైన్యం మంగళవారం అర్ధరాత్రి రంగంలోకి దిగింది. అత్యంత సమస్యాత్మకంగా మారిన ప్రాంతాలను తమ అధీనంలోకి తీసుకుంది. దేశవ్యాప్త కర్ఫ్యూను విధించింది. అయితే హింసాత్మక ఘటనల్లో మరణాల సంఖ్య బుధవారానికి 33కు పెరిగింది. 1,033 మంది గాయపడ్డారు. గురువారం ఉదయం దాకా కఠిన ఆంక్షలను అందరూ పాటించాలని, లూటీ, దోపిడీ వంటివి పునరావృతమైతే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. యాత్ర, పర్యటన కోసమొచ్చి చిక్కుకుపోయిన విదేశీయులను భద్రంగా స్వదేశాలకు తరలించే ప్రక్రియ మొదలెడతామని ఆర్మీ భరోసా ఇచ్చింది. ఆలోపు విదేశీ పర్యాటకులు, యాత్రికులకు తగు సాయం చేయాలని హోటళ్లు, టూరిజం సంస్థలను ఆర్మీ ఆదేశించింది. కాఠ్మండులో దుకాణాలు కొల్లగొట్టిన అల్లరిమూకల సభ్యులను ఆర్మీ అరెస్ట్‌చేసింది. వారి నుంచి భారీ ఎత్తున నగదు, 31 ఆయుధాలు, విలువైన వస్తువులను స్వాధీనంచేసుకుంది. నేపాల్‌లో తాజా పరిస్థితిని గమనిస్తున్నట్లు ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ బుధవారం చెప్పారు.

పారిపోయిన ఖైదీలు

ఆందోళనకారులు జైళ్లను బద్దలుకొట్టడంతో వాటిల్లోని 13,000 మందికిపైగా ఖైదీలు పరారయ్యారు. ఢిల్లీబజార్ జైలు, ఛిత్వాన్, నఖూ, ఝుంప్కా, కంచన్‌పూర్, జలేశ్వర్, కస్కీ, డాంగ్, జుమ్లా, సోలూఖుంబు, గౌర్, బఝాంగ్‌లోని జైళ్ల నుంచి ఖైదీలు పారిపోయారు. ఆకొద్ది సమయంలో పారిపోవడం సాధ్యంకాని ఖైదీలు కారాగారాల్లో ఘర్షణలకు దిగుతున్నారు. పశ్చిమ నేపాల్‌లోని బాంకే ప్రాంతంలోని నౌబస్తా ప్రాంతీయ జైలు పరిధిలోని బాలనేరస్తుల కేంద్రంలో కొందరు జైలువార్డన్ల నుంచి ఆయుధాలు లాక్కునేందుకు తెగించారు. ఈ ఘర్షణల్లో ఐదుగురు బాలలు చనిపోయారు. కొన్ని జైళ్ల నుంచి పారిపోయిన ఖైదీలను సైన్యం ఎలాగోలా వెతికి పట్టుకుని మళ్లీ జైల్లో పడేసింది.

పర్యాటకుల ఆక్రందనలు

పోఖారా పట్టణంలో వాలీబాల్ లీగ్ మ్యాచ్‌ల కోసం వచ్చిన భారతీయ మహిళ ఉపస్థ గిల్ ఆందోళనకారుల దాడి నుంచి తప్పించుకున్నారు. తనను రక్షించాలని, స్వదేశానికి పంపించాలని భారతసర్కార్‌ను వేడుకుంటూ ఆమె ఇన్‌స్టా గ్రామ్‌లో ఒక వీడియో పోస్ట్‌చేశారు. ''మ్యాచ్ కోసం ఇక్కడికొచ్చా. హోటల్ స్పాలో ఉన్నప్పుడు ఆందోళనకారులు పెద్ద కర్రలతో వెంటబడ్డారు. ఎలాగోలా వారి బారి నుంచి తప్పించుకున్నా. కానీ నా లగేజీ మొత్తం హోటల్‌లోనే ఉండిపోయింది. ఆ హోటల్‌కు నిరసనకారులు నిప్పుపెట్టి కాల్చేశారు. దయచేసి నన్ను భారత్‌కు పంపేయండి. రోడ్ల మీద ఎక్కడ చూసిన మంటలే చెలరేగుతున్నాయి. ఇక్కడ దారుణ పరిస్థితులున్నాయి''అని ఆమె వీడియోలో వాపోయారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, గుజరాత్, ఢిల్లీ, కేరళ, కర్ణాటక, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ ఇలా పలు రాష్ట్రాలకు చెందిన చాలా మంది పర్యాటకులు నేపాల్‌లో చిక్కుకుపోయి సురక్షిత తిరుగుప్రయాణం కోసం ప్రభుత్వ సాయం అర్థిస్తున్నారు. పలు రాష్ట్రాల ప్రభుత్వాలు ఇప్పటికే నేపాల్ అధికారవర్గాలతో చర్చలు జరుపుతున్నాయి. అయితే ఎయిర్‌ఇండియా, ఇండిగో విమానాల్లో భారతీయులను వెనక్కి రప్పిస్తామని పౌరవిమాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు 'ఎక్స్'లో పేర్కొన్నారు.

మాట్లాడేందుకు ఎదురుచూస్తున్నా..

మోదీ నాకు చాలా మంచి మిత్రుడు: ట్రంప్



న్యూయార్క్: భారత ప్రధాని నరేంద్ర మోదీ తనకు చాలా మంచి మిత్రుడని, ఆయనతో మాట్లాడేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. రాబోయే కొన్ని వారాల్లోనే మోదీతో సంభాషిస్తానని తెలిపారు. భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంపై చర్చలు చురుగ్గా కొనసాగుతున్నాయని స్పష్టంచేశారు. ఈ చర్చలు విజయవంతం అవుతాయనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. చర్చలను సానుకూలమైన ముగింపునకు తీసుకురావడంలో ఇబ్బందులేవీ లేవని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ట్రంప్ మంగళవారం ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. భారత్‌తో బలమైన సంబంధాలను కోరుకుంటున్నానని పరోక్షంగా సంకేతాలిచ్చారు. రెండు దేశాలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భారత్, అమెరికా నడుమ వాణిజ్యపరమైన అవరోధాలు కచ్చితంగా తొలగించుకుంటామని పేర్కొన్నారు. భారత్‌తో సంబంధాలను బలహీనపర్చుకోవడం ఎంత మాత్రం ఇష్టం లేదని ట్రంప్ తన చర్యల ద్వారా సంకేతాలిస్తున్నారు. ''మోదీ గొప్ప ప్రధానమంత్రి. ఆయన నాకు ఎప్పటికీ మంచి మిత్రుడే. మేము ఎల్లప్పుడూ స్నేహితులుగా ఉంటాం'' అని ట్రంప్ శుక్రవారం వైట్‌హౌస్‌లో వ్యాఖ్యానించారు.

ద్వైపాక్షిక ఒప్పందానికి కృషి

భారత్, అమెరికా ప్రజల కోసం ట్రంప్‌తో కలిసి పనిచేస్తా

- ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడి



న్యూఢిల్లీ: భారత్, అమెరికాలు సహజ భాగస్వామ్య దేశాలు అని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక ఒప్పందంపై చర్చలను సాధ్యమైనంత త్వరగా ముగించడానికి ముమ్మరంగా ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. ఇరుపక్షాలు ఆ దిశగా కృషి చేస్తున్నాయని పేర్కొన్నారు. భారత్, అమెరికాల మధ్య వాణిజ్యపరమైన అవరోధాలను తొలగించడానికి ప్రయత్నాలు సాగుతున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనపై మోదీ ప్రతిస్పందించారు. ఈ మేరకు బుధవారం 'ఎక్స్'లో పోస్టుచేశారు. ట్రంప్ ప్రకటనను పరోక్షంగా స్వాగతించారు. భారత్, అమెరికా మధ్య సన్నిహిత సంబంధాలు ఉన్నాయని స్పష్టంచేశారు. రెండు మిత్ర దేశాల నడుమ భాగస్వామ్యానికి సంబంధించిన పూర్తి శక్తి సామర్థ్యాలను ప్రదర్శించడానికి వాణిజ్య చర్చలు దోహదపడతాయని ఆశిస్తున్నట్లు వెల్లడించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో మాట్లాడేందుకు తాను ఎదురు చూస్తున్నట్లు తెలిపారు. రెండు దేశాల పౌరులకు మేలు జరిగేలా, ఉజ్వల భవిష్యత్తు ఉండేలా తాము కలిసికట్టుగా పనిచేస్తామని తేల్చిచెప్పారు. మోదీ–ట్రంప్ మధ్య సోషల్ మీడియాలో అనుసంధానం గత నాలుగో రోజుల్లో ఇది రెండోసారి కావడం విశేషం. భారత్–అమెరికా మధ్య ప్రత్యేక అనుబంధం ఉందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ట్రంప్ చెప్పగా, అందుకు మోదీ ఈ నెల 6న హర్షం వ్యక్తంచేశారు. రెండు దేశాల బంధంపై ట్రంప్ అభిప్రాయాన్ని ప్రశంసించారు.

భారత్, అమెరికా మధ్య సంబంధాలు ఇటీవల ఒత్తిడికి లోనవుతున్న సంగతి తెలిసిందే. రష్యా నుంచి ముడి చమురు కొంటున్నందుకు భారత్‌పై ట్రంప్ సర్కార్ మండిపడుతోంది. భారత ఉత్పత్తులపై ఏకంగా 50 శాతం సుంకాలు విధించింది. ఈ నేపథ్యంలో భారత్‌తో సంబంధాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ట్రంప్ సంకేతాలు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. సంబంధాలను మళ్లీ యథాతథ స్థితికి తీసుకురావాలని ఇరుదేశాలు నిర్ణయించుకున్నట్లు కనిపిస్తోంది. రాబోయే రోజుల్లో భారత్, అమెరికా మధ్య దౌత్యపరమైన చర్చలు ప్రారంభం కాబోతున్నట్లు తెలుస్తోంది. అమెరికా నుంచి ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం త్వరలో ఇండియాకు రానుంది. అమెరికా నుంచి భారత నావికాదళం పీ–8ఐ లాంగ్ రేంజ్, మల్టీమిషన్ మారిటైమ్ పెట్రోల్ ఎయిర్ క్రాఫ్టలు కొనుగోలు చేస్తోంది. దీనిపై త్వరలో ఇరుపక్షాల మధ్య తుది చర్చలు జరుగనున్నాయి.

భారత్‌పై 100% సుంకాలు!

- ఈయూ దేశాలపై ట్రంప్ ఒత్తిడి
- ధ్రువీకరించని అమెరికా ప్రభుత్వం

వాషింగ్టన్: ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని ముగించేలా రష్యాపై ఒత్తిడి పెంచడానికి భారత్‌తో పాటు చైనాపై 100 శాతం టారిఫ్‌లు విధించాలని యూరోపియన్ యూనియన్ (ఈయూ)పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒత్తిడి తెచ్చారా? నిజమేనని కొన్ని వార్తా సంస్థలు చెబుతున్నాయి. మంగళవారం అమెరికా, ఈయూ అధికారుల మధ్య సమావేశం జరిగింది. రష్యాను ఆర్థికంగా దెబ్బకొట్టేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ట్రంప్ స్పష్టంచేసినట్లు మీడియా వెల్లడించింది. రష్యాను దారికి తీసుకురావాలంటే దాని మిత్రదేశాలైన భారత్, చైనాల ఉత్పత్తులపై ఏకంగా 100 శాతం సుంకాలు వసూలు చేయాలని ఈయూ దేశాలను ట్రంప్ డిమాండ్ చేసినట్లు పేర్కొంది. ఉక్రెయిన్–రష్యా యుద్ధాన్ని ఆపడానికి అందుబాటులో ఉన్న మార్గాలపై ఈ భేటీలో చర్చ జరిగినట్లు సమాచారం. అయితే, భారత్, చైనాలపై 100 శాతం టారిఫ్‌లు విధించాలంటూ ఈయూ కూటమికి ట్రంప్ సూచించినట్లు అమెరికా ప్రభుత్వం అధికారికంగా ప్రకటించలేదు. మీడియా వార్తలపైనా స్పందించలేదు. ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని ఆపేలా రష్యాను ఒప్పించడంలో ట్రంప్ విఫలమవుతున్న సంగతి తెలిసిందే.

నేపాల్ ప్రధానిగా సుశీల?

- మధ్యంతర ప్రభుత్వ అధినేతగా నియమించాలని యువత సూచన
- రోజురోజుకీ పెరుగుతున్న మద్దతు
- మరికొన్ని పేర్లు సైతం తెరపైకి..



కాఠ్మండు: కల్లోల నేపాల్‌లో మధ్యంతర ప్రభుత్వ ఏర్పాటు దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. సోషల్ మీడియాపై నిషేధాన్ని వ్యతిరేకిస్తూ యువతరం ఆరంభించిన పోరాటం నేపాల్ ప్రధానమంత్రి కేపీ శర్మ ఓలీ రాజీనామాకు దారితీసింది. మధ్యంతర ప్రభుత్వ అధినేతగా ఎవరిని ఎంపిక చేయాలన్న దానిపై 'జనరేషన్ జెడ్'ఆన్‌లైన్‌లో సంప్రదింపులు ప్రారంభించింది. యువత తమ అభిప్రాయాలు పంచుకుంటున్నారు. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుశీల కర్కిని తాత్కాలిక ప్రధానమంత్రిగా నియమించాలని చాలామంది సూచిస్తున్నారు. యువతలో ఆమెపట్ల అమితమైన ఆదరణ కనిపిస్తోంది. తాజాగా జరిగిన వర్చువల్ సమావేశంలో 5 వేల మందికిపైగా పాల్గొన్నారు. మధ్యంతర ప్రభుత్వ అధినేతగా జస్టిస్ సుశీల కర్కిని నియమించాలన్న ప్రతిపాదనకు ఎక్కువమంది ఓటేశారు. తొలుత కాఠ్మండు నగర మేయర్ బాలెన్ షా పేరు వినిపించింది. ఆయనను సంప్రదించేందుకు పలుమార్లు ప్రయత్నించినప్పటికీ అందుబాటులోకి రాలేదని జనరేషన్ జెడ్ ప్రతినిధులు చెప్పారు. మరోవైపు కర్కికి మద్దతు రోజురోజుకీ పెరుగుతోంది.

మద్దతుగా 2,500 మంది సంతకాలు

మధ్యంతర ప్రభుత్వ పగ్గాలు చేపట్టాలంటూ సుశీల కర్కిని యువత అభ్యర్థించగా.. తనకు మద్దతుగా కనీసం వెయ్యి సంతకాలు సేకరించి, చూపించాలని ఆమె కోరినట్లు సమాచారం. ప్రస్తుతం ఆమెకు అనుకూలంగా సంతకాలు చేసినవారి సంఖ్య 2,500కు చేరినట్లు సమాచారం. మరోవైపు పోటీలో సుశీల కర్కి ముందంజలో ఉన్నప్పటికీ మరికొన్ని పేర్లు కూడా తెరపైకి వస్తున్నాయి. నేపాల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ చీఫ్ కుల్మాన్ ఘీసింగ్, యువనేత సాగర్ ధాకల్, ధరణ్ సిటీ మేయర్ హర్కా సంపంగ్ పేర్లపైనా చర్చ సాగుతోంది. నేపాల్‌లోని ప్రముఖ యూట్యూబర్ రందోమ్ నేపాలీ పేరు కూడా వినిపిస్తోంది. అయితే, మధ్యంతర ప్రభుత్వాన్ని నడిపించడానికి ఎవరూ ముందుకు రాకపోతే తాను ఆలోచిస్తానని ఆయన పేర్కొన్నారు. సుశీల కర్కి నియామకానికి పెద్ద తతంగమే ఉంటుందని సమాచారం. ఆమె తొలుత నేపాల్ ఆర్మీ చీఫ్ జనరల్ అశోక్ రాజ్ సిగ్డెల్‌ను, అనంతరం అధ్యక్షుడు రామ్‌చంద్ర పౌడెల్‌ను కలుసుకొని మద్దతు పొందాల్సి ఉంటుందని నిపుణులు చెప్పారు.

ఎవరీ జస్టిస్ సుశీల?

నేపాల్ చరిత్రలో 72 ఏళ్ల సుశీల కర్కికి ప్రత్యేక స్థానమే ఉంది. సుప్రీంకోర్టులో మొట్టమొదటి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా ఆమె రికార్డుకెక్కారు. భారత్‌లోని బనారస్ హిందూ యూనివర్సిటీలో చదువుకున్నారు. 1975లో పొలిటికల్ సైన్స్‌లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేశారు. సుశీల కర్కి మొదట టీచర్‌గా పనిచేశారు. 1978లో కాఠ్మండులోని త్రిభువన్ యూనివర్సిటీలో న్యాయ విద్యలో బ్యాచిలర్స్ డిగ్రీ అభ్యసించారు. 2016లో నేపాల్ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌గా నియమితులయ్యారు. అప్పటి ప్రధానమంత్రి కేపీ శర్మ ఓలీ నేతృత్వంలోని రాజ్యాంగ మండలి సిఫార్సు మేరకు అప్పటి అధ్యక్షురాలు బిద్యాదేవి భండారీ ఆమెను చీఫ్ జస్టిస్‌గా నియమించారు. సుశీల కర్కి అవినీతికి దూరంగా ఉంటారని, ఎవరికీ భయపడబోరని పేరుంది. అవినీతికి పాల్పడిన మంత్రులను జైలుకు పంపిస్తూ కీలక తీర్పులిచ్చారు. 2006లో నేపాల్ రాజ్యాంగ ముసాయిదా కమిటీలో సభ్యురాలిగా సేవలందించారు. బనారస్ హిందూ యూనివర్సిటీలో చదువుకున్నప్పటి రోజులను సుశీల ఇటీవలే గుర్తుచేసుకున్నారు. అక్కడ డ్యాన్స్ నేర్చుకొనే అవకాశం దక్కిందని చెప్పారు. ఆ యూనివర్సిటీలోనే తనకు ఉద్యోగం వచ్చిందని, అక్కడే పీహెచ్‌డీ పూర్తిచేసే అవకాశం వచ్చిందని అన్నారు. కానీ, విధిరాత మరోలా ఉండడంతో న్యాయమూర్తిగా మారానని తెలిపారు.

మోదీజీ కో నమస్కార్

నేపాల్ ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించడానికి తాను సిద్ధంగా ఉన్నానని జస్టిస్ సుశీల చెప్పారు. ఆమె బుధవారం ఓ మీడియా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. మధ్యంతర ప్రభుత్వాన్ని ముందుకు నడిపించాలంటూ యువత చేసిన విజ్ఞప్తిని స్వీకరిస్తున్నానని తెలిపారు. దేశ అభివృద్ధి కోసం అందరం కలిసి పనిచేద్దామని నేపాల్ ప్రజలకు పిలుపునిచ్చారు. నూతన ప్రారంభానికి శ్రీకారం చుడదామని అన్నారు. భారత్–నేపాల్ మధ్య దశాబ్దాలుగా బలమైన సంబంధాలు ఉన్నాయని గుర్తుచేశారు. భారత్ అంటే తమకు ఎంతో గౌరవం, ప్రేమ అని స్పష్టంచేశారు. తమ దేశానికి భారత్ వివిధ సందర్భాల్లో ఎంతగానో సాయం అందించిందని చెప్పారు. భారతదేశ పాలకులు, నాయకులతో తమకు మంచి సంబంధాలు ఉన్నాయని వెల్లడించారు. ముఖ్యంగా ప్రధాని మోదీకి నమస్కారాలు తెలియజేస్తున్నానని జస్టిస్ సుశీల కర్కి వ్యాఖ్యానించారు. మోదీజీ అంటే తనకు గౌరవ ప్రపత్తులు, ఆరాధనభావం ఉన్నట్లు వివరించారు.

మన రాజ్యాంగాన్ని చూసి గర్విస్తున్నాం

- పొరుగున నేపాల్‌లో ఏం జరుగుతుందో చూడండి
- కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం వ్యాఖ్య
- మనది బలీయమైన ప్రజాస్వామ్య వ్యవస్థ అంటూ కితాబు



న్యూఢిల్లీ: బలహీన ప్రజాస్వామ్య పునాదులపై నిర్మితమైన రాజ్యాలు కుప్పకూలుతున్నాయని, బలీయమైన మన రాజ్యాంగాన్ని చూసి గర్విస్తున్నామని ఐదుగురు న్యాయమూర్తుల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం వ్యాఖ్యానించింది. శాసనసభల ఆమోదం పొంది తమ వద్దకు వచ్చిన బిల్లులను నిర్దిష్ట కాలపరిమితిలోపు గవర్నర్లు, రాష్ట్రపతి నిర్ణయాలు తీసుకోవాలంటూ సుప్రీంకోర్టు గతంలో తీర్పునిచ్చింది. దీనిపై సుప్రీంకోర్టును రాష్ట్రపతి అభిప్రాయం కోరిన అంశంలో వాదోపవాదనలు జరుగుతున్న కేసు విచారణ సందర్భంగా బుధవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ సారథ్యంలోని రాజ్యాంగ ధర్మాసనం పైవ్యాఖ్యలు చేసింది. ''పౌరులు ప్రభావితమయ్యే అత్యంత కీలకమైన నిర్ణయాలు తీసుకునేముందు సుప్రీంకోర్టును రాష్ట్రపతి సలహాలు కోరవచ్చు అని మన భారత రాజ్యాంగం ఉద్బోధిస్తోంది. ఇలాంటి సమగ్రతను సంతరించుకున్న మన రాజ్యాంగాన్ని చూసి గర్విస్తున్నాం. పొరుగుదేశాల్లో ఏం జరుగుతుందో చూడండి. నేపాల్‌లో ఇప్పుడు ఎలాంటి దారుణ పరిస్థితి ఉందో మనం దరం చూస్తూనే ఉన్నాం''అని సీజేఐ గవాయ్ అన్నారు. బంగ్లాదేశ్‌లోనూ అదే పరిస్థితులు ఉన్నాయని మరో న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్ నాథ్ గుర్తుచేశారు. ధర్మాసనంలో జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ ఎ.ఎస్.చందూర్కర్ సైతం సభ్యులుగా ఉన్నారు.

నేపాల్‌లో..

తమ వద్ద గడువులోపు సమగ్రస్థాయిలో రిజిస్ట్రేషన్ చేసుకోలేదన్న సాకుతో సోషల్ మీడియా యాప్‌లపై పూర్తిస్థాయి నిషేధం విధించి నేపాల్ ప్రభుత్వం విద్యార్థుల నుంచి తీవ్రస్థాయిలో ప్రతిఘటనను ఎదుర్కొంది. చివరకు ప్రధాని ఓలీ తన పాలనావైఫల్యాన్ని అంగీకరిస్తూ గద్దె దిగారు. అయినాసరే జెన్ జెడ్, ఇతర విద్యార్థి సంఘాల ఆందోళన ఆగకపోగా మరింత హింసాత్మకంగా మారి చివరకు 30 మంది ప్రాణాలను బలిగొంది. పార్లమెంట్, దేశాధ్యక్షుని కార్యాలయం, ప్రధాని నివాసం, సుప్రీంకోర్టు భవనం, ప్రధాన రాజకీయ పార్టీల హెడ్‌ఆఫీస్‌లు, సీనియర్ నేతల ఇళ్లు, మీడియా కార్యాలయాలు ఇలా దేశంలోని కీలక భవంతులన్నీ ఆందోళనకారుల తగలబెట్టారు. కొన్నింటిని ధ్వంసంచేశారు. మాజీ ప్రధాని షేర్‌బహదూర్ దేవ్‌బా ఇంటిని చుట్టుముట్టి దేవ్‌బా, భార్య అర్జు రాణాలపై దాడిచేశారు. ప్రజల ఆస్తుల విధ్వంసం యథేచ్ఛగా సాగింది.

బంగ్లాదేశ్‌లో..

భారత్‌కు తూర్పు వైపున్న మరో పొరుగు దేశం బంగ్లాదేశ్ సైతం ఉద్యమ సెగకు బలైంది. 1971 విమోచన ఉద్యమకారుల వారసులకు సివిల్‌సర్వీసెస్ ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పించడంతో అక్కడి నిరుద్యోగ యువతలో ఆగ్రహం కట్టలుతెంచుకుంది. అది హఠాత్తుగా గత ఏడాది జులైలో మహోగ్రరూపం దాల్చి దేశవ్యాప్తంగా అల్లర్లు, హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. వందమందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. ప్రభుత్వం చేతులెత్తేసింది. చివరకు దేశ మహిళా ప్రధానమంత్రి షేక్ హసీనా ప్రాణభయంతో రాజధాని ఢాకాను వీడి ఢిల్లీకి చేరుకున్నారు. అప్పట్నుంచి ఆమె ఢిల్లీలోనే తలదాచుకుంటున్నారు. నోబెల్ గ్రహీత మొహమ్మద్ యూనుస్ ఆపద్ధర్మ ప్రభుత్వం కొనసాగుతున్నా అది సుస్థిర పాలనను అందివ్వలేక ఆపసోపాలు పడుతోంది.

సాక్షి హైదరాబాద్

గురువారం । 11 । సెప్టెంబర్ । 2025



దేహం.. దాహం..

అలసట, మానసిక మందకొడితనం (బ్రెయిన్ ఫాగ్), తలనొప్పికి ద్రవాల కొరతే ప్రధానంగా కనిపిస్తోందని నగరానికి చెందిన వైద్యులు అంటున్నారు. - సిటీప్లస్‌లో



ఆక్రమణలపై ఉక్కుపాదం

సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు అధికారులు ఆక్రమణలపై ఉక్కుపాదం మోపారు. జేబీఎస్ సమీపంలోని పార్కు స్థలంలో కూల్చివేతలు చేపట్టారు. -11లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.0/23.0

నగరంలో గురువారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చిరుజల్లులు కురిసే అవకాశముంది. గరిష్టంగా 34, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.

సంస్కారం లేని విద్య దండగ

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు



సిల్వర్ జూబ్లీ ఉత్సవాల్లో మాట్లాడుతున్న వెంకయ్య నాయుడు

కవాడిగూడ: చదువుతోపాటు సంస్కారం ఉండాలని, సంస్కారం లేని విద్య దండగ అని భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు అన్నారు. తల్లిదండ్రులను, గురువులను, పెద్దలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచించారు. బుధవారం రామకృష్ణ మఠంలోని స్వామి వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్సీ సిల్వర్ జూబ్లీ మహోత్సవాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉప రాష్ట్రపతి పదవీ విరమణ చేశాక యువతను ఎక్కువగా కలుసుకోవాలని నిర్ణయించుకున్నానని చెప్పారు. మన సంస్కృతి, సంస్కారాలు, కుటుంబ వ్యవస్థపై అవగాహన కలిగించడానికి దేశమంతా పర్యటించాలని అనుకున్నానని అన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని, నీటిని పొదుపుగా వాడుకొని కాపాడుకోవాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే తప్పుడు కథనాల వల్ల యువత పెడదోవ పట్టడంతోపాటు అనర్థాలు అధికం అవుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం భారతదేశం ఆర్థిక వ్యవస్థ 5వ స్థానంలో ఉందని, మున్ముందు 3వ స్థానానికి చేరుకుంటుందని అన్నారు. వివేకానంద ఆశయసాధనకు యువత పాటుపడాలని, పెద్దారులు పట్టకుండా సన్మార్గంలో పయనించాలని సూచించారు. కార్యక్రమంలో రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద, స్వామి నిత్యాముకుంటానందజీ, వివిధ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఖైదీల సంస్కరణ సామాజిక బాధ్యత

మంత్రి శ్రీధర్‌బాబు



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు

బండ్లగూడ: జైళ్లు నిరాశకు కేంద్రాలుగా కాకుండా ఆశలు, ఆకాంక్షలకు చిహ్నాలుగా మారాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అభిలషించారు. 7వ ఆల్ ఇండియా ప్రిజన్ డ్యూటీ మీట్–2025 సందర్భంగా ఆర్వీఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో బుధవారం ఏర్పాటు చేసిన కల్చరల్ నైట్‌లో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. జైళ్లను కేవలం శిక్షా కేంద్రాలుగా కాకుండా వాటిని మానవత్వంతో కూడిన సంస్కరణలకు వేదికలుగా తీర్చిదిద్దేలా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని వివరించారు. ఖైదీల్లో మార్పు తీసుకొచ్చేందుకు తెలంగాణ జైళ్ల శాఖ చేపట్టిన కార్యక్రమాలు ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలిచాయని కొనియాడారు. జైళ్ల గోడల మధ్య దేశపు భిన్నత్వం కనిపిస్తోందన్నారు. వివిధ రాష్ట్రాలు, భాషలు, మతాలు, సంస్కృతులకు చెందిన ఖైదీలు ఉంటారని, వీరికి ఒకే రకమైన సంస్కరణ విధానం సరిపోదన్నారు. వారి వ్యక్తిగత పరిస్థితులను అర్థం చేసుకుని అందుకనుగుణంగా చర్యలు చేపట్టాలని అధికారులకు మంత్రి సూచించారు. ఖైదీల్లో సంస్కరణ అనేది కేవలం జైళ్ల శాఖ బాధ్యత మాత్రమే కాదని, అది మనందరి సామాజిక బాధ్యత అని శ్రీధర్ బాబు గుర్తు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర జైళ్ల శాఖ డీజీ సౌమ్యమిశ్రా, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు హరిచందన, నారాయణరెడ్డి, సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి పాల్గొన్నారు.

22 వరకూ ఆగుదాం!

కొత్త జీఎస్టీ శ్లాబులు అమల్లోకి వచ్చేదప్పుడే



ఈ- కామర్స్ ఆఫర్లూ అప్పుడే..

ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ వంటి ఆన్‌లైన్ సంస్థలపై కూడా ప్రభావం చూపిస్తుంది. ఈ–కామర్స్ కొనుగోలుదారులు సైతం ఈ నెల 22 డెడ్‌లైన్ విధానానికే జై కొడుతుండటంతో.. కొన్ని సంస్థలు ఎలక్ట్రానిక్ ఉత్పత్తులపై ఆఫర్లను సైతం నిలిపివేశాయి. దీంతో సాధారణంగా డైలీ, వీక్లీ ఆఫర్ల పేరుతో ఆన్‌లైన్ కస్టమర్లను ఆకర్షించే ఈ–కామర్స్ సంస్థలు.. తమ మెగా ఆఫర్లను ఈ నెల 22 తర్వాతే ప్రకటించాలని వ్యూహరచన చేస్తున్నాయి. జీఎస్టీ తగ్గింపు తర్వాత 'బిగ్ బిలియన్ డేస్', 'గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్' వంటి పేర్లతో భారీ సేల్ నిర్వహించడానికి సిద్ధమవుతుండటం గమనార్హం.

భారీగా తగ్గనున్న వాహనాలు, ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల ధరలు

- వేచి చూసే ధోరణిలో వినియోగదారులు
- బైక్‌లు, కార్లు, టీవీలు, ఏసీల కొనుగోళ్లు వాయిదా
- పాత జీఎస్టీతో పోలిస్తే 10 శాతం మేర తగ్గనున్న రేట్లు
- ఈ–కామర్స్ సైట్లలోనూ ఈ నెల 22 తర్వాతే ఆఫర్లు

సాక్షి, సిటీబ్యూరో:

నగర వాసులకు బొనాంజా అందనుంది. దసరా, దీపావళి పండగ ఆనందాలు వస్తు సేవల పన్ను (జీఎస్టీ) సవరణతో రెట్టింపు కానుంది. ఇటీవల కేంద్రం సవరించిన జీఎస్టీ శ్లాబులు ఈ నెల 22 నుంచి అమలులోకి రానున్నాయి. గతంతో పోలిస్తే ఆటో మొబైల్స్, ఎలక్ట్రానిక్ వంటి చాలా వరకు ఉత్పత్తుల ధరలు సుమారు 10 శాతం మేర తగ్గనున్నాయి. దీంతో వాహనాలు, టీవీలు, కార్లు, సెల్‌ఫోన్లు వంటి ఉత్పత్తుల కొనుగోలుదారులు వేచి చూసే ధోరణిలో ఉన్నారు. ఈ నెల 22 వరకూ కొనుగోళ్లను వాయిదా వేసుకుంటున్నారు. మరోవైపు ఈ– కామర్స్ సంస్థలు కూడా ఈ నెల 22 తర్వాతే ఆఫర్లను అందించేందుకూ సిద్ధమవుతున్నాయి. దీంతో ప్రస్తుతం రిటైల్ మార్కెట్లు, ఆన్‌లైన్ సంస్థలలో అమ్మకాలు తగ్గుముఖం పట్టాయి.

18 నుంచి 5 శాతానికి..

గతంలో జీఎస్టీలో ఐదు శ్లాబులు ఉండగా.. తాజాగా కేంద్రం వీటిని రెండింటికి కుదించింది. విలాసవంతమైన వస్తువులపై ప్రత్యేకంగా 10 శాతం జీఎస్టీ శ్లాబును విధించింది. ప్రస్తుతం అనేక ఉత్పత్తులపై జీఎస్టీ 28 శాతం వరకు ఉన్నాయి. 22వ తేదీ నుంచి ఈ స్లాబ్ 18 శాతానికి తగ్గనుంది. కొన్ని ఉత్పత్తులపై 18 శాతం నుంచి 5 శాతానికి కూడా తగ్గే అవకాశముంది. ప్రత్యేకించి స్మార్ట్ ఫోన్లు, టీవీలు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్ల వంటి ఎలక్ట్రానిక్ వస్తువులతో పాటు కార్లు, బైక్ వంటి ఆటోమొబైల్స్ ధరలు తగ్గనున్నాయి. వీటితో పాటు నిత్యావసర సరుకులపై కూడా కేంద్రం జీఎస్టీని తగ్గించింది. జీఎస్టీ శ్లాబుల్లో మార్పులతో ఒకవైపు కొన్ని కంపెనీలు రేట్ల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్న తరుణంలో వినియోగదారులు మాత్రం రేట్లు తగ్గుతాయని ఆశగా ఎదురుచూస్తున్నారు. చాలామంది షోరూమ్‌లకు వెళ్లి వస్తువులను చూస్తున్నారు. వాటి ఫీచర్లను పరిశీలిస్తున్నారు. కానీ కొనుగోలును మాత్రం ఈ నెల 22 తర్వాతే చేద్దామనే అభిప్రాయానికి వస్తున్నారని మార్కెట్ పరిశీలకులు అంటున్నారు.

కొన్ని బ్రాండ్లు తాత్కాలికంగా ఆఫర్లు ప్రకటించినా అవి కస్టమర్లను ఆకట్టుకోలేకపోతున్నాయి.

తగ్గనున్న వాహనాల ధరలు..

సాధారణంగా దసరా, దీపావళి పండగ సీజన్లలో వాహనాలను కొనుగోలు చేయడం సెంటిమెంట్‌గా భావిస్తుంటారు. అయితే ఇప్పటివరకు ఆటో మొబైల్స్‌పై 28 శాతంగా జీఎస్టీ ఉండగా.. కొత్త జీఎస్టీ శ్లాబ్‌లో ఇది 18 శాతానికి తగ్గింది. ఏకంగా 10 శాతం మేర జీఎస్టీ తగ్గుతుంది. దీంతో మధ్యస్థాయి కారుపై రూ.1.5 లక్షల వరకు, బైక్‌పై రూ.10 వేల నుంచి రూ.20 వేల మధ్య తగ్గింపు ఉండనుంది. దీంతో వాహన కొనుగోలుదారులు కొనుగోళ్లను మరో రెండు వారాల పాటు వాయిదా వేసుకుంటున్నారు. వాహన షోరూమ్‌లో గిరాకీ తగ్గడంతో కొనుగోలుదారులను ఆకర్షించేందుకు షోరూమ్ నిర్వాహకులు కొత్త ఆఫర్లను ప్రకటిస్తున్నారు. ముందస్తుగా బుకింగ్ చేసుకుని 22వ తేదీ తర్వాతే డెలివరీ చేసుకోవచ్చని భావిస్తున్నారు.

ఏసీ, వాషింగ్ మెషీన్, టీవీలు సైతం..

స్మార్ట్ ఫోన్లు, టీవీలు, ఏసీలు, వాషింగ్ మిషన్లు, డిష్‌వాషర్లు వంటి ఎలక్ట్రానిక్ ఉపకరణాలపై కూడా కేంద్రం జీఎస్టీ శ్లాబ్‌ను తగ్గించింది. ఇప్పటివరకు వీటిపై 28 శాతం పన్ను విధించగా, ఇప్పుడవి 18 శాతం జీఎస్టీ శ్లాబ్‌లోకి వెళ్లాయి. దీంతో ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల ధరలు కూడా భారీగానే తగ్గుతాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. టీవీలపై రూ.5 వేల నుంచి రూ.15 వేల వరకు, మొబైల్ ఫోన్లపై రూ.2 వేల నుంచి రూ.5 వేలు, ఫ్రిజ్, వాషింగ్ మెషీన్లపై రూ.7 వేల నుంచి రూ.10 వేల వరకు తగ్గింపు ఉండే అవకాశం ఉండటంతో కొనుగోళ్ల వాయిదాకే జనం మొగ్గు చూపుతున్నారు.

పెళ్లంటూ ఎర..



పెట్టుబడుల పేరిట టోకరా!

సాక్షి, సిటీబ్యూరో: సోషల్ మీడియా ద్వారా పరిచయం కావడం.. విదేశాల్లో స్థిరపడిన భారతీయులుగా నమ్మించడం.. పెళ్లి ప్రతిపాదనలు తీసుకురావడం... భారత్‌కు తిరిగి వస్తూ విమానాశ్రయంలో చిక్కుకున్నట్లు కథ నడపటం... కస్టమ్స్, ఇతర పన్నులు చెల్లించాలని అందినకాడికి దండుకోవడం.. గతంలో ఈ పంథాలో రెచ్చిపోయిన మాట్రి' మోసగాళ్లు' ప్రస్తుతం పంథా మార్చారు. ఈ మాట్రిమోనియల్ ఫ్రాడ్స్‌లోనే ఇన్వెస్ట్‌మెంట్ మోసాలను చేర్చారు. ఇలాంటి నేరంలో ఆదివారం చాంద్రాయణగుట్టకు చెందిన వ్యక్తి (30) రూ.27.5 లక్షలు కోల్పోగా.. బుధవారం జియాగూడ వాసి (34) రూ.1.56 లక్షలు నష్టపోయారు.

మారు పేర్లు, ఫొటోలతో ఏమార్చి..

సైబర్ నేరగాళ్లు తొలుత మారు పేర్లు, వివరాలు, ఫొటోలతో వివిధ మాట్రిమోనియల్ సైట్లలో రిజిస్టర్ చేసుకుంటున్నారు. యువతులుగా, యువకులుగా ప్రొఫైల్స్ క్రియేట్ చేసుకుని ఏఐ జనరేటెడ్ ఫొటోలను పొందుపరుస్తున్నారు. సాధారణంగా విదేశాల్లో స్థిరపడిన భారతీయులుగా, వైద్య వృత్తిలో ఉన్నట్లు నమోదవుతున్నారు. ఎవరైనా ఆసక్తి కనబరిస్తే వారితో సంప్రదింపులు జరిపి పెళ్లి ప్రస్తావన తీసుకువస్తున్నారు. ఇలా తమపై పూర్తి నమ్మకం కలిగే వరకు చాటింగ్ చేస్తున్నారు. ఆపై అసలు కథ ప్రారంభించిన సైబర్ నేరగాళ్లు క్రిప్టో కరెన్సీ, బిట్ కాయిన్ ట్రేడింగ్ పేరు చెబుతున్నారు. ఈ రకంగా వారితో కొన్ని యాప్స్ డౌన్‌లోడ్ చేయించి, పెట్టుబడులు పెట్టిస్తున్నారు.

తొలుత చిన్న మొత్తాలు పెట్టించి..

సైబర్ నేరగాళ్ల అధీనంలో పని చేసే ఈ వర్చువల్ యాప్స్‌లో పెట్టుబడి పెట్టడానికి అనువుగా బ్యాంక్ ఖాతాలు అనుసంధానించేలా చేస్తున్నారు. తొలుత చిన్న మొత్తాలు పెట్టుబడిగా పెట్టించి లాభాలు చూపిస్తూ వాటిని విత్‌డ్రా చేసుకోవడానికీ అవకాశం ఇస్తున్నారు. ఆపై పెద్ద మొత్తాలు పెట్టుబడి పెట్టిన తర్వాత ఆ మొత్తం, లాభం అంటూ వర్చువల్ యాప్‌లో భారీ మొత్తాలు చూపిస్తున్నారు. ఆ నగదు డ్రా చేసుకునే అవకాశం ఇవ్వకుండా లాక్ చేసి.. తీసుకోవాలంటే మరికొంత చెల్లించాలంటూ అందినకాడికి దండుకుంటున్నారు.

ట్రేడింగ్ పేరుతో యువతి మాదిరిగా..

చాంద్రాయణగుట్టకు చెందిన యువకుడికి బిట్ కాయిన్ ట్రేడింగ్ పేరుతో యువతి మాదిరిగా ఎర వేశారు. రూ.27.5 లక్షలు పెట్టుబడి పెట్టించి... లాభంతో కలిపి యాప్‌లో రూ.1.34 కోట్ల బ్యాలెన్స్ చూపించారు. ఆ డబ్బు విత్‌డ్రా చేసుకోవాలంటూ లాభం పొందినందుకు 10 శాతం కమీషన్‌గా రూ.13.47 లక్షలు చెల్లించాలని షరతు విధించారు. జియాగూడ వ్యక్తితో క్రిప్టో కరెన్సీలో పెట్టుబడి అంటూ రూ.1.5 లక్షలు కాజేశారు. మాట్రిమోనియల్ ఫ్రాడ్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలంటూ సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు సూచించారు.



- దేశంలోనే తొలిస్థానంలో హైదరాబాద్
- తర్వాత స్థానాల్లో బెంగళూరు, చెన్నై, తిరువనంతపురం
- ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ హెచ్చరికలు

ముప్పు ముంగిట్లో..

నగరంలో ఆందోళన కలిగిస్తున్న రొమ్ము కేన్సర్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌లో రొమ్ము కేన్సర్ బాధితుల సంఖ్య భారీగా పెరుగుతోందని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్‌మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) హెచ్చరిస్తోంది. నేషనల్ కేన్సర్ రిజిస్ట్రీ లెక్కల ప్రకారం అప్పుడే పుట్టిన శిశువు నుంచి 74 ఏళ్ల వయసు వరకు దేశంలో ప్రతి 29 మంది మహిళల్లో ఒకరు రొమ్ము కేన్సర్ బారిన పడుతున్నారని స్పష్టం చేసింది. రొమ్ము కేన్సర్ బాధితుల్లో దేశంలోనే అత్యధికంగా హైదరాబాద్‌లో ఉన్నారనే విషయం ఆందోళనకు గురి చేస్తోంది. మహిళల్లో ప్రధానంగా రొమ్ము, గర్భాశయ ముఖద్వారం, అండాశయ కేన్సర్లు తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. నగరంలోని ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రికి ప్రతి నెల సుమారు 130 నుంచి 140 మంది రొమ్ముకేన్సర్ బాధితులు వస్తున్నారని, గతంలో ఈ సంఖ్య సుమారు 70గా ఉండేదని ఆస్పత్రి వర్గాలు చెబుతున్నాయి. దీన్ని బట్టి బాధితుల సంఖ్య దాదాపు రెట్టింపుని అయిందని స్పష్టమవుతోంది.

నగరంలోని ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రితో పాటు నిమ్స్, గాంధీ, ఉస్మానియా, ప్రైవేట్ ఆస్పత్రుల్లోనూ రొమ్ము కేన్సర్ బాధితులు చికిత్సలు పొందుతున్నారు. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ప్రతి లక్ష మందిలో 54 మంది మహిళలు రొమ్ము కేన్సర్ బాధితులుగా ఉంటున్నారని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఇది దేశంలోనే అత్యధిక రేటు అని నిపుణులు చెబుతున్నారు. తరువాతి స్థానంలో బెంగళూరు 47.7 మంది, చెన్నై 45.4 మంది, తిరువనంతపురం 40.7 మంది బాధితులు నమోదవుతున్నారు. దేశంలో డయాబెటిక్ అధికంగా ఉన్న నగరాల్లో హైదరాబాద్ (నాలుగో స్థానం) ఉంది. రొమ్ము కేన్సర్‌కు ఇది ఒక కారణం కావచ్చని వైద్యులు అంచనా వేస్తున్నారు. 35 ఏళ్ల నుంచి 50 ఏళ్ల మధ్య వారిలో వారిలో రొమ్ము కేన్సర్ ఎక్కువగా కనిపిస్తోంది. వయసు మీరినవారిలోనూ దీని ప్రభావం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

ఇవీ కారణాలు..

ప్రధానంగా జీవన శైలిలో మార్పులు, తీసుకునే ఆహారం, తొందరగా రజస్వల కావడం, ఆలస్యంగా వివాహాలు చేసుకోవడం, పిల్లలు లేకపోవడం, తల్లులు పిల్లలకు పాలివ్వకపోవడం, శారీరక వ్యాయామం లేకపోవడం, ఆలస్యంగా రుతుక్రమం (నెలసరి) రావడం, ఊబకాయం, నిశ్చలమైన జీవనశైలి, మద్యపానం, పొగాకు, కొవ్వు ఉన్న ఆహారం తీసుకోవడం తదితర కారణాలు కనిపిస్తున్నాయి. పురుషుల్లో ప్రధానంగా నోటి కేన్సర్లు, లివర్, ఉదరం, యూరినరీ బ్లాడర్ కేన్సర్లు వస్తున్నాయి. ధూమపానం, మద్యపానం కారణంగానే సుమారు 50 శాతం వరకు కేసులు వస్తున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

కచ్చితంగా చెప్పలేం..



మహిళల్లో రొమ్ము కేన్సర్, పురుషుల్లో నోటి కేన్సర్ అధికంగా కనిపిస్తున్నాయి. నెలలో రొమ్ము కేన్సర్‌తో ఆస్పత్రికి వస్తున్న బాధితుల సంఖ్య గతంలో 70 నుంచి 80 మధ్య ఉండేది. ప్రస్తుతం ఈ సంఖ్య 130 నుంచి 140గా నమోదవుతోంది. రొమ్ము కేన్సర్‌లో పెరుగుదల కనిపిస్తోంది. అయితే.. దేశంలో హైదరాబాద్‌లోనే రొమ్ముకేన్సర్ కేసులు ఎందుకు ఎక్కువగా నమోదవుతున్నాయన్న విషయాన్ని కచ్చితంగా చెప్పడం కష్టం. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి ఇక్కడికి వస్తుంటారు. బహుశా దీనివల్ల కేసుల సంఖ్య ఎక్కువగా కనిపించే అవకాశం ఉంది. – డా.ఎం. శ్రీనివాసులు, ఎంఎన్‌జే ఆస్పత్రి సీనియర్ అంకాలజిస్టు

రూ.100 కోట్ల విలువైన భూమికి కంచె

1.2 ఎకరాలు కాపాడిన హైడ్రా



ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి ప్రాంతంలో కబ్జా అయిన 1.2 ఎకరాల భూమిని హైడ్రా స్వాధీనం చేసుకుంది. దీని విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.100 కోట్లు ఉంటుందని బుధవారం ప్రకటించింది. ఆల్విన్ కాలనీని అనుకుని ఉన్న సర్వే నం .276లో 2.39 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అక్కడ ఇప్పటికే కొన్ని ఇళ్ల నిర్మాణం జరిగింది. మిగిలి ఉన్న 1.20 ఎకరాల భూమి కబ్జా కాకుండా కాపాడాలని హైడ్రాకు ఫిర్యాదు అందింది. దీంతో స్పందించిన హైడ్రా బుధవారం ఆ భూమిని స్వాధీనం చేసుకుని, కంచె వేసి, బోర్డు ఏర్పాటు చేసింది. అయితే ఈ భూమి తమదంటూ హైదరాబాద్ ఆల్విన్ ఎంప్లాయీస్ హౌసింగ్ కమిటీ పోరాడుతోంది. ఇదే సమయంలో ఆల్విన్ కాలనీ సంక్షేమ సంఘంతో పాటు ఆ పక్కనే ఉన్న కాకతీయనగర్ కాలనీ వాసులు మాత్రం ఈ భూమిని కాపాడి పార్కును నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు. హైదరాబాద్ ఆల్విన్ ఎంప్లాయీస్ హౌసింగ్ కమిటీకి 1986లో ప్రభుత్వం 79.29 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. రెండు దశల్లో ప్లాట్ల కేటాయింపు జరిగినా నాన్ అలాటీస్ కొంతమంది ఉన్నారు. దీంతో పక్కనే ఉన్న 2.39 ఎకరాల ప్రభుత్వ భూమిని తమకు కేటాయించాలని హైదరాబాద్ ఆల్విన్ ఎంప్లాయీస్ హౌసింగ్ కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు డబ్బులు కూడా చెల్లించినట్టు కమిటీ ప్రతినిధులు చెప్తున్నారు. కమిటీ ప్రతినిధులు కొనకుండానే 2.39 ఎకరాల్లో ప్లాట్లు వేసి అక్రమంగా అమ్మారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆల్విన్ కంపెనీ బంద్ అయిందని, ఆ కమిటీ మనుగడలో లేదని, ఆల్విన్ కాలనీలోని ప్లాట్లు కూడా ఇష్టానుసారం అమ్మేశారని ఆ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఇక్కడి ఖాళీ స్థలంలో అక్రమ పార్కింగ్ కొనసాగుతోందని ప్రజావాణికి ఫిర్యాదు చేయడంతో సదరు భూమికి హైడ్రా కంచె వేసింది.

- ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలే ప్రధానాస్త్రాలు
- అన్ని పార్టీలకూ సవాల్‌గా జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక
- రోజురోజుకూ వేడెక్కుతున్న రాజకీయ పరిణామాలు

సానుభూతి పవనాలు వీచేనా?

మాగంటి గోపీనాథ్ భార్య సునీతకే బీఆర్ఎస్ టికెట్?

సాక్షి, సిటీబ్యూరో: త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను అన్ని పార్టీలూ సవాల్‌గా తీసుకోవడంతో రాజకీయ పరిణామాలు వేడెక్కుతున్నాయి. బుధవారం నియోజకవర్గంలోని రహ్మత్‌నగర్ డివిజన్ పార్టీ కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పలువురు ముఖ్య నాయకులతో పాటు మాగంటి గోపీనాథ్ భార్య సునీత కూడా పాల్గొన్నారు. మాగంటి గోపీనాథ్ మరణంతో జూబ్లీహిల్స్ స్థానం ఖాళీ అయినందునే ఈ ఉప ఎన్నిక జరుగుతుండటం తెలిసిందే. గోపీనాథ్ ఉన్నప్పుడు నియోజకవర్గంలో ఎవరికే ఆపద వచ్చినా అండగా ఉండేవారని, ఆయన మరణంతో అనుకోకుండా వచ్చిన ఈ ఎన్నికలో మాగంటి కుటుంబానికి ప్రజలంతా అండగా ఉండాలని కేటీఆర్ పిలుపునివ్వడంతో పాటు, తనకు అండగా నిలవాలని సునీత కూడా కోరడంతో ఇక ఆ నియోజకవర్గ అభ్యర్థిగా ఆమె పేరు ప్రకటించడం లాంఛనప్రాయమేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో గోపీనాథ్ మరణం వల్ల సానుభూతి పవనాలు బీఆర్ఎస్‌కు ఉపకరించగలవా అనే చర్చలు జరుగుతున్నాయి.

సిట్టింగ్ సీటును నిలుపుకోవాలని..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత మరణంతో జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ నుంచి శ్రీగణేశ్ గెలవడంతో, బీఆర్ఎస్ సిట్టింగ్ సీటును కోల్పోయింది. ఇప్పుడు గోపీనాథ్ మరణంతో జరుగుతున్న ఈ ఎన్నికలో ఘన విజయంతో ప్రజలు తమ వెంటే ఉన్నారని, తిరిగి జైత్రయాత్ర ప్రారంభించాలని బీఆర్ఎస్ భావిస్తోంది. కాంగ్రెస్ ప్రజావ్యతిరేక విధానాలు, హైడ్రా కూల్చివేతలవంటివి అస్త్రాలుగా మలచుకోవాలని భావిస్తోంది.

కాంగ్రెస్‌కు రెఫరెండం

ఇక ఈ ఎన్నికలో గెలుపు కాంగ్రెస్‌కు రెఫరెండంగా పలువురు భావిస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడి త్వరలో రెండేళ్లు పూర్తి కానున్న నేపథ్యంలో ఇతర ప్రతిపక్ష పార్టీలు సైతం ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించడం ద్వారా రాబోయే రోజుల్లో గెలిచేది తామేనని చెప్పేందుకు ఎవరి వ్యూహాల్లో వారున్నారు.

పార్టీల వ్యూహం ఇలా..

కాంగ్రెస్: ఈ ఎన్నికలో గెలుపు ద్వారా తమ పాలనకు ప్రజల రెఫరెండం అని బలంగా చెప్పవచ్చని భావిస్తూ ఇప్పటికే కొన్ని వ్యూహాలు అమలు చేస్తోంది.

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీఅధ్యక్షుడు మహేశ్‌గౌడ్, పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జిమీనాక్షి నటరాజన్ వంటి నేతలు నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించారు.
- ముగ్గురు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్‌లకు నియోజకవర్గంలోని డివిజన్ల బాధ్యతలు అప్పగించి, బూత్ స్థాయి ప్రచారాన్ని ముమ్మరం చేశారు.
- బీసీలకు 42% రిజర్వేషన్ల అమలు, పేదలకు సన్నబియ్యం సహా ఇతర హామీల అమలు వంటి అంశాలను ప్రచారంలో ప్రస్తావిస్తున్నారు.

బీజేపీ: ఈ ఎన్నికలో గెలవడం ద్వారా ప్రజలు తమవైపు మొగ్గుచూపుతున్నారని చెప్పడంతో పాటు రాబోయే రోజుల్లో రాష్ట్రంలో అధికారం తమదేనని బీజేపీ చెప్పాలనుకుంటోంది.

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నుంచి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు దాకా నియోజకవర్గంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు.
- బీజేపీ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని కార్పొరేటర్లతోనూ ముమ్మర ప్రచారం నిర్వహిస్తోంది. ఈ ఎన్నిక కోసం మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేసి బూత్‌స్థాయిలో సమన్వయం చేస్తోంది.

బీఆర్ఎస్: సిట్టింగ్ సీటు కావడంతో బీఆర్ఎస్ ఈ స్థానాన్ని నిలబెట్టుకోవడం కోసం కృషి చేస్తోంది.

- గోపీనాథ్ మరణంతో ప్రజల్లో ఏర్పడిన సానుభూతి ఉపకరిస్తుందనే మాగంటి సునీత తమ అభ్యర్థి అనే సంకేతాలిచ్చింది.
- మాగంటి గోపీనాథ్ వరుసగా మూడు పర్యాయాలు గెలిచిన నేపథ్యం ఉంది. మాగంటి గోపీనాథ్ సంస్మరణ సభల ద్వారా పార్టీ ఐక్యతను చాటుతోంది.
- సునీత ఇప్పటికే ఇంటింటి ప్రచారం ప్రారంభించి, తన భర్త చేసిన సేవలను గుర్తు చేస్తూ ప్రజలతో మమేకమవుతోంది.
- తాజాగా తెలంగాణ భవన్‌లో జరిగిన సమావేశంలో కేటీఆర్ స్వయంగా పాల్గొనడం, పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశంతో కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్న వారిని గుర్తించి తమవైపు తిప్పుకోవాలనే యోచనలో ఉంది.

మజ్లిస్: జూబ్లీహిల్స్‌లో మైనారిటీ ఓటర్లు కీలకంగా ఉండటంతో, మజ్లిస్ మద్దతు పెను ప్రభావం చూపనుంది. మజ్లిస్ పోటీ చేస్తుందా, కాంగ్రెస్‌కు మద్దతుగా నిలుస్తుందా చూడాల్సి ఉంది.

రచన జర్నలిజం కళాశాలలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

హిమాయత్‌నగర్ : నారాయణగూడలో రచన జర్నలిజం కళాశాలలో రెగ్యులర్, కరస్పాండెన్స్ విధానంలో జర్నలిజంలో పీజీ డిప్లమా, సర్టిఫికెట్ కోర్సులలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పీజీ డిప్లమా కోర్సులో చేరడానికి ఏదైనా డిగ్రీ, సర్టిఫికెట్ కోర్సులో చేరేందుకు 10వ తరగతి పాసైన వారు అర్హులని తెలిపారు. సెప్టెంబర్ 30లోగా దరఖాస్తులు తీసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ : 040-23261335 లేదా 9959640797 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

గణేష్ ఉత్సవాల్లో రెచ్చిపోయిన పోకిరీలు

1612 మందిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న షీ-టీమ్స్

సాక్షి, సిటీబ్యూరో: ఖైరతాబాద్ బడా గణేషుడి సహా నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఇటీవల జరిగిన ఉత్సవాల్లో పోకిరీలు రెచ్చిపోయారు. వీరిపై నిఘా ఉంచిన షీ-టీమ్స్ బృందాలు యువతులు, మహిళలను వేధిస్తున్న 1612 మందిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నాయి. వీరిలో 68 మంది మైనర్లు, 45 మంది 50 ఏళ్ల పైబడి వారు కూడా ఉన్నారు. 1444 మందికి కౌన్సెలింగ్ ఇచ్చిన అధికారులు మిగిలిన వారిపై పెట్టీ కేసులు నమోదు చేశారు. వీరిని కోర్టులో హాజరు పరచగా రూ.50 నుంచి రూ.1050 వరకు జరిమానా పడింది. ఓ కేసులో మాత్రం నిందితుడిని దోషిగా నిర్ధారించిన న్యాయస్థానం రెండు రోజుల సాధారణ జైలు శిక్ష విధించినట్లు డీసీపీ డాక్టర్ ఎస్‌జేపీ కవిత పేర్కొన్నారు.

పండగ రద్దీ నియంత్రణకు పకడ్బందీ ఏర్పాట్లు

రైల్వేస్టేషన్ల నుంచి 24 గంటల పాటు బస్సుల రాకపోకలు

- ప్రయాణికుల భద్రత కోసం నిరంతర నిఘా
- స్టేషన్ల పరిసర ప్రాంతాల్లో రద్దీ తగ్గించేందుకు చర్యలు
- రైల్వే డివిజనల్ మేనేజర్ల సమీక్ష



సమీక్ష సమావేశంలో పాల్గొన్న రైల్వే డివిజనల్ మేనేజర్లు, వివిధ శాఖల అధికారులు

సికింద్రాబాద్: రాబోయే పండగ సెలవులను పురస్కరించుకుని రైలు ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవకుండా ఉండేందుకు, సంపూర్ణ భద్రత కల్పించేందుకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టనున్నారు. ఈ మేరకు బుధవారం దక్షిణ మధ్య రైల్వే అధికారులు వివిధ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సికింద్రాబాద్, హైదరాబాద్, కాచిగూడ, లింగంపల్లి, చర్లపల్లి రైల్వేస్టేషన్లు వేలాది మంది ప్రయాణికుల రద్దీతో ఉండే అవకాశం ఉన్నందున ఆయా స్టేషన్లు, పరిసరాల్లో పరిస్థితులపై అధ్యయనం చేశారు. ఈనెల 19 నుంచి రెండు నెలల పాటు దసరా, దీపావళి, ఛాత్ పండుగలు ముగిసేంత వరకు తీసుకోవాల్సిన చర్యలపై కార్యాచరణ సిద్ధం చేశారు. సికింద్రాబాద్ సంచాలన్ భవన్‌లో సికింద్రాబాద్, హైదరాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్లు డాక్టర్ ఆర్.గోపాలకృష్ణన్, సంతోష్ వర్మ నేతృత్వంలో నిర్వహించిన సంయుక్త సమావేశంలో లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, రైల్వే పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఇబ్బందులు లేకుండా చర్యలు...

ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా జనరల్ టికెటింగ్ వ్యవస్థను మరితం సులభతరం చేయడం, రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్‌లు, వెయిటింగ్ హాళ్లలో నిరంతర తనిఖీలు నిర్వహించడంతోపాటు, ప్రవేశ ద్వారాల వద్ద అనుమానాస్పద వ్యక్తులను కట్టడి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. జనరల్ బోగీల్లో రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున తొక్కిసలాట జరగకుండా ఉండేందుకు క్యూ లైన్లలో ప్రయాణికులను పంపించడం, చైన్‌స్నాచర్లు, పిక్‌పాకెటర్లను కట్టడి చేసేందుకు అక్రమ ప్రవేశ ద్వారాల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రెండు నెలల పాటు రైల్వే స్టేషన్లలో నిరంతర నిఘా ఏర్పాటు చేసి పహారా కాయాలని ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ అధికారులకు సూచించారు. ' సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్ 10, చర్లపల్లి ప్లాట్‌ఫామ్ 1, కాచిగూడ రైల్వేస్టేషన్ దేవాలయం వద్ద అదనపు బస్‌టర్మినల్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వివిధ మార్గాల్లో అదనపు బస్సులను ఏర్పాటు చేయడంతోపాటు, రైల్వేస్టేషన్ల నుంచి 24 గంటల పాటు బస్సుల రాకపోకలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

కట్టుదిట్టమైన బందోబస్తు

ప్రధాన రైల్వేస్టేషన్ల బయట ఎదురయ్యే సమస్యలను అధిగమించి ప్రయాణికులకు రాకపోకలకు మార్గం సుగమం చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని లాండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసు అధికారులకు సూచించారు. వాహనాల కదలికలు, ట్రాఫిక్ సమస్యలు అధిగమించడం, రైల్వే వంతెనల వద్ద పికెటింగ్‌లు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. రైల్వేస్టేషన్ల మార్గాల్లో రద్దీ సమస్యలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు క్యాబ్‌లు, ఆటోలు, సందర్శకుల వాహనాల రాకపోకలకు ప్రత్యేక లైన్లు ఏర్పాటు చేయడం, అదనపు పార్కింగ్ స్థలాలు ఏర్పాటుపై ప్రతిపాదనలు సిద్ధం చేశారు. సమావేశంలో ఆర్‌పీఎఫ్ డివిజనల్ సెక్యూరిటీ ఆఫీసర్ ఆలకుంట నవీన్‌కుమార్, డివిజనల్ సీనియర్ కమర్షియల్ మేనేజర్లు షిపాలికుమార్, అనిరుధ్ ఫామర్, ఆర్టీసీ డిప్యూటీ రీజనల్ మేనేజర్ పవిత్ర, ట్రాఫిక్ డీసీపీ రాములు, అదనపు డీసీపీ ఎన్.వెంకటరమణ, లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ ఏసీపీలు ఎస్ఎన్ జావెద్, కే.శశాంక్‌రెడ్డి, జీ.శంకర్‌రాజు, సికింద్రాబాద్ రైల్వే ఇన్‌స్పెక్టర్ బీ.సాయీశ్వర్‌గౌడ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

డెక్కన్ కిచెన్ హోటల్ కేసు విచారణ వాయిదా

- వచ్చే విచారణకు హీరో వెంకటేశ్, రానా, సురేశ్ హాజరు కావాలి
- తదుపరి విచారణను అక్టోబర్ 16 వాయిదా వేసిన నాంపల్లి కోర్టు

సిటీ కోర్టులు : ఫిల్మ్‌నగర్ భూ వివాదంపై బుధవారం నాంపల్లి కోర్టులో విచారణ జరిగింది. ఫిల్మ్‌నగర్‌లోని తన డెక్కన్ కిచెన్ హోటల్‌ను అక్రమంగా కూల్చివేశారని నందకుమార్ అనే వ్యక్తి హీరోలు దగ్గుబాటి రానా, వెంకటేశ్, సురేశ్‌లపై కేసు దాఖలు చేశారు. ఈ కేసుపై బుధవారం నాంపల్లిలోని 17వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్‌లో విచారణ జరిగింది. రానా, వెంకటేశ్, ప్రొడ్యూసర్ సురేశ్ గైర్హాజరు కావడంతో వారి తరఫున న్యాయవాది హాజరయ్యారు. ఫిర్యాదుదారుడు నందకుమార్ కోర్టుకు హాజరయ్యాడు. దగ్గుబాటి కుటుంబం దురుద్దేశపూర్వకంగా తన డెక్కన్ కిచెన్ హోటల్‌ను కూల్చివేయించి ఇబ్బందులకు గురి చేస్తోందని ఆయన పిటిషన్‌లో పేర్కొన్నారు. హైకోర్టులో కంటెప్ట్ ఆర్డర్ ఉన్నా అక్రమంగా హోటల్‌ను కూల్చివేశారని ఆరోపించారు. ఈ కేసుపై విచారణ చేపట్టిన న్యాయస్థానం ఇప్పటికే దగ్గుబాటి రానా, వెంకటేశ్, సురేశ్‌బాబులకు నోటీసులు అందినందున వచ్చే విచారణకు నేరుగా కోర్టులో హాజరుకావాలని సూచించింది. అదేవిధంగా రూ.10 వేల చొప్పున రెండు పూచీకత్తులను కోర్టులో దాఖలు చేసుకోవాలని వారి తరుపు న్యాయవాదికి సూచించింది. తదుపరి విచారణను అక్టోబర్ 16 వాయిదా వేస్తున్నటు న్యాయమూర్తి భారతి తెలిపారు.

న్యాయం జరిగే వరకు పోరాడుతా..

దగ్గుబాటి కుటుంబానికి మాకు పలు అంశాలపైన కోర్టులో వివాదాలు జరుగున్న నేపథ్యంలో అక్రమంగా తన డెక్కన్ కిచెన్ హోటల్‌ను కూల్చివేయించారని ఫిర్యాదుదారుడు నందకుమార్ మీడియాతో తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావు, ఎస్బైబీ చీఫ్ ప్రభాకర్‌రావుతో కలిసి తన ఆస్తులను ధ్వంసం చేశారన్నారు. గత ప్రభుత్వంలో అధికారులతో కుమ్మక్కై కేసులు పెట్టి ఇబ్బందిపెడుతున్నా న్యాయపరంగా పోరాడుతున్నానని తెలిపాడు. డెక్కన్ కిచెన్ హోటల్‌కు సంబంధించి సిటీ సివిల్ కోర్టులో కోర్టు ఆర్డర్ ఉన్నా.. హైకోర్టులో కంటెప్ట్ ఆర్డర్ ఉన్నా అక్రమంగా కూల్చివేశారన్నాడు. 18 నెలలు గడుస్తున్నా.. దగ్గుబాటి కుటుంబం కోర్టుకు రావడం లేదన్నారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా న్యాయం జరిగేవరకు పోరాటం చేస్తానని తెలిపాడు. -నందకుమార్

మార్టిగేజ్ విధానంపై వివరణ ఇవ్వండి

- కంటోన్మెంట్‌కు హైకోర్టు నోటీసులు జారీ
- మన్నె క్రిషాంక్ ఫిర్యాదుపై స్పందన

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో భవన నిర్మాణాలకు మార్టిగేజ్ విధానం అమలు చేయడాన్ని సవాలు చేస్తూ, బీఆర్ఎస్ నేత మన్నె క్రిషాంక్ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు స్పందించింది. ఈ అంశంపై వారం రోజుల్లోగా పిటిషన్ దాఖలు చేయాల్సిందిగా సూచిస్తూ కంటోన్మెంట్ బోర్డుకు నోటీసులు జారీ చేసింది. ఈ సందర్భంగా మన్నె క్రిషాంక్ మాట్లాడుతూ జీహెచ్ఎంసీ పరిధిలో 200 చదరపు మీటర్లకు పైబడిన నిర్మాణాలకు మాత్రమే అమల్లో ఉన్న మార్టిగేజ్ విధానాన్ని, కంటోన్మెంట్‌లో కేవలం 111 చదరపు మీటర్ల నుంచే అమలు చేయడం దారుణమన్నారు. సామాన్య, మధ్యతరగతి కంటోన్మెంట్ ప్రజల సొంతింటి కలను జఠిలం చేసే ఈ చర్యలను ఉపసంహరించుకోవాల్సిందిగా తాను డిమాండ్ చేశానన్నారు. బోర్డు అధికారులు ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయం చట్టబద్ధతను సవాల్ చేస్తూ కోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడంలో భాగంగా మార్టిగేజ్ విధానం అమలు చేస్తున్నామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ విధానం వల్ల చిన్న ప్లాట్‌లలో నిర్మాణాలు చేపట్టే వారికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. కఠినమైన కంటోన్మెంట్ నిబంధనలకు లోబడి నిర్మాణాలు చేపట్టడం వల్ల పేద, మధ్య తరగతి వర్గాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందన్నారు. జీహెచ్ఎంసీని ఆదర్శంగా తీసుకునే బోర్డు అధికారులు, అదే తరహా నిబంధనలు అమలు చేయాలన్నారు.

చచ్చిపో..లేదంటే చంపేస్తాం....

- కైసర్ నగర్ డబుల్ బెడ్‌రూమ్ సముదాయంలో లేడీ కిలాడీల బెదిరింపులు
- భయంతో ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య



రాజు మృతదేహాన్ని తీసుకెళ్లకుండా అడ్డుకుంటున్న స్థానికులు



రాజు (ఫైల్)

సుభాష్‌నగర్: ఒరేయ్ తలుపులు తీయరా.. నీ అంతు చూస్తాం.. ఉదయంలోగా చచ్చిపో.. లేకుంటే మా చేతిలో చస్తావు అంటూ ముగ్గురు కిలాడీ లేడీలు మారణాయుధాలతో ఓ వ్యక్తి ఇంటి వద్దకు వచ్చి అర్ధరాత్రి మూడుసార్లు హల్‌చల్ చేశారు. దీంతో సదరు వ్యక్తి భయంతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధి కైసర్‌నగర్ డబుల్ బెడ్ రూమ్ సముదాయంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కైసర్ నగర్ డబల్ బెడ్ రూమ్ సముదాయంలో 6వ బ్లాక్ ప్లాట్ నెంబర్ 302 లో బియ్యం పల్లి రాజు (55), జ్యోతి దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. రాజు బాలానగర్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. మంగళవారం రాత్రి అతను డ్యూటీ ముగించుకుని ఇంటికి వస్తుండగా 2వ బ్లాక్‌లో నివాసం ఉంటున్న నౌసీమ్ అనే మహిళ అతడిని అనుసరిస్తూ వచ్చింది. అతడి జేబులో నుంచి డబ్బులు తీసేందుకు ప్రయత్నించగా నివారించేందుకు రాజు సదరు మహిళా చేయి పట్టుకున్నాడు. దీంతో సదరు మహిళతో పాటు ఆమె తల్లి షహజాన్, 4వ బ్లాక్‌లో ఉండే అంజుమా అక్కడికి చేరుకుని రాజును దుర్భాషలాడారు. దీంతో సొసైటీ సభ్యులు జోక్యం చేసుకుని వారికి నచ్చజెప్పి ఇంటికి పంపించారు. ఆ తర్వాత మళ్లీ రాజు ఇంటికి వచ్చి గొడవ చేయగా స్థానికుడు సతీష్ చెప్పడంతో వెనుదిరిగారు. అంతటితో ఆగకుండా అర్ధరాత్రి మారణాయుధాలతో అతడి ఇంటికి వచ్చి ఒరేయ్ బయటికి రారా.. నీవు చచ్చిపోతావా.. మమ్మల్ని చంపమంటావా, ఉదయంలోగా చచ్చిపోవాలి లేకుంటే నీ అంతు చూస్తాం అంటూ హెచ్చరించి వెళ్లిపోయారు. దీంతో ఆందోళనకు గురైన రాజు ఇంట్లో కుటుంబ సభ్యులు నిద్రిస్తుండగా మరో బెడ్ రూమ్‌లోకి వెళ్లి చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం ఉదయం దీనిని గుర్తించిన అతడి భార్య జ్యోతి ఇరుగుపొరుగు వారికి సమాచారం అందించింది. దీంతో ఆగ్రహానికి లోనైన స్థానికులు రాజు మృతికి కారణమైన వారి ఇంటి ఎదుట ఆందోళన చేపట్టారు. దీనిపై సమాచారం అందడంతో సూరారం సీఐ సుధీర్ కృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని గొడవలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. రాజు కారణమైన మహిళలపై పోలీసులు పలు సెక్షన్లపై కేసు నమోదు చేశారు. నిందితుల్లో ఒకరైన అంజుమా ఈ గొడవకు ముందు మరో వ్యక్తితో గొడవ పెట్టుకొని రభస చేసింది. వీరు ముగ్గురూ నిత్యం అమాయకులను టార్గెట్ చేసుకొని బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

13న ఎన్నికల కమిషన్‌పై అశోక్ లావాసా ప్రసంగం

సాక్షి, సిటీబ్యూరో: ప్రజాస్వామ్యాన్ని కాపాడే భారత ఎన్నికల కమిషన్‌కు ప్రస్తుతం ఎదురవుతున్న సవాళ్ల మధ్య దాని తటస్థతపై ప్రశ్నలను ఎదుర్కొంటుందా..?? ఎన్నికల సంఘంపై ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించడం తక్షణ అవసరమా, ఎన్నికల ప్రజాస్వామ్యం మనుగడకు ముందస్తు అవసరమా అనే అంశాలపై భారత మాజీ ఎన్నికల కమిషనర్ అశోక్ లావాసా ప్రసంగించనున్నారు. ఈ నెల 13న మంథన్ ఇండియా ఆధ్వర్యంలో నగరంలోని విద్యారణ్య ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న 'మంథన్ సహ వ్యవస్థాపకులు, హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ మార్గదర్శక ట్రస్టీ అజయ్ గాంధీ' స్మారక ఉపన్యాసంలో అశోక్ లావాసా తన ఆలోచనలను పంచుకోనున్నారు. 'ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా: ఎ సెంట్రీ అండర్ అటాక్' ప్రధానాంశంగా భారత ఎన్నికల కమిషన్ ప్రస్తుత పనితీరు, పార్లమెంటులో చర్చిస్తున్న అంశాలు, దాని పనితీరుపై సుప్రీంకోర్టు వ్యాఖ్యం తదితర అంశాల ఇతివృత్తంగా ఈ ప్రసంగం ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు. అశోక్ లావాసా భారత ఎన్నికల కమిషనర్‌గా, ఆసియా అభివృద్ధి బ్యాంకు ఉపాధ్యక్షులుగా, కేంద్ర ఆర్థిక - వ్యయ కార్యదర్శి, పర్యావరణ, అటవీ - వాతావరణ మార్పుల కార్యదర్శి, పౌర విమానయాన కార్యదర్శిగా పనిచేశారు.

14న ప్రవక్త మహ్మద్ జయంతి సభ

సాక్షి,సిటీబ్యూరో: తామీర్-ఎ-మిల్లత్ 76వ 'యౌమ్-ఎ-రహ్మతుల్ లిల్ ఆలమీన్' కార్యక్రమంలో భాగంగా ఈ నెల 14న ఉదయం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో తామీర్-ఎ-మిల్లత్ అధ్యక్షుడు ముహమ్మద్ జియావుద్దీన్ నయ్యర్ పర్యవేక్షణలో బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి దేశంలోని ప్రముఖ పండితులు, మేధావులతో పాటు స్థానిక ఉలమాలు హాజరుకానున్నారు. రెండో రోజు 15న రాత్రి చంచల్‌గూడ జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో 'యౌమ్-ఎ-సహాబా' ఉంటుందని సభ నిర్వాహకులు తెలిపారు.

పథకం బెడిసికొట్టింది..

- డ్రగ్స్ కేసులో యువ హీరోను ఇరికించేందుకు యత్నం
- సినీనటిని బ్లాక్‌మెయిల్ చేసిన ఎక్సైజ్ కానిస్టేబుల్..
- విచారణ చేపట్టిన ఫిలింనగర్ పోలీసులు

బంజారాహిల్స్: ఓ సినీ యువ హీరోను డ్రగ్స్ కేసులో ఇరికించేందుకు ఓ ఎక్సైజ్ కానిస్టేబుల్ పథకం వేశాడు. ఇందుకోసం సదరు హీరో స్నేహితురాలైన యువ నటిని ఎరగా వేద్దామనుకున్నాడు. ఈ విషయం పసిగట్టిన సదరు హీరో సినీ ఫక్కీలో పథకం వేసి అదే స్నేహితురాలితో ఎక్సైజ్ కానిస్టేబుల్‌ను అడ్డంగా ఇరికించాడు. సినిమాను తలపించిన ఈ ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఎక్సైజ్ స్టేట్ టాస్క్‌ఫోర్స్ (ఎస్‌టీఎఫ్)లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఎస్ఎస్ఎల్ మహేశ్వర్‌రావు అలియాస్ ఎస్.మహేష్ గత కొంతకాలంగా జూబ్లీహిల్స్, గచ్చిబౌలి, మాదాపూర్ ప్రాంతాల్లోని పబ్‌లలో పర్యటిస్తూ తాను ఎస్ఐనని, ఇన్‌స్పెక్టర్‌నని పరిచయం చేసుకుంటూ అక్కడికి వచ్చే సినీ నటుల కదలికలను గమనిస్తూ వస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఓ యువ హీరో పలుమార్లు తన భార్య, స్నేహితురాలైన నటితో కలిసి పబ్‌లకు వస్తుండడాన్ని అతను గుర్తించాడు. సదరు నటి కదలికలపై నిఘా పెట్టిన అతను ఆమెకు ఫోన్ చేసి తాను ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్‌నని, మీరు డ్రగ్స్ తీసుకుంటున్నారు.. నా వద్ద ఆధారాలు ఉన్నాయి.. వీడియోలు ఉన్నాయంటూ ఆమె వెళ్లిన ప్రాంతాల్లో తీసిన ఫొటోలను వాట్సప్ ద్వారా పంపించాడు. ఇటీవల ఆమె ఉంటున్న ఇంటికి వెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించడమేగాక తన కోరిక తీర్చకపోతే డ్రగ్స్ కేసులో ఇరికిస్తానని బ్లాక్‌మెయిల్ చేశాడు. ఓ యువ హీరో పేరు చెప్పి అతను కూడా డ్రగ్స్ తీసుకుంటున్నాడని చెప్పాలని ఆమెపై ఒత్తిడి చేశాడు. మహేస్ వేధింపులు ఎక్కువ కావడంతో బాధితురాలు ఈ విషయాన్ని సదరు యువ హీరో భార్యకు చెప్పింది. అతను పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో ఫిలింనగర్ పోలీసులు మంగళవారం సదరు నటిని విచారించడంతో ఆమె తనకు జరుగుతున్న వేధింపులను పోలీసుల దృష్టికి తీసుకువచ్చింది. పోలీసులు ఎక్సైజ్ కానిస్టేబుల్ మహేశ్వర్‌రావును అదుపులోకి తీసుకుని వరకు విచారించారు. అయితే తాను కొందరు సినీనటులను డ్రగ్స్ కేసులో అరెస్టు చేసేందుకు ఈ పథకం వేశానని మహేశ్వర్‌రావు పోలీసులకు చెప్పాడు. అయితే అతను సీఐనని ఎందుకు చెప్పుకుంటున్నాడు.. ఆ నటిని ఎందుకు ఫాలో అయ్యాడు.. ఆ హీరోను ఎందుకు బుక్ చేద్దామనుకున్నాడు.. తదితర విషయాలపై ఆరా తీయగా అతను గత కొంతకాలంగా టాలీవుడ్ ప్రముఖులను బెదిరిస్తున్నట్లుగా నిర్ధారణ అయ్యింది. పలువురు సినీ ప్రముఖుల ఇంటికి వెళ్లి డబ్బులు కూడా దండుకున్నట్లు తేలింది. డబ్బులు ఇవ్వకపోతే ఇంట్లో డ్రగ్స్ దొరికాయని కేసు పెడతానని బ్లాక్‌మెయిల్ చేసినట్లు నిర్ధారించారు. అంతేకాకుండా బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాదాపూర్ ప్రాంతాల్లో పలువురు పబ్ యజమానుల నుంచి రూ. లక్షలు వసూలు చేసినట్లు తేలింది. కొందరు మహిళలను బెదిరించి వారి నుంచి డబ్బులు వసూలు చేయడమే కాకుండా, వారితో అసభ్యంగా ప్రవర్తించినట్లు వెలుగులోకి వచ్చింది. ఆయన కాల్ డేటా, నగదు లావాదేవీలు, వాట్సప్, సోషల్ మీడియా మెసేజ్‌లను పరిశీలించిన పోలీసులు ఇప్పటివరకు 25 మంది సినీ ప్రముఖులు, వ్యాపార, పారిశ్రామికవేత్తలను బెదిరించి డబ్బులు వసూలు చేసినట్లు గుర్తించారు. సదరు కానిస్టేబుల్ ట్రూ కాలర్‌లో తాను సీఐనంటూ, డ్రగ్స్ పట్టుకోవడంలో దేశముదురునంటూ మోసాలకు పాల్పడుతున్నాడని ఇటీవల కొందరు సినీ ప్రముఖులు కూడా టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తేలింది. నిందితుడిని విచారించిన ఫిలింనగర్ పోలీసులు విచారణ నివేదికతో పాటు ఎక్సైజ్ అధికారులకు అప్పగించారు.

'ఇంటికి' చేరిన ఇక్రమ్!

- 2011లో అక్రమంగా హైదరాబాద్ వచ్చిన పాకిస్థానీ
- దుబాయ్‌లో ఉండగా నగర మహిళతో ప్రేమాయణం
- ఆమె కోసమే అడ్డదారిలో సరిహద్దులు దాటి ఇక్కడికి
- 2018లో అరెస్టు చేసిన నగర సైబర్ క్రైమ్ పోలీసులు
- గతంలో రెండుసార్లు డిపోర్టేషన్ ప్రక్రియకు అడ్డంకులు
- ఎట్టకేలకు అటారీ బోర్డర్ నుంచి పంపేసిన అధికారులు



సాక్షి, సిటీబ్యూరో: సుదీర్ఘకాలంగా హైదరాబాద్ డిటెన్షన్ సెంటర్‌లో బందీగా ఉన్న పాకిస్థానీ మహ్మద్ ఉస్మాన్ ఇక్రమ్ అలియాస్ మహ్మద్ అబ్బాస్ ఇక్రమ్ ఎట్టకేలకు పాకిస్థాన్ చేరాడు. గతంలో రెండుసార్లు సరిహద్దుల వరకు వెళ్లి సాంకేతిక కారణాలతో తిరిగి వచ్చేసిన అతడిని మంగళవారం పంజాబ్‌లోని అటారీ బోర్డర్ నుంచి పాకిస్థాన్‌కు పంపారు. అక్కడి పాక్ రేంజర్లకు ఇక్రమ్‌ను అప్పగించినట్లు నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ బుధవారం ప్రకటించారు. నగరంలోని పాతబస్తీకి చెందిన ఓ మహిళ ఇద్దరు కుమార్తెలు పుట్టిన తర్వాత భర్తను కోల్పోయింది. బతుకుదెరువు నిమిత్తం దుబాయ్ వెళ్లిన ఆమెకు అక్కడ పరిచయమైన పాకిస్థానీ ఇక్రమ్ తాను ఢిల్లీ వాసినని నమ్మించి వివాహం చేసుకున్నాడు. కొన్నాళ్లకు విషయం తెలిసిన మహిళ నగరానికి తిరిగి వచ్చేశారు. 2011లో ఉస్మాన్ సైతం హైదరాబాద్‌కు చేరుకున్నాడు. ఆరు నెలల విజిట్ వీసాపై వచ్చానంటూ చెప్పినా... దుబాయ్ నుంచి నేపాల్ మీదుగా అక్రమంగా ప్రవేశించాడని తేలింది. ఇక్రమ్ వచ్చిన ఆరు నెలలకు ఈ విషయం తెలుసుకున్న మహిళ అతడిని దూరంగా ఉంచింది. దీంతో కక్షకట్టిన అతను ఆమెను వేధించడంతో బాధితురాలు మహిళా ఠాణాను ఆశ్రయించడంతో ఇక్రమ్‌పై కేసు నమోదైంది. ఈ కేసులో పోలీసులు ఇక్రమ్‌ను విచారించి, నోటీసులు జారీ చేశారు. అప్పట్లో ఇతగాడు పాకిస్థానీ అని భార్య చెప్పకపోవడంతో విషయం బయటకు రాలేదు. 2018 జూన్‌లో సదరు మహిళ కుమార్తె విషయంలో ఓ సైబర్ నేరానికి పాల్పడ్డాడు. అతడి వేధింపులు తట్టుకోలేకపోయిన భార్య సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేసింది. దీంతో 2018 జూన్‌లో ఇక్రమ్‌ను అరెస్టు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. అప్పుడే పాకిస్థానీగా గుర్తించడంతో లోతుగా విచారించారు. ఈ నేపథ్యంలోనే ఇతగాడు అబ్బాస్ పేరుతో అనేక బోగస్ ధ్రువీకరణలతో పాస్‌పోర్ట్ సైతం తీసుకున్నట్లు వెల్లడైంది. సర్టిఫికెట్ల ఆధారంగా కొన్ని ప్రైవేట్ ఉద్యోగాలు చేసినట్లు బయటపడింది. ఇతగాడిని అరెస్టు చేసినప్పుడు మహారాష్ట్రలోని ఓ ప్రైవేట్ విద్యా సంస్థలో టెన్త్ నుంచి డిగ్రీ చదివినట్లు ఉన్న సర్టిఫికెట్లతో పాటు అబ్బాస్ పేరుతో గోల్నాక చిరునామాతో 2012లో తీసుకున్న భారత పాస్‌పోర్ట్, ఆధార్ సహా ఇతర గుర్తింపుకార్డులతో పాటు పాక్ పాస్‌పోర్ట్‌కు చెందినదిగా అనుమానిస్తున్న జిరాక్సు ప్రతిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇతడి వద్ద ఉన్న సర్టిఫికెట్ల ప్రకారం 2003లో టెన్త్, 2003-05లో ఇంటర్, 2005-08లో డిగ్రీ పూర్తి చేసినట్లు ఉంది. ఇవి తప్పని తేలాలంటే ఆ సమయంలో ఇక్రమ్ భారత్‌లో లేనట్లు నిర్ధారించాల్సి ఉండటంతో ఆ పని ప్రారంభించారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) ద్వారా పాకిస్థాన్ అధికారులను సంప్రదించారు. పూర్వాపరాలు పరిశీలించిన ఆ అధికారులు అతను పాకిస్థానీ అని ఖరారు చేశారు. సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో నమోదైన కేసు విచారణ, శిక్షా కాలం ముగియడంతో ఇక్రమ్‌ను పాకిస్థాన్‌కు బలవంతంగా తిప్పి పంపాలని (డిపోర్టేషన్) భావించారు. దీనికి సంబంధించి ఫార్మాలిటీస్ పూర్తి చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు అటారీ సరిహద్దుల వరకు తీసుకువెళ్లారు. అయితే డిపోర్టేషన్‌కు సంబంధించిన పత్రాల్లో కొన్ని లోపాలు ఉన్నట్లు చెప్పిన పాకిస్థాన్ అధికారులు అతడి ఎంట్రీని అడ్డుకున్నారు. వెనక్కు తీసుకువచ్చిన అధికారులు మరికొన్ని పత్రాలు సిద్ధం చేశారు. వీటిలో మరోసారి వాఘా సరిహద్దుల వరకు తీసుకువెళ్లారు. ఈసారి అతడిపై పాతబస్తీలో నమోదైన వేధింపుల కేసు పెండింగ్‌లో ఉందని తెలియడంతో మళ్లీ వెనక్కు తీసుకువచ్చారు. ఈ కేసులో తన భార్యతో రాజీ చేసుకున్న ఇక్రమ్‌ను దాదాపు రెండేళ్లుగా నగరంలోని సీసీఎస్ ఆధీనంలో ఉన్న డిపోర్టేషన్ సెంటర్‌లో ఉంచారు. ఇక్రమ్‌ను పాకిస్థాన్‌కు పంపడానికి అవసరమైన కసరత్తులు పూర్తి కావడంతో మంగళవారం పాక్ రేంజర్లకు అప్పగించారు. 'హైదరాబాద్ సీసీఎస్ ఆధీనంలో డిటెన్షన్ సెంటర్ 2018 ఆగస్టు 29న ఏర్పాటైంది. అప్పటి నుంచి 19 దేశాలకు చెందిన మొత్తం 158 మందిని అక్కడ నిర్బంధించాం. వీరిలో 150 మందిని ఇప్పటికే వారి వారి దేశాలకు పంపించాం. గత నెల 12న సిటీలో అక్రమంగా నివసిస్తూ మానవ అక్రమ రవాణాకు పాల్పడిన 20 మంది బంగ్లాదేశ్ పౌరులను ఇండో-బంగ్లాదేశ్ సరిహద్దు ద్వారా డిపోర్ట్ చేశాం' అని సీపీ ఆనంద్ పేర్కొన్నారు.

గృహిణి దారుణ హత్య

మూసా పేట : ఓ మహిళ దారుణ హత్యకు గురైన సంఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. స్థానిక సాన్వీ లేక్ అపార్ట్‌మెంట్‌లో 1311 ఫ్లాట్‌లో రాకేష్ అగర్వాల్, రేణు (50) దంపతులు నివాసం ఉంటున్నారు. రాకేష్ సనత్‌నగర్ లో స్టీల్ షాప్ నిర్వహిస్తున్నాడు. వారి ఇంట్లో పని చేసేందుకు పది రోజుల క్రితం హర్ష అనే వ్యక్తిని వంట మనిషిని నియమించుకున్నారు. బుధవారం భర్త, కుమారుడు షాప్‌కు వెళ్లగా రేణు ఒక్కతే ఇంట్లో ఉంటుంది. సాయంత్రం ఆమె భర్త ఇంటికి వచ్చి చూడగా ఇళ్లు తాళం వేసి ఉండటంతో ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానం వచ్చి ప్లంబర్ సహాయంలో తలుపులు తెరిచి చూడగా రేణు రక్తం మడుగులో పడి ఉంది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు.

కాళ్లు, చేతులు కట్టేసి... అక్కడే స్నానం చేసి..

రేణు కాళ్లు, చేతులు కట్టేసి కుక్కర్‌తో తలపై మోది గొంతు కోసి హత్య చేశారు. రక్తం అంటుకున్న దుస్తులను అక్కడే విడిచి బాత్రూంలో స్నానం చేసి దుస్తులు మార్చుకుని బ్యాగ్‌తో సహా యజమాని స్కూటీపై పరారైనట్లు సీసీ కెమెరాలో రికార్డయ్యింది. 5 టీమ్‌లతో నిందితుల కోసం గాలిస్తున్నట్లు బాలానగర్ జోన్ డీసీపీ సురేష్ కుమార్ తెలిపారు.

క్లుప్తంగా...

ఉచిత కంటి వైద్యశిబిరాలు ఉపయోగించుకోవాలి



ఉచిత కంటి వైద్యశిబిరాలను సందర్శించిన మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్

శ్రీనగర్‌కాలనీ: ప్రజలు ఉచిత కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని, కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దని మాజీ ఎంపీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్‌యాదవ్ సూచించారు. బుధవారం ఎర్రగడ్డ డివిజన్‌లో ఏకేవై ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐదు బస్తీల్లో ఉచిత కంటి వైద్యశిబిరాలను సందర్శించారు. వైద్యులు స్థానిక ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి, తగు సలహాలు, సూచనలు చేసి మందులను అందించారు. నేతలు మోసిన్ ఖురేషి, ఎర్ర కృష్ణకుమార్, ఖాజా, ఆకాష్, జహంగీర్, బాలరాజ్ పాల్గొన్నారు.

గౌతంరావుకు పలువురి అభినందనలు



శ్రీనగర్‌కాలనీ: హైదరాబాద్ సెంట్రల్‌జిల్లా మాజీ అధ్యక్షుడు గౌతంరావు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా బుధవారం బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్, రవికుమార్‌లు అభినందనలు తెలిపారు. గౌతంరావు రాష్ట్ర నియామకంతో పార్టీ మరింత బలోపేతమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

బంజారాహిల్స్ పాఠశాల హెచ్‌ఎంగా నరసింహ

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-7లోని కన్హయ్యలాల్ శాంతాదేవి లోహియా ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా బి.నరసింహ బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పటివరకు ఈ పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎంగా లక్ష్మీకాంత్‌రెడ్డి వ్యవహరించారు. గత ఏడాది ఈ పాఠశాల హెచ్‌ఎంగా ఉన్న యాదగిరి పలు కారణాల వల్ల బదిలీ కాగా అప్పటి నుంచి ఇన్‌చార్జి హెచ్‌ఎంతోనే నడుస్తుంది. ఇటీవల బదిలీలు, పదోన్నతులకు సంబంధించి కోర్టు తీర్పు రావడంతో ఈ పాఠశాలకు హెచ్‌ఎంగా నరసింహ నియమితులయ్యారు. ఇప్పటివరకు ఆయన బోరబండ, యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాలల్లో సుదీర్ఘకాలం పనిచేశారు.

వివాహిత అదృశ్యం



పద్మశ్రీ ..

పంజగుట్ట: పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వివాహిత అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన మేరకు.. ఖమ్మం జిల్లాకు చెందిన వేమిరెడ్డి అప్పిరెడ్డి, అతని భార్య వి.పద్మశ్రీ పంజగుట్ట, బాలాపూర బస్తీలో నివాసం ఉండే వారు. అప్పిరెడ్డి ఓ ప్రైవేట్ సంస్థలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తుండగా, పద్మశ్రీ ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తుంది. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ నెల 8న రాత్రి ఇంట్లో ఎవ్వరికీ చెప్పకుండా పద్మశ్రీ వెళ్లిపోయింది. చుట్టుపక్కల ఎంత వెతికినా కనిపించకపోవడం, సొంత గ్రామంలో ఆరాతీసినా ఫలితం లేకపోవడంతో అప్పిరెడ్డి పంజగుట్ట పోలీసులను ఫిర్యాదు చేశాడు.

మెసేజ్ పంపి నగదు స్వాహా

వెంగళరావునగర్: ఏపీకే మెసేజ్ పంపి ఆన్‌లైన్‌లో నగదు కాజేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. శ్రీకృష్ణానగర్‌కు చెందిన భగవాన్‌గౌడ్ కాంట్రాక్టర్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. ఈనెల 1న ఏపీకే ద్వారా మెసేజ్ వచ్చింది. దానిని ఓపెన్ చేసి అందులో ఆయన నెంబర్ పంపాడు. దాంతో అతనికి ఓటీపీలు వచ్చాయి. పిన్ నెంబర్ మార్చాలని, లేనిపక్షంలో నగదు పోతుందని హెచ్చరించాడు. ఈనెల 4న తొలుత రూ.80వేలు, తర్వాత రూ.4500 మాయం అయ్యాయి. బాధితుడు సైబర్‌క్రైంలో సమాచారం అనంతరం బుధవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కన్నుల పండువగా సాగిన నారీశక్తి పర్వం

హిమాయత్‌నగర్ : ఈనెల 22న అగ్రసేన్ మహారాజ్ జయంతి వేడుకల్లో భాగంగా నారీ శక్తి మహిళా ఉత్సవాన్ని బుధవారం తెలంగాణ అగర్వాల్ సమాజ్ ఆర్గనైజింగ్ కమిటీ ఛైర్మన్ రీతూ అగర్వాల్, వైస్ ఛైర్మన్ డింపుల్ అగర్వాల్, ఆర్తి అగర్వాల్ ఆధ్వర్యంలో అగ్రసేన్ వైభవంగా నిర్వహించినట్లు సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు అనిరుధ్ గుప్తా తెలిపారు. అగ్రసేన్ జయంతి ప్రధాన సంయోజకురాలు డా.సీమాజైన్, కల్చరల్ కమిటీ ఛైర్మన్ రీతూ అగర్వాల్, డింపుల్ అగర్వాల్, రజని అగర్వాల్, ఆర్తి అగర్వాల్, అనూ కేడియా, అంజనీ అగర్వాల్ పాల్గొన్నారు.

ర్యాపిడో డ్రైవర్లుగా మహిళలు

- మహిళా సమాఖ్యల సభ్యులకు అవకాశం
- శిక్షణ ఇచ్చి, ప్రభుత్వమే రుణం ఇచ్చి
- త్వరలోనే సీఎం చేతుల మీదుగా పథకం ప్రారంభం



మహిళా సమాఖ్యల ప్రతినిధులతో మాట్లాడుతున్న డీపీవో ఆశా విరానిక

బంజారాహిల్స్: మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఇప్పటికే పలు ప్రభుత్వ కార్యాలయాలతో పాటు పలు కీలక ప్రాంతాల్లో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేయించిన ప్రభుత్వం మహిళల కోసం తాజాగా మరో కొత్త పథకం ప్రారంభించింది. దీనికి సంబంధించిన సన్నాహక సమావేశాలను జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ డీపీవోలు ఆయా సర్కిళ్ళ వారిగా నిర్వహిస్తున్నారు. ఇందిరా మహిళ శక్తి స్కీం కింద మహిళా సమాఖ్యలలో సభ్యులుగా ఉన్న వారికి బైక్ రైడర్లుగా శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి కల్పించాలనే ఆలోచనతో ప్రభుత్వం తాజాగా ర్యాపిడో సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ నేపథ్యంలో ఆసక్తి గల మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని అధికారులు నిర్ణయించి ఈ మేరకు బుధవారం బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని సీఎంటీసీ భవన్‌లో జూబ్లీహిల్స్ సర్కిల్-18 పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట డివిజన్ల పరిధిలోని ఆసక్తి గల మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీవో ఆషా విరానిక ఈ పథకం యొక్క మార్గదర్శకాలను మహిళా సమాఖ్యల ప్రతినిధులకు వివరించారు. ర్యాపిడో సంస్థ ద్వారా ఇప్పటికే వేలాది యువత ఉపాధి పొందుతున్నారని మహిళలకు ఉపాధి కల్పించాలనే గొప్ప సంకల్పంతో ప్రభుత్వం ఈ సంస్థతో మాట్లాడి ముందుకు సాగుతున్నదని తెలిపారు. మహిళలందరికీ బైక్‌లు ఉండవు కాబట్టి బైక్ మొత్తంలో 10 శాతం మహిళలు చెల్లించాల్సి ఉంటుందని మిగతా మొత్తాన్ని ప్రభుత్వం ఎటువంటి గ్యారెంటీ అవసరం లేకుండా రుణం ఇప్పిస్తుందని తెలిపారు. సిబిల్ స్కోర్‌తో అవసరం లేదని చెప్పారు. లైసెన్స్ కలిగి ఉన్న మహిళలందరూ ఈ ర్యాపిడో బైక్ రైడర్ స్కీంకు అర్హత కలిగిన వారేనని అన్నారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి ఇన్‌కం సర్టిఫికెట్‌తో పాటు సోషల్ స్టేటస్, లైసెన్స్, కేవైసీ, సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ ఫొటోతో పాటు సమాఖ్య తీర్మాణం కాపీ, నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు ఇవ్వాలని సూచించారు.

ఆసక్తి ఉన్న వారికి శిక్షణ

దరఖాస్తు చేసుకున్న వారికి త్వరలోనే ర్యాపిడో సంస్థ ద్వారా శిక్షణ ఇస్తారని డ్రైవింగ్‌లో వారు పూర్తి శిక్షణ పూర్తి చేసుకున్న బైక్‌లు అందించేందుకు ఏర్పాట్లు చేస్తారు. త్వరలోనే సీఎం చేతుల మీదుగా ప్రారంభమ్యే స్కీంలో వీరికి వాహనాలు అందజేస్తారు. నగరంలో ఏ సంస్థలో చూసినా మహిళా రైడర్లు సంఖ్య చాలా తక్కువగా ఉన్నదని మహిళలను ప్రోత్సహించడంతో పాటు ఆర్థికంగా వారికి ఉపాధి అవకాశాన్ని కల్పించేందుకు ఇది మంచి అవకాశమని అధికారులు అంటున్నారు.

మానసికస్థైర్యాన్ని పెంచుకోవాలి



ఆత్మహత్యల నివారణ కొరకు పోస్టర్లను ప్రదర్శిస్తున్న డాక్టర్ రాజారావు, డాక్టర్ అనిత

శ్రీనగర్‌కాలనీ: నేటి ఆధునిక జీవన విధానంలో మానసిక ఒత్తిడిలు అధికంగా పెట్టుకొని ఆత్మహత్యలను పాల్పడుతున్నారని, మనసులో ఏమిపెట్టుకోకుండా మనసులో అనుకున్నది చెప్పి భారాన్ని దింపుకోవాలని, మానసికస్థైర్యాన్ని పెంచుకోవాలని ఉస్మానియా మెడికల్‌కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రాజారావు అన్నారు. బుధవారం ప్రపంచ ఆత్మహత్యల దినోత్సవం సందర్భంగా ఎర్రగడ్డలోని మానసిక ఆసుపత్రిలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ 70 నుండి 80శాతం ఆత్మహత్యలు డిప్రెషన్ నుండే మొదలవుతున్నాయని, వాటిని అదుపులో పెట్టుకోవాలని అన్నారు. ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ అనిత మాట్లాడుతూ డిప్రెషన్ లోనుకాకుండా చాలా థెరపీలు, కౌన్సిలింగ్స్ ఉన్నాయని, ప్రశాంతమైన జీవితాన్ని ప్రతిఒక్కరూ గడపాలని, తీవ్ర డిప్రెషన్‌కు లోనుకాకుండా మానసికంగా బలంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఓడీ డాక్టర్ సుధారాణి, హెడ్ ఆఫ్ క్లినికల్ సైకాలజీ డాక్టర్ వెంకట సుబ్బయ్య, సైక్రాటిస్ట్ డాక్టర్ సుమనారెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

ఏఐ బోధనా మెలకువలపై సమావేశం



బోధనా మెలకువలు చెబుతున్న ఉపాధ్యాయురాలు అపురూప

బంజారాహిల్స్: బోధనా మెలకువలను తెలుసుకోవడంతో పాటు విద్యార్థులకు మరింత అర్థమయ్యేరీతిలో బోధించేందుకు, ఒకరి ఆలోచనలు మరొకరు పంచుకోవడానికి బంజారాహిల్స్ కాంప్లెక్స్ మీటింగ్ బుధవారం బంజారాహిల్స్ రోడ్ నెంబర్-7లోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించారు. షేక్‌పేట మండల డిప్యూటీ ఐఓఎస్ మల్లయ్య బంజారాహిల్స్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సింహ్మాతో పాటు 11 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు ఇందులో పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు అపురూప ఈ కార్యక్రమంలో పాల్గొని బోధనా మెలకువలను సహచర ఉపాధ్యాయులతో పంచుకున్నారు. 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)-డిజిటల్ లిటరసీ' అన్న అంశంపై ఈ కార్యక్రమం జరిగింది. విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే రీతిలో ఏఐతో పాటు డిజిటల్ బోధనలో తీసుకోవాల్సిన అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ నిర్వహించారు.

ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి



చాకలి ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాటూరి రమేష్ తదితరులు

హిమాయత్‌నగర్ : చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలను బుధవారం హిమాయత్‌నగర్ కాంగ్రెస్ నాయకులు జి.రామన్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం నాయకులు పైళ్ల ఆశయ్య, మరియల గోపాల్, పరిమి భాస్కర్ రావు, లొంక సోమయ్య, రాపర్తి ప్రభాకర్, మంగయ్య పాల్గొన్నారు.

ఫిలింనగర్‌లో చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు

ఫిలింనగర్: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు, సబ్బండ వర్గాల మేల్కొలుపు చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి సందర్భంగా బుధవారం ఫిలింనగర్‌లోని కొత్త చెరువు వద్ద చాకలి ఐలమ్మ విగ్రహానికి స్థానికులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జూబ్లీహిల్స్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాటూరి రమేష్, గోదాసు నాగార్జున, భవానీ రమేష్, బోయ సాయిలు, రాములు, మంగమ్మ, ధనమ్మ, చంద్రమ్మ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి జాతికి ఆమె చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు.

పార్కింగ్ చేసిన బైక్ మాయం

వెంగళరావునగర్: పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం మాయమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ఎల్లారెడ్డిగూడలో నివాసం ఉంటున్న వై.రఘు డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. ఈనెల 4వ తేదీ తన సోదరుడు అనిల్‌కు చెందిన వాహనాన్ని తీసుకుని వచ్చి వాడుకుని రాత్రి ఇంటి ముందు పార్క్ చేసి ఉదయం వచ్చి చూడగా కనిపించలేదు. అనేకప్రాంతాల్లో వెదికినా జాడలేదు. దాంతో బుధవారం రఘు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు.

నేడు స్టేట్‌హోం ఎదుట ధర్నా

వెంగళరావునగర్: సీఐటీయు ఆధ్వర్యంలో ఈనెల 11న మధురానగర్ మహిళా శిశుసంక్షేమశాఖ ప్రధాన కార్యాలయం (స్టేట్‌హోం) ఎదుట ధర్నా చేపట్టనున్నట్టు సీఐటీయు జూబ్లీహిల్స్ జోన్ కమిటీ కన్వీనర్ రాపర్తి అశోక్ బుధవారం తెలిపారు. గత ఆరు నెలలుగా స్టేట్‌హోంలోని శిశువిహార్‌లో పని చేస్తున్న ఆయమ్మలకు వేతనాలు ఇవ్వడం లేదని, వారి సమస్యల పరిష్కారం కోరుతూ ధర్నా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలియజేశారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ ఫిజికల్ డైరెక్టర్‌గా మల్లేష్



మల్లేష్‌ను సత్కరిస్తున్న టీజీవో సంఘం నాయకులు

పంజగుట్ట: చిన్న వయస్సులోనే రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఫిజికల్ డైరెక్టర్ అవార్డు సాధించిన మల్లేష్ మున్ముందు జాతీయస్థాయిలో మంచి పేరు గడించాలని తెలంగాణ గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీజీవో) హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎం.బి.కృష్ణ యాదవ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన బెస్ట్ ఫిజికల్ డైరెక్టర్ అవార్డును సాధించిన ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ మల్లేష్‌ను బుధవారం టీజీవో సంఘం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్ బి.రాజేంద్ర కుమార్, టిజీవో నగర అధ్యక్షుడు ఎం.బి.కృష్ణ యాదవ్, సెక్రటరీ/ హమ్మద్‌బ్దుల్ ఖాదర్‌లు మల్లేష్‌ను సత్కరించారు. కార్యక్రంలో టీజీవో జిల్లా జాయింట్ సెక్రటరీ కొత్త విద్యాసాగర్, కాలేజీ వైస్ ప్రిన్సిపల్ నవీన్ చందర్ రాజు, డాక్టర్ శ్రీనివాస్, ప్రొఫెసర్ చంద్రయ్య, ప్రసాద్, డాక్టర్ సుదర్శన్, డాక్టర్ యాదగిరి, గిరి తదితరులు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్యాయత్నం

రహమత్‌నగర్: ప్రేమించిన వ్యక్తి పెళ్లికి నిరాకరించడంతో ఓ యువతి ఆత్మహత్యాయత్నం చేసింది. బోరబండ పోలీసులు తెలిపిన మేరకు.. పెద్దమ్మ నగర్‌కు చెందిన యువతి (26), ఇదే బస్తీకి చెందిన నవీన్ మూడేళ్లుగా ప్రేమించుకున్నారు. ఇటీవల నవీన్‌ను పెళ్లి చేసుకోవాలని యువతి కోరగా నవీన్ నిరాకరించాడు. దీంతో యువతి బుధవారం ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. మమత బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎంపీ, ఎమ్మెల్యే కాలనీ సొసైటీ అధ్యక్షుడిగా కొలను హనుమంతరెడ్డి



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-10లోని విజయ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ (ఎంపీ, ఎమ్మెల్యే కాలనీ) అధ్యక్షుడిగా కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే కొలను హనుమంత రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సొసైటీ మేనేజింగ్ కమిటీ ఎన్నికలు మంగళవారం జరగ్గా కొలను హనుమంతరెడ్డి ప్యానెల్ ఈ ఎన్నికల్లో ఘన విజయం సాధించింది. గెలుపొందిన మేనేజింగ్ కమిటీ సభ్యులు బుధవారం సమావేశమై ప్రెసిడెంట్‌గా కొలను హనుమంతరెడ్డి ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఎన్.సూర్యప్రకాశరావు, జనరల్ సెక్రటరీ ఏ.సందీప్‌రెడ్డి, ట్రెజరర్‌గా వి.సీతామాధురి ఎన్నికయ్యారు. సొసైటీ ముఖ్య సలహాదారుగా మల్లు రవిని ఎంపిక చేశారు. కార్యవర్గ సభ్యులుగా పి.గాయత్రీలత, కె.ముత్యంరెడ్డి, పి.రవీంద్ర, వై.రంగారావు, ఎం.సురేందర్‌రెడ్డి, అనుపమారెడ్డిలు నియమితులయ్యారు. సమావేశంలో భాగంగా కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో ఆలోచింపజేసిన సీబీపీ



జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం...

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో బుధవారం కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం (సీబీపీ) నిర్వహించారు. మెలుహా స్కూల్ అకడమిక్స్ మాజీ డైరెక్టర్ అంజలి రజ్దాన్, ఎడ్యుకేషనల్ మెంటరింగ్ ఇండియా అకడమిక్స్ డైరెక్టర్ లక్ష్మీ అన్నపూర్ణ చింతలూరిలు హాజరై కృత్రిమ మేధస్సు ఆవశ్యకతను వివరించారు. ముఖ్యంగా బోధన, అభ్యాస పద్ధతుల్లో ఏఐను ఏకీకృతం చేయడానికి అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలు, వివిధ రకాల పద్ధతులతో విద్యావేత్తలను సన్నద్ధం చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం కొనసాగింది. డైరెక్టర్ వరలక్ష్మీ మాట్లాడుతూ విద్యావేత్తల్లో ఏఐ సంసిద్ధతను పెంపొందించడానికి ఒంటరిగా కాకుండా కలిసి పనిచేయడం కీలకమన్నారు. ఈ సెషన్లు ఏఐ చిక్కులను పరిష్కార మార్గాన్ని సూచించాయన్నారు.

సీనియర్ సిటిజన్‌కు సినీ నిర్మాత టోకరా

- ఫోర్జరీ సంతకాలతో 99 ఏళ్ల లీజు..
- కేసు నమోదు చేసిన పోలీసులు..

బంజారాహిల్స్: పదేళ్ల పాటు లీజుకు తీసుకుని భవనాన్ని 99 ఏళ్ల లీజు అంటూ ఫోర్జరీ పత్రాలను సృష్టించి మోసం చేయడంతో పాటు వృద్ధురాలిని బెదిరింపులకు గురిచేస్తున్న వ్యవహారంలో సినీ నిర్మాత, రౌడీషీటర్ షేక్ బషీద్‌తో పాటు అతని భార్యపై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-10లో నివాసం ఉంటున్న లక్ష్మీశ్వరి (85) కుమారుడు తిరుమల వెంకటేష్ అమెరికాలో ఉంటారు. అతడికి జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్-25లో భవనం ఉంది. దానికి జీపీఏ హోల్డర్‌గా ఉన్న తల్లి లక్ష్మీశ్వరి వద్ద నుంచి 2013లో సినీ నిర్మాత షేక్ బషీద్, అతని భార్య షేక్ కరీమున్నీసా లీజుకు తీసుకున్నారు. పదేళ్ల పాటు లీజుకు ఇచ్చినట్లు ఒప్పందం కుదుర్చుకున్నారు. 2023లో లీజు గడువు ముగియడంతో ఖాళీ చేయాలంటూ యజమానులు చెప్పగా, తమకు 99 ఏళ్ల పాటు లీజు ఉందంటూ పత్రాలు చూపించారు. 2012 నుంచి 2112 దాకా ఇంటిని ఖాళీ చేసే ప్రసక్తే లేదంటూ షేక్‌బషీద్ చెప్పడంతో లక్ష్మీశ్వరి షాక్‌కు గురయ్యారు. అప్పటి నుంచి అద్దె చెల్లించకపోవడంతో పాటు బెదిరింపులకు దిగుతున్నారు. ప్రభుత్వాలు తప్ప ప్రైవేటు వ్యక్తులు ఎవరూ 99 ఏళ్లకు ఇంటిని లీజు ఇవ్వరని, తప్పుడు పత్రాలతో తన ఇంటిని కాజేసే కుట్ర చేస్తున్నారంటూ బాధితురాలు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మేరకు పోలీసులు షేక్‌బషీద్‌తో పాటు అతని భార్య కరీమున్నీసాలపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై వేదింపుల కేసు

ఫిలింనగర్: తనతో ఎంగేజ్‌మెంట్ రద్దు చేసుకుందనే కక్షతో యువతి ఫోన్ నెంబర్లను పబ్లిక్ టాయిలెట్స్‌లో రాస్తుండడంతో పాటు వేధింపులకు గురిచేస్తున్న వ్యక్తిపై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఫిలింనగర్‌లో నివాసం ఉంటున్న యువతి (21)కి గత ఏడాది బాలాపూర్‌లో నివాసం ఉంటున్న ఆదర్శ్ (31)తో పెళ్లి సంబంధం వచ్చింది. అయితే ఇటీవల ఆదర్శ్‌కు వేరే యువతులతో పరిచయాలు ఉన్నాయని తెలియడంతో యువతి నిలదీసింది. దీంతో తీవ్ర పదజాలంతో దూషించడంతో పాటు దాడికి పాల్పడ్డాడు. దీంతో ఆదర్శ్‌తో ఎంగేజ్‌మెంట్ రద్దు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల ఆమెకు గుర్తుతెలియని నెంబర్ల నుంచి ఫోన్లు వస్తున్నాయి. ఆమె ఫోన్ నెంబర్ పబ్లిక్ టాయిలెట్స్‌లో చూశామని కాల్స్ చేసిన వారు చెప్పడంతో ఎంగేజ్‌మెంట్ రద్దు చేసిన కోపంతో ఆదర్శ్ ఈ పని చేసి ఉంటాడంటూ బాధిత యువతి ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రూప్-1 తప్పిదాల బాధ్యత ప్రభుత్వానిదే

హిమాయత్‌నగర్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) చేస్తున్న వరుస తప్పిదాలతో నిరుద్యోగ యువత గందరగోళంలో పడిందని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి విమర్శించింది. బుధవారం ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్రలు మాట్లాడుతూ టీజీపీఎస్సీని ప్రక్షాళన చేసిన తర్వాత కూడా మళ్లీ తప్పిదాలు చేయడంతో నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పారదర్శకంగా నియామకాలు చేపట్టేలా కోర్టు కేసులు రాకుండా గ్రూప్-1 నియామకాలను చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే నిరుద్యోగ అభ్యర్థులను సమీకరించి రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలకు పిలుపునిస్తామని హెచ్చరించారు.

నీటి బిల్లు పేరుతో ఆన్‌లైన్‌లో నగదు చోరీ

వెంగళరావునగర్ : నీటి బిల్లు చెల్లించాలంటూ ఓటీపీ తీసుకుని ఆన్‌లైన్‌లో నగదు చోరీ చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. ప్రకారం ఎల్లారెడ్డిగూడలో నివాసం ఉండే ఎం.తిరుమల ప్రసాద్ చిరు వ్యాపారం చేస్తుంటాడు. జులై 26వ తేదీనాడు నీటి బిల్లు చెల్లించాలంటూ అతనికి మెసేజ్ వచ్చింది. దాని లింక్ ఓపెన్ చేసి ఓటీపీ తెలియజేసి డెబిట్ కార్డు ద్వారా రూ.10వేలు చెల్లించాడు. గత నెల 4వ తేదీ అతనికి కిరాయిదారులు రూ.10103 పంపారు. సాయంత్రానికి ఆ నగదు మాయం అయింది. వెంటనే బాధితుడు సైబర్‌క్రైం పోలీసులకు తెలియజేశాడు. అనంతరం బుధవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు.

17వ తేదీలోపు మార్పులు, చేర్పులు చేసుకోవాలి

వెంగళరావునగర్: ఈనెల 17వ తేదీ తుది జాబితా విడుదల చేసే లోపుగా ఓటర్లు తమకు చెందిన అడ్రస్‌లోని మార్పులు, చేర్పులు చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ సర్కిల్-19 ఉప కమిషనర్ రజినీకాంత్‌రెడ్డి తెలియజేశారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయంలో బుధవారం పలు రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు వారి డిమాండ్స్‌ను డీఎంసీకి తెలిపారు.

మహిళా కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీగా దీపాదేవిగౌడ్



నియామకపత్రం అందుకుంటున్న దీపాదేవిగౌడ్

బంజారాహిల్స్: ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీగా బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2 ఇందిరానగర్‌కు చెందిన సీహెచ్.దీపాదేవిగౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఖైరతాబాద్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎస్.ఉషశ్రీ చేతుల మీదుగా ఆమె నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా దీపాదేవి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ పదవిని అప్పగించిన కాంగ్రెస్ అగ్రనేతలకు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఆదామ్‌కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

హిమాయత్‌నగర్: నారాయణగూడ బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్రం అధ్యాపకులు డా.గడ్డం ఆదామ్‌కు కళాశాల ఉత్తమ అధ్యాపకులు-25 అవార్డును బుధవారం బీజేఆర్ కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథి ఖైరతాబాద్ ఐడి కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొ.రాజేంద్ర కుమార్, లయన్స్ క్లబ్ సికింద్రాబాద్ ప్రతినిధులతో కలిసి ఘనంగా సన్మానించి కళాశాల ప్రిన్సిపాల్ కెప్టెన్ డా.ఎం.విజయ్ కుమార్ అందజేశారు. ఆదామ్‌కు వైస్ ప్రిన్సిపాల్స్ డా.పి.సత్య నారాయణ రెడ్డి, డా.ఆర్.శ్రీనివాస్, డా.కె.శ్రీనివాస్, డా.సి.వి.ఎల్.నారాయణ, డా.రాజేశ్వర్, డా.వేణు, డా.కదారి శ్రీనివాసరావు శుభాకాంక్షలు తెలియజేశారు.

కేబుల్ ఆపరేటర్లపై ఉక్కుపాదం మోపుతున్న ప్రభుత్వం

పంజగుట్ట: ప్రభుత్వం జియో, ఎయిర్‌టెల్ లాంటి సంస్థలకు లాభం చేసేందుకు చిన్నచిన్న కేబుల్ ఆపరేటర్లపై ఉక్కుపాదం మోపుతున్నట్లు అనుమానం వస్తుందని తెలంగాణ ఫెడరేషన్ ఆఫ్ ఎరియల్ కేబుల్ ఆపరేటర్స్ ఆరోపించింది. ఫైబర్ కేబుల్స్ కట్ చెయ్యడంవల్ల ఎంతో మంది ఆపరేటర్లు లక్షల్లో నష్టపోయి, అటు కస్టమర్లకు సమాధానం చెప్పుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదనవ్యక్తం చేశారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్ బాబు, ప్రధాన కార్యదర్శి అరవింద్, కార్యదర్శి సలాముద్దీన్, కరుణాకర్ రెడ్డిలు మాట్లాడుతూ .. రామాంతపూర్ ఘటనకు తమకు ఎలాంటి సంభంధం లేదని అసలు ఫైబర్ వైర్లల్లో విద్యుత్ రాదని అది కేవలం సిగ్నల్ కోసం వాడే వైర్లు అన్నారు. ప్రత్యేకంగా టీంలు పెట్టి మరీ కేబుల్ వైర్లు కట్ చెయిస్తున్నారని తాము కూడా సుందరీకరణకు సంపూర్ణ మద్దత్తు ఇస్తాము కాని ఎదైనా పరిష్కారం చూపించి అప్పుడు చర్యలు తీసుకోవాలని అన్నారు.



బాలికల విద్యకు కేఈఎఫ్ చేయూత

సాక్షి, సిటీబ్యూరో: ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన ప్రతిభావంతులైన బాలికలు ఉన్నత విద్య కలలను సాకారం చేసుకోవటానికి చేయూతనిస్తూ కోటక్ మహీంద్రా గ్రూప్‌నకు చెందిన సామాజిక సేవా విభాగం కోటక్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ (కేఈఎఫ్), తమ కోటక్ కన్య స్కాలర్‌షిప్ కార్యక్రమం ప్రకటించింది. దీనిలో భాగంగా 500 మంది బాలికలకు స్కాలర్‌షిప్‌లను అందించనుంది. ఈ విషయాన్ని సంస్థ నగర ప్రతినిధులు తెలిపారు. ఎన్ఆర్ఐఎఫ్, నాక్ – గుర్తింపు పొందిన సంస్థలలో స్టెమ్, మెడిసిన్, లా, ఆర్కిటెక్చర్, డిజైన్, ఇతర రంగాలలో అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీలను అభ్యసించే బాలికలకు ఈ ఆర్థిక ప్రయోజనం లభిస్తుందని వివరించారు.

నైపుణ్యం, సామర్థ్యాలకే విలువ

- ది యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ వీఎల్‌వీఎస్ఎస్ సుబ్బారావు
- 'టీహబ్'లో జపాన్‌లోని క్యోటో సీకా యూనివర్సిటీ మధ్య ఒప్పందం



రాయదుర్గం: భవిష్యత్తులో డిగ్రీలకు విలువ ఉండదని దియంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ వీఎల్‌వీఎస్ఎస్ సుబ్బారావు స్పష్టం చేశారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్ క్యాంపస్‌లో మన దేశంలో పూర్తిస్థాయి గ్రాడ్యుయేషన్ అండ్ పీజీ మల్టీమీడియా కోర్సులు అందిస్తున్న మొదటి కళాశాల ఇంటర్నేషనల్ అకాడమీ ఆఫ్ కంప్యూటర్ గ్రాఫిక్స్(ఐఏసీజీ), మాంగా అండ్ అనిమే కోర్సులు అందిస్తున్న ప్రపంచంలోని మొదటి విశ్వవిద్యాలయం జపాన్‌లోని క్యోటో సీకా మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంపై ఐఏసీజీ మల్టీమీడియా కాలేజీ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ రామకృష్ణ పోలిన, క్యోటోసీకా విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ కాంటెంపరరీ ఆఫ్రికన్ అండ్ ఏషియన్ కల్చర్స్ డైరెక్టర్ షిస్ ముత్సుమురా సంతకాలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సుబ్బారావు మాట్లాడుతూ భవిష్యత్తులో డిగ్రీలతో పాటు నైపుణ్యం, సామర్థ్యాలకే విలువ ఉంటుందని, అవి ఉన్నవారికే అవకాశాలు ఉంటాయని అన్నారు. ఈ కాలంలో పాఠశాలలు, కళాశాలలు రివాల్వింగ్ కరికులం అవలంబించాలని ఆయన సూచించారు. షిస్ ముత్సుమురా మాట్లాడుతూ జపాన్‌లో జనాభా వృద్ధాప్యం వైపు సాగుతోందని, ఈ నేపథ్యంలో భారత యువ ప్రతిభావంతుల అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.





దేహం.. దాహం..

నగరవాసులను వేధిస్తున్న నిశ్శబ్ద ద్రవనష్టం

- నాన్ డైరియల్ డీహైడ్రేషన్‌గా నామకరణం
- అనారోగ్య సమస్యలకు కారణమవుతున్న వైనం
- సాధారణ నీటితో మాత్రమే భర్తీ కాదంటున్న వైద్యులు
- ద్రవాహారంతో పాటు ఎలక్ట్రోలైట్స్ కూడా అవసరమే..

అలసట, మానసిక మందకొడితనం (బ్రెయిన్ ఫాగ్), తలనొప్పి, లోబీపీ వంటి లక్షణాలతో క్లినిక్స్‌ను సందర్శిస్తున్న వారి సంఖ్య నగరంలో పెరుగుతోంది. గతంలో ఈ తరహా సమస్యలకు వేర్వేరు కారణాలు ఉండేవి.. కానీ ఇప్పుడు వీటన్నింటికీ శరీరంలో ద్రవాల కొరతే ప్రధానంగా కనిపిస్తోందని వైద్యులు అంటున్నారు. వాంతులు, విరేచనాలు లేకపోయినా శరీరం తీవ్ర ద్రవాల కొరతను ఎదుర్కొంటోంది. అందుకే ప్రస్తుతం వైద్యులు దీనిని 'నాన్ డైరియల్ డీహైడ్రేషన్' అని పేర్కొంటున్నారు. వైద్యులు చెబుతున్న ప్రకారం..

– సాక్షి, సిటీబ్యూరో

డీహైడ్రేషన్ అనేది ఇప్పుడు సర్వకాల సర్వావస్థలలోనూ కలిగే సమస్యగా మారింది. గతంలో వేసవి కాలంలో మాత్రమే సంభవించేదని చాలా మంది భావించేవారు. కానీ తాజాగా వైద్యుల క్లినికల్ అనుభవాల్లో కాలంతో పాటు లక్షణాలను కూడా ఇది మార్చుకుంటోందనే కొత్త మార్పు గుర్తిస్తున్నారు. ఇది హఠాత్తుగా సంభవించేది కాదని గుర్తించలేని విధంగా గుట్టుగా శరీరంలో ఉండి నిదానంగా పెరుగుతోంది. దీనికి కొన్ని కారణాల్లో..

- నగరంలో ఎక్కువగా వేడి – తేమ వాతావరణం ఉంటోంది. ఇలా వాతావరణంలో తేమ అధికంగా ఉన్నప్పుడు చెమట ఆవిరి కాకుండా చర్మంపై ఆగిపోతుంది. దీని వల్ల ద్రవనష్టం జరుగుతూనే ఉంటుంది. కానీ దాహం వేయడానికి బదులు అలసట, మత్తు, శరీరం బరువు అనిపించడం ఉంటుంది.
- నగరంలో దగ్గు, జలుబు వంటివి అనేక మందికి వదలని చుట్టాల్లా మారాయి. వీటికి తోడుగా తేలికపాటి జ్వరం.. వీటి వల్ల ఊపిరితిత్తుల ద్వారా.. చర్మం ద్వారా అదనంగా ద్రవాలు కోల్పోతాం. తినే, తాగే పరిమాణం తగ్గిపోవడం వల్ల డీహైడ్రేషన్ మరింత పెరుగుతోంది.
- తరచూ మూత్రానికి వెళ్లడం, మూత్రనాళం దగ్గర నొప్పి వంటి సమస్యల వల్ల చాలా మంది నీరు తాగడాన్ని తగ్గిస్తారు. దీని ఫలితంగా మూత్రనాళ ఇన్ఫెక్షన్ సమస్య వస్తుంది.
- నగరంలో దీర్ఘకాలిక ప్రయాణాలు చేసేవారు ఎక్కువయ్యారు. విమాన ప్రయాణాల్లో నీరు తీసుకోవడం బాగా తక్కువ. పైగా పొడి గాలి, సాల్టెడ్ స్నాక్స్, వేడి పానీయాల సేవనం.. వల్ల కూడా ద్రవనష్టం జరుగుతుంది.
- ఊపిరి పీల్చడం నుంచి మొదలై ఆహారం జీర్ణం కావడం వరకు ప్రతీదీ ద్రవ ప్రమేయంతోనే జరుగుతుంది. వీటితో పాటు చెమట వల్ల రోజుకు కనీసం 2.5 లీటర్ల ద్రవ నష్టం జరుగుతుంది. కాఫీ, టీ వంటివి అతిగా తీసుకోవడం, భోజనాలు స్కిప్ చేయడం, ఒత్తిడి ఇవన్నీ కలిపితే ఆ నష్టం మరింత భారీగా ఉంటుంది.



పరిష్కారం ఏమిటి?

హైడ్రేషన్ అంటే కేవలం నీటి పరిమాణం మాత్రమే కాదు, దాని ఖచ్చితత్వం కూడా. కాబట్టి నీటి పరిమాణం తగ్గింది అని నీరు తీసుకుంటే మాత్రమే సరిపోదు.. తగిన పోషకాలున్న ద్రవాహారం అవసరం. సోడియం, పొటాషియం, క్లోరైడ్ వంటి ముఖ్య ఎలక్ట్రోలైట్ సొల్యూషన్స్ కలిగిన తక్కువ గ్లూకోజ్. క్యాలరీ, డయాబెటిక్ సేఫ్ ఫార్ములాతో తయారైన రెడీ టు డ్రింక్స్ కూడా ఈ లోటును భర్తీ చేయగలవు. పనిలో ఉండగా అలసట వచ్చినా లేదా ప్రయాణంలోనూ సరిపడా నీటితో పాటు ఎలక్ట్రోలైట్స్, గ్లూకోజ్, ఎనర్జీ సమతుల్యంగా తీసుకోవడం శరీరానికి అవసరం.





ద్రవాహారంతో.. అసమతుల్యత సరిచేయాలి..

డీహైడ్రేషన్ డయాబెటిస్, బీపీ ఉన్నవారికి ఇది ఎక్కువ ప్రమాదకరం. ఎప్పుడూ వాంతులు, విరేచనాలతోనే వస్తుందని కాదు. ఇది రోజువారీగా నిశ్శబ్దంగా ఏర్పడి, ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. దీనికి పరిష్కారాన్ని కేవలం నీటితో సరిపెట్టకూడదు. శరీరం కోల్పోతున్న అసలు మూలకాలు ఏవో తెలుసుకుని భర్తీ చేయాలి. ఎలక్ట్రోలైట్స్ లేకపోతే మెదడు, కండరాలు సరిగా పనిచేయవు. శరీరం కోల్పోయే సోడియం, పొటాషియం, గ్లూకోజ్ వంటి మూలకాల్ని భర్తీ చేయకపోతే కణాల పనితీరు దెబ్బతింటుంది.

– డా.మోసిన్ అస్లం, కన్సల్టెంట్ ఫిజీషియన్, ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ, హైదరాబాద్

చిత్రం.. సహజత్వం

- వీధి వ్యాపారుల జీవన స్థితిగతులు..
- పెద్ద సమూహంలోని అందరి హావభావాలు..
- చిత్రమేదైనా చూస్తుండిపోవాల్సిందే..
- యువ ఆర్టిస్ట్ వెంకటేశ్‌ను శెభాష్ అనాల్సిందే..

సాక్షి, సిటీబ్యూరో: జీవితమంటే సర్దుకోవడం.. అది ఇంట్లో వస్తువులైనా, జీవితంలో పరిస్థితులైనా..! సర్దుకోవడం కూడా ఒక కళ.. కళాత్మకంగా సర్దుకోవడం ఒక అందమైన జీవితమని యువ ఆర్టిస్టు చెన్న వెంకటేశ్ అంటున్నాడు. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీలో ఆయన ఫైన్ ఆర్ట్స్‌లో మాస్టర్స్ స్టూడెంట్. కేవలం పెన్సిల్, కలర్ పెన్సిల్‌తో మధ్యతరగతి, దిగువ మధ్య తరగతి బతుకు చిత్రాలను, సామాజిక అంశాలను వాస్తవికత ఉట్టిపడేలా చిత్రాలు వేయడం ఈ యువ ఆర్టిస్టు ప్రత్యేకత. ఎంతలా అంటే.. ఆయన గీసిన చిత్రాలు కెమెరాలో తీసిన ఫొటోలా లేదా పెన్సిల్‌తో వేసిన బొమ్మలా అని గుర్తించలేము. ఇంతటి సహజత్వానికి, వాస్తవికతకు తన తీక్షణ వీక్షణమే కారణమంటాడు. మారుమూల గ్రామంలో తన తల్లి చిన్న ఇంటిని, వంటగదిలో వస్తువులను పొందికగా సర్దుకోవడం నుంచి స్ఫూర్తి పొంది, ఆర్టిస్టుగా అలాంటి బడుగు జీవన చిత్రాలను సహజత్వం ఉట్టిపడేలా చిత్రాలను వేయడం తన ప్రత్యేకగా మార్చుకున్నాడు. ఇలా నగరంలోని ఫుట్‌పాత్ వ్యాపారాలు, జీవన స్థితిగతులు, అందులోని భావోద్వేగాలతో గీసిన చిత్రాలను నగరంలోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో 'స్టాక్‌డ్ స్టోరీస్: ది పోయెటిక్స్ ఆఫ్ అర్బన్ స్టిల్‌నెస్' అనే పేరుతో ఈ నెల 14వ తేదీ వరకు ప్రదర్శిస్తున్నారు.

నిత్య జీవన గాథలు.. వ్యథలు

రోడ్డుకు పక్కన బుట్టలమ్ముకునే చిన్న కొట్టు.. సాధారణంగా మనం చూసే విధానాన్ని, తన కళాత్మక చూపునకు మధ్య వ్యత్యాసాన్ని అతడి చిత్రం చెప్పకనే చెబుతుంది. వేల మంది పాల్గొన్న ఒక ఉత్సవం లేదా కార్యక్రమంలోని ప్రతి ఒక్కరి ఆహార్యం, భావోద్వేగంతో పాటు ఆ పరిసర ప్రాంతాల ప్రతీ సూక్ష్మ అంశాన్ని మైక్రోస్కోప్‌లా అతడు చూపిస్తాడు. ముఖ్యంగా నగర జీవితంలోని సర్దుకుపోయే మాధుర్యాన్ని అర్థవంతంగా పెన్సిల్ రంగులతో అద్భుతా చూపిస్తాడు వెంకటేశ్. అందులో ఏదో ఒక చోట మనకు మనం కనిపిస్తాం.. ప్రతి సామాన్యుడి జీవితం కనిపిస్తుంది. ఓవైపు నిత్య జీవన గాథలను అందంగా సృష్టిస్తూనే.. మరోవైపు అందులోని వ్యథలను పరిచయం చేస్తాడు 23 ఏళ్ల యువ కళాకారుడు.











పలు వేదికల్లో ప్రశంసలు

ఇలా తన కళాత్మక ప్రయాణంలోని చిత్రాలను ముంబై వేదికగా ఆల్ ఇండియా యాన్యువల్ ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో, హైదరాబాద్ స్టేట్ ఆర్ట్ గ్యాలరీ యాన్యువల్ ఆర్ట్ ఎగ్జిబిషన్, హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ నేషనల్ యాన్యువల్ ఆర్ట్ ఎగ్జిబిషన్, హైదరాబాద్ ఆర్ట్ ఫెస్ట్ 25 మెట్రో స్టూడెంట్ ఆర్ట్ ప్రాజెక్ట్ వంటి తదితర వేదికల్లో ప్రదర్శించి ప్రశంసలు పొందాడు. హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ నుంచి ఎక్సలెన్స్ అవార్డు, స్టేట్ ఆర్ట్ గ్యాలరీ నుంచి సోలో షో స్పాన్సర్‌షిప్, బాంబే ఆర్ట్ సొసైటీ నుంచి అమ్రిత షెర్-గిల్ అవార్డులను అందుకున్నాడు.

అమ్మే.. నా కళకు ఊపిరి..



నాకు రియలిజం ఆర్ట్‌పై ఆసక్తి ఎక్కువ. అందుకే నా చిత్రాల్లో సహజత్వం, వాస్తవికత ఖచ్చితంగా ఇమిడి ఉండేలా చూసుకుంటాను. రోజువారీ పట్టణ జీవితంలోని విస్మరించబడిన వివరాలతో, ముఖ్యంగా రోడ్డు పక్కన ఉన్న దుకాణాల దృశ్యాలు, అందులో నిమగ్నమైన జీవితాలు, వారి ఎమోషన్స్‌ను రంగులతో గీయడం ఇష్టం. అందులోని సూక్ష్మమైన అంశాలను అన్వేషించి సంక్లిష్టమైన, అత్యంత వివరణాత్మక విషయాలను చిత్రిస్తున్నాను. అస్తవ్యస్తంగా కనిపించే విషయాల్లో పొందుపరచబడిన సాంస్కృతిక కథనాలు హైలైట్ చేయడం హాబీగా మారిపోయింది. మా దిగువ మధ్యతరగతి కుటుంబం నేపథ్యంలో మా అమ్మ ఇంటిని నైపుణ్యంగా సర్దుకునే తత్వం నా కళకు ఊపిరిపోసింది.

– చెన్న వెంకటేశ్, యువ ఆర్టిస్ట్

నగరంలో 2 ఫిట్‌నెస్ క్లబ్స్..

ఎనీటైమ్ ఫిట్‌నెస్

సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన ఎనీటైమ్ ఫిట్‌నెస్ బ్రాండ్ నగరంలో అడుగుపెట్టింది. ఒకే సమయంలో 2 ఫిట్‌నెస్ క్లబ్‌లను జూబ్లీహిల్స్, కొండాపూర్‌లలో ఏర్పాటు చేసింది. వీటిని బుధవారం నుంచి అందుబాటులోకి తెచ్చిన సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రపంచ స్థాయి ఎక్విప్‌మెంట్‌తో పాటు 24 గంటలూ ఫిట్‌నెస్ యాక్సెస్‌ను అందించడం తమ ప్రత్యేకత అని ప్రతీ హైదరాబాదీ ఫిట్‌గా ఉండాలని తాము కోరుకుంటున్నట్లు తెలిపారు. తమ క్లబ్‌లో అడుగుపెట్టడంతోనే సభ్యులు ప్రపంచవ్యాప్తంగా 5,500పైగా ఉన్న క్లబ్‌ల నెట్‌వర్క్‌లోకి ప్రవేశం పొందుతారని వివరించారు. కార్యక్రమంలో ఎనీటైమ్ ఫిట్‌నెస్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ వికాస్ జైన్, ఫ్రాంచైజ్ భాగస్వాములు వికుల్ అగర్వాల్, మధు మండవ వికాస్ క్వాత్రా పాల్గొని మాట్లాడారు.

డైనమిక్ హౌసింగ్ మార్కెట్‌లో సిటీ టాప్

సాక్షి, సిటీబ్యూరో: అధునాతన జీవనశైలిలో భాగమైన తొలి పాస్టెల్ క్వార్ట్జ్ కలెక్షన్ నగరంలో ఆవిష్కృతమైంది. దేశంలోని ప్రముఖ లగ్జరీ క్వార్ట్జ్ బ్రాండ్ స్పెక్ట్ర క్వార్ట్జ్ సర్ఫేస్ ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించిన డిజైన్ డెమోక్రసీ 2025లో పాస్టెల్ పోయిస్ అనే భారతదేశపు తొలి పాస్టెల్ క్వార్ట్జ్ కలెక్షన్‌ను ఆవిష్కరించింది. ఆధునిక ఇంటీరియర్స్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని, గ్లోబల్ డిజైన్ సెన్సిబిలిటీస్‌తో నాలుగు ప్రత్యేకమైన షేడ్స్‌తో ఈ కలెక్షన్ రూపొందించబడింది. ఈ సందర్భంగా స్పెక్ట్ర క్వార్ట్జ్ సర్ఫేస్ వ్యవస్థాపకుడు అంకిత్ జైన్ మాట్లాడుతూ.. ఏడాదిలోపు కంపెనీ రెవెన్యూలో 8–10 శాతం తెలంగాణ నుంచి రావొచ్చని, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఐటీ పరిశ్రమ, రెసిడెన్షియల్ డెవలప్‌మెంట్ కారణంగా హైదరాబాద్ సహజమైన విస్తరణ కేంద్రంగా ఎదిగిందని తెలిపారు.

క్లుప్తంగా...

ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి ఇన్‌చార్జి డైరెక్టర్‌గా డాక్టర్ జోసెఫ్ బెంజమెన్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో క్యాన్సర్ చికిత్స లభించే ఏకైక ప్రభుత్వ ఎంఎన్‌జే ఆసుపత్రి ఇన్‌చార్జి డైరెక్టర్‌గా డాక్టర్ జోసెఫ్ బెంజమెన్ నియమితులయ్యారు. ఇప్పటి వరకు డైరెక్టర్‌గా ఉన్న డాక్టర్ శ్రీనివాసులు.. వాస్తవానికి రాష్ట్ర విభజన సమయంలో ఏపీకి ఆప్షన్ పెట్టుకున్నారు. అక్కడ ఆయన క్యాడర్‌కు తగిన పోస్టు లేకపోవడంతో ఎంఎన్‌జే ఆసుపత్రిలో కొనసాగారు. గత నెల 26న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు డాక్టర్ శ్రీనివాసులును రిలీవ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ఇన్‌చార్జి డైరెక్టర్‌గా జోసెఫ్ బెంజమెన్‌ను నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది.

గ్రూప్–1 పరీక్ష రద్దు చేయాలి: ఎమ్మెల్సీ శ్రవణ్



సాక్షి, హైదరాబాద్: హైకోర్టు ఆదేశాల ప్రకారం వెంటనే గ్రూప్–1 పరీక్ష రద్దు చేయాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం టీజీపీఎస్సీ కార్యదర్శి ప్రియాంక అలకు.. దాసోజు శ్రవణ్, బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ తదితరులు కలిసి వినతి పత్రం సమర్పించారు. రాజ్యాంగ విరుద్ధమైన, వివక్ష చూపుతున్న జీవో 29ను వెనక్కి తీసుకోవాలని కోరారు. న్యాయం కోసం పోరాడిన విద్యార్థులపై నమోదు చేసిన తప్పుడు కేసులు ఉపసంహరించాలని డిమాండ్ చేశారు.

హైకోర్టు తీర్పు అమలు చేయండి: కృష్ణయ్య



సాక్షి, హైదరాబాద్: గ్రూప్ 1పై హైకోర్టు ఇచ్చిన తీర్పు అమలుకు వెంటనే చర్యలు తీసుకోవాలని పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వాన్ని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆయన బుధవారం తెలంగాణ సచివాలయం మీడియా పాయింట్ బయట విలేకరులతో మాట్లాడారు. హైకోర్టు అనేక అంశాలను లోతుగా పరిశీలించి తప్పులు వెలికితీసిందని చెప్పారు. ఈ అవకతవకలపై న్యాయ విచారణ జరపాలన్నారు.

సరైన చర్యలతో రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట

- మరణాలు తగ్గించేందుకు కాలపరిమితితో పనిచేయాలి
- ప్రతి నెలా ఒకసారి జిల్లా రోడ్డు భద్రతా కమిటీ భేటీలు నిర్వహించాలి
- రోడ్డు భద్రతా కమిటీ చైర్మన్ జస్టిస్ అభయ్ మనోహర్ సప్రే



జస్టిస్ అభయ్ మనోహర్ సప్రేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎస్ రామకృష్ణారావు

సాక్షి,హైదరాబాద్: సరైన చర్యలు, జాగ్రత్తలు తీసుకుంటే రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నివారించ వచ్చని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, రోడ్డు భద్రతా కమిటీ చైర్మన్ జస్టిస్ అభయ్ మనోహర్ సప్రే అన్నారు. ప్రమాదాల్లో మరణాలను తగ్గించేందుకు నిర్దిష్ట కాలవ్యవధి (టైమ్ బౌండ్) పెట్టుకొని సంబంధిత శాఖలు పనిచేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ విధంగా చేస్తే ఇతర రాష్ట్రాలకు తెలంగాణ 'రోల్ మోడల్'గా నిలిచే అవకాశం ఉందన్నారు. రోడ్డు భద్రత అనేది ప్రభుత్వం, సమాజం ఉమ్మడి బాధ్యత అని పేర్కొన్నారు. బుధవారం తెలంగాణలో రోడ్డు భద్రతపై ఉన్నతాధికారులతో మనోహర్ సప్రే సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా రోజుకు 500 మంది, గంటకు 25 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతినెలా కనీసం ఒకసారి క్రమం తప్పకుండా జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశాలను నిర్వహించాలని సూచించారు. ప్రమాదాలకు కారణమవుతున్న 'బ్లాక్‌స్పాట్స్'ను సరిచేయాలని, రోడ్లపై గుంతలను వెంటనే పూడ్చాలని, చెల్లుబాటయ్యే డ్రైవింగ్, వాహన బీమా ఉండేలా ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని, వాహన యజమానులకు డ్రైవింగ్, వాహన బీమా గడువుతీరిపోవడానికి సంబంధించిన అలర్ట్‌లు పంపించాలని సప్రే తెలిపారు.

రోడ్డు భద్రతకు టెక్నాలజీ వినియోగం

రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన ఈ కమిటీ, చట్టాల అమలు, రాష్ట్ర ప్రభుత్వ విధానాల సమీక్షతో పాటు ఇంజనీరింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎమర్జెన్సీ రెస్పాన్స్ వంటి అంశాల్లో మార్గనిర్దేశం చేస్తోంది. ఈ విషయంలో రాష్ట్రంలో చేపట్టిన చర్యలను సీఎస్ రామకృష్ణారావు, హోం సెక్రటరీ రవిగుప్తా వివరించారు. ట్రాఫిక్ నియంత్రణలో కృత్రిమ మేధ, డేటా అనలిటిక్స్ వినియోగిస్తున్నట్లు డీజీపీ జితేంద్ర తెలిపారు. వాహనాల రిజిస్ట్రేషన్లు, ప్రమాదాలు, మరణాలు, గాయాల వార్షిక గణాంకాలను ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సురేంద్రమోహన్ తెలియజేశారు. పాఠశాలల్లో రోడ్డు భద్రతపై పాఠ్యాంశాలు ప్రవేశపెడుతున్నట్లు విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణా వివరించారు. ఔటర్ రింగ్ రోడ్డుపై భద్రతా చర్యలు గురించి హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ తెలిపారు. ప్రమాదకర ప్రాంతాలలో జాగ్రత్తలతో పాటు రోడ్లపై గుంతలు పూడ్చటం, లేన్‌మార్కింగ్, సిగ్నేజీల ఏర్పాటు వంటి ఇంజనీరింగ్ చర్యలను గురించి జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ వివరించారు. దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల పరంగా తెలంగాణ 8వ స్థానంలో, మరణాల పరంగా 10వ స్థానంలో ఉందని వివిధ శాఖల అధికారులు వెల్లడించారు. హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగం లేకపోవడం, మద్యం సేవించి డ్రైవింగ్, మొబైల్ వాడకం, అతివేగం ప్రధాన కారణాలని తెలియజేశారు. దీంతో వీటిపై మరింత లోతైన అవగాహన కార్యక్రమాలు అవసరమని జస్టిస్ సప్రే సూచించారు. రాష్ట్రంలో అమలవుతున్న చర్యలపై సంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో స్పెషల్ సీఎస్ వికాస్‌రాజ్, మున్సిపల్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఇలంబర్తి, టీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్, హెల్త్ కమిషనర్ డా.సంగీత తదితరులు పాల్గొన్నారు.

తనయుడిని కడతేర్చిన తండ్రి

- చంపుతానని బెదిరించాడని..
- తండ్రితోపాటు సహకరించిన ముగ్గురి అరెస్ట్



నిందితులతో సీఐ సురేశ్, ఎస్‌ఐ రాజు

వెంకటాపురం(ఎం): మద్యానికి బానిసై, ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో అప్పుల పాలైన కుమారుడు తననెక్కడ చంపుతాడోనన్న భయంతో.. కన్నతండ్రే బిడ్డను హత్య చేశాడు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ సంఘటనపై ములుగు జిల్లా కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సీఐ దారం సురేశ్, వెంకటాపురం ఎస్‌ఐ చల్ల రాజు వెల్లడించిన వివరాలివి. వెంకటాపురం మండలం లక్ష్మీదేవిపేటకు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు దుర్గం సూరయ్యకు ఇద్దరు కుమారులు సంపత్, అశోక్ ఉన్నారు. సూరయ్య ప్రస్తుతం ములుగు మండలం రంగారావుపల్లి శివారులో నివసిస్తున్నాడు. ఈ క్రమంలో సూరయ్య చిన్న కుమారుడు అశోక్ మద్యానికి బానిసై.. ఆన్‌లైన్ బెట్టింగ్‌లో తీవ్రంగా నష్టపోయాడు. తన వాటాగా వచ్చిన రెండు ఎకరాల భూమిని అమ్ముకున్నాడు. ఈనెల 7న లక్ష్మీదేవిపేట నుంచి రంగారావుపల్లిలో నివసిస్తున్న తండ్రి సూరయ్య వద్దకు వెళ్లాడు. మద్యం మత్తులో.. ఎలాగైనా ఈరోజు చంపుతానంటూ తండ్రిని బెదిరించాడు. దీంతో ఆందోళనకు గురైన సూరయ్య తన పెద్ద కుమారుడు సంపత్, తమ్ముడు సాంబయ్య సాయంతో.. చిన్న కుమారుడు అశోక్ మెడకు తాడు చుట్టి చంపేశాడు. అనంతరం డ్రైవర్ రమేశ్ సాయంతో అశోక్ మృతదేహాన్ని కారులో రంగారావుపల్లి నుంచి తాను ఉంటున్న ఇంటి వద్ద పడేశాడు. ఈ ఘటనపై లక్ష్మీదేవిపేటకు చెందిన ఒక వ్యక్తి సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టి నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

తల్లిని హతమార్చిన తనయ

ఆస్తి కోసం భర్తతో కలిసి ఘాతుకం



బాదావత్ లక్ష్మి (ఫైల్)

పాలకుర్తి టౌన్: ఆస్తి కోసం భర్తతో కలిసి కుమార్తె తన తల్లిని హత్య చేసింది. జనగామ జిల్లా పాలకుర్తి మండలం పెద్దతండా (కే) గ్రామంలో జరిగిన ఈ సంఘటనపై సీఐ జానకీరాంరెడ్డి తెలిపిన వివరాలివి. పెద్దతండా(కే)కు చెందిన బాదావత్ లక్ష్మి (42) వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది. ఆమె భర్త తిరుపతి 15 ఏళ్ల క్రితం మృతి చెందాడు. ఈ దంపతులకు సంగీత ఏకైక సంతానం. ఈమెకు ఐదేళ్ల క్రితం ఇదే మండలం దుబ్బతండా(ఎస్పీ) గ్రామానికి చెందిన బానోత్ వీరన్నతో వివాహం చేశారు. తల్లి పేరిట ఉన్న 20 గుంటల వ్యవసాయ భూమిని తన పేరుతో పట్టా చేయాలని సంగీత పలుమార్లు కోరగా తల్లి నిరాకరించింది. దీంతో భర్తతో కలిసి మంగళవారం రాత్రి పెద్దతండాకు చేరుకుని నిద్రలో ఉన్న లక్ష్మి ముఖంపై దిండుపెట్టి హత్య చేశారు. కూలి పనికి లక్ష్మిని పిలవడానికి వెళ్లిన స్థానిక మహిళ ఇది చూసి తండావాసులకు బుధవారం తెలియజేసింది. వారు పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలి తండ్రి సేనావత్ చంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీస్ దర్యాప్తునకు సహకరించాలి

మణప్పురం, ముత్తూట్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: మణప్పురం, ముత్తూట్ ఫైనాన్స్ సంస్థలు కేసుల దర్యాప్తులో పోలీసులకు సహకరించాలని హైకోర్టు ఆదేశించింది. విచారణ సమయంలో వ్యాపార కార్యకలాపాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా దర్యాప్తు కొనసాగించాలని స్పష్టం చేసింది. చట్టప్రకారం కేసుల దర్యాప్తు చేపట్టవచ్చని పోలీసులకు సూచించింది. క్రిమినల్ కేసులున్న ఖాతాదారుల వివరాలు ఇవ్వాలని మంచిర్యాల పోలీసులు జారీ చేసిన నోటీసులను సవాల్ చేస్తూ రెండు ఫైనాన్స్ సంస్థలు హైకోర్టును ఆశ్రయించాయి. ఈ పిటిషన్లపై జస్టిస్ ఎన్వీ శ్రవణ్ కుమార్ విచారణ చేపట్టారు. హోం జీపీ మహేశ్‌రాజే వాదనలు వినిపిస్తూ.. చెన్నూరు ఎస్‌బీఐలో రూ.13.71 కోట్ల విలువైన నగలు దోపిడీ చేసిన నిందితులు ఈ ఫైనాన్స్ సంస్థల్లో తాకట్టు పెట్టి రుణాలు పొందారని, దర్యాప్తునకు సహకరించడం లేదని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పోలీసుల దర్యాప్తునకు సహకరించాలని ఫైనాన్స్ సంస్థలను ఆదేశించారు. లాకర్లు తెరవడం, నగలు చూపడాన్ని వీడియో తీయాలని పోలీసులను ఆదేశించారు.

బండి సంజయ్, రాంచందర్‌రావులను కలిసిన గ్రూప్–1 అభ్యర్థులు

సాక్షి, హైదరాబాద్: కేంద్రమంత్రి బండి సంజయ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావులను గ్రూప్–1 అభ్యర్థులు విడివిడిగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. గ్రూప్–1 ఫలితాలను రద్దు చేస్తూ హైకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో పలువురు అభ్యర్థులు వారిని కలిసి నిరుద్యోగులకు అండగా ఉంటూ సహాయ సహకారాలు అందించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. నిరుద్యోగులకు న్యాయం చేసే విషయంలో ఎప్పుడూ ముందుంటామని, భవిష్యత్తులోనూ అండగా ఉంటామని వారికి సంజయ్, రాంచందర్‌రావు భరోసా ఇచ్చారు. అశోక్‌నగర్ చౌరస్తా వద్ద బండి సంజయ్ చేసిన ఆందోళన తమకు ఎంతో స్ఫూర్తినిచ్చిందన్నారు. హైకోర్టులోనూ న్యాయ పోరాటానికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందించారని తెలిపారు. ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా వెనక్కి తగ్గకుండా పోరాడిన గ్రూప్–1 అభ్యర్థులను సంజయ్ అభినందించారు. 'బీజేపీ పోరాటం వల్లనే హైకోర్టు తీర్పు వచ్చింది. గ్రూప్–1 అభ్యర్థుల న్యాయమైన హక్కులను కాపాడేలా తాము మద్దతుగా నిలబడతాం' అని రాంచందర్‌రావు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ గ్రూప్–1 మెయిన్స్ పరీక్షల నిర్వహణలో అవకతవకలతో అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు.

బీఆర్‌ఎస్ వదంతులను నమ్మకండి

యువత భవిష్యత్తును చీకట్లోకి నెట్టింది వారే: ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్



సాక్షి, హైదరాబాద్: గ్రూప్–1 పరీక్షల విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును ప్రభుత్వం గౌరవిస్తుందని, ఎవరికీ నష్టం జరగకుండా భవిష్యత్ కార్యాచరణను టీజీపీఎస్సీ రూపొందిస్తుందని రామగుండం కాంగ్రెస్ ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ వెల్లడించారు. హైకోర్టు ఇచ్చిన తీర్పులో కాంగ్రెస్ పార్టీని, ప్రభుత్వాన్ని ఒక్క మాట కూడా అనలేదని, ఈ విషయంలో బీఆర్‌ఎస్ సృష్టిస్తున్న వదంతులను నమ్మవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. బుధవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఇప్పుడు విద్యార్థుల గురించి మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ హయాంలో కనీసం టెన్త్, ఇంటర్, డిగ్రీ పరీక్షలను కూడా సరిగా నిర్వహించలేకపోయారని, ప్రశ్న పత్రాలను పాన్‌షాపుల్లో అమ్ముకున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి సీఎం అయిన తర్వాత విద్యార్థులకు బంగారు భవిష్యత్తు కల్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత 60 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని చెప్పారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి జాగ్రత్తగా మాట్లాడాలని, లేదంటే అతని మాటలకు తాము చేతలు చూపించాల్సి వస్తుందని రాజ్‌ఠాకూర్ హెచ్చరించారు. ఫార్ములా–ఈ రేస్ కేసులో విచారణను ఎదుర్కొంటే అది లొట్టపీసు కేసో.. మంచి పీసు కేసో తెలుస్తుందని కేటీఆర్‌నుద్దేశించి ఆయన వ్యాఖ్యానించారు.

గ్రూప్–1 అవకతవకలపై నేడు నిరసన కార్యక్రమాలు



బీఆర్‌ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్

సాక్షి, హైదరాబాద్: గ్రూప్–1 పరీక్ష నిర్వహణలో విఫలమైన పబ్లిక్ సర్వీస్ కమిషన్ నైతిక బాధ్యత వహిస్తూ టీజీపీఎస్సీ చైర్మన్ రాజీనామా చేయాలని బీఆర్‌ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గ్రూప్–1 అవకతవకలకు నిరసనగా బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో గురువారం రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల ఎదుట, జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నామని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా అభ్యర్థులకు 28 సెంటర్లు కేటాయించగా.. కోఠి ఉమెన్స్ కాలేజీలో రెండు సెంటర్‌లలో 71 మంది ఎంపికయ్యారని, మిగిలిన 26 సెంటర్లలో 139 మంది ఎంపిక అవడం ఎలా సాధ్యమని శ్రీనివాస్ ప్రశ్నించారు. 563 ఉద్యోగాల్లో కేవలం 9 శాతం మంది మాత్రమే తెలుగు మీడియం విద్యార్థులు ఉన్నట్లు టీజీపీఎస్సీ షీల్డ్ కవర్‌లో పేర్కొందని వెల్లడించారు. ఇంగ్లిష్‌లో 12,381 మంది పరీక్ష రాస్తే 508 మంది ఎంపికయ్యారని, తెలుగులో 8,694 మంది పరీక్ష రాస్తే కేవలం 56 మంది మాత్రమే ఎంపికయ్యారన్నారు. ప్రభుత్వం పట్టింపులకుపోకుండా హైకోర్టు డివిజన్ బెంచ్‌కి, సుప్రీంకోర్టుకు వెళ్లకుండా అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు.

నగర వార్తలు

మరోసారి జంట జలాశయాల గేట్ల ఎత్తివేత

– మూసీలోకి900 క్యూసెక్కుల నీరు

మణికొండ: జంట జలాశయాలైన ఉస్మాన్‌సాగర్(గండిపేట), హిమాయత్‌సాగర్‌ల పరీవాహక ప్రాంతాల నుంచి వరద పోటెత్తడంతో బుధవారం మరోసారి గేట్లు తెరిచారు. హిమాయత్‌సాగర్‌కు ఎగువ నుంచి 2 వేల క్యూసెక్కుల వరద వస్తుండటంతో ఒక గేటు రెండు అడుగులు ఎత్తి 671 క్యూసెక్కుల నీటిని కిందికి వదలారు. గండిపేటకు 500 క్యూసెక్కుల వరద వస్తుండటంతో రెండు గేట్లు ఒక అడుగు మేర ఎత్తి 234 క్యూసెక్కుల నీటికి మూసీలోకి విడుదల చేశారు. హిమాయత్‌సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 1763.50 అడుగులు కాగా, ప్రస్తుతం 1,762.55 అడుగులు, గండిపేట పూర్తిస్థాయి మట్టం 1,790 అడుగులు కాగా, ప్రస్తుతం 1,789.15 అడుగుల మట్టం నీరు ఉన్నట్టు అధికారులు తెలిపారు.

ఖాళీగా ఉన్న డిగ్రీ సీట్లను భర్తీ చేయాలి



వేం నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న లక్ష్మీనారాయణ తదితరులు

గన్‌ఫౌండ్రీ: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయాలని, దోస్త్ ద్వారా విద్యార్థులకు ప్రత్యేక అవకాశం కల్పించాలని బీసీ కులాల సమన్వయ వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండు లక్ష్మీనారాయణ కోరారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం.నరేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మిగిలిపోయిన సీట్లను భర్తీ చేస్తే విద్యార్థులు విద్యా సంవత్సరాన్ని కోల్పోయే ప్రమాదం నుంచి బయట పడతారని అన్నారు. సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని నరేందర్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

డబ్ల్యూటీఐటీసీ సంయుక్త కార్యదర్శిగా బూర వెంకటేశ్వర్లు

సాక్షి, సిటీబ్యూరో: ప్రపంచ తెలుగు సమాచార సాంకేతిక మండలి(డబ్ల్యూటీఐటీసీ) రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా స్టైపిల్ ఫౌండర్, సీఈఓ బూర వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. సెప్టెంబర్ 27న ఆయన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆయనకు గ్లోబల్ ఐటీ రంగంలో 25 ఏళ్లకుపైగా అనుభవం ఉంది. టీసీఎస్, యాక్సెంచర్‌లో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తూ, నార్త్ అమెరికా, యూరప్, ఆసియా–పసిఫిక్ ప్రాంతాల్లో జ్యూరిచ్ ఫైనాన్షియల్ సర్వీసెస్, బ్యాంక్ ఆఫ్ అమెరికా, ఎరిక్సన్ వంటి ఫార్చ్యూన్ 500 సంస్థలకు పెద్ద ఎత్తున టెక్నాలజీ సొల్యూషన్లు అందించారు.

ఆక్రమణలపై ఉక్కుపాదం

- పికెట్ పార్క్‌లో కూల్చివేతలు చేపట్టిన కంటోన్మెంట్ అధికారులు
- ఉద్రిక్తంగా మారిన అక్రమ ఫుడ్‌కోర్టుల తొలగింపు
- ప్రత్యామ్నాయం చూపాలని ఎంపీ ఈటల, ఎమ్మెల్యే శ్రీగణేశ్ డిమాండ్



కూల్చివేతలు చేపడుతున్న బోర్డు సిబ్బంది



కంటోన్మెంట్: ఎట్టకేలకు సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు అధికారులు ఆక్రమణలపై ఉక్కుపాదం మోపారు. జేబీఎస్ సమీపంలోని పార్కుస్థలంలో బుధవారం తెల్లవారక ముందే కూల్చివేతలు చేపట్టారు. పికెట్ నాలాను ఆనుకుని వెలిసిన ఫుడ్‌కోర్టులను వందలాది మంది పోలీసుల బందోబస్తు నడుమ తొలగించారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఫుడ్‌కోర్టులను నేలమట్టం చేశారు. ప్రతిష్టాత్మక పికెట్ పార్కును ఇటీవల సుమారు కోటి రూపాయలు వెచ్చించి దివంగత ప్రధాని వాజ్‌పేయి పేరిట పార్కును అభివృద్ధి చేశారు. ఈ నెల 17 పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే తెలంగాణ విమోచన దినోత్సవంలో పాల్గొనేందుకు రానున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేతుల మీదుగా అందులో వాజ్‌పేయి విగ్రహావిష్కరణ చేయించనున్నారు.

ఆక్రమించి.. అక్రమ వ్యాపారాలు

నాలా తూర్పు భాగంలో ఉండే స్థలంలో కొన్నేళ్ల క్రితమే ఫుట్‌పాత్ వ్యాపారాలు వెలిశాయి. కాలక్రమేణా హోటళ్లను తలపించే స్థాయిలో ఆక్రమణదారులు పక్కా నిర్మాణాలు చేపట్టారు. దుకాణాలను ఇతరులకు లీజుకు ఇచ్చి రోజువారీగా భారీ మొత్తంలో కిరాయిలు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై బోర్డు అధికారులకు ఫిర్యాదులు రావడంతో పదేళ్ల క్రితమే కూల్చివేతలు చేపట్టారు. అయితే నాటి ప్రజాప్రతినిధుల జోక్యంతో ఆక్రమణలు మళ్లీ వెలిశాయి. తాజాగా హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో కలిసి బోర్డు అధికారులు ఆక్రమణలను పరిశీలించారు. సీఈఓ మధుకర్ నాయక్ ఆదేశాల మేరకు బోర్డు సిబ్బంది కూల్చివేతలు చేపట్టి భవిష్యత్‌లో ఆక్రమణలు జరగకుండా ఫెన్సింగ్ కూడా చేశారు. దుకాణదారులు కూల్చివేతలు అడ్డుకునేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.

ఆక్రమిస్తే చర్యలు తప్పవు

రక్షణ శాఖ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తప్పవు. అక్రమ నిర్మాణాలు చేపట్టడమే కాకుండా వాటిని ఇతరులకు లీజుకు ఇచ్చినట్లు మాకు ఫిర్యాదులు అందాయి. నాలాను ఆనుకుని ఉన్న స్థలంలో ఫుడ్‌కోర్టుల నిర్వహణ ప్రజారోగ్యానికి నష్టదాయకం. రక్షణ స్థలాలను లీజుకు ఇచ్చినవారిపై చర్యలు తీసుకుంటాం.

–మధుకర్ నాయక్, కంటోన్మెంట్ సీఈఓ

పేదలకు ఇబ్బందులు కలిగించొద్దు

ప్రభుత్వ స్థలాల ఆక్రమణల తొలగింపు పేరిట పేదలకు ఇబ్బందులు కలిగించొద్దు. జేబీఎస్ సమీపంలో కూల్చివేతల కారణంగా రోడ్డున పడిన పేదలకు ప్రత్యామ్నాయ అవకాశాలు కల్పించాలని బోర్డు అధికారులను కోరాం. వీలైనంత వారి జీవనోపాధి దెబ్బతినకుండా చూడాలని సూచించాం.

– ఈటల రాజేందర్, ఎంపీ

ప్రత్యామ్నాయం కల్పించాలి

ఫుట్‌పాత్‌లో వ్యాపారాలు నిర్వహించుకునే నిరుపేదలకు ప్రత్యామ్నాయం చూపాలి. బోర్డుకు ఆదాయం వచ్చేలా మరోచోట వారికి ఉపాధి అవకాశం కల్పించాలి. ఈ మేరకు బోర్డు అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తాం.

–శ్రీగణేశ్, ఎమ్మెల్యే

కార్పొరేట్‌కు దీటుగా 'గాంధీ' బ్రాండింగ్

– అడిషనల్ డీఎంఈ ప్రొఫెసర్ వాణి



గాంధీఆస్పత్రి: ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి బ్రాండింగ్‌ని దేశంలోనే నంబర్ వన్‌గా నిలుపుతామని మెడికల్ ఎడ్యుకేషన్ అడిషనల్ డీఎంఈ ప్రొఫెసర్ వాణి అన్నారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, ముఖ్య కార్యదర్శి ఆదేశాలతో ఆమె బుధవారం గాంధీ ఆస్పత్రిని ఆకస్మికంగా సందర్శించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వసతులు కల్పించి, నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు ఉద్దేశించిన బ్రాండింగ్ ప్రక్రియను ప్రారంభించినట్లు వివరించారు. టీజీఎంఎస్ఐడీసీ అధికారులు, గాంధీ పాలనయంత్రాంగంతో కలిసి అవుట్ పేషెంట్ విభాగంలోని రిజిస్ట్రేషన్, ఫార్మసీ కౌంటర్లు, ఆయుష్మాన్‌భారత్ (అభా) నమోదు, రోగుల టాయిలెట్లు, ఏఏ విభాగాలు ఎక్కడ ఉన్నాయో తెలిపే సైన్‌బోర్డుల ఏర్పాటు తదితర అంశాలపై ఆరా తీశారు. ఓపీ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి పాత టైంటేబుల్‌తో ఉన్న బోర్డులను అప్పటికప్పుడే తొలగించారు. సెంట్రల్ ల్యాబ్, సీటీ స్కానింగ్ వద్ద గర్భిణులు, మహిళలు పెద్ద సంఖ్యలో బారులు తీరిన దృశ్యాన్ని చూసిన ఆమె తక్షణమే ఆయా ప్రాంతాల్లో బెంచీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఓపీ విభాగంలో అనేక సమస్యలు ఉన్నా వాటిని పరిష్కరించేందుకు కృషి చేయకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

త్వరలోనే స్పెషల్ ఆఫీసర్ నియామకం

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఆదేశాలతో గాంధీ ఆస్పత్రిలో త్వరలోనే స్పెషల్ ఆఫీసర్‌ను నియమిస్తామని అడిషనల్ డీఎంఈ వాణి స్పష్టం చేశారు. స్పెషల్ ఆఫీసర్ నియామకంతో అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. గాంధీ పాలనయంత్రాంగం, వైద్యులు, మీడియా కలిసి నిరుపేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తామన్నారు. గాంధీకి మీరే స్పెషల్‌ఆఫీసర్‌గా వస్తారా అని మీడియా ప్రశ్నించగా, ఉన్నతాధికారుల ఆదేశాలు పాటిస్తానన్నారు. కార్యక్రమంలో గాంధీ సూపరింటెండెంట్ సీహెచ్ ఎన్ రాజకుమారి, ఆర్ఎంఓ–1 శేషాద్రి, అనస్థీషియా ప్రొఫెసర్ కిరణ్ మాదల, ఆర్ఎంఓలు సుధార్‌సింగ్, రజనీలతో పాటు పలువురు వైద్యులు, అధికారులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

మంత్రి తుమ్మలకు విన్నవించిన హౌసింగ్ సొసైటీ నేతలు

పంజగుట్ట: జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని కోరుతూ ది జర్నలిస్టు కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ పాలకవర్గం రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వినతిపత్రం అందించింది. ఈ మేరకు సొసైటీ అధ్యక్షుడు బ్రహ్మండభేరి గోపరాజు నాయకత్వంలో ఉపాధ్యక్షుడు ఎం.లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి రవీంద్రబాబు, కోశాధికారి భీమగాని మహేశ్వర్ గౌడ్, డైరెక్టర్ కమలాకరాచార్య బుధవారం మంత్రి తుమ్మలను కలిశారు. జర్నలిస్టుల ఇండ్ల స్థలాలు, తాజా సుప్రీంకోర్టు తీర్పు, ప్రస్తుత పరిస్థితుల గురించి చర్చించారు. 1964లో ఏర్పడిన సొసైటీ ఇప్పటి వరకు మూడు కాలనీలను ఏర్పాటు చేసుకుని వందలాది మంది జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందించిందని, మరో కాలనీ ఏర్పాటు కోసం 30 ఏళ్లుగా జర్నలిస్టులు ఎదురుచూస్తున్నారని మంత్రికి వివరించారు. సొసైటీ నిధులు, సభ్యుల నుంచి కూడా నిధులు సేకరించి స్థలం కొనుగోలు చేయాలని జనరల్ బాడీ సమావేశం తీర్మానించిన విషయాన్ని మంత్రికి వివరించారు. హౌసింగ్ సొసైటీలో ఉన్న వెయ్యి మంది జర్నలిస్టులకు న్యాయం చేయాలని కోరారు. మంత్రి తుమ్మల స్పందిస్తూ సొసైటీకి, జర్నలిస్టులకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని, స్థలం కొనుగోలుపై అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు.



మంత్రి తుమ్మలను కలిసి వినతిపత్రం ఇస్తున్న హౌసింగ్ సొసైటీ నాయకులు

సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభం

మియాపూర్: మియాపూర్‌లోని సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో ప్రముఖ సినీనటి మృణాల్ ఠాకూర్ సందడి చేసింది. మియాపూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సీఎంఆర్ షాపింగ్ మాల్‌ను పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, సినీనటి మృణాల్ ఠాకూర్ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో 'సంక్రాంతికి వస్తున్నాం'సినిమా ఫేమ్, చైల్డ్ ఆర్టిస్ట్ బుల్‌రాజ్(రేవంత్), కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, నాయకులు రఘునాథ్ రెడ్డి, సీఎంఆర్ అధినేత వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సినీనటి మృణాల్ ఠాకూర్, ఎమ్మెల్యే గాంధీ తదితరులు

వీరనారి చాకలి ఐలమ్మకు హైడ్రా నివాళి



సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ సాయుధ పోరాట వీరవనిత, చిట్యాల (చాకలి) ఐలమ్మ వర్ధంతిని హైడ్రా ప్రధాన కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బహుజనుల ఆత్మగౌరవానికి ఆమె ప్రతీక అని వ్యాఖ్యానించారు. నాటి తెలంగాణ సాయుధ రైతాంగం పోరాటంలో ఐలమ్మ ప్రదర్శించిన ధైర్యసాహసాలు ప్రజాస్వామిక పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచాయని కొనియాడారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి నుంచి విముక్తి కోసం సాగిన సాయుధ పోరాటంలో ఐలమ్మ పాత్ర మరువలేనిదని అన్నారు. కార్యక్రమంలో హైడ్రా అడిషనల్ కమిషనర్ ఎన్.అశోక్ కుమార్, అదనపు సంచాలకులు వర్ల పాపయ్య, అడ్మిన్ ఎస్పీ ఆర్.సుదర్శన్, ఏసీపీలు తిరుమల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అట్టర్ ఫ్లాప్ సినిమాకు బలవంతపు విజయోత్సవాలా?

చంద్రబాబు 'సూపర్ సిక్స్ సూపర్ హిట్' బహిరంగ సభపై వైఎస్ జగన్ ఎద్దేవా



సాక్షి, అమరావతి: 'సూపర్ సిక్స్, సూపర్ సెవెన్.. సినిమా అట్టర్ ఫ్లాప్ అని ప్రజలందరికీ అర్థమైంది. ఇలాంటి అట్టర్ ఫ్లాప్ సినిమాకు అనంతపురంలో బలవంతపు విజయోత్సవాలు చేస్తున్నారు' అంటూ సీఎం నారా చంద్రబాబునాయుడును వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఒక వైపు దారుణమైన పాలన సాగిస్తూ, మరో వైపు మోసం చేస్తూ హామీలన్నీ ఎగ్గొడుతున్నారంటూ ఎత్తిచూపారు. కళ్లార్పకుండా జంకు బొంకు లేకుండా అబద్ధాలు చెప్పడంలో చంద్రబాబు అత్యంత నేర్పరి అంటూ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. చంద్రబాబు చేసిన మోసాలు, చెప్పిన అబద్ధాలు, పొడిచిన వెన్నుపోట్లతో ప్రజల జీవితాలు తగలబడుతుంటే.. రోమ్ నగరం తగలబడిపోతుంటే నీరో చక్రవర్తి ఫిడేల్ వాయిస్తున్నట్టుగా చంద్రబాబు సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ సూపర్ హిట్ అంటూ అనంతపురంలో బలవంతపు సంబరాలు చేసుకుంటున్నారని ఏకి పారేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడారు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలపై 'ఈనాడు'లో ఎన్నికలకు ముందు టీడీపీ కూటమి ఇచ్చిన అడ్వర్టైజ్‌మెంట్ (ప్రకటన)ను.. సూపర్ సిక్స్ సూపర్ హిట్ పేరుతో అనంతపురంలో సభ నిర్వహిస్తున్న సందర్భంగా బుధవారం సంచికలో ఇచ్చిన ఇచ్చిన అడ్వర్టైజ్‌మెంట్‌ను చూపిస్తూ.. వాటిలో ఎగ్గొట్టిన హామీలను ఎత్తిచూపుతూ.. చంద్రబాబు ఏ స్థాయిలో అబద్ధాలు ఆడుతారో, ఏ స్థాయిలో మోసం చేస్తారో చెప్పడానికి ఇదో చిన్న ఉదాహరణ మాత్రమేనంటూ తూర్పారబట్టారు. ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలపై చంద్రబాబు మాట్లాడిన మాటల వీడియోలు, ఆ హామీల అమలు వల్ల ఒనగూరే ప్రయోజనంపై ఇంటింటికీ బాబు ష్యూరిటీ–భవిష్యత్తుకు గ్యారంటీ పేరుతో ఇచ్చిన బాండ్లను, ఇప్పుడు ఆ హామీల అమలు తీరును ఎత్తి చూపుతూ చంద్రబాబు మోసాలను సాక్ష్యాధారాలతో వివరించారు. సూపర్ సిక్స్ హామీలను ఎగ్గొట్టడం, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ.. ఆరోగ్యశ్రీకి మంగళం పాడటం.. యూరియా, ఇతర ఎరువులు దొరక్క రైతుల కష్టాలు.. ఏ పంటకూ గిట్టుబాటు ధర లేక పోవడం, ఉచిత పంటల బీమాను ఎగ్గొట్టడంపై చంద్రబాబు, ఆయన ఎల్లో మీడియా నాణేనికి ఒక వైపు మాత్రమే చెబుతోందని.. మరో వైపు ఏం జరుగుతోందో ప్రజలకు వివరించడానికే మీడియా సమావేశం నిర్వహించాల్సి వచ్చిందన్నారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

ప్రపంచంలో చంద్రబాబులా అబద్ధాలు చెప్పగలిగే నైపుణ్యం ఎవరికైనా ఉందా?

- చంద్రబాబు ఏ స్థాయిలో అబద్ధాలు ఆడతారో, ఏ స్థాయిలో మోసం చేస్తున్నారో చెప్పడానికి ఇదో చిన్న ఉదాహరణ. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్‌పై ఎన్నికలకు ముందు 2024 మే 9న ఈనాడులో ఇచ్చిన ప్రకటనలో యువతకు 20 లక్షల ఉపాధి అవకాశాలు, నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి.. స్కూళ్లకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు, ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు పెట్టుబడి సాయం, ప్రతి ఇంటికీ ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకూ నెలకు రూ.1,500 చొప్పున ఏడాదికి రూ.18 వేలు, మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 50 ఏళ్లకే నెలకు రూ.4 వేల పింఛన్ ఇస్తామని ఆ ప్రకటనలో ప్రచారం చేశారు.
- ఈ రోజు (బుధవారం) అదే ఈనాడులో టీడీపీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రకటన చూస్తే.. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛన్ ప్రస్తావన ఎగిరిపోయింది. ఆడబిడ్డ నిధి నెలనెలా రూ.1500.. ఏడాదికి రూ.18వేలు హామీ మాయమైంది. ఆ స్థానంలోకి 204 అన్న క్యాంటీన్లు వచ్చాయి. నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఎగిరిపోయింది. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రకటనలకు.. ఇప్పుడిచ్చిన ప్రకటనలకు పొంతనే లేదు. బాబు మాదిరిగా కళ్లార్పకుండా అబద్ధాలు ఆడగలిగిన నేర్పరి ప్రపంచంలో మరొక రు ఉంటారా? అన్న క్యాంటీన్లు సూపర్ సిక్స్ హామీల్లో గతంలో ఇచ్చినట్టు మనం అనుకోవాలట!

ఎల్లో గ్యాంగ్ ఏ'మార్పు'లెన్నో..!



గతేడాది శాసనసభ ఎన్నికలముందు సూపర్ సిక్స్ పథకాలంటూ ఈనాడులో ఇచ్చిన యాడ్, తాజాగా ఇచ్చిన యాడ్‌లో తేడాలు ఇవిగో..

నాడు చంద్రబాబు ఏమన్నారో వినండి

(చంద్రబాబు సూపర్ సిక్స్‌పై మాట్లాడిన వీడియోలు ప్రదర్శించారు)

- 'ఒకటే హామీ ఇస్తున్నా. జగన్‌మోహన్‌రెడ్డి పెట్టిన సంక్షేమ కార్యక్రమాలు ఆగిపోవు. ఇంకా మెరుగైన సంక్షేమ కార్యక్రమాలు ఇచ్చి మిమ్మల్ని ముందుకు తీసుకెళ్తామని హామీ ఇస్తున్నా'
- 'రైతులకు సంవత్సరానికి ఇప్పుడిచ్చేది కాకుండా రూ.20 వేలు ఇస్తాం. దీనిని టీడీపీలో నిర్ణయించాం. తల్లికి వందనం కింద ఎంత మంది పిల్లలున్నా ఒక్కొక్కరికీ రూ.15 వేలు.. ఆంక్షలు లేవు.. కటింగ్‌లు లేవు. పూర్తిగా మా ఆడబిడ్డలకు ఇచ్చే బాధ్యత మాది'.
- 'ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం. నేనే డ్రైవర్‌ని.. సేఫ్ డ్రైవర్‌ని. మీరు బస్సు ఎక్కితే.. ఒక్కటే చెప్పండి.. మా చంద్రన్న చెప్పాడు.. నేను ఏ ఊరికి పోవాలన్నా నువ్వు ఏమీ అడగడానికి వీలులేదు. ఇది చంద్రన్న నాకిచ్చిన హక్కు అని గట్టిగా చెప్పండి. ఏమీ భయపడక్కర్లేదు'.
- 'నా ఆడ బిడ్డల కష్టాలు చూసి ఆలోచించా. ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇవ్వాలని ఆలోచించా. మీ ఖర్చులు పెరిగాయి. దుర్మార్గుడు దీపం ఆర్పేస్తున్నాడు. అందుకే మళ్లీ దీపం వెలిగిస్తా. మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తానని మీ అందరికీ హామీ ఇస్తున్నా'.
- 'ప్రతి ఒక్క మహిళను మహా శక్తిగా తయారు చేయాలనేది నా సంకల్పం. కుటుంబ బాధ్యత మీకు అప్పజెప్పాలని నా ఆలోచన. అందుకే ఈ రోజు ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1,500 నేరుగా మీ అకౌంట్‌లో వేస్తాం'.
- 'ఇప్పుడు హామీ ఇస్తున్నా.. ఏపీలోని యువతను ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు అనుసంధానం చేస్తాం. ఇక్కడికి పరిశ్రమలు తెస్తాం. ఉద్యోగాలు ఇస్తాం. రాబోయే ఐదేళ్లలో 20 లక్షల మంది యువతకు ఉద్యోగాలు ఇచ్చే బాధ్యత టీడీపీది. అంతేకాదు నీకు ఉద్యోగం వచ్చే వరకు నెలకు రూ.3 వేల భృతి ఇస్తాం. ఎంత తమ్ముళ్లా.. ఎంత.. రూ.3 వేలు ఇస్తాం'.

చంద్రబాబూ.. ఇవన్నీ మోసాలు కావా?

- ఈ రోజు (బుధవారం) అనంతపురంలో సూపర్‌హిట్ పేరుతో సభ పెట్టావు. ఇప్పుడు నేను అడుగుతున్నాను.. 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1,500 చొప్పున ఏడాదికి రూ.18 వేలు ఇచ్చావా? ఆడబిడ్డ నిధి కింద రెండేళ్లకు రూ.36 వేలు బాకీ పడ్డావు. ఇది మోసం కాదా?
- నిరుద్యోగ యువతకు ఉద్యోగం లేదా నెలకు రూ.3 వేల చొప్పున ఏడాదికి రూ.36 వేలు. రెండేళ్లకు రూ.72 వేలు బాకీ పడ్డావు. అవి ఇవ్వక పోవడం మోసం కాదా? అది నీ సూపర్‌సిక్స్ హామీ కాదా?
- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 50 ఏళ్లకే పెన్షన్ నెలకు రూ.4 వేలు. ఏడాదికి రూ.48 వేలు. రెండేళ్లకు రూ.96 వేలు బాకీ. ఇది మోసం కాదా? పెన్షన్ల సంఖ్య గత ఏడాది మార్చి నాటికి 66,34,742 ఉంటే, ఈ నెలలో మీరు ఇచ్చిన పెన్షన్లు 61,92,864. అంటే దాదాపు 5 లక్షలు కోత. ఇది మోసం కాదా?.
- రాష్ట్రంలో మహిళలు ఎక్కడికి పోవాలన్నా బస్సుల్లో ఫ్రీ (ఉచితం) అన్నావు. కానీ పరిమిత బస్సుల్లోనే అనుమతివ్వడం మోసం కాదా?
- ప్రతి ఇంటికీ ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఫ్రీ (ఉచితం) అన్నావు. కానీ గత ఏడాది ఒక్కటే ఇచ్చావు. ఈ ఏడాది ఒక్కటి కూడా లేదు. అంటే 6 సిలిండర్లకు గాను, కేవలం ఒక్కటే ఇవ్వడం మోసం కాదా?
- పీఎం కిసాన్ కాకుండా రూ.20 వేలు అన్నదాత సుఖీభవ కింద ఇస్తానన్నావు. అలా రూ.40 వేలు ఇవ్వాల్సి ఉండగా, కేవలం రూ.5 వేలు మాత్రమే ఇవ్వడం మోసం కాదా?
- తల్లికి వందనం కింద స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి కోతలు లేకుండా, ఎలాంటి ఆంక్షలు లేకుండా ఏడాదికి రూ.15 వేలు ఇస్తానన్నావు. తొలి ఏడాది రూ.15 వేలు ఎగ్గొట్టావు. రెండేళ్లకు రూ.30 వేలు ఇవ్వాల్సి ఉండగా, 30 లక్షల మందికి ఎగ్గొట్టావు. మిగిలిన వారికి కేవలం రూ.13 వేలు మాత్రమే, ఇంకా చాలా మందికి రూ.8 వేలు మాత్రమే ఇవ్వడం మోసం కాదా?
- గత ప్రభుత్వంలో అమలైన పథకాలు రద్దు చేయడం మోసం కాదా? చేయూత, ఆసరా, సున్నా వడ్డీ, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, తోడు, చేదోడు, ఉచిత పంటల బీమా, విద్యా దీవెన, వసతి దీవెన, పిల్లలకు ట్యాబ్‌ల పంపిణీ రద్దు చేశావు. ఇది మోసం కాదా?
- చంద్రబాబు చెప్పిన అబద్ధాలు, ఆయన చేసిన మోసంతో ప్రజల జీవితాలు తగలబడుతుంటే.. ఆయన సూపర్‌హిట్ పేరుతో బలవంతపు వేడుకలు నిర్వహిస్తుండటం దారుణం.

మేం రాగానే ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఆ మెడికల్ కాలేజీలు

చంద్రబాబు సర్కారు అవినీతికి ప్రభుత్వ నూతన వైద్య కళాశాలల ప్రైవేటీకరణ పరాకాష్ట అని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. సూపర్ స్పెషాలిటీ వసతులతో ప్రజలకు అత్యుత్తమ వైద్యం అందించే లక్ష్యంతో ప్రభుత్వ ఆధ్వర్యంలో తాము చేపట్టిన కొత్త మెడికల్ కాలేజీలను కమీషన్లకు ఆశపడి తన మనుషులకు చంద్రబాబు దోచిపెడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు అమ్మేసే టెండర్లలో ఎవరూ పాల్గొనవద్దంటూ హెచ్చరించారు. ఒకవేళ టెండర్లలో ఎవరైనా పాల్గొని ఆ మెడికల్ కాలేజీలను చేజిక్కించుకున్నా.. తాము అధికారంలోకి రాగానే వాటిని రద్దు చేస్తామని స్పష్టం చేశారు. మళ్లీ ఆ మెడికల్ కాలేజీలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని నిర్వహిస్తుందని పునరుద్ఘాటించారు. సంపద సృష్టిస్తాననే హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబు ప్రజల ఆస్తులను పప్పు బెల్లాల్లా అమ్మేసే కుంభకోణానికి పాల్పడుతూ సొంత ఆస్తులు పెంచుకుంటున్నారంటూ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. 2019 నాటికే మూడు సార్లు సీఎంగా పనిచేసి ఒక్కటంటే ఒక్క ప్రభుత్వ వైద్య కళాశాలను కూడా ఏర్పాటు చేయని చంద్రబాబు ఇప్పుడు తమ ప్రభుత్వంలో చేపట్టిన కొత్త కళాశాలలను ఏకంగా అమ్మేస్తున్నారని, వైద్య ఆరోగ్య రంగాన్ని నిర్వీర్యం చేశారని దుయ్యబట్టారు. కూటమి సర్కారు ఆరోగ్యశ్రీకి రూ.నాలుగు వేల కోట్లు బిల్లులు బకాయిలు పెట్టడంతో నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో రోగులకు సేవలు అందడం లేదని.. ఈ పథకం కోసం ఏటా రూ.3,600 కోట్లు ఇవ్వటానికి మనసురాని చంద్రబాబు రూ.25 లక్షల ఇన్సూరెన్స్‌కు ప్రీమియం కింద రూ.ఐదారు వేల కోట్లు కడతారా? ఇదంతా డ్రామా కాదా? అని నిలదీశారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఎరువులు అందిస్తే ఏ రైతూ రోడ్డెక్కడు

'ఖరీఫ్‌లో ఇప్పటికే రైతులకు 6.65 లక్షల టన్నుల యూరియా సరఫరా చేశామని, గతేడాది కంటే 97 వేల టన్నులు అధికంగా అందించామని మీరు గొప్పగా ప్రకటనలు చేస్తున్నారు. నిజంగా ప్రభుత్వం అవసరమైన మేరకు యూరియా, ఎరువులు అందించి ఉంటే రాష్ట్రంలో ఏ రైతూ రోడ్డెక్కడు కదా?' అని సీఎం చంద్రబాబు నాయుడును వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూటిగా ప్రశ్నించారు. చంద్రబాబు ప్రకటన (వీడియో ప్లే చేశారు) చూస్తుంటే ఆశ్చర్యం వేసిందన్నారు. రైతులకు అందించాల్సిన ఎరువులు, యూరియాను దారి మళ్లించి బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు అమ్ముతూ అధికార పార్టీ నేతలు కుంభకోణాలకు పాల్పడుతున్నారని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఈ కుంభకోణంలో చంద్రబాబు కూడా భాగస్వామి అని దునుమాడారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ జగన్ బుధవారం మీడియాతో మాట్లాడారు. ఎరువులు దొరక్క, గిట్టుబాటు ధర దక్కక రైతులు పడుతున్న ఇబ్బందులను ఆధారాలతో ఎత్తిచూపుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతుల సంక్షేమం కోసం తెచ్చిన విప్లవాత్మక పథకాలను గుర్తు చేస్తూ చంద్రబాబు సర్కార్ తీరును కడిగి పారేశారు.

క్లుప్తంగా...

శ్రీవారి మేల్‌చాట్ వస్త్రాలకు రూ.43.45 లక్షలు విరాళం

తిరుమల: తిరుమల శ్రీవారికి ఏడాది పాటు వినియోగించే 55 సెట్ల మేల్‌చాట్ వస్త్రాలకు అయ్యే రూ.43.45 లక్షలను బుధవారం వారణాసికి కాశీమఠం మఠాధిపతి శ్రీమద్ సమ్యమీంద్ర తీర్థ స్వామీజీ మార్గదర్శకత్వంలో ఆ మఠం ప్రతినిధి, కె.నారాయణ షెనోయ్ అనే భక్తుడు బుధవారం విరాళంగా అందించారు. ఈ విరాళానికి సంబంధించిన డీడీని శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి పాల్గొన్నారు.



'మద్దిరాల'కు డాక్టర్ యలవర్తి నాయుడమ్మ అవార్డు

- ప్రదానం చేసిన తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలికి చెందిన విశ్వవిఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ యలవర్తి నాయుడమ్మ స్మారక అవార్డు ప్రదానోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. డాక్టర్ యలవర్తి నాయుడమ్మ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇక్కడి తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఏర్పాటైన ప్రత్యేక సభకు ఫౌండేషన్ చైర్మన్ యడ్లపాటి రఘునాథబాబు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరయ్యారు. ఆర్థికరంగ నిపుణుడు, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆర్థిక వ్యవహారాల విభాగం కార్యదర్శి నాగరాజు మద్దిరాలకు డాక్టర్ నాయుడమ్మ అవార్డును తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రదానం చేశారు. అనంతరం నాగరాజు మద్దిరాల దంపతులను సత్కరించారు. డాక్టర్ నాయుడమ్మపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు.

భావ ప్రకటన స్వేచ్ఛ ప్రాథమిక హక్కు

ఆ హక్కుకు ఎవరూ విఘాతం కల్పించలేరు: వైఎస్ జగన్

సాక్షి, అమరావతి : ఫ్రీడమ్ ఆఫ్ ఎక్స్‌ప్రెషన్ (భావ ప్రకటనా స్వేచ్ఛ) అందరికీ రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని, ఆ హక్కుకు ఎవరూ విఘాతం కల్పించలేరని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ స్పష్టం చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం మీడియా ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన స్పందించారు. సోషల్ మీడియా అంశం రాష్ట్ర పరిధిలో లేదని గుర్తు చేశారు. అది పూర్తిగా కేంద్రం పరిధిలో ఉన్నందున దాన్ని నియంత్రించేలా రాష్ట్ర ప్రభుత్వం చట్టం చేయడం సాధ్యం కాదని తేల్చి చెప్పారు. గతంలో ఆ చట్టం (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్-2000)లోని సెక్షన్-66-ఏ కు కేంద్రం ఒక సవరణ చేస్తే.. దాన్ని సుప్రీంకోర్టులో శ్రేయ సింఘాల్ సవాల్ చేశారని గుర్తు చేశారు. ఆ కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇస్తూ.. ఆ సవరణ వల్ల రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)ఏ లోని భావ ప్రకటనా స్వేచ్ఛకు విఘాతం కలుగుతుందని, భావప్రకటన స్వేచ్ఛ అందరి హక్కు అని స్పష్టం చేసిందని వివరించారు. అసెంబ్లీలో తగినంత సమయం ఇస్తేనే ప్రజా సమస్యలు ప్రస్తావించగలుగుతామని మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. 'అసెంబ్లీలో ఉన్నది ఒకటే ప్రతిపక్షం. అది మాదే. అయినా మాకు ప్రతిపక్ష గుర్తింపు ఇవ్వడం లేదు. ఆయనకు అది ఇష్టం లేదు. అందుకు కారణం ప్రజల సమస్యలు కనిపించకూడదు.. ప్రజల గొంతు వినిపించకూడదు అనేదే ఆయన ఉద్దేశం' అంటూ సీఎం చంద్రబాబుపై ధ్వజమెత్తారు. 'మమ్మల్ని ప్రతిపక్షంగా ఎందుకు గుర్తించడం లేదన్న దానిపై హైకోర్టులో విచారణ పెండింగ్‌లో ఉంది. దానికి ఇప్పటికీ స్పీకర్ సమాధానం చెప్పడం లేదు' అంటూ గుర్తు చేశారు.

కేంద్ర బలగాల పర్యవేక్షణలో స్థానిక ఎన్నికలు జరగాలి

స్థానిక ఎన్నికల్లో అక్రమాలకు ఈవీఎంలు పరిష్కారం కాదని.. మొన్న పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ఏం జరిగిందో చూశామని వైఎస్ జగన్ అన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడి పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో పోలీసుల ద్వారా రిగ్గింగ్ చేయించిందని ఎత్తి చూపారు. కేంద్ర బలగాల పర్యవేక్షణలో స్థానిక సంస్థలు నిర్వహిస్తేనే పారదర్శకంగా జరుగుతాయని పునరుద్ఘాటించారు.

మైనార్టీ గురుకులాల్లో తగ్గుతున్న విద్యార్థులు

- రెండునెలల్లో భారీగా తగ్గిన విద్యార్థులు
- ఒక్కో పాఠశాలలో సగటున 12 శాతం తగ్గినట్లు అంచనా
- విద్యార్థుల హాజరు తగ్గుదలను తీవ్రంగా పరిగణిస్తున్న సొసైటీ
- పాఠశాల, కళాశాల ప్రిన్సిపాళ్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసిన కార్యదర్శి
- సంతృప్తికర వివరణ ఇవ్వాలని ఆదేశం.. లేకుంటే కఠిన చర్యలని హెచ్చరిక

సాక్షి,హైదరాబాద్: తెలంగాణ మైనార్టీ గురుకుల విద్యా సంస్థల్లో విద్యార్థుల సంఖ్య భారీగా తగ్గుతోంది. వందశాతం ప్రవేశాలు కల్పించాలంటూ ఒకవైపు మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాళ్లకు సొసైటీ అధికారులు పదేపదే సూచనలు చేస్తుండగా.. ఇప్పటికే అడ్మిషన్లు పొందిన పలువురు పిల్లలు ఇంటిబాట పడుతున్నారు. ఒకసారి ఇంటికి వెళ్లిన విద్యార్థులు తిరిగి బడికి రావడం లేదని తెలుస్తోంది. దీంతో హాజరుశాతం క్రమంగా తగ్గుతోంది. తెలంగాణ మైనార్టీ గురుకుల విద్యా సంస్థ (టీఎంఆర్‌ఈఐఎస్) పరిధిలో 206 విద్యా సంస్థలున్నాయి. వీటిలో సగానికి పైబడి జూనియర్ కాలేజీ వరకు కొనసాగుతున్నాయి. కాగా, కొంతకాలంగా ఈ విద్యా సంస్థల్లో ప్రవేశాలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో 2025–26 విద్యా సంవత్సరంలో వందశాతం ప్రవేశాలు కల్పించాలన్న లక్ష్యంతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించగా.. ఇప్పటికే ప్రవేశాలు పొందిన విద్యార్థులు తిరుగుముఖం పడుతుండటం ఆయా గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లకు సవాలుగా మారింది. ఈ ఏడాది జూన్ 30వ తేదీ నుంచి ఆగస్టు 30వ తేదీ వరకు ఉన్న విద్యార్థుల వివరాలను ఇటీవల సొసైటీ అధికారులు పరిశీలించగా, చాలా పాఠశాలల్లో విద్యార్థుల డ్రాపౌట్లు భారీగా పెరిగాయని వెల్లడైంది. ఒక్కో పాఠశాలలో సగటున 10 శాతం నుంచి 20 శాతం మేర హాజరుశాతం తగ్గిందని తేలింది. దీంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సొసైటీ అధికారులు క్షేత్రస్థాయిలో ప్రిన్సిపాళ్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

వివరణ ఇవ్వకుంటే కఠిన చర్యలు..

టీఎంఆర్‌ఈఐఎస్ పరిధిలో 206 గురుకుల విద్యా సంస్థలుండగా.. వీటిలో దాదాపు 165 విద్యా సంస్థల ప్రిన్సిపాళ్లకు సొసైటీ కార్యదర్శి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఒకవైపు వందశాతం ప్రవేశాల లక్ష్యాన్ని నిర్దేశిస్తే.. మరో పక్క చాలాచోట్ల డ్రాపౌట్లు ఉండడం, ప్రవేశాల సంఖ్య సంతృప్తికరంగా లేకపోవడంలాంటి కారణాలతో ఈ నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న నాలుగు రోజుల్లో స్పష్టమైన వివరణ ఇవ్వాలని అందులో సొసైటీ కార్యదర్శి స్పష్టం చేశారు. వివరణ సంతృప్తికరంగా లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో నోటీసులు అందుకున్న ప్రిన్సిపాళ్లు ఇప్పుడు వివరణ పత్రాలతో సొసైటీ కార్యదర్శి కార్యాలయం చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. లిఖితపూర్వక వివరణ ఇచ్చినప్పటికీ.. అవి సంతృప్తికరంగా లేవంటూ సొసైటీ అధికారులు వారిపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో నేరుగా కార్యదర్శిని కలిసేందుకు వారు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇదిలా ఉండగా ఈ వారాంతం నాటికి వారికిచ్చిన గడువు ముగిసిన తర్వాత చర్యలు తీసుకునే అవకాశం ఉందని సొసైటీ అధికారులు చెపుతున్నారు.

కలవరపెడుతున్న బాలికల జనన రేటు తగ్గుదల

దేశంలో ప్రతి వెయ్యిమంది పురుషులకు 917 మంది మహిళలు
గ్రామీణ ప్రాంతాల్లో 914 మంది, పట్టణాల్లో 925 మంది స్త్రీలు
నమూనా గణాంకాలు-2023 నివేదికలో వెల్లడి



సాక్షి, అమరావతి: దేశంలో బాలికల జనన రేటు తగ్గుతుండటం కలవరపాటుకు గురిచేస్తోంది. పట్టణాల్లో కంటే గ్రామీణ ప్రాంతాల్లోనే జనన లింగ నిష్పత్తిలో భేదం కనబడుతోంది. భారత్‌లో సగటున ప్రతి వెయ్యి మంది పురుషులకు 917 మంది మహిళలున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వెయ్యి మంది పురుషులకు 914 మంది స్త్రీలుండగా పట్టణ ప్రాంతాల్లో వెయ్యి మంది పురుషులకు 925 మంది స్త్రీలున్నారు. ఈ మేరకు 2021–2023 మధ్య కాలంలో లింగ నిష్పత్తి గణాంకాలను నమూనా గణాంకాల–2023 నివేదిక తాజాగా వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా గ్రామీణ ప్రాంతాల్లో కంటే పట్టణాల్లోనే లింగ నిష్పత్తి ఎక్కువగా ఉంది. ఏపీలో గ్రామీణ ప్రాంతాల్లో వెయ్యి మంది పురుషులకు 938 మంది స్త్రీలుండగా అదే పట్టణ ప్రాంతాల్లో వెయ్యిమంది పురుషులకు 953 మంది స్త్రీలున్నారు. ఢిల్లీలో గ్రామీణ ప్రాంతాల కన్నా పట్టణాల్లో లింగ నిష్పత్తి చాలా తక్కువగా ఉంది. ఛత్తీస్‌గఢ్‌లో ప్రతి వెయ్యి మంది పురుషులకు అత్యధికంగా 974 మంది స్త్రీలున్నారు. ఆ తరువాత కేరళలో వెయ్యి మంది పురుషులకు 971 మంది స్త్రీలున్నారు. వెయ్యి మంది పురుషులకు 868 మంది స్త్రీలతో ఉత్తరాఖండ్‌లో అత్యల్ప లింగ నిష్పత్తి ఉంది.

దేశంలో రాష్ట్రాల వారీగా ప్రతి వెయ్యి మంది పురుమలకు స్త్రీల సంఖ్య ఇలా..

రాష్ట్రం పేరు	మొత్తం	గ్రామీణ	పట్టణ
దేశంలో	917	914	925
ఛత్తీస్‌గఢ్	974	987	921
కేరళ	971	974	967
హిమాచల్ ప్రదేశ్	958	959	940
ఆంధ్రప్రదేశ్	943	938	953
అసోం	938	936	961
తమిళనాడు	933	923	942
కర్ణాటక	931	936	922
పశ్చిమ బెంగాల్	931	927	944
జమ్మూ-కశ్మీర్	929	927	936
జార్ఖండ్	925	928	913

కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం

ఉత్తరాంధ్రలో పలుచోట్ల వర్షాలు

సాక్షి, అమరావతి: దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో ఉత్తరాంధ్రలో వర్షాలు కురుస్తున్నాయి. ఆ ప్రాంతాల్లో సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఫలితంగా బుధవారం అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో 6.1 సెంటీమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదైంది. తూర్పుగోదావరి జిల్లా పైడిమెట్టలో 4.9, అనకాపల్లి జిల్లా చోడవరంలో 4.8 సెంటీమీటర్ల వర్షపాతం కురిసింది. గురువారం అల్లూరి సీతారామరాజు, ఏలూరు, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో పలుచోట్ల పిడుగులతో కూడిన ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది.

సాక్షి
ఫ్యామిలీ
హైదరాబాద్
గురువారం ॥ 11-9-2025









'నా టైమ్ బాగ లేదు' అనుకున్నాడు తాతయ్య.

ఎందుకంటే ఆయన ఆన్‌లైన్ మోసానికి గురయ్యాడు. దాంతో తీవ్ర నిర్వేదానికి లోనయ్యాడు. ఈ నేపథ్యంలో తన తాతయ్యలాంటి ఎంతో మంది వృద్ధుల కోసం 'షీల్డ్ సీనియర్స్' అనే వెబ్‌సైట్‌ను రూపొందించిన పదిహేడు సంవత్సరాల ఇండియన్-అమెరికన్ తేజస్వి మనోజ్... టైమ్స్ మ్యాగజైన్ 'కిడ్ ఆఫ్ ది ఇయర్-2025' ఘనత సాధించింది. 'ఆన్‌లైన్ మోసానికి గురైతే ఏం చేయాలి...' నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తల వరకు సెమినార్‌లు, తన వెబ్‌సైట్ ద్వారా విస్తృత ప్రచారం చేస్తోంది తేజస్వి.

ఇప్పుడు **తేజస్వి** 'టైమ్' బాగుంది.

ఆమె చెప్పే సాంకేతిక విషయాల గురించి వినడానికి ఆబాలగోపాలం ఆసక్తి కనబరుస్తోంది. టైమ్ మ్యాగజైన్ తేజస్విని 'సర్వీస్ స్టార్'గా కొనియాడింది...

సర్వీస్ స్టార్

● టైమ్స్
కిడ్ ఆఫ్ ది ఇయర్
2025

కాలిఫోర్నియాలో పుట్టి డాలస్‌లో పెరిగింది తేజస్వి మనోజ్. తేజస్వి తల్లిదండ్రులు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌లు. కోడింగ్ అంటే తేజస్వికి ఎంతో ఇష్టం. చాలా చిన్న వయసులోనే కోడింగ్ నేర్చుకోవడం మొదలుపెట్టింది. బొమ్మలతో ఆడుకుందో లేదో తెలియదుగానీ కోడింగ్ ప్రపంచంలో జావా, పైథాన్‌లతో ఆడుకుంది.

కోడింగ్ శక్తి...

'గర్ల్స్ హూ కోడ్' అనే స్వచ్ఛంద సంస్థ సైబర్ సెక్యూరిటీపై నిర్వహించే క్లాసులకు రెగ్యులర్‌గా హాజరయ్యేది తేజస్వి. ఎయిర్ ఫోర్స్, స్పేస్‌ఫోర్స్ ప్రోగ్రామ్ 'సైబర్-పేట్రియాట్'లో చురుగ్గా పాల్గొనేది.

'కోడింగ్ అనేది ఎంతో అద్భుత ప్రక్రియ. కోడింగ్‌ను చాలా ఎంజాయ్ చేస్తాను. కోడింగ్‌ను నేర్చుకోవడం వల్ల దానిశక్తి ఏమిటో తెలుసుకోగలిగాను. భవిష్యత్‌లో కూడా కోడింగ్‌తో నా ప్రయాణం కొనసాగుతుంది' అంటుంది తేజస్వి.

ఎంతోమంది తాతయ్యల కోసం...

గత సంవత్సరం తేజస్వి తాత ఆన్‌లైన్ మోసానికి గురయ్యాడు. మోసగాళ్లు ఆయన నుంచి డబ్బు డిమాండ్ చేశారు. అయితే కుటుంబసభ్యులకు ఈ ఆన్‌లైన్ మోసం గురించి తెలియడంతో వారి ఆటలు సాగలేదు. తాతయ్యకు ఆన్‌లైన్ మోసాల గురించి అవగాహన లేకపోవడం తేజస్విని ఆశ్చర్యపరిచింది. అయితే తన తాత మాత్రమే కాదు ఎంతోమంది వ్యక్తులకు ఆన్‌లైన్ మోసాల గురించి బొత్తిగా అవగాహన లేదనే విషయం తెలుసుకుంది.

అలా అని తేజస్వి బాధపడుతూ కూర్చోలేదు.

'నా వంతుగా ఏదైనా చేయాలి' అని పరిశోధన బాట పట్టింది. సీనియర్ సిటిజన్‌లకు ఆన్‌లైన్ మోసాల గురించి హెచ్చరించడానికి 'షీల్డ్ సీనియర్స్' పేరుతో వెబ్‌సైట్ రూపొందించింది. సైబర్‌సెక్యూరిటీకి సంబంధించిన ప్రాథమిక సూత్రాలను 'షీల్డ్ సీనియర్స్' తెలియజేస్తుంది.

ఆహా... ఆల్‌రౌండర్!



కోడింగ్‌లో అద్భుత ప్రతిభ కనబరుస్తున్న తేజస్వి మనోజ్ వయొలిన్ అద్భుతంగా వాయిస్తుంది. తన ఆర్కెస్ట్రాతో హైస్కూల్‌లో ఎన్నో కచేరీలు చేసింది. కరాటేలో కూడా ప్రవేశం ఉంది. స్కేటింగ్-అమెరికాలో యాక్టివ్‌గా ఉంది. తాజాగా ఈగిల్ స్కౌట్ ర్యాంక్ అందుకుంది. 'వైభ' అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా భూటాన్ కాందిశీకుల పిల్లలకు మ్యాథ్స్, ఇంగ్లీష్ బోధిస్తోంది. సామాజిక సేవాకార్యక్రమాలలో ఎప్పుడూ ముందుంటుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ తనకు ఇష్టమైన సబ్జెక్ట్‌లు. భవిష్యత్‌లో కంప్యూటర్ సైన్స్ చదవాలనుకుంటుంది. 'ఎప్పుడూ ఏదో ఒకటి నేర్చుకోవాలనే ఉత్సాహవంతుల దగ్గరికి విజయాలు ఉత్సాహంగా నడిచొస్తాయి' అని చెప్పడానికి బలమైన ఉదాహరణ తేజస్వి మనోజ్.

స్వతంత్రంగా... సగర్వంగా...

'సీనియర్ సిటిజనులు ఎలాంటి సంకోచం లేకుండా స్వతంత్రంగా, సగర్వంగా ఆన్‌లైన్ ప్రపంచంలో తమ పనులు తాము చేసుకునేలా షీల్డ్ సీనియర్స్'కు రూపకల్పన చేశాం' అంటుంది తేజస్వి.

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కలిగించడానికి తేజస్వి నిర్వహించే సమావేశాలకు ఎంతోమంది వృద్ధులు హాజరవుతుంటారు. ఆమె ప్రసంగిస్తుంటే నోట్స్ రాసుకుంటారు. ప్రసంగం పూర్తయిన తరువాత తేజస్విని రకరకాల సందేహాలు అడుగుతుంటారు. వాటికి ఓపికగా జవాబులు ఇస్తుంటుంది తేజస్వి.

'మాది టెక్ ఫ్యామిలీ' అని ఘనంగా చెబుతుంటాడు తేజస్వి తండ్రి మనోజ్. ఆ ఘనతకు సామాజిక ప్రయోజనాన్ని జోడించి 'డిజిటల్ డిఫెండర్'గా పేరు తెచ్చుకుంది తేజస్వి.

ఉక్కుకవచం... షీల్డ్ సీనియర్స్

'షీల్డ్ సీనియర్స్'లో ఆన్‌లైన్ మోసాలకు సంబంధించిన సందేహాలకు చాట్‌బాట్ ద్వారా సమాధానాలు తెలుసుకోవచ్చు. అనుమానాస్పద టెక్ట్స్, మెజేస్‌లను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా విశ్లేషించుకోవచ్చు. 'షీల్డ్ సీనియర్స్'లో నాలుగు విభాగాలు ఉంటాయి. 'లెర్న్' విభాగంలో ఇంటర్‌నెట్ సెక్యూరిటీకి సంబంధించి ప్రాథమిక విషయాలు తెలుసుకోవచ్చు. స్ట్రాంగ్ పాస్‌వర్డ్స్ రూపొందించుకోవడానికి, ప్రైవసీ సెట్టింగ్స్‌ను అర్థం చేసుకోవడానికి, ఎలాంటి సమాచారం షేర్ చేయవచ్చు, ఏది చేయకూడదు...మొదలైనవి తెలుసుకోవచ్చు. 'ఆస్క్' విభాగంలో చాట్‌బాట్ ద్వారా సందేహ నివృత్తి చేసుకోవచ్చు. 'ఎనలైజ్' అనేది మూడో విభాగం. యూజర్‌లు ఈ ట్యాబ్ క్లిక్ చేసి అనుమానాస్పద టెక్ట్స్, ఈ మెయిల్స్‌ను అప్‌లోడ్ చేయవచ్చు. 'రిపోర్ట్' సెక్షన్‌లో ఆన్‌లైన్ మోసగాళ్లపై ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదులపై స్పందించే 14 ప్రైవేట్, ప్రభుత్వ సంస్థలకు చెందిన లింక్స్ ఇందులో ఉంటాయి.

● మన(సు)లో మాట

సోషల్ మీడియా ఆ ఆనందం కృత్రిమమే!

నాకు పెళ్లయి నాలుగు సంవత్సరాలయింది. మాది మధ్య తరగతి కుటుంబం. నాది ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం, నా భార్య ఓ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తోంది. ఆమెకు ఇతరులతో పోల్చుకునే తత్వం ఎక్కువ. స్నేహితులు, చుట్టాలు సోషల్ మీడియాలో పెట్టే రకరకాల పోస్టులు చూసి వాళ్ళలాగా ఖరీదైన బట్టలు, నగలు కొనుక్కోవాలి, రెస్టారెంట్లుకి తరచు వెళ్ళాలి, విలాసవంతమైన లైఫ్ గడపాలి అని నన్ను ఇబ్బంది పెడుతుంటుంది. అందుకోసం అప్పులు చేస్తుంది. నాతో కూడా అప్పులు చేయించింది. హోటల్‌కు కానీ, టూర్‌కి కానీ వెళ్లినా, అక్కడి ఫుడ్‌ని, ప్లేస్‌ని ఎంజాయ్ చేయకుండా తన ఆలోచన అంతా ఫోటోలు తీయడం, వెంటనే వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం మీదే ఉంటుంది. ఆ తర్వాత వాటికి ఎన్ని లైక్‌లు, కామెంట్స్ వచ్చాయని చూసుకోవడం... రోజంతా ఇదే సరిపోతుంది. ఆమె పైన ఉన్న ప్రేమతో ఇప్పటిదాకా నేను సహించాను కానీ ఇక నావల్ల కావట్లేదు. ఆమె పద్ధతి మార్చే మార్గముంటే చెప్తారని ఆశిస్తున్నాను.

– **శ్రీకుమార్,** విశాఖపట్టణం

సోషల్ మీడియాలో చూసి ఇతరులతో పోల్చుకుంటూ వాళ్లలా ఉండటం కోసం అప్పులు చేస్తూ ఆర్థిక క్రమశిక్షణ పాటించకపోతే కుటుంబాలు ఎలా ఛిన్నాభిన్నమవుతాయో చెప్పడానికి మీ జీవితమే ఒక ఉదాహరణ. ప్రపంచంలోని వేరు వేరు ప్రాంతాల్లోని వారు కనెక్టవడం కోసం, స్నేహితులు, బంధువులతో మన సంతోషాలు, బాధలు పంచుకోవడం కోసం, సోషల్ మీడియా ఒక ప్లాట్‌ఫాం లాగా ఉపయోగపడుతుంది. అయితే చాలామంది వాస్తవ జీవితానికి దూరంగా, డిజిటల్ లైఫ్‌లోనే బతుకుతూ, సోషల్ మీడియా మాయలో పడి వింత వింతగా ప్రవర్తిస్తుంటారు. ముఖ్యంగా నల్గురితో ఫ్రీగా కలవలేనివారు, ఆత్మన్యూనతతో బాధపడేవారు, జీవితంలోని ప్రత్యేక సంఘటనలను ఫిల్టర్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసి, వాటికి వచ్చే కామెంట్స్, లైక్స్ చూసుకుని ఒక 'ఫేక్ సక్సెస్'(కృత్రిమ విజయం)ని ఆనందిస్తున్నారు. ఎవరి జీవితాల్లోనూ అన్నీ సంతోషాలే ఉండవు. తమ బాధలను, కష్టాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయరు, కేవలం సక్సెస్ సోరీస్' మాత్రమే పోస్ట్ చేస్తుంటారు. అది చూసి ఇతరులు కూడా తమ బాధలను పక్కన పెట్టి సక్సెస్‌ను మాత్రమే పోస్ట్ చేయాలన్న తాపత్రయంతో ఇలాంటివి పోస్ట్ చేసి కృత్రిమ ఆనందాన్ని పొందుతుంటారు. సోషల్ మీడియాలో చూసేవన్నీ నిజమని నమ్మి మీ భార్యలాంటి చాలామంది లేనిపోని ఆర్భాటాలకు పోయి ఇలా అప్పుల పాలవుతున్నారు. కుటుంబంతో కలిసి బయటకు వెళ్ళటం, సరదాగా ప్రయాణాలు చేయాలనుకోవటం తప్పేం కాదు, కానీ మన స్థోమతని బట్టి అందుబాటులో ఉన్న ప్రదేశాలకి వెళ్ళడం.. అలా వెళ్ళే ప్రదేశమేదైనా కానీ అక్కడ అందరూ సరదాగా గడిపిన క్షణాలు, కబుర్లే మనకు మర్చిపోలేని తీపి జ్ఞాపకాలని గుర్తుంచుకోవాలి. నిజమైన సంతోషం అంటే లాంగ్‌టూర్లు, కాస్ట్‌లీ రెస్టారెంట్లూ కాదు, మనవారితో గడిపే సంతోష క్షణాలే! మీరిద్దరూ కలిసి, ఒకసారి మానసిక వైద్యనిపుణుని కలిస్తే ఆమెకేమైనా వ్యక్తిత్వ సమస్యలు, ఇతర మానసిక ఇబ్బందులు ఉంటే, పరీక్షించి, వాటికి తగిన కౌన్సెలింగ్, చికిత్స ఇస్తారు. మీరు కూడ ఇక ఆర్థిక క్రమశిక్షణ పాటించండి. త్వరలోనే అన్నీ సర్దుకుంటాయని ఆశిద్దాం! ఆల్ ది బెస్ట్!



డా. ఇండ్ల విశాల్ రెడ్డి, సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ.
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ: sakshifamily3@gmail.com



● న్యూస్‌మేకర్

వెనిస్‌లో గెలిచింది

వెనిస్ నగరంలో ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 6 వరకు జరిగిన వెనిస్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో మన యువ దర్శకురాలు అనుపర్ణా రాయ్ అవార్డు గెలుచుకుంది. మొదటి, రెండవ దర్శకత్వ సినిమాల కేటగిరి 'ఒరిజోంటి' కేటగిరిలో తన మొదటి సినిమా 'సాంగ్స్ ఆఫ్ ఫర్‌గాటెన్ ట్రీస్'కు ఆమె అవార్డు గెలుచుకుంది. అనురాగ్ కశ్యప్ సమర్పించిన సినిమా ఇది. అనుపర్ణ పరిచయం.

'స్త్రీల లోపల ఉండే ఖాళీలు స్త్రీలకే తెలియవు. ఆ ఖాళీలు ఏ విధాన పూరింపబడతాయో కూడా తెలియదు. స్త్రీలు తమలో తాము చేసే అంతర్గత ప్రయాణానికి వీలు ఉండదు. అలాంటి ఇద్దరు స్త్రీలు తమను తాము తెలుసుకోవడమే కాక ఒకరినొకరు అర్థం చేసుకునే ప్రయత్నమే నేను తీసిన సాంగ్స్ ఆఫ్ ఫర్‌గాటెన్ ట్రీస్ సినిమా' అంది అనుపర్ణా రాయ్.

29 ఏళ్ల అనుపర్ణా రాయ్ ఇటీవల వెనిస్‌లో జరిగిన వెనిస్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో అందరి దృష్టి ఆకర్షించింది. ఆమె దర్శకత్వం వహించిన 77 నిమిషాల 'సాంగ్స్ ఆఫ్ ఫర్‌గాటెన్ ట్రీస్' హిందీ సినిమా మూడు షోస్ వేస్తే హౌస్‌ఫుల్‌గా నడిచాయి. అందరూ ఆమెను ప్రశంసించారు. ఈ ఫిల్మ్ ఫెస్టివల్‌లో మొదటిసారి దర్శకత్వం వహించే సినిమాల విభాగం 'ఒరిజోంటి'లో ఈ సినిమా సెలక్ట్ కావడమే గొప్ప అనుకుంటే అవార్డు గెలవడం మరింత గొప్ప. ఆ విధంగా అనుపర్ణా రాయ్ చరిత్ర సృష్టించింది. వివిధ దేశాల నుంచి 19 సినిమాలు ఎంట్రీ పొందిన ఈ విభాగంలో మన భారతీయ చిత్రం 'సాంగ్స్ ఆఫ్ ఫర్‌గాటెన్ ట్రీస్'కు అవార్డు దక్కడం దేశంలో యువ ప్రతిభకు లోటు లేదనే విషయాన్ని నిరూపిస్తోంది. సినీ రంగంలో మహిళల సృజనకు తార్కాణంగా నిలుస్తోంది.

కథ ఏమిటి?

'సాంగ్స్ ఆఫ్ ఫర్‌గాటెన్ ట్రీస్' కథ ముంబైలో జరుగుతుంది. ముంబైకి వలస వచ్చిన ఔత్సాహిక నటి తోయ, సేల్స్ రంగంలో పని చేసే శ్వేత ఒక అపార్ట్‌మెంట్‌లో రూమ్‌మేట్స్‌గా కలిసి జీవిస్తూ ఉంటారు. తోయకు నటిగా అవకాశాలు రావు. అందువల్ల తప్పనిసరై సెక్స్ వర్క్ చేయాల్సి ఉంటుంది. అలాగే శ్వేతకు ఎదురుపడుతున్న పురుషులు ఆమెను అర్థం చేసుకోవడంలో విఫలమవుతుంటారు. ఈ క్రమంలో తోయ, శ్వేత ఒకరికొకరు తోడవుతారు. ఉద్వేగాలను అర్థం చేసుకొని ఎమోషనల్ సపోర్ట్ ఇచ్చుకుంటారు. వారి మధ్య ప్రేమ ఏర్పడుతుంది. అయితే తోయ చేసే సెక్స్‌వర్క్ ఇరుగు పొరుగుకు తెలిసి చివరకు ఫ్లాట్ ఖాళీ చేయాల్సి వస్తుంది. ఆమెతో పాటు శ్వేత కూడా బయటకు నడవడంతో సినిమా ముగుస్తుంది. అయితే ఇప్పుడు వారు ఒంటరి కాదు. ఒకరికి ఒకరు ఉన్నారు. అదీ తేడా. ఈ కథంతా అపార్ట్‌మెంట్‌లోని వంట గదిలో, డ్రాయింగ్ రూమ్‌లో, కిటికీ దగ్గర, కారిడార్లలో జరుగుతుంది. స్త్రీలకు దొరికే ఈ మాత్రపు స్థలంలోనే వారు ఏ విధంగా జీవితాలను నిభాయించుకుంటారో దర్శకురాలు చూపుతుంది.

బెంగాల్ అమ్మాయి

అనుపర్ణా రాయ్ పశ్చిమ బెంగాల్‌లోని పురూలియా జిల్లాలో పుట్టి పెరిగింది. మాస్ కమ్యూనికేషన్ చదివి ఢిల్లీలో కాల్ సెంటర్‌లో పని చేసింది. 2022లో ముంబైకి వలస వచ్చింది. దర్శకురాలిగా ఆమెకు ఎటువంటి శిక్షణ లేదు. చిన్నప్పుడు సినిమా హాలుకు వెళ్లడం కూడా కష్టమయ్యేది. కాలేజీ వయసులోనే సినిమా అంటే ఏమిటో పైరెటెడ్ సినిమాలను తన లాప్‌టాప్‌లో చూసి తెలుసుకుంది. 'రన్ టు ది రివర్' అనే షార్ట్ ఫిల్మ్ తర్వాత 'సాంగ్స్ ఆఫ్ ఫర్‌గాటెన్ ట్రీస్' తీయాలనుకుంది. అయితే ఇందుకు ఆమె దగ్గర డబ్బు లేదు. కొద్దిపాటి ఫండ్ దొరికితే తన అద్దె ఫ్లాట్‌లోనే ఇద్దరు ముఖ్యపాత్రధారులను తనతోపాటు ఉంచుకుని సినిమా తీసింది. తర్వాత అనురాగ్ కశ్యప్ ఈ సినిమాను మెచ్చి సమర్పకుడిగా వచ్చాడు. దాంతో సినిమా వెనిస్‌కు చేరింది. అవార్డు కూడా సాధించింది.

అంతా రాజకీయమే

'చిన్నప్పుడు నాకో స్నేహితురాలు ఉండేది. దళితురాలు. ఆమె పేరు ఝూమా దాస్. ఆమెతో మాట్లాడవద్దని మా నాన్న చెప్పాడు. అలా ఆ స్నేహం వదులుకున్నాను. కాని ఆ పని చేసినందుకు మా నాన్నను ఇప్పటికీ క్షమించలేకపోతున్నాను. ఝూమా దాస్‌కు చిన్న వయసులోనే పెళ్లయ్యింది. దానికి కారణం పెళ్లి ఖర్చు భరించే ప్రభుత్వ పథకమే. ప్రభుత్వాలు ఆడపిల్లల పెళ్ళిళ్లకు డబ్బు ఇవ్వడం కన్నా వారి చదువుకు డబ్బు ఇవ్వాలి. తక్కువ కులాల ఆడపిల్లల ఎదుగుదలను పట్టించుకోక వారిని త్వరగా వదిలించుకోవడానికి ప్రభుత్వం చేసే ప్రయత్నమే పెళ్లి ఖర్చు భరించడం. స్త్రీలు ఎన్నో సంఘర్షణలు ఎదుర్కొంటూనే ఉన్నారు. వారి కథలు నాలో నిండిపోయి ఈ సినిమాగా బయటకు వచ్చాయి' అని తెలిపింది అనుపర్ణ రాయ్.

● నైట్ ఈటింగ్ సిండ్రోమ్

ఈశ్వర్ తిండి అలవాట్లు ఇటీవల చాలా విచిత్రంగా మారాయి. ఈమధ్య రాత్రి భోజనం కాగానే వెంటనే నిద్రపట్టడం లేదు. కాసేపాగాక ఏదైనా తిందామంటూ మాటిమాటికీ ఫ్రిజ్ తెరచి చూస్తుంటాడు. రాత్రిపూట ఆకలేయడం గుర్తుకొచ్చి ప్రతిరోజూ రాత్రి తినడం కోసం చిప్స్ అనీ, కారా అనీ... ఏదో ఒక రకమైన శ్నాక్స్ తెచ్చుకుంటూ ఉంటాడు. కొన్నిసార్లు ముందుగానే స్వీట్స్ కూడా తెచ్చిపెట్టుకుంటాడు. రాత్రి రెండు గంటలయినప్పటికీ ఆ టైమ్‌లోనైనా తింటే తప్ప నిద్రపట్టదు. ఇలా రాత్రి తినేయడంతో పొద్దున్న బ్రేక్‌ఫాస్ట్ టైమ్‌కు అంతగా ఆకలేయదు. ఈ అలవాటు వల్ల ఇటు ఆహారపు అలవాట్లూ, అటు నిద్రవేళలూ ఈ రెండూ అస్తవ్యస్తంగా మారాయి. ఎట్టకేలకు డాక్టర్‌ను సంప్రదిస్తే ఇది ఒకరకమైన రుగ్మత అనీ దీని పేరే 'నైట్ ఈటింగ్ సిండ్రోమ్-(ఎన్‌ఈఎస్)' అనీ తెలిసింది. ఈ అనారోగ్య సమస్యపై అవగాహన కోసమే ఈ కథనం...

ఆరోగ్యాన్ని తినేస్తుంది!





సి. మంజులా రావ్
క్లినికల్ సైకాలజిస్ట్

ఈ కేస్ స్టడీలో ఈశ్వర్ అంతగా పట్టించుకోలేదుగానీ... ఈ అలవాటు అదే పనిగా కొనసాగుతుండటంతో కొన్ని ఇబ్బందులు వచ్చిపడుతుంటాయి. పెందరాళే నిద్రలేవలేకపోవడంతో ఆఫీసులో మందకొడిగా మారిపోవడం, అర్ధరాత్రి తినేసి ఉండటంతో బ్రేక్‌ఫాస్ట్ టైమ్‌కు ఆకలి లేకపోవడం... దాంతో పగలు భోజన వేళలు తప్పడం వంటి అనర్థాలు ఏర్పడతాయి. దాంతో దీర్ఘకాలంలో ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదమూ ఉంటుంది.

గుర్తించడం ఎలా...

● రాత్రిళ్లు వారంలో కనీసం నాలుగు నుంచి ఐదు రాత్రులు నిద్రలేకపోవడం ● ఉదయం లేచాక ఆకలి లేకపోవడం ● రాత్రి భోజనం తర్వాత ఎంతకీ నిద్రపట్టకపోతే నిద్రపట్టాలంటే మళ్లీ ఏదోటి తినక తప్పదని అనుకుంటూ ఉండటం ● ఒకలాంటి డిప్రెషన్ మూడ్... సాయంత్రాలు ఈ ఫీలింగ్ మరింత ఎక్కువ.

ఇలాంటిదే మరో సమస్య...

బింజ్ ఈటింగ్ డిజార్డర్ అనే మరో సమస్య కూడా ఉంది. 'నైట్ ఈటింగ్ సిండ్రోమ్' కంటే ఇది కాస్త వేరుగా ఉంటుంది. బింజ్ ఈటింగ్ డిజార్డర్‌లో బాధితులు ఏమాత్రం గ్యాప్ లేకుండా అదే పనిగా తినేస్తుంటారు. కానీ నైట్ ఈటింగ్ సిండ్రోమ్‌లో బాధితులు అదేపనిగా కాకుండా కొద్ది కొద్ది మొత్తాల్లో తింటుంటారు.

'నైట్ ఈటింగ్ సిండ్రోమ్'కు కారణాలు... ఈ సమస్యకు కారణం ఇదమిత్థంగా తెలియదు. డాక్టర్ల అంచనా ప్రకారం నిద్రపోవడానికి – నిద్రలేవడానికి తోడ్పడే నిద్ర సైకిల్‌లో అస్తవ్యస్తతతో పాటు కొన్ని హార్మోన్ల అసమతౌల్యత వల్ల ఇలా జరుగుతుంది. స్థూలకాయుల్లో ఇది కనిపించడంతో పాటు డిప్రెషన్, యాంగ్జైటీతో బాధపడేవారిలో ఇది సాధారణంగా కనిపిస్తుంటుంది. సాధారణంగా నైట్ ఈటింగ్ సిండ్రోమ్ సమస్య ప్రతి వందమందిలో ఒకరిలో కనిపిస్తుంటుంది. ఒకవేళ స్థూలకాయుల్లోనైతే ప్రతి 10 మందికి ఒకరిలో కనిపిస్తుంది. ఇక ఈ సమస్యకూ జన్యుపరమైన అంశాలకూ సంబంధముందని వైద్యపరిశోధకులు చెబుతున్నారు. బాడీ క్లాక్‌ని నియంత్రించే 'పీఈఆర్-1' అనే జన్యువులోని లోపం కారణంగా ఈ సమస్య ఉత్పన్నమవుతుందన్నది శాస్త్రవేత్తల మాట.

నిర్ధారణ పరీక్షలు: ● బాధితులు తిండి, నిద్ర అలవాట్ల గురించి డాక్టర్లు తెలుసుకోవడం ● పాలీసోమ్నోగ్రఫీ అనే పరీక్ష సహాయంతో మెదడులోని తరంగాలు, ఆక్సిజన్ మోతాదులు, గుండె స్పందనల, శ్వాస తీసుకునే రేటు వంటి పరీక్షల సహాయంతో డాక్టర్లు ఈ సమస్యను నిర్ధారణ చేస్తారు.

ఆరోగ్యంపై ఎన్‌ఈఎస్ దుష్ప్రభావాలు... ఎన్‌ఈఎస్‌కూ స్థూలకాయానికీ సంబంధం ఉందని తెలుసుగానీ... స్థూలకాయం వల్లనే ఈ ఎన్‌ఈఎస్ వస్తుందా అన్న విషయం ఇంకా వైద్యనిపుణులకు తెలియరాలేదు. అయితే వీళ్లలో చాలామందికి స్థూలకాయం ఉంటుంది కాబట్టి ఒబేసిటీ వల్ల వచ్చే అన్ని రకాల దుష్ప్రభావాలూ ఎన్‌ఈఎస్‌లో కనిపించడానికి అవకాశముంది. ఇక కొందరిలోనైతే ఈ ఎన్‌ఈఎస్ వల్లనే తర్వాత్తర్వాత ఊబకాయం వచ్చే అవకాశమూ ఉంటుంది.

చికిత్స... సైకియాట్రిస్టుల ఆధ్వర్యంలో కొన్ని రకాల యాంటీడిప్రెసెంట్లతో పాటు అవసరాన్ని బట్టి బిహేవియర్ థెరపీ ఇస్తారు. కొన్ని రకాల రిలాక్సేషన్ టెక్నిక్స్ అవలంబిస్తూ రాత్రి తిండిని క్రమంగా ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌కి షిఫ్ట్ అయ్యేలా కౌన్సెలింగ్ చేయడం ద్వారా చికిత్స అందిస్తారు.

బులియన్
(బంగారం 10 గ్రా.: వెండి కిలో)
సెప్టెంబర్ 10న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,13,810	1,12,680	1,10,510	1,12,600	1,13,700	1,10,720
బంగారం (22 క్యారెట్లు)	1,06,280	1,01,130	1,01,300	1,04,340	1,04,600	1,01,500
వెండి	1,29,500	1,27,800	1,40,000	1,27,800	1,28,000	1,40,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.



'సూపర్-4'లో కొరియాపై భారత్ విజయం

హాంగ్జౌ (చైనా): ఆసియా కప్ మహిళల హాకీ టోర్నమెంట్ 'సూపర్-4' దశలో భారత్ శుభారంభం చేసింది. దక్షిణ కొరియా జట్టుతో బుధవారం జరిగిన తొలి మ్యాచ్‌లో సలీమా టెటె సారథ్యంలోని టీమిండియా 4-2 గోల్స్ తేడాతో విజయం సాధించింది. భారత్ తరఫున వైష్ణవి విఠల్ ఫాల్కే (2వ నిమిషంలో), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సంగీత కుమారి (33వ నిమిషంలో), లాల్‌రెమ్‌సియామి (40వ నిమిషంలో), రుతుజా **(59వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. కొరియా జట్టుకు యుజిన్ కిమ్ (33వ, 53వ** నిమిషాల్లో) రెండు గోల్స్ అందించింది. ఈ మ్యాచ్‌లో భారత్‌కు తొమ్మిది పెనాల్టీ కార్నర్‌లు లభించగా...రెండింటిని గోల్స్‌గా మలిచింది. కొరియా జట్టుకు నాలుగు పెనాల్టీ కార్నర్‌లు రాగా... రెండింటిని సద్వినియోగం చేసుకుంది. మరో 'సూపర్-4' మ్యాచ్‌లో ఆతిథ్య చైనా 2-0 గోల్స్ తేడాతో జపాన్‌ను ఓడించింది. ప్రస్తుతం భారత్, చైనా మూడు పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నాయి. నేడు జరిగే మ్యాచ్‌ల్లో చైనాతో భారత్; కొరియాతో జపాన్ తలపడతాయి. 'సూపర్-4' దశ ముగిశాక టాప్-2లో నిలిచిన జట్లు ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. **విజేత జట్టు వచ్చే ఏడాది జరిగే ప్రపంచ కప్ టోర్నీకి నేరుగా అర్హత పొందుతుంది.**

నిఖత్ జరీన్ పరాజయం



- క్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగిన భారత బాక్సర్
- సెమీస్ చేరి పతకాలను ఖాయం చేసుకున్న నుపుర్, జైస్మీన్



నుపుర్



జైస్మీన్

లివర్‌పూల్: ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్ మహిళల విభాగంలో భారత్‌కు రెండు పతకాలు ఖాయమయ్యాయి. మూడోసారి ఈ మెగా ఈవెంట్‌లో పతకం సాధిస్తుందనుకున్న భారత స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్ (51 కేజీలు) క్వార్టర్ ఫైనల్లోనే నిష్క్రమించగా... నుపుర్ షెరాన్ (ప్లస్ 80 కేజీలు), జైస్మీన్ లంబోరియా (57 కేజీలు) సెమీ ఫైనల్లోకి దూసుకెళ్లి కనీసం కాంస్య పతకాలను ఖాయం చేసుకున్నారు. 2022, 2023 ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీల్లో స్వర్ణ పతకాలు నెగ్గిన తెలంగాణ బాక్సర్ నిఖత్ ఈసారి రిక్తహస్తాలతో వెనుదిరిగింది. క్వార్టర్ ఫైనల్లో నిఖత్ 0:5తో టోక్యో, పారిస్ ఒలింపిక్స్ రజత పతక **విజేత బుసె నాజ్ సాకిరోగ్లు** (టర్కీ) చేతిలో ఓడిపోయింది. ఇతర క్వార్టర్ ఫైనల్స్‌లో నుపుర్ 4:1తో ఒల్టినోయ్ సోటిబ్ బొయేవా (ఉజ్బెకిస్తాన్)పై, జైస్మీన్ 5:0తో ఖుమోరబోను (ఉజ్బెకిస్తాన్)పై విజయం సాధించి సెమీఫైనల్లోకి ప్రవేశించారు. పురుషుల విభాగంలో జాదూ మణి సింగ్ (48 కేజీలు), అభినాశ్ జమ్వాల్ (65 కేజీలు) క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టి పతకానికి విజయం దూరంలో నిలిచారు. మరో భారత బాక్సర్ జుగ్నూ అహ్లావత్ (85 కేజీలు) తొలి రౌండ్‌లోనే ఓడిపోయాడు.

తెలుగు టైటాన్స్ 'హ్యాట్రిక్'

యు ముంబాపై విజయం • వైజాగ్‌లో పీకేఎల్ మ్యాచ్‌లకు నేడు ముగింపు



విశాఖ స్పోర్ట్స్: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) సీజన్-12లో తెలుగు టైటాన్స్ వరుసగా మూడో విజయంతో సత్తా చాటింది. హోం గ్రౌండ్‌లో ఐదు మ్యాచ్‌లు ఆడిన తెలుగు టైటాన్స్ తొలి రెండు మ్యాచ్‌లలో ఓడినా... ఇప్పుడు 'హ్యాట్రిక్' విజయంతో వైజాగ్ అంచెను ముగించింది. బుధవారం జరిగిన పోరులో టైటాన్స్ 45-37 స్కోరుతో యు ముంబాను చిత్తు చేసింది. టైటాన్స్ తరఫున భరత్ హుడా 13 పాయింట్లతో చెలరేగగా... చేతన్ సాహు 6, కెప్టెన్ విజయ్ మలిక్ 5 పాయింట్లతో అతనికి సహకరించారు. చివరి 10 నిమిషాల్లో కాస్త పోరాడిన ముంబా ప్రత్యర్థిని 'ఆలౌట్' చేయగలిగినా పాయింట్ల అంతరం మాత్రమే తగ్గించ గలిగింది. ముంబా ఆటగాళ్లలో సందీప్, ఆమిర్ మొహమ్మద్ చెరో 7 పాయింట్లు సాధించారు. మరో మ్యాచ్‌లో పుణేరీ పల్టన్ 43-32 తేడాతో యూపీ యోధాస్‌పై గెలిచింది. నేడు జరిగే మ్యాచ్‌లలో యు ముంబాతో పట్నా పైరేట్స్, దబంగ్ ఢిల్లీతో గుజరాత్ జెయింట్స్ తలపడతాయి. తొలి 28 మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇచ్చిన విశాఖపట్నంలో నేటితో పీకేఎల్ పోటీలు ముగియనున్నాయి. రేపటి నుంచి జైపూర్‌లోని సవాయ్ మాన్‌సింగ్ ఇండోర్ స్టేడియం వేదికగా టోర్నీ కొనసాగుతుంది.

• హాంకాంగ్ ఓపెన్‌లో సింధుకు షాక్
• నేటి నుంచి దులీప్ ట్రోఫీ ఫైనల్
మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

ధనాధన్... ఫటాఫట్

9 వికెట్లతో భారత్ ఘన విజయం

యూఏఈ 57 ఆలౌట్ • 27 బంతుల్లోనే గెలిచిన టీమిండియా • ఆదివారం పాకిస్తాన్‌తో భారత్ కీలక పోరు

అంతర్జాతీయ టి20ల్లో భారత్‌కు, ఇతర జట్లకు మధ్య ఉన్న స్థాయీభేదం ఏమిటో మరోసారి కనిపించింది. వరల్డ్ చాంపియన్ టీమిండియా ముందు పసికూనలా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) జట్టు పూర్తిగా తేలిపోయింది. ఫలితంగా ఆసియా కప్ టి20 టోర్నీలో భారత్ భారీ గెలుపుతో సత్తా చాటింది. భారత బౌలర్ల ధాటికి 79 బంతుల్లోనే యూఏఈ ఇన్నింగ్స్ ముగియగా, లక్ష్యాన్ని ఛేదించేందుకు మన జట్టుకు 27 బంతులే సరిపోయాయి. కుల్దీప్ యాదవ్, శివమ్ దూబే కలిసి 7 వికెట్లతో ప్రత్యర్థిని పడగొట్టగా... అభిషేక్ శర్మ జోరుతో లాంఛనం ముగిసింది. ఇక అభిమానులంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్న సమరంలో ఆదివారం పాకిస్తాన్‌తో భారత్ ఆడుతుంది.



కుల్దీప్‌కు సహచరుల అభినందన

దుబాయ్: ఆసియా కప్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ ఘన విజయంతో శుభారంభం చేసింది. బుధవారం జరిగిన గ్రూప్ 'ఎ' మ్యాచ్‌లో భారత్ 9 వికెట్ల తేడాతో యూఏఈని చిత్తు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన యూఏఈ 13.1 ఓవర్లలో 57 పరుగులకే కుప్పకూలింది. అలీషాన్ (17 బంతుల్లో 22; 3 ఫోర్లు, 1 సిక్స్), వసీమ్ (22 బంతుల్లో 19; 3 ఫోర్లు) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. కుల్దీప్ యాదవ్ (4/7), శివమ్ దూబే (3/4) బౌలింగ్‌లో చెలరేగారు. అనంతరం భారత్ 4.3 ఓవర్లలో వికెట్ నష్టానికి 60 పరుగులు చేసి గెలిచింది. ఇందులో 4 ఫోర్లు, 5 సిక్స్‌లతో మొత్తం 46 పరుగులు వచ్చాయి! అభిషేక్ శర్మ (16 బంతుల్లో 30; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) దూకుడుగా ఆడగా... శుబ్‌మన్ గిల్ (9 బంతుల్లో 20 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్), సూర్యకుమార్ యాదవ్ (7 నాటౌట్) కలిసి మ్యాచ్‌ను ముగించారు. కుల్దీప్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' పురస్కారం లభించింది. భారత్ తమ తదుపరి మ్యాచ్‌ను ఆదివారం చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్ జట్టుతో ఆడుతుంది. **అబుదాబిలో నేడు జరిగే గ్రూప్ 'బి' మ్యాచ్‌లో హాంకాంగ్‌తో బంగ్లాదేశ్ ఆడుతుంది.**

టపటపా...

యూఏఈ ఇన్నింగ్స్ తొలి 21 బంతుల్లో 26 పరుగులు... ఇందులో 3 ఫోర్లు, ఒక సిక్స్‌తో అలీషాన్ ఒక్కడే 22 పరుగులు చేశాడు. ఆ తర్వాత బుమ్రా వేసిన ఇన్నింగ్స్ ఆరో ఓవర్లో కెప్టెన్ వసీమ్ మూడు ఫోర్లు బాది 12 పరుగులు రాబట్టాడు. ఈ రెండు సందర్భాలు మినహా యూఏఈ ప్రదర్శనలో చెప్పుకోవడానికేమీ లేదు. భారత బౌలర్ల స్థాయికి తగ్గ ప్రదర్శన చేయడంతో యూఏఈ బ్యాటర్లు పరుగులు చేయడంలో తీవ్ర తడబాటు కనిపించింది. సింగిల్ కూడా తీయడం కష్టంగా మారిపోవడంతో పాటు జట్టు వరుసగా వికెట్లు కోల్పోయింది. 26/0 నుంచి పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. తర్వాతి 32 బంతుల్లో 24 పరుగులు మాత్రమే చేసిన టీమ్ సగం వికెట్లు కోల్పోవడంతో స్కోరు 50/5కి చేరింది. వీటిలో కుల్దీప్ ఒకే ఓవర్లో తీసిన మూడు వికెట్లు ఉన్నాయి. అనంతరం తర్వాతి 25 బంతుల్లో 7 పరుగులే చేసిన జట్టు మరో ఐదు వికెట్లు చేజార్చుకుంది. వీటిలో దూబే ఒకే ఓవర్లో తీసిన రెండు వికెట్లు ఉన్నాయి. భారత బౌలర్లలో హార్దిక్ పాండ్యా 2, బుమ్రా 4 ఫోర్లు ఇవ్వగా... మిగతా నలుగురు బౌలర్లు కలిపి 55 బంతుల్లో ఒక్క ఫోర్ ఇవ్వకుండా ఒక సిక్స్ మాత్రం (అక్షర్ బౌలింగ్‌లో) ఇచ్చారు! 2024 టి20 వరల్డ్ కప్ ఫైనల్ తర్వాత తొలిసారి భారత్ తరఫున టి20 మ్యాచ్ బరిలోకి దిగిన బుమ్రా... ఆరేళ్ల తర్వాత మొదటిసారి పవర్‌ప్లేలో మూడు ఓవర్లు వేశాడు.

స్కోరు వివరాలు

యూఏఈ ఇన్నింగ్స్: అలీషాన్ (బి) బుమ్రా 22; వసీమ్ (ఎల్బీ) (బి) కుల్దీప్ 19; జోహెబ్ (సి) కుల్దీప్ (బి) వరుణ్ 2; రాహుల్ చోప్రా (సి) గిల్ (బి) కుల్దీప్ 3; ఆసిఫ్ ఖాన్ (సి) సామ్సన్ (బి) దూబే 2; కౌశిక్ (బి) కుల్దీప్ 2; ధ్రువ్ (ఎల్బీ) (బి) దూబే 1; సిమ్రన్‌జీత్ (ఎల్బీ) (బి) అక్షర్ 1; హైదర్ అలీ (సి) సామ్సన్ (బి) కుల్దీప్ 1; జునైద్ (సి) సూర్యకుమార్ (బి) దూబే 0; రోహిద్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (13.1 ఓవర్లలో ఆలౌట్)** 57. **వికెట్ల పతనం:** 1-26, 2-29, 3-47, 4-48, 5-50, 6-51, 7-52, 8-54, 9-55, 10-57. **బౌలింగ్:** పాండ్యా 1-0-10-0, బుమ్రా 3-0-19-1, అక్షర్ 3-0-13-1, వరుణ్ 2-0-4-1, కుల్దీప్ 2.1-0-7-4, దూబే 2-0-4-3.

భారత్ ఇన్నింగ్స్: అభిషేక్ శర్మ (సి) హైదర్ (బి) జునైద్ 30; గిల్ (నాటౌట్) 20; సూర్య కుమార్ (నాటౌట్) 7; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (4.3 ఓవర్లలో వికెట్ నష్టానికి) 60. వికెట్ల పతనం:** 1-48. **బౌలింగ్:** హైదర్ అలీ 1-0-10-0, రోహిద్ 1-0-15-0, ధ్రువ్ 1-0-13-0, జునైద్ 1-0-16-1, సిమ్రన్‌జీత్ 0.3-0-6-0.

27 ఛేదనలో బంతుల పరంగా భారత్‌కు ఇదే అతి వేగవంతమైన విజయం. గతంలో 39 బంతుల్లో స్కాట్లాండ్‌పై లక్ష్యాన్ని ఛేదించింది.

సాక్షి సినిమా



● అనిల్ రావిపూడి, విజయ్ సేతుపతి, టబు, చిరంజీవి, పూరి జగన్నాథ్, చార్మి, నయనతార

సందడే సందడి

చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో 'మన శంకరవరప్రసాద్ గారు' సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. నయనతార హీరోయిన్‌గా నటిస్తున్నారు. అర్చన సమర్పణలో సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ స్టూడియోలో జరుగుతోంది. చిరంజీవి, నయనతారలపై ఓ పాట చిత్రీకరిస్తున్నారు. ఇదే స్టూడియోలో మరో కాంప్లెక్స్‌లో విజయ్ సేతుపతి హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వం వహిస్తున్న సినిమా చిత్రీకరణ జరుగుతోంది. ఈ సినిమాలో సంయుక్త, టబు, విజయ్ కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. పూరి జగన్నాథ్, చార్మీ కౌర్, జేబీ నారాయణరావు కొండ్రోల్లా నిర్మిస్తున్నారు. ఈ మూవీ షూట్‌లో భాగంగా విజయ్ సేతుపతి, టబుతో పాటు ఇతర నటీనటులపై కీలక సన్నివేశాలు తీస్తున్నారు పూరి. రెండు సినిమాల షూటింగ్స్ ఒకే స్టూడియోలో జరుగుతుండటంతో షాట్ గ్యాప్‌లో 'మన శంకరవరప్రసాద్ గారు' యూనిట్‌ని కలిసి, సందడి చేసింది పూరి అండ్ టీమ్. ఇక 'మన శంకరవర ప్రసాద్ గారు' 2026 సంక్రాంతికి రిలీజ్ కానుంది. అలాగే విజయ్ సేతుపతి- పూరి జగన్నాథ్ చిత్రం కూడా 2026 ఆరంభంలో ప్రేక్షకుల ముందుకు రానుంది.

సరదాగా అన్న మాటను వైరల్ చేశారు!

- బెల్లంకొండ సాయి శ్రీనివాస్



''హారర్, మిస్టరీ నేపథ్యంలో రూపొందిన చిత్రం 'కిష్కింధపురి'. హారర్ సినిమాలో ఇంత పెద్ద కథ ఉన్న సినిమాని నేను ఇప్పటివరకు చూడలేదు. డబ్బింగ్ సినిమా కాకుండా చాలా రోజుల తర్వాత 'కిష్కింధపురి'తో నేరుగా తెలుగు ఫిల్మ్ చేసే అవకాశం దొరికింది. ఔట్‌పుట్ బాగా వచ్చిన ఈ సినిమా మీద యూనిట్ అంతా నమ్మకంగా ఉన్నాం. మా మూవీ ప్రేక్షకులకు డిఫరెంట్ థ్రిల్, సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది'' అని బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తెలిపారు. కౌశిక్ పెగల్లపాటి దర్శకత్వంలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమా పరమేశ్వరన్ జంటగా నటించిన చిత్రం 'కిష్కింధపురి'. సాహు గారపాటి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న విడుదలవుతోంది. ఈ సందర్భంగా బెల్లంకొండ సాయి శ్రీనివాస్ పంచుకున్న విశేషాలు.

- టీనేజీలో ఉన్నప్పట్నుంచి నాకు హారర్ సినిమాలంటే ఇష్టం. మా శ్రీ సాయి గణేశ్ ప్రొడక్షన్‌లో నిర్మించిన 'కాంచన' సినిమాని చాలా ఎంజాయ్ చేశాను. డైరెక్టర్ కౌశిక్ 'కిష్కింధపురి' కథ చెప్పినప్పుడు చాలా నచ్చింది. నాకు బాగా ఇష్టమైన జానర్ ఇది. హారర్ కారణంగా మా సినిమాకి 'ఎ' సర్టిఫికెట్ ఇచ్చారు. ఇంత సీరియస్ హారర్ సినిమా చూసి చాలా కాలమైందని సెన్సార్ సభ్యులు అభినందించడం ఆనందాన్నిచ్చింది. 'కిష్కింధపురి'ని టీనేజ్ ఆడియన్స్‌తో పాటు సాధారణ ప్రేక్షకులు కూడా ఎంజాయ్ చేస్తారు. మా సినిమా కథలోనే యాక్షన్ ఉంది. విజువల్ ఎఫెక్ట్స్, సౌండ్ పరంగా ఆడియన్స్ థ్రిల్ అవుతారు. ఇలాంటి సినిమాని థియేటర్లో చూస్తున్నప్పుడు ఆ అనుభూతి వేరే స్థాయిలో ఉంటుంది.
- ఈ సినిమా కోసం సువర్ణమాయ అనే రేడియో స్టేషన్‌ని సెట్‌గా వేశాం. అలాగే ఓ పాడుబడ్డ గృహంలో షూట్ చేశాం. మంగళవారం ఈ సినిమాని మా స్నేహితులతో కలిసి థియేటర్స్‌లో చూశాం ... సినిమా అదిరిపోయింది. సౌండ్ డిజైనర్ రాధాకృష్ణగారు సౌండ్‌ని అద్భుతంగా డిజైన్ చేశారు. కౌశిక్ మంచి కథ రెడీ చేసుకున్నాడు. అయితే ఇలాంటి జోనర్స్ సినిమాలకి బడ్జెట్ పరిమితులుంటాయి. కానీ, సాహు గారపాటిగారు ఆడియన్స్‌కి ద బెస్ట్ ఇవ్వాలని రాజీ పడకుండా నిర్మించారు.
- 'కిష్కింధపురి' లాంటి హారర్, మిస్టరీ నేపథ్యంలో రూపొందిన చిత్రాలకు నేపథ్య సంగీతానికి చాలా ప్రాధాన్యం ఉంటుంది. చేతన్ భరద్వాజ్ అద్భుతమైన మ్యూజిక్, నేపథ్య సంగీతం అందించారు. 'మా సినిమాకి వచ్చిన ప్రేక్షకుల్లో మొదటి పది నిమిషాల తర్వాత ఎవరైనా ఫోన్ పట్టుకుంటే నేను ఇండస్ట్రీ వదిలి వెళ్లిపోతాను' అని సరదాగా అన్నాను... దాన్ని వైరల్ చేశారు. మా చిత్ర కథ అంత ఆసక్తిగా ఉంటుందని చెప్పడమే నా ఉద్దేశం. నాకు సినిమా తప్ప వేరే ప్రపంచం లేదు... ఇండస్ట్రీలోనే ఉంటాను... భవిష్యత్‌లో దర్శకత్వం కూడా చేస్తాను. నేను నటించిన 'టైసన్ నాయుడు' చిత్రం అక్టోబరులో విడుదలవుతుంది. 'హైందవ' సినిమా షూటింగ్ చివరి దశకు వచ్చింది. అదే విధంగా 'పొలిమేర' చిత్రదర్శకుడు అనిల్‌తో ఒక సినిమా ఉంటుంది. 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' లాంటి కథ ఉంటే నేను, నా తమ్ముడు సాయి గణేశ్ కలిసి సినిమా చేస్తాం.


ప్రేమకథ షురూ



● దుల్కర్, పూజా హెగ్డే

దుల్కర్ సల్మాన్‌ని ద్విచక్ర వాహనంపై కూర్చోబెట్టుకుని రయ్ రయ్‌మంటూ పూజా హెగ్డే బండి నడిపారు. ఇద్దరూ ఎలా చిరునవ్వులు చిందించారో ఇక్కడున్న ఫొటోలో చూడొచ్చు. దుల్కర్ సల్మాన్, పూజా హెగ్డే హీరో హీరోయిన్‌గా ఓ ప్రేమకథా చిత్రం షురూ అయింది. రవి నెలకుదిటి దర్శకునిగా పరిచయం చేస్తూ సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ చిత్రంలో పూజా హెగ్డేని కథానాయికగా ప్రకటించి, బుధవారం ఆమె షూట్‌లో పాల్గొన్న విషయాన్ని చిత్రబృందం తెలియ జేసింది. ''రవి నెలకుదిటి చక్కని ప్రేమకథ రాశారు. ఈ కథలో మంచి హ్యూమన్ డ్రామా, హృదయానికి హత్తుకునే భావోద్వేగాలు ఉన్నాయి'' అని కూడా యూనిట్ పేర్కొంది. పాన్-ఇండియా మూవీగా ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్, కెమెరా: అనయ్ ఓం గోస్వామి.

వాయుపుత్ర... పవిత్ర దృశ్యకావ్యం



● 'వాయుపుత్ర' పోస్టర్

'కార్తికేయ, కార్తికేయ 2, తండేల్' వంటి విజయవంతమైన సినిమాలను తెరకెక్కించిన చందు మొండేటి దర్శకత్వంలో 'వాయుపుత్ర' అనే యానిమేషన్ సినిమా రూపొందనుంది. శ్రీకర ప్రొడక్షన్స్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించనున్నారు. ఈ చిత్రాన్ని బుధవారం ప్రకటించి, హనుమంతుడు కొండపై నిలబడి దహనమవుతున్న లంకను చూస్తున్న పోస్టర్‌ని విడుదల చేశారు. ''మన చరిత్ర, ఇతిహాసాల్లో వాయుపుత్రుడు హనుమంతుడు ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉన్నారు. సప్త చిరంజీవుల్లో ఒకరైన ఆయన తన బలం, భక్తితో కాలాన్ని అధిగమించిన శాశ్వత యోధుడు. అలాంటి గొప్ప యోధుడి కథతో 'వాయుపుత్ర' చిత్రం రూపొందనుంది. ఇది పర్వతాలను కదిలించిన భక్తి కథ కూడా. భారీ స్థాయిలో 3డీ యానిమేషన్ చిత్రంగా రూపొందించనున్న ఈ సినిమా హనుమంతుని కాలాతీత కథను గొప్ప దృశ్యకావ్యంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానుంది. ఇది కేవలం సినిమా కాదు, థియేటర్లను దేవాలయాలుగా మార్చే పవిత్ర దృశ్యం. ప్రేక్షకులను మునుపెన్నడూ లేని విధంగా భక్తి పారవశ్యంలోకి తీసుకెళుతుంది. 2026 దసరాకి తెలుగు, హిందీ, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయనున్నాం'' అని చిత్రయూనిట్ తెలిపింది.

మా చిన్ని...



● కుమారుడితో వరుణ్, లావణ్య

''అవర్ లిటిల్ మేన్' అంటూ తమకు బాబు పుట్టిన విషయాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు వరుణ్ తేజ్. బుధవారం (సెప్టెంబరు 10) ఉదయం హైదరాబాద్‌లోని రెయిన్ బో ఆస్పత్రిలో లావణ్య త్రిపాఠి బాబుకి జన్మనిచ్చారు. భార్యను ముద్దాడుతూ, కొడుకుని పట్టుకుని మురిసిపోతున్న ఫొటోతో పాటు తన తల్లిదండ్రులు, పెదనాన్న చిరంజీవి తన కుమారుణ్ణి ఎత్తుకున్న ఫొటోలను షేర్ చేశారు వరుణ్. ''ఈ ప్రపంచానికి స్వాగతం, లిటిల్ వన్. కొణిదెల కుటుంబంలోకి మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నాం. తల్లిదండ్రులైన వరుణ్, లావణ్యకి, నాన్నమ్మ, తాత అయిన పద్మజ, నాగబాబులకు శుభాకాంక్షలు. బేబీ బాయ్‌కి ఆరోగ్యం, ఆనందం, ఆశీర్వాదం... అన్నీ మెండుగా ఉండాలని కోరుకుంటున్నాను'' అని ఇన్‌స్టాగ్రామ్ వేదికగా చిరంజీవి ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఇక 2023 నవంబరు 1న వరుణ్ తేజ్, లావణ్య పెద్దల అంగీకారంతో ప్రేమ వివాహం చేసుకున్న విషయం తెలిసిందే.

వెండితెరపైకి రాజ్‌కుమార్ కిడ్నాప్



● రాజ్‌కుమార్

కన్నడ కంఠీరవ రాజ్ కుమార్ జీవితంలోని కీలక అంశమైన కిడ్నాప్ నేపథ్యంలో ఓ సినిమా రానుంది. రాజ్‌కుమార్‌ని వీరప్పన్ కిడ్నాప్ చేసిన విషయం తెలిసిందే. అశోక్, ముని, నాగేశ్ ప్రధాన పాత్రధారులుగా కట్టా శ్రీకర్ ప్రసాద్ దర్శకత్వంలో వి. లీలా మనోహర్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. అక్టోబరులో షూటింగ్ ప్రారంభం కానుంది. శ్రీకర్ ప్రసాద్ మాట్లాడుతూ- ''రాజ్‌కుమార్‌గారిని వీరప్పన్ కిడ్నాప్ చేయడం అందర్నీ షాక్‌కి గురి చేసింది. అప్పటి కిడ్నాప్ కోణంలో పలు అంశాలను ఈ చిత్రంలో చర్చించడం జరుగుతుంది. ఈ చిత్రానికి ప్రతిభగల టెక్నీషియన్లు పని చేయనున్నారు. పూర్తి వివరాలు దసరా తర్వాత వెల్లడిస్తాం'' అని చెప్పారు. ఇదిలా ఉంటే.... 2000 జూలై 30న రాజ్‌కుమార్‌ని కిడ్నాప్ చేసి, 2000 నవంబరు 15న విడుదల చేశారు వీరప్పన్. ఇక 2006 ఏప్రిల్ 12న రాజ్‌కుమార్ తుది శ్వాస విడిచారు.

హీరోయిన్లలో ఆమే నాకు స్ఫూర్తి

- రితికా నాయక్



''మిరాయ్'లో నాది బలమైన పాత్ర. హిమాలయాల్లో ఉండే ఒక మాంక్ క్యారెక్టర్ నాది. తనలో గ్రేట్ ఎనర్జీ ఉంటుంది. నా పాత్రని తెరపై చూసుకునేందుకు ఎగ్జయిటెడ్‌గా ఉన్నాను. 'మిరాయ్'లోని యాక్షన్ అడ్వెంచర్, ఫ్యాంటసీ ఎలిమెంట్స్ ప్రేక్షకులకు గొప్ప అనుభూతినిస్తాయి'' అన్నారు రితికా నాయక్. తేజ సజ్జా, రితికా నాయక్ జంటగా నటించిన చిత్రం 'మిరాయ్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించారు. టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం రేపు (శుక్రవారం) రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా రితికా నాయక్ విలేకరులతో మాట్లాడుతూ- ''నా తొలి చిత్రం 'అశోకవనంలో అర్జున కళ్యాణం' (2022) తర్వాత ఒక మంచి పాత్ర కోసం చూస్తున్నప్పుడు 'మిరాయ్' చాన్స్ వచ్చింది. అద్భుతమైన కథ ఇది. ఈ సినిమాని దాదాపు 80 శాతం లైవ్ లొకేషన్స్‌లో చిత్రీకరించడం సవాల్‌గా అనిపించింది. కార్తీక్‌గారు విజన్ ఉన్న డైరెక్టర్. సినిమాని చాలా బాగా తీశారు. మా ఇద్దరి పుట్టినరోజుకి ఒక్క రోజు గ్యాప్.. అంతే. అందుకే బ్రదర్-సిస్టర్ అని పిలుచుకునేవాళ్లం. తేజ సజ్జాకి షూటింగ్‌లో చాలా గాయాలయ్యాయి. అయినా సరైన టైమ్‌కి సెట్‌లో ఉండే వారు. మనోజ్‌గారు పవర్‌ఫుల్ పాత్రలో కనిపిస్తారు. నా రెండో సినిమానే పీపుల్ మీడియా ఫ్యాక్టరీలాంటి పెద్ద బేనర్‌లో చేయడం హ్యాపీగా ఉంది. ఇక నాకు వ్యక్తిగతంగా యాక్షన్, రొమాన్స్ ఫేవరెట్ జోనర్స్. హీరోయిన్లలో సాయి పల్లవిగారంటే ఇష్టం. తనే నాకు స్ఫూర్తి. ప్రస్తుతం వరుణ్ తేజ్‌గారితో ఒక సినిమా చేస్తున్నా. అలాగే మరి కొన్ని ప్రాజెక్ట్స్ సిద్ధంగా ఉన్నాయి'' అని తెలిపారు.

సాక్షి బిజినెస్
గురువారం
11-9-2025

స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
324	105
81,425	24,973

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	21,917	▲	37
డోజోన్స్	45,460	▼	251
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,227	▼	16
డాక్స్	24,304	▼	88
షాంఘై	3,812	▲	5
నికాయ్	43,838	▲	379

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	87.75	88.77
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	118.00	120.94
€	యూరో	ఎస్‌బీఐ	102.00	101.86
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	59.15	60.66
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	57.14	59.40
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	66.43	70.09
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.61	24.10
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.10	24.35
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.49	13.32

భారత్‌లో 19 నుంచి ఐఫోన్ 17 సేల్..!

- రేపటి నుంచి ప్రీ-ఆర్డర్లు ప్రారంభం
- రూ. 82,900 నుంచి రూ. 2.3 లక్షల వరకు ధర శ్రేణి



న్యూఢిల్లీ: టెక్ దిగ్గజం యాపిల్ కొత్తగా ప్రవేశపెట్టిన ఐఫోన్ 17 స్మార్ట్‌ఫోన్ల శ్రేణి విక్రయాలు సెప్టెంబర్ 19 నుంచి భారత మార్కెట్లో ప్రారంభం కానున్నాయి. వీటి ధరల శ్రేణి రూ. 82,900 నుంచి రూ. 2,29,900 వరకు ఉంటుంది. ఎయిర్ పేరిట యాపిల్ అత్యంత పల్చని ఐఫోన్‌ను కూడా ప్రవేశపెట్టింది. ఇది కేవలం 5.6 మిల్లీమీటర్ల మందం ఉంటుంది. ఈ-సిమ్‌లను మాత్రమే సపోర్ట్ చేస్తుంది. కొత్త ఐఫోన్ మోడల్స్‌లో 128 జీబీ స్టోరేజీ ఆప్షన్‌ను కంపెనీ నిలిపివేసింది. దీంతో ఐఫోన్ 16 సిరీస్‌తో పోలిస్తే బేస్ మోడల్స్ ధర పెరిగింది. భారత్ సహా 63 దేశాల్లోని కస్టమర్లు సెప్టెంబర్ 12 నుంచి ఐఫోన్ 17 ప్రో, ప్రో మ్యాక్స్‌ని ప్రీ-ఆర్డర్ చేయొచ్చని యాపిల్ తెలిపింది. ఐఫోన్ 17 ఫోన్లు 256 జీబీ, 512 జీబీ స్టోరేజీతో లభిస్తాయి. ఎయిర్ సిరీస్ 256 జీబీ నుంచి 1 టీబీ స్టోరేజీతో లభిస్తుంది. ఏ19 చిప్‌సెట్ వల్ల ఐఫోన్ 16తో పోలిస్తే కొత్త ఐఫోన్ 20% అధికం, ఐఫోన్ 13తో పోలిస్తే రెట్టింపు వేగంతో పని చేస్తుంది. గతానికి భిన్నంగా ఈసారి 'ప్లస్' మోడల్స్ ఏవీ లేవు. ప్రో మ్యాక్స్‌లో తొలిసారిగా 2టీబీ ఆప్షన్‌ను కంపెనీ అందుబాటులోకి తెచ్చింది. మరోవైపు, శాటిలైట్ కమ్యూనికేషన్స్‌కి కూడా ఉపయోగపడేలా వాచ్ 3 అల్ట్రాను కూడా యాపిల్ ఆవిష్కరించింది. దీని ధర రూ. 89,900గా ఉంటుంది. ప్రీ-ఆర్డర్లు ప్రారంభమయ్యాయి.

వివిధ మోడల్స్ ధరలు ఇలా...

మోడల్	స్క్రీన్	స్టోరేజీ	ప్రారంభ ధర
ఐఫోన్ 17	6.3	256 జీబీ-512జీబీ	82,900
ఐఫోన్ 17 ప్రో	6.3	256 జీబీ-1టీబీ	1,34,900
ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్	6.9	256 జీబీ-2 టీబీ	1,49,900
ఎయిర్	6.5	256జీబీ-1టీబీ	1,19,900

(స్క్రీన్: అంగుళాలు, ధర రూ.లలో)

బంగారం మరో కొత్త గరిష్టం



న్యూఢిల్లీ: బంగారం బుధవారం మరో నూతన గరిష్ట స్థాయిని నమోదు చేసింది. 99.9 శాతం స్వచ్ఛత పసిడి 10 గ్రాములకు రూ. 250 పెరిగి రూ. 1,13,000కు చేరుకోవడం ద్వారా సరి కొత్త రికార్డును సృష్టించింది. మంగళవారం కూడా రూ.5,080 పెరిగి రూ.1,12,750 స్థాయి వద్ద జీవిత కాల గరిష్టాన్ని నమోదు చేయడం తెలిసిందే. యూఎస్ డాలర్ ఇండెక్స్ బలహీనపడడం (ఏడు వారాల కనిష్టం), ఫెడ్ దూకుడుగా వడ్డీ రేట్లను తగ్గిస్తుందన్న అంచనాలు పసిడి ర్యాలీకి సాయపడుతున్నట్టు అబాన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సీఈవో చింతన్ మెహతా తెలిపారు. యూఎస్ ట్రెజరీ ఈల్డ్స్ తగ్గడానికి తోడు, మధ్యప్రాచ్యంలో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరుగుదల పసిడి ధరలకు అదనపు బలాన్నిచ్చినట్టు చెప్పారు. మరోవైపు వెండి సైతం కిలోకి రూ.300 లాభపడడంతో రూ.1,28,500కు చేరుకుంది. అంతర్జాతీయ మార్కెట్లోనూ పసిడి ఔన్స్‌కు 3,715 వద్ద కొత్త గరిష్టాన్ని నమోదు చేసింది.

నిఫ్టీకి ఆరో రోజూ లాభాలే

- 324 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్
- యూఎస్‌తో వాణిజ్య చర్చలు, ఒప్పందంపై ఆశలు
- ఐటీ, ఫైనాన్స్, క్యాపిటల్ గూడ్స్ షేర్లకు డిమాండ్



ముంబై: దేశీయ స్టాక్ సూచీలు బుధవారం అరశాతం మేర పెరిగాయి. అమెరికా భారత్ మధ్య వాణిజ్య చర్చలు, ఒప్పందాల ఖరారుపై ఆశలు మళ్లీ చిగురించాయి. జీఎస్‌టీ రేట్ల తగ్గింపు ప్రయోజనాలు, ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల కోత అంచనాలు సెంటిమెంట్‌ను మరింత బలపరిచాయి. ఫలితంగా సెన్సెక్స్ 324 పాయింట్లు బలపడి 81,425 వద్ద స్థిరపడింది. ఈ సూచీకిది మూడో రోజూ లాభాల ముగింపు. వరుసగా ఆరో రోజూ లాభపడిన నిఫ్టీ 105 పాయింట్లు పెరిగి 24,973 వద్ద నిలిచింది. ఐటీ, ఫైనాన్షియల్ సర్వీసెస్, క్యాపిటల్ గూడ్స్, టెక్, రియల్టీ, ఇండస్ట్రియల్స్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఒక దశలో సెన్సెక్స్ 543 పాయింట్లు బలపడి 81,644 వద్ద, నిఫ్టీ 167 పాయింట్లు ఎగసి 25,036 వద్ద ఇంట్రాడే గరిష్టాలు అందుకున్నాయి. ఆసియా మార్కెట్లు 1.5%, యూరప్ మార్కెట్లు స్వల్ప నష్టాలతో ముగిశాయి. అమెరికా స్టాక్ సూచీలు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి.

- అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై ఆశావహ అంచనాలతో టెక్స్‌టైల్ రంగానికి చెందిన వెల్‌స్పన్ లివింగ్, వర్ధమాన్ టెక్స్‌టైల్స్, ట్రైడెంట్, అరవింద్ షేర్లు 4% నుంచి 10% లాభపడ్డాయి. అలాగే ఐటీ కంపెనీల షేర్లు రెండో రోజూ లాభపడ్డాయి. ఈ రంగానికి చెందిన పెర్సిస్టెంట్ 5.50%, కోఫోర్జ్, ఎంఫసీస్ 4%, విప్రో, హెచ్‌సీఎల్ టెక్ 3%, ఎల్‌టీఐఎం, టీసీఎస్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్ షేర్లు 2% పెరిగాయి.
- యూరోపియన్ యూనియన్ భారత్‌కు చెందిన 102 మత్స్య సంస్థలకు ఎగుమతులు చేసేందుకు ఆమోదం తెలపడంతో దేశీయ సీఫుడ్ కంపెనీల షేర్లకు భారీగా డిమాండ్ నెలకొంది. అవంతీ ఫీడ్స్ 15%, అపెక్స్ ఫ్రోజెన్ 16%, కోస్టల్ కార్పొరేషన్ 20%, వాటర్‌బేస్ 7%, జీల్ ఆక్వేరియం 9% ర్యాలీ చేశాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

భారత వృద్ధి అంచనాలు అప్!	ఈక్విటీ ఫండ్స్‌లో తగ్గిన పెట్టుబడుల జోరు!

మన వాహన రంగం ప్రపంచంలోనే టాప్!

- ఐదేళ్లలో సాధించాలని లక్ష్యం
- ప్రస్తుతం పరిశ్రమ పరిమాణం రూ. 22 లక్షల కోట్లు
- కేంద్ర మంత్రి గడ్కరీ వెల్లడి





ఎలక్ట్రిక్ బస్సుల తయారీ పెంచాలి..

న్యూఢిల్లీ: వచ్చే ఐదేళ్లలో భారత ఆటోమొబైల్ పరిశ్రమను ప్రపంచంలోనే నంబర్ వన్‌గా నిలబెట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు కేంద్ర రహదారి రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. తాను రవాణా శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పుడు రూ. 14 లక్షల కోట్లుగా ఉన్న దేశీ ఆటోమొబైల్ పరిశ్రమ ఇప్పుడు రూ. 22 లక్షల కోట్లకు చేరిందని వివరించారు. ప్రస్తుతం అమెరికా పరిశ్రమ రూ. 78 లక్షల కోట్ల విలువతో అగ్రస్థానంలో ఉండగా, రూ. 47 లక్షల కోట్లతో చైనా రెండో స్థానంలో ఉంది. 'భారత వాహన పరిశ్రమను ఐదేళ్లలో ప్రపంచంలోనే నంబర్ వన్‌గా నిలబెట్టాలనేది మా లక్ష్యం. ఇది కాస్త కష్టమే, అయినప్పటికీ, అసాధ్యం మాత్రం కాదు' అని గడ్కరీ చెప్పారు. భారత్‌లో అత్యంత నాణ్యమైన వాహనాలు చౌకగా తయారవుతున్నందున, టాప్ ఆటోమొబైల్ కంపెనీలు ఇక్కడ కార్యకలాపాలు సాగిస్తున్నాయని వివరించారు.

ఈ–20కి వ్యతిరేకంగా పెట్రోల్ లాబీలు ..

ఈ–20 ఇంధనంపై (20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్) ఆందోళనలు వ్యక్తమవుతుండటంపై స్పందిస్తూ.. పెట్రోలియం రంగం దీనికి వ్యతిరేకంగా లాబీయింగ్ చేస్తోందని గడ్కరీ చెప్పారు. 'ప్రతీచోట లాబీలు ఉంటాయి. ఎవరి ప్రయోజనాలు వారివి. పెట్రోల్ లాబీ చాలా సంపన్నమైనది' అని ఆయన వ్యాఖ్యానించారు. వ్యవసాయం రంగంలో ఉపయోగించే వాహనాల్లో ఫ్లెక్స్-ఫ్యూయల్ ఇంజిన్ల వాడకాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.


శిలాజ ఇంధనాల దిగుమతి కోసం భారత్ రూ. 22 లక్షల కోట్లు వెచ్చిస్తోందని, ఇటువంటి ఇంధనాల వల్ల కాలుష్య సమస్య వస్తోందని గడ్కరీ చెప్పారు. ఈ నేపథ్యంలో దేశీ కంపెనీలు చౌకగా పనిచేసే ఎలక్ట్రిక్ కార్లు, బస్సులు, ట్రక్కులు తయారు చేస్తున్నాయని వివరించారు. అయితే, దేశీయంగా ఏటా 1,00,000 మేర ఎలక్ట్రిక్ బస్సుల అవసరం ఉంటే తయారీ సామర్థ్యం మాత్రం 50,000-60,000 మాత్రమే ఉందని ఆయన తెలిపారు. ఎగుమతులకు కూడా భారీగా అవకాశాలు ఉన్నందున ఎలక్ట్రిక్ బస్సుల తయారీని మరింతగా పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. లిథియం అయాన్ బ్యాటరీల ధర కూడా తగ్గుతోందని, కొన్నాళ్లకు ఎలక్ట్రిక్ వాహనాల ధరలు.. పెట్రోల్, డీజిల్ వాహనాల రేట్లకు సమానం అవుతాయని మంత్రి చెప్పారు.

వేగంగా ఎదుగుతున్న ఈవీ మార్కెట్: కుమారస్వామి

ప్రపంచంలోనే అత్యంత వేగంగా ఎదుగుతున్న ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) మార్కెట్లలో ఇప్పుడు భారత్ కూడా ఒకటని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి తెలిపారు. 2024-25లో దేశీయంగా 10 లక్షల ఈవీలు అమ్ముడయ్యాయని ఆయన వివరించారు. వీటిలో ఈ-టూవీలర్ల వాటా 1 శాతంగా, త్రీ-వీలర్ల వాటా 57 శాతంగా ఉందని చెప్పారు. ఆటో రిటైల్ సదస్సుకు పంపిన వీడియో సందేశంలో మంత్రి ఈ విషయాలు తెలిపారు.

రిలయన్స్ ఇంటెలిజెన్స్ షురూ

- సొంత అనుబంధ సంస్థగా ఏర్పాటు
- రిలయన్స్ ఇండస్ట్రీస్ తాజాగా వెల్లడి



న్యూఢిల్లీ: రిలయన్స్ ఇంటెలిజెన్స్ పేరుతో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సేవల కంపెనీకి తెరతీసినట్లు డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ తాజాగా వెల్లడించింది. పూర్తి అనుబంధ కంపెనీగా ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. ఇందుకు కార్పొరేట్ వ్యవహారాల శాఖ నుంచి సర్టిఫికెట్‌ను పొందినట్లు తెలియజేసింది. గత నెలలో నిర్వహించిన వార్షిక సాధారణ సమావేశం(ఏజీఎం)లో కొత్తగా ఏఐ కంపెనీని ఏర్పాటు చేయనున్నట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీ వాటాదారులకు వెల్లడించిన సంగతి తెలిసిందే. తద్వారా భారీస్థాయి ఏఐ మౌలికసదుపాయాలకు తెరతీయనున్నట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా గ్లోబల్ టెక్ దిగ్గజాలు మెటా, గూగుల్‌తో కొత్త భాగస్వామ్యాలను సైతం ప్రకటించారు. గిగావాట్ సామర్థ్యంతో రిలయన్స్ ఇంటెలిజెన్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆర్ఐఎల్ ఇప్పటికే వెల్లడించింది. గ్రీన్ ఎనర్జీ మద్దతుతో ఏఐ-రెడీ డేటా సెంటర్లతో నెలకొల్పుతున్నట్లు తెలియజేసింది. దశాబ్దంక్రితం రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు డిజిటల్ సర్వీసులు గ్రోత్ ఇంజిన్‌గా నిలవగా.. ఇకపై ఏఐతో మరింత పురోభివృద్ధిని అందుకోనున్నట్లు ఏజీఎంలో ముకేశ్ పేర్కొన్నారు.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

ఈఐఎల్‌లో 48 అసోసియేట్ ఇంజనీర్ గ్రేడ్-2, 3పోస్టులు

ఇంజనీర్స్ ఇండియా లిమిటెడ్(ఈఐఎల్)లో ఫిక్స్‌డ్ టర్మ్ ప్రాతిపదికన అసోసియేట్ ఇంజనీర్ గ్రేడ్-2,3 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 48.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్సీ, బీటెక్/బీఈలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 31 నుంచి 41 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు పోస్టును అనుసరించి రూ.72,000 నుంచి రూ.96,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.09.2025
» **ఇంటర్వ్యూ తేదీలు:** 08.10.2025, 09.10.2025, 29.10.2025, 30.10.2025.
» **వెబ్‌సైట్:** https://recruitment.eil.co.in

హెచ్‌ఎల్‌ఎల్ ఇన్‌ఫ్రాటెక్ సర్వీసెస్‌లో 31 మేనేజర్ పోస్టులు

హెచ్‌ఎల్‌ఎల్ లైఫ్‌కేర్ లిమిటెడ్ అనుబంధ సంస్థ హెచ్‌ఎల్‌ఎల్ ఇన్‌ఫ్రాటెక్ సర్వీసెస్ లిమిటెడ్ దేశవ్యాప్తంగా ఉన్న కార్యాలయాలు /ప్రాజెక్ట్‌ల కోసం రెగ్యులర్/ఫిక్స్‌డ్ టర్మ్ ప్రాతిపదికన దేశవ్యాప్తంగా ఉన్న హెచ్‌ఎల్‌ఎల్ కేంద్రాల్లో మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 31.
» **పోస్టుల వివరాలు:** డిప్యూటీ మేనేజర్–19, అసిస్టెంట్ మేనేజర్–12.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగాల్లో డిప్లొమా, డిగ్రీ, బీఈ/బీటెక్, సీఏ/ఐసీడబ్ల్యూఏ, ఎంబీఏ, బీఫార్మ్ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** 31.08.2025 నాటికి అసిస్టెంట్ మేనేజర్‌కు 37 ఏళ్లు, డిప్యూటీ మేనేజర్‌కు 40 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు అసిస్టెంట్ మేనేజర్‌కు రూ.30,000 నుంచి రూ.1,20,000, డిప్యూటీ మేనేజర్‌కు రూ.40,000 నుంచి రూ.1,40,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.09.2025
» **వెబ్‌సైట్:** www.lifecarehll.com

ఐజీఐడీఆర్‌లో 15 నాన్‌టీచింగ్ పోస్టులు

ముంబైలోని ఇందిరా గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెవలప్‌మెంట్ రీసెర్చ్(ఐజీఐడీఆర్).. నాన్‌టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 15.
» **పోస్టులు:** హ్యూమన్ రిసోర్సెస్ ఆఫీసర్, రీసెర్చ్ గ్రాంట్స్ అండ్ ప్రాజెక్ట్ ఆఫీసర్, అకడమిక్ అండ్ స్టూడెంట్ అఫైర్స్, లా ఆఫీసర్, అసిస్టెంట్ సిస్టమ్ అనలిస్ట్ కమ్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, పి.ఎస్. డైరెక్టర్, అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, అసిస్టెంట్ సివిల్ ఇంజనీర్, క్యాంపస్ సేఫ్టీ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్, లైబ్రరీ అసిస్టెంట్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగాల్లో డిగ్రీ, పీజీ, ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం తప్పనిసరిగా ఉండాలి.
» **వయసు:** హ్యూమన్ రిసోర్సెస్ ఆఫీసర్, రీసెర్చ్ గ్రాంట్స్,ప్రాజెక్ట్ ఆఫీసర్, అకడమిక్ అండ్ స్టూడెంట్స్ అఫైర్స్, లా ఆఫీసర్, అసిస్టెంట్ సిస్టమ్ అనలిస్ట్ కమ్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ పోస్టులకు 40 ఏళ్లు, ఇతర పోస్టులకు 35 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు హ్యూమన్ రిసోర్సెస్ ఆఫీసర్, రీసెర్చ్ గ్రాంట్స్ అండ్ ప్రాజెక్ట్ ఆఫీసర్, అకడమిక్ అండ్ స్టూడెంట్ అఫైర్స్, లా ఆఫీసర్, అసిస్టెంట్ సిస్టమ్ అనలిస్ట్ కమ్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ పోస్టులకు రూ.56,100 నుంచి రూ.1,77,500, హాస్టల్ సూపరింటెండెంట్, ప్రొఫెషనల్ అసిస్టెంట్‌లకు రూ.35,400 నుంచి రూ.1,12,400, లైబ్రరీ అసిస్టెంట్‌కు రూ.25,000, ఇతర పోస్టులకు రూ.44,900 నుంచి రూ.1,42,400.
» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్ట్, విద్యార్హతలు, సర్టిఫికేట్‌ల పరిశీలన, ఉద్యోగానుభవం, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.09.2025
» **వెబ్‌సైట్:** www.igidr.ac.in

ఎన్‌డీఏ పరీక్షలో విజయం ఇలా

సాయుధ దళాల్లో ఆఫీసర్ కొలువు కోరుకునే వారికి చక్కటి అవకాశం. యూపీఎస్సీ త్రివిధ దళాల్లో పోస్టుల భర్తీకి ఎన్‌డీఏ, ఎన్‌ఏ(2) 2025 పరీక్షను ఈ నెల 14న ఆఫ్‌లైన్ విధానంలో నిర్వహించనుంది. యూపీఎస్సీ తన అధికారిక వెబ్‌సైట్‌లో ఈ నెల 4వ తేదీ నుంచి అడ్మిట్ కార్డులు అందుబాటులో ఉంచింది. దేశవ్యాప్తంగా వివిధ కేంద్రాల్లో ఒకే రోజున పరీక్ష నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో.. ఎన్‌డీఏ, ఎన్‌ఏ ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, ప్రిపరేషన్ తదితర వివరాలు..

» ఈ నెల 14న ఎన్‌డీఏ, ఎన్‌ఏ(2) 2025 రాత పరీక్ష
» మొత్తం 406 ఖాళీల భర్తీకి ఎంపిక ప్రక్రియ
» ఆఫ్‌లైన్ రాత పరీక్ష, ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూతో ఎంపిక



కేంద్ర ప్రభుత్వ నియామక సంస్థ యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ).. త్రివిధ దళాల్లో ఆఫీసర్ ఉద్యోగాల భర్తీకి ఏటా రెండుసార్లు నేషనల్ డిఫెన్స్ అకాడమీ(ఎన్‌డీఏ), నావల్ అకాడమీ ఎగ్జామినేషన్(ఎన్‌ఏ) నోటిఫికేషన్ విడుదల చేస్తుంది. ఎన్‌డీఏ అండ్ ఎన్‌ఏ 2025(2) ద్వారా.. 2026 జూలై 1న ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌ల్లో ప్రారంభమయ్యే ఎన్‌డీఏకు చెందిన 156వ కోర్సు, అదేవిధంగా 118వ ఇండియన్ నావల్ అకాడమీ కోర్సుల్లో ప్రవేశం పొందొచ్చు. ఈ కోర్సుల్లో చేరి శిక్షణను విజయవంతంగా పూర్తిచేసుకున్న అభ్యర్థులకు త్రివిధ దళాల్లో ఆఫీసర్ స్థాయి కొలువు ఖాయమవుతుంది.

రాత పరీక్ష -ఎగ్జామ్ డే టిప్స్

- మొత్తం 900 మార్కులకు ఆబ్జెక్టివ్ తరహాలో రాత పరీక్ష ఉంటుంది. ఇందులో రెండు పేపర్లు.. పేపర్-1 మ్యాథమెటిక్స్-300 మార్కులకు, పేపర్-2 జనరల్ ఎబిలిటీ టెస్ట్-600 మార్కులకు ఉంటాయి. ప్రతి పేపర్‌కు పరీక్ష సమయం రెండున్నర గంటలు. ప్రశ్న పత్రాలు ద్విభాష(బైలింగ్వల్) ఇంగ్లిష్/హిందీలో ఉంటాయి. నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది.
- పరీక్షకు రెండు రోజుల ముందు సమయం రివిజన్ కోణంలో అత్యంత కీలకమైనదిగా గుర్తించాలి. ఈ విలువైన సమయంలో ముఖ్యమైన అంశాలను వేగంగా రివిజన్ చేయడంపై ఫోకస్ చేయాలి.
- ఇప్పటికే యూపీఎస్సీ పేర్కొన్న సిలబస్ ప్రిపరేషన్ పూర్తి చేసుకున్న అభ్యర్థులు ప్రస్తుత సమయంలో గత ప్రశ్నపత్రాలు, మోడల్ కొశ్చన్స్ ప్రాక్టీస్ చేయడంపై దృష్టిసారించాలి.
- ఇప్పటికే సిద్ధం చేసుకున్న నోట్స్ నుంచి మ్యాథమెటిక్స్ సూత్రాలను రివైజ్ చేసుకోవాలి.
- దినపత్రికల నుంచి సేకరించిన సంక్షిప్త నోట్స్‌ను వేగంగా పునశ్చరణ చేసుకోవడం ద్వారా జనరల్ నాలెడ్జ్ అంశాలపై పట్టు సాధించాలి.
- ప్రస్తుత సమయంలో మోడల్ టెస్టులను ప్రాక్టీస్ చేయడం ద్వారా వేగాన్ని , కచ్చితత్వాన్ని పెంచుకోవాలి.
- పరీక్ష కోణంలో అభ్యర్థి తన బలాలు బలహీనతలపై అవగాహనతో పరీక్ష కేంద్రానికి వెళ్లాలి. పరీక్ష హాల్లో ప్రశ్న పత్రం అందుకున్న తర్వాత బాగా పట్టున్న విభాగాలను తొలుత పూర్తి చేసుకోవాలి. కష్టమైన వాటిని చివర్లో అటెంప్ట్ చేయాలి.
- పరీక్ష కేంద్రంలో టైమ్ మేనేజ్‌మెంట్ అత్యంత కీలకమైనదిగా గుర్తించాలి.
- దీంతోపాటు అభ్యర్థులు ఈ పరీక్షలో విజయం సాధించేందుకు ఫిజికల్‌గా, మెంటల్‌గా ఫిట్‌గా ఉండటం ఎంతో అవసరం.

రెండు దశల్లో ఎంపిక విధానం

2025 మేలో విడుదల చేసిన ఎన్‌డీఏ, ఎన్‌ఏ(2) 2025 ద్వారా త్రివిధ దళాల్లో మొత్తం 406 పోస్టులను భర్తీ చేయనున్నారు.

పోస్టుల వివరాలు

నేషనల్ డిఫెన్స్ అకాడమీ(ఎన్‌డీఏ)కి సంబంధించి ఆర్మీలో 208 పోస్టులు (మహిళలకు 10 పోస్టులు); నేవీలో 42 పోస్టులు(మహిళలకు 5 పోస్టులు); ఎయిర్ ఫోర్స్‌లో 120 పోస్టులు((ఫ్లయింగ్-92 పోస్టులు(మహిళలకు 2 పోస్టులు), గ్రౌండ్ డ్యూటీ(టెక్)-18 పోస్టులు(మహిళలకు 2 పోస్టులు), గ్రౌండ్ డ్యూటీ నాన్ టెక్-10 పోస్టులు(మహిళలకు 2 పోస్టులు)); అదేవిధంగా నావల్ అకాడమీ(10+2 క్యాడెట్‌ఎంట్రీ స్కీమ్)-36 పోస్టులు(మహిళలకు 4 పోస్టులు) ఉన్నాయి.

విద్యార్హతలు

- నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ)కి చెందిన ఆర్మీ వింగ్‌లో పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు ఏదైనా గ్రూప్‌లో ఇంటర్మీడియెట్ లేదా తత్సమాన ఉత్తీర్ణత ఉండాలి.
- నేషనల్ డిఫెన్స్ అకాడమీ(ఎన్‌డీఏ)కి చెందిన ఎయిర్‌ఫోర్స్, నావల్ వింగ్ తోపాటు 10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్‌కు దరఖాస్తు చేసుకునేందుకు మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీలతో ఇంటర్మీడియెట్ లేదా తత్సమాన ఉత్తీర్ణత ఉండాలి.

వయసు

అభ్యర్థులు 2007 జనవరి 1కు ముందు, 2010 జనవరి 1 తర్వాత జన్మించి ఉండరాదు. అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తుకు అర్హులు. నిర్దేశిత శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.

వేతనం

శిక్షణకు ఎంపికైన వారికి ప్రారంభంలోనే నెలకు రూ.56,100 స్టైపెండ్ లభిస్తుంది. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత ప్రతి నెల రూ.56,100 మూల వేతనంతోపాటు డీఏ, హెచ్‌ఆర్ఏ, ఇతర ఆర్థిక ప్రోత్సాహకాలు, సౌకర్యాలు లభిస్తాయి.

ఎంపిక విధానం

ఎన్‌డీఏ, ఎన్‌ఏకు అభ్యర్థుల ఎంపిక రెండు దశల్లో జరుగుతుంది. మొదటి దశలో రాత పరీక్ష నిర్వహిస్తారు. రాత పరీక్షలో ప్రతిభ చూపిన వారికి ఎస్ఎస్‌బీ(సర్వీస్ సెలక్షన్ బోర్డ్) ఇంటర్వ్యూ, మెడికల్ టెస్టుల ఆధారంగా తుది విజేతలను ప్రకటిస్తారు.

ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూకు 900 మార్కులు

- రాత పరీక్షలో ప్రతిభ చూపినవారికి ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ 900 మార్కులకు జరుగుతుంది. ఇందులో స్టేజ్ 1, స్టేజ్ 2 ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. స్టేజ్ 1లో ఆఫీసర్ ఇంటెలిజెన్స్ రేటింగ్, పిక్చర్ పర్సెప్షన్ అండ్ డిస్క్రిప్షన్ టెస్ట్ ఉంటాయి.
- స్టేజ్ 1లో అర్హత సాధించిన వారికి స్టేజ్ 2 నిర్వహిస్తారు. స్టేజ్ 2లో.. ఇంటర్వ్యూ, గ్రూప్ టెస్టింగ్ ఆఫీసర్ టాస్క్స్, సైకాలజీ టెస్టులు, కాన్ఫరెన్స్ ఉంటాయి. ఇవి నాలుగు రోజుల పాటు కొనసాగుతాయి. ఇంటర్వ్యూ ఆఫీసర్, గ్రూప్ టెస్టింగ్ ఆఫీసర్, సైకాలజిస్ట్ అభ్యర్థి వ్యక్తిత్వాన్ని అంచనావేస్తారు.

శిక్షణ

- నేషనల్ డిఫెన్స్ అకాడమీ(ఎన్‌డీఏ)కి చెందిన ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లకు ఎంపికైన అభ్యర్థులకు మూడేళ్లపాటు శిక్షణ ఉంటుంది. ఇందులో భౌతిక శిక్షణ తోపాటు అకడెమిక్ బోధన కూడా ఉంటుంది. ఈ మూడేళ్లల్లో రెండున్నరేళ్లు మూడు సర్వీసులకు ఉమ్మడిగా శిక్షణ ఇస్తారు. మొత్తంగా మూడేళ్ల శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ డిగ్రీలను ప్రదానం చేస్తుంది. ఆర్మీ క్యాడెట్స్‌కు బీఎస్సీ/బీఎస్సీ(కంప్యూటర్స్/బీఏ; నావల్ క్యాడెట్స్‌కు బీటెక్ డిగ్రీ, ఎయిర్ ఫోర్స్ క్యాడెట్స్‌కు బీటెక్/బీఎస్సీ/బీఎస్సీ కంప్యూటర్స్ పట్టాలను అందజేస్తారు.
- 10+2 క్యాడెట్ ఎంట్రీ నావెల్ అకాడమీకి ఎంపికైన అభ్యర్థులకు ఇండియన్ నావల్ అకాడమీ, ఎజిమలలో నాలుగేళ్లపాటు శిక్షణ ఇస్తారు. వీరికి శిక్షణ అనంతరం బీటెక్ డిగ్రీని ప్రదానం చేస్తారు.
- ఇలా శిక్షణను విజయవంతంగా పూర్తిచేసుకున్న అభ్యర్థులకు ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌ల్లో ఆఫీసర్ స్థాయి ఉద్యోగాలైన లెఫ్టినెంట్, సబ్‌లెఫ్టినెంట్, ఫ్లయింగ్ ఆఫీసర్/గ్రౌండ్ డ్యూటీ ఆఫీసర్ హోదాలతో కెరీర్ ప్రారంభమవుతుంది.

ముఖ్య సమాచారం

- హాల్‌టికెట్ విడుదల: 04.09.2025
- రాత పరీక్ష తేది: 14.09.2025
- వెబ్‌సైట్: https://upsconline.nic.in., https://upsc.gov.in

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–సోషియాలజీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం–ఫిజికల్ సైన్స్
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–ఇండియన్ ఎకానమీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం– కంప్యూటర్ అవేర్‌నెస్

యూత్‌కు రెస్ట్ రూమ్



వాష్‌రూముల్లో
కాసేపు సేదతీరుతున్న జెన్–జీ

ఒత్తిడిని జయించేందుకు
'బాత్రూమ్ క్యాంపింగ్'

కొత్త ఆలోచనల కోసమూ
అటువైపే అడుగులు

ప్రపంచవ్యాప్తంగా
ట్రెండ్‌గా మారుతున్న వైనం

సాక్షి, స్పెషల్ డెస్క్: ఎంత చెట్టుకు అంత గాలి అన్నట్టు జీవితంలో ప్రతి ఒక్కరికీ వారివారి స్థాయిలను బట్టి ఒత్తిడి అనేది అనివార్యం అయిపోయింది. సాధారణంగా ఒత్తిడిని జయించేందుకు యోగా, క్రీడలు, సంగీతం, నలుగురితో ముచ్చటించడం, షాపింగ్ థెరపీ వంటివి చేస్తుంటారు. కానీ జెన్–జీ.. అంటే 13–28 ఏళ్ల వయసున్న యువతలో మాత్రం చాలామంది వీటన్నిటికీ భిన్నంగా 'బాత్రూమ్ క్యాంపింగ్'ని ఆశ్రయిస్తున్నారు.

టెంట్, చలి మంటలు, నక్షత్రాలతో మెరిసే ఆకాశం, షాపింగ్.. ఇవేవీ కావు. జస్ట్ తెల్లటి టైల్స్ పరిచిన నాలుగు గోడల మధ్య 'రెస్ట్‌రూమ్స్'లో జెన్ –జీ సేదతీరుతోంది. శారీరక అవసరాల కోసం కాకుండా మానసిక ప్రశాంతతకు బాత్రూమ్‌లో ఎక్కువసేపు గడుపుతున్నారు. శబ్దాలు, జనంతో కిటకిటలాడే ప్రదేశాలకు దూరంగా ప్రశాంతంగా ఉండటానికి, సంగీతం వినడానికి మూసి ఉంచిన కమోడ్‌పై కూర్చుని మనసుని తేలికపర్చుకుంటున్నారు. ఒత్తిడి, ఆందోళన, బాధ, ఓటమి సమయంలోనే కాదు.. సమస్యల నుంచి బయటపడే మార్గాల అన్వేషణ, కొత్త ఆలోచనల కోసమూ అటువైపే అడుగులు పడుతున్నాయి. ఇల్లు, ఆఫీస్ లేదా ఏదైనా పార్టీలో ఉన్నా.. ఒత్తిడికి గురైనప్పుడు, మనసు బాధగా ఉన్నప్పుడు బాత్రూమ్‌ను ఆశ్రయిస్తున్నారు. దీన్నే ఇప్పుడు 'బాత్రూమ్ క్యాంపింగ్' అంటున్నారు.

ప్రపంచానికి దూరంగా..

'నా బాధ, ఒత్తిడి నలుగురికి తెలియాల్సిన అవసరం లేదు. అవి వారికి అక్కరలేదు. అందరికీ కనపడేలా కూర్చుని బాధపడుతుంటే ఈ సమాజం వేలెత్తి చూపుతుంది. అలా కాకుండా బాత్రూమ్‌లో అయితే ఎవ్వరికీ తెలీదు. ఏకాంతం, నిశ్శబ్దంతో కూడిన ప్రశాంత వాతావరణమూ ఉంటుంది. మనల్ని జడ్జ్ చేసే అవకాశం ఇంకొకరికి ఉండదు' అంటోంది జెన్ జీ.

బాత్రూమ్ క్యాంపింగ్ ఎందుకంటే?

ఒత్తిడి	ఓటమి
ఆందోళన	సమస్యకు
కోపం	పరిష్కారం
బాధ	కొత్త ఆలోచనలు

వీటిని ట్రై చేయండి

ఒత్తిడి నుంచి ఉపశమనానికి బాత్రూమ్‌ను ఒక సౌలభ్యమైన స్థలంగా ఈ తరం వాళ్లు భావిస్తూ ఉండవచ్చు. కానీ బాత్రూమ్ అంటే రోగకారక క్రిములకు అడ్డా అని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఆందోళనను నియంత్రించడానికి ఇతర ఆరోగ్యకర మార్గాలూ ఉన్నాయని వారు సూచిస్తున్నారు.

ప్రాణాయామం: శ్వాస ఆధారిత ప్రాణాయామ ప్రక్రియలను నిపుణుల ద్వారా తెలుసుకుని రోజూ చేయడం వల్ల ఒత్తిడి తగ్గి, మెదడు చురుగ్గా పనిచేస్తుందని ప్రపంచ వ్యాప్తంగా అనేక అధ్యయనాలు చెబుతున్నాయి.

ప్రకృతి ఒడిలో: ప్రకృతిని మించిన వైద్యుడు లేడు. పార్కులు, మైదానాల్లో గడ్డిని తాకడం, గడ్డిపై పడుకోవడం, సుందర ప్రకృతి దృశ్యాలను ఆస్వాదించడం.. ఇవన్నీ మనసును ఆహ్లాదపరిచేవే.


సంగీతం,పజిల్స్: నచ్చిన సంగీతాన్ని వినొచ్చు. మెదడుకు పని కల్పించే పజిల్స్ చేయొచ్చు.

ఆఫీసుల్లో: గంటల తరబడి కంప్యూటర్ల ముందు కూర్చోకుండా.. ప్రతీ అరగంట లేదా గంటకు చిన్న విరామం తీసుకోవాలి. ఒత్తిడి అనిపిస్తే.. తేలికపాటి ప్రాణాయామాలు చేయాలి. మీ డెస్క్ వద్ద సరైన భంగిమలో కూర్చునేలా చూసుకోండి.

నో సెల్‌ఫోన్: అలసిపోయినట్టు అనిపించినా.. పని ఎక్కువైనట్టు అనుకున్నా వెంటనే చేతులు ఫోన్ మీదకు వెళ్లిపోతుంటాయి. అలా వెళ్లి.. ఎన్ని ఫేస్‌బుక్ పోస్టులు చూస్తామో / పెడతారో, ఎన్ని రీల్స్ చూస్తారో తెలీదు. అన్నీ మనకు నచ్చినవే ఉండాలని లేదుగా. నచ్చనివి కనిపిస్తే మరింత కోపం, ఒత్తిడి. అందువల్ల ఆందోళన ఉండే సమయాల్లో సెల్‌ఫోన్‌ను (మ్యూజిక్ వినేటప్పుడు తప్ప) పక్కన పెట్టేయండి.

సమయానికి తిండి, నిద్ర

- సమయానికి ఆహారం తీసుకోవాలి. ఎంత పనిలో ఉన్నా, ఒత్తిడి ఉన్నా.. తినే టైమ్‌ను మాత్రం వాయిదా వేయొద్దు. అది మరింత ఒత్తిడి, ఆందోళనకు దారితీస్తుంది.
- తీసుకునే ఆహారంలో అన్ని రకాల పోషకాలూ ఉండేలా చూసుకోవాలి. ముఖ్యంగా పోషకాహార నిపుణులు సూచించే.. ఒత్తిడి తగ్గించే ఆహార పదార్థాలు తీసుకోవాలి.
- రాత్రుళ్లు సమయానికి, వేగంగా నిద్రపోవడం .. తెల్లవారుజామున లేవడం దినచర్యగా పెట్టుకోండి. రాత్రిపూట ఫోన్ లేదా టీవీల్లో సినిమాలు చూడటం సరదాగానే ఉంటుంది గానీ.. దాని ప్రభావం మరుసటి రోజంతా పడుతుంది.



పని.. ఒత్తిడి కాదు!

జెన్–జీలో చాలామంది పనిని ఒత్తిడిగా భావిస్తుంటారు. ఆ మానసిక స్వభావాన్ని ముందు పూర్తిగా మార్చుకోవాలి. కెరీర్‌లో ఎదగాలన్న మనస్తత్వాన్ని పెంపొందించుకుంటే పనిపట్ల ప్రేమ, నిబద్ధత వాటంతటవే పెరుగుతాయి. పనిలో లేదా కెరీర్‌లో వచ్చే సవాళ్లను భవిష్యత్తుకు మెట్లుగా చూడాలి తప్ప.. వాటిని ఒత్తిడిగా భావించినంత కాలం ఎదుగుదల ఉండదు అని గ్రహించాలి.

రెవెన్యూ శాఖలో ఎస్జీడీసీ, డీసీ పదోన్నతులు ఇవ్వండి

మంత్రి పొంగులేటిని కలిసిన డిప్యూటీ కలెక్టర్ల సంఘం



పొంగులేటికి కృతజ్ఞతలు తెలుపుతున్న వీఆర్వోలు, జీపీవోల జేఏసీ నేతలు

సాక్షి, హైదరాబాద్: రెవెన్యూ శాఖలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు (ఎస్జీడీసీ), డిప్యూటీ కలెక్టర్ (డీసీ) కేడర్‌లో పెండింగ్‌లో ఉన్న ఖాళీలను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని తెలంగాణ సివిల్ సర్వీసెస్ (ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్) డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈమేరకు బుధవారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని సంఘ ప్రతినిధులు కలిసి సమస్యను వివరించారు. రెవెన్యూ శాఖ పరిపాలనా పనితీరును బలోపేతం చేయడానికి అర్హులైన డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లకు పదోన్నతులు కల్పించాలని, అలాగే ఖాళీగా ఉన్న 13 ఎస్జీడీసీ పోస్టులు, పదోన్నతుల ద్వారా ఖాళీ అయ్యే డిప్యూటీ కలెక్టర్ ఖాళీలను భర్తీ చేయాలని అభ్యర్థించారు. ఈ అంశంపై మంత్రి సానుకూలంగా స్పందించి రెవెన్యూ శాఖ కార్యదర్శి సీసీఎల్ఏ లోకేశ్‌కుమార్‌ను ఆదేశించారు. మంత్రిని కలిసిన వారిలో ట్రెసా అధ్యక్షుడు వంగా రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గౌతమ్‌కుమార్, వీఆర్ఓ అధ్యక్షుడు గోల్కొండ సతీశ్, డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడు చంద్రమోహన్, ఆఫీస్ బేరర్లు చంద్రకళ, ఉపేందర్‌రెడ్డి, రాజేశ్వరి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వానికి వీఆర్వో, జీపీఓల జేఏసీ కృతజ్ఞతలు

కేసీఆర్ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయంతో రద్దు చేసిన గ్రామ రెవెన్యూ వ్యవస్థను పునర్నిర్మించి గ్రామీణ వ్యవస్థను బలోపేతం చేసి రైతులకు, ప్రజలకు అందుబాటులో ఉండేలా తిరిగి ఆ వ్యవస్థను తీసుకొచ్చినందుకు తెలంగాణ వీఆర్వో, జీపీఓల జేఏసీ చైర్మన్ గోల్కొండ సతీశ్.. సీఎం రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈమేరకు బుధవారం పొంగులేటిని కలిసి హర్షం వ్యక్తంచేశారు.

కుల ధ్రువీకరణ పత్రాల జారీ మరింత సులభతరం: మంత్రి శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: కుల ధ్రువీకరణ పత్రాల జారీని మరింత సులభతరం చేస్తున్నామని ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. అమల్లోకి వచ్చిన కొత్త విధానం తర్వాత 17 వేల మందికిపైగా లబ్ధి చేకూరిందని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మార్పులతో ప్రతి ఏడాది 20 లక్షల మంది ప్రయోజనం పొందుతారన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారు కుల ధ్రువీకరణ పత్రం మళ్లీ తీసుకునేటప్పుడు ప్రతిసారీ ఆమోద ప్రక్రియకు వెళ్లాల్సిన అవసరం లేదని, హిందూ, ఎస్సీ వర్గానికి చెందిన వారు క్రైస్తవ మతంలోకి మారి బీసీ–సీ వర్గంలోకి వచ్చే ప్రత్యేక సందర్భాల్లో మాత్రం పూర్వపు ఆమోద విధానం అమల్లోనే ఉంటుందని మంత్రి వివరించారు. కొత్తగా జారీ చేసే కుల ధ్రువీకరణ పత్రంలో మొదటిసారి ఆమోదం తెలిపిన అధికారి పేరు, కొత్తగా జారీ తేదీ ఉంటాయని, పాత సర్టిఫికెట్ నంబర్ తెలిసినవారు వెంటనే ముద్రణ పొందవచ్చన్నారు. ఒకవేళ గుర్తు లేకపోతే జిల్లా, మండలం, గ్రామం, ఉపజాతి, పేరుతో శోధన చేసి పత్రం ఇస్తారని, పేరు, ఇంటి పేరు, తండ్రి పేరు వంటి సవరణల కోసం మాత్రం జిల్లా అధికారికి ఫిర్యాదు చేసి, కొత్త దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. సీసీఎల్ఏ, బీసీ సంక్షేమం, ఎస్సీ సంక్షేమ శాఖలు, జిల్లా అధికారులు, తహసీల్దార్లతో జరిగిన సంప్రదింపుల తర్వాత ఈ మార్పులు అమల్లోకి వచ్చాయని శ్రీధర్‌బాబు చెప్పారు.

జియో థర్మల్ విద్యుత్‌కు అధిక ప్రాధాన్యం

- హైదరాబాద్‌లో ఎనర్జీ రీసెర్చ్ సెంటర్ ప్రారంభం
- మణుగూరులో పైలట్ ప్రాజెక్టు

సాక్షి, హైదరాబాద్: జియోథర్మల్ విద్యుదుత్పాదనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించింది, దేశంలో మొత్తం 381 థర్మల్ యాక్టివ్ కేంద్రాల్లో దాదాపు 10,600 మెగావాట్ల విద్యుదుత్పాదన చేసే సామర్థ్యం ఉన్నట్లు అంచనా వేశారు. జియో థర్మల్‌కు సంబంధించి కౌన్సిల్ ఫర్ సైంటిఫిక్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్)– నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ఇన్‌స్టిట్యూట్ (ఎన్జీఆర్ఐ)ల ఆధ్వర్యంలో కొత్తగా హైదరాబాద్‌లో 'జియో థర్మల్ ఎనర్జీ రీసెర్చ్ సెంటర్ (సీజీఈఆర్)ను బుధవారం ప్రారంభించింది. ఈ కేంద్రాన్ని సీఎస్ఐఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎస్.కలైసెల్వి ప్రారంభించారు. ప్రస్తుతం అంచనా వేసిన ఈ జియోథర్మల్ విద్యుత్కేంద్రాల నుంచి ఉత్పత్తయ్యే విద్యుత్‌తో దాదాపు ఏడుకోట్ల గృహాలకు విద్యుత్ సరఫరా చేయడానికి వీలుందని అంచనా వేశారు. ప్రస్తుతం తెలంగాణలో పైలట్ ప్రాజెక్టు కింద మణుగూరులో 20 కిలోవాట్ల సామర్థ్యంతో విద్యుదుత్పాదన జరుగుతోంది. పర్యావరణ కాలుష్యం ఉండదని, నిర్వహణ ఖర్చులు కూడా చాలా తక్కువగా ఉండటం వల్ల దీర్ఘకాలంలో జియో థర్మల్ ఎనర్జీ కేంద్రాలతో లాభాలు ఎక్కువని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. కాగా ఈ కేంద్రం ప్రారంభం సందర్భంగా సీఎస్ఐఆర్ డైరెక్టర్ జనరల్ మాట్లాడుతూ 'భారత్‌లో విద్యుత్ అవసరాలు పెరుగుతున్నాయి. 2070 నాటికి నెట్ జీరో లక్ష్యం సాధించాలంటే కొత్త ప్రత్యామ్నాయాలు తప్పనిసరి'అని పేర్కొన్నారు. వక్తలు డాక్టర్ అభయ్ అనంత్ పాళిల్‌కర్, డా. జి.కె. పాత్రా తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నుంచి 102 టీఎంసీలు అవసరం

- నీటిపారుదల శాఖకు నల్లగొండ సీఈ లేఖ

సాక్షి, హైదరాబాద్: వచ్చే డిసెంబర్ చివరి నాటికి రాష్ట్ర సాగు, తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ జలాశయం నుంచి 102.5 టీఎంసీల నీళ్లు అవసరమని నీటిపారుదల శాఖ నల్లగొండ చీఫ్ ఇంజనీర్ వి.అజయ్ ఈనెల 8న ఆ శాఖ ఈఎన్సీకి (జనరల్)లేఖ రాశారు. సాగునీటికి 88.5 టీఎంసీలు, తాగునీటికి 14 టీఎంసీలు అవసరమని తెలిపారు. సాగర్ఎడమ కాల్వకి 70 టీఎంసీలు, ఏఎమ్మార్పీ ప్రాజెక్టుకి 32.5 టీఎంసీలు అవసరమన్నారు. గత జూన్ 1 నుంచి గత ఆగస్టు 31 వరకు నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి తెలంగాణ 26.715 టీఎంసీలను వాడుకోగా, ఏపీ 28.03 టీఎంసీలను వాడుకుందని వెల్లడించారు. కనీస నీటిమట్టానికి ఎగువన సాగర్‌లో 178 టీఎంసీలు, శ్రీశైలంలో 157 టీఎంసీల జలాలున్నాయని తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర నీటి అవసరాలను కృష్ణాబోర్డు దృష్టికి తీసుకెళ్లి నీటి విడుదలకి అనుమతులు పొందాలని విజ్ఞప్తి చేశారు.



సాగర్ క్రస్ట్ గేట్లు మూసివేత

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ జలాశయానికి ఎగువనుంచి వస్తున్న వరద తగ్గడంతో రేడియల్ క్రస్ట్‌గేట్లను బుధవారం మూసివేశారు. ప్రస్తుతం ఎగువన శ్రీశైలం జలాశయం నుంచి 55,244 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా అంతే నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుదుత్పాదన ద్వారా 33,495 క్యూసెక్కులు కృష్ణానదిలోకి వదులుతున్నారు. కుడి, ఎడమ కాల్వలు, ఏఎమ్మార్పీ, వరద కాల్వలకు 21,749 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. సాగర్ గరిష్ట స్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.0450 టీఎంసీల సామర్థ్యం) కాగా.. ప్రస్తుతం 589.20 అడుగులు(309.6546 టీఎంసీలు) ఉంది.

కలంపై కూటమి కత్తి.. ఖండిద్దాం గొంతెత్తి

సాక్షి ఎడిటర్, పాత్రికేయులకు వెల్లువెత్తుతున్న సంఘీభావం • ఏపీ పోలీసుల కేసులపై ముక్తకంఠంతో ఖండన



సాక్షి, హైదరాబాద్: పత్రికాస్వేచ్ఛను హరించేలా ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తున్న తీరును తెలంగాణకు చెందిన పలు రాజకీయ పార్టీల నేతలు, జర్నలిస్టు సంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ తీరు పత్రికల గొంతునొక్కడమేనన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. 'సాక్షి'దినపత్రిక ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి, బ్యూరో ఇన్‌చార్జి, రిపోర్టర్లపై ఏపీ ప్రభుత్వ ప్రోద్బలంతో అక్కడి పోలీసులు కేసులు పెట్టి ఆఫీస్‌కు వచ్చి మరీ నోటీసులు అందజేయడంపై వారు మండిపడ్డారు. 'సాక్షి'ఆంధ్రప్రదేశ్ ఎడిషన్‌లో ప్రచురితమైన వార్తపై చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కేసు పెట్టి నోటీసులు ఇవ్వడాన్ని తప్పుబట్టారు. వార్తాపత్రికలో వచ్చిన ఏదైనా వార్తపై అభ్యంతరాలుంటే ఖండించడం, వివరణ ఇవ్వడం సంప్రదాయం కాగా.. ఏకంగా కేసులు పెట్టి సాక్షి జర్నలిస్టులకు నోటీసులు ఇవ్వడాన్ని తప్పుబట్టారు. పత్రికాస్వేచ్ఛకు విఘాతం, భంగం కలిగేలా, ప్రజాస్వామ్య విలువలకు భంగం వాటిల్లేలా ఏపీ ప్రభుత్వ ఆదేశాలతో పోలీసులు వ్యవహరించడాన్ని ఖండించారు. ఈ అంశానికి సంబంధించి పార్టీల నాయకులు, జర్నలిస్టు సంఘాల నేతల అభిప్రాయాలు.. వారి మాటల్లోనే...

పత్రికాస్వేచ్ఛను కాపాడాలి



ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికల పట్ల, పత్రికాస్వేచ్ఛ పట్ల పౌరులతో పాటు రాజకీయ పార్టీలకు కూడా గౌరవం ఉండాలి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పనితీరు గురించి వైఎస్సార్‌సీపీ నేతలు మాట్లాడిన మాటలను ప్రచురించినందుకుగాను 'సాక్షి'దినపత్రిక ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిపై అక్కడి పోలీసులు కేసు నమోదు చేయడం సరైంది కాదు. పత్రికలు పనిగట్టుకుని ప్రత్యేక కథనాలు రాస్తే తప్పు పట్టాలి. ఎవరో అన్నది రాస్తే కేసులు పెట్టడం సమంజసం కాదు. వారు చెప్పిన అంశంలో తప్పులు, అభ్యంతరాలుంటే ఆ మాటలు మాట్లాడినవారిపై కేసులు పెట్టుకోవచ్చుగానీ.. ప్రచురించిన పత్రికలపై పెట్టడం సరైంది కాదు.

– మహేశ్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్సీ, టీపీసీసీ అధ్యక్షుడు

వివరణ లేదా రిజాయిండర్ ఇవ్వాలి



వార్తాపత్రికల్లో వచ్చే ప్రతి విమర్శపై కేసు పెట్టే పద్ధతి, విధానం సరికాదు. ప్రతి కేసు విచారణకు ముందే సరైన ఆధారాలు ఉన్నాయా లేదా అనేది తెలుసుకోవాల్సిన బాధ్యత పోలీసులపై ఉంది. ఏదైనా ఫిర్యాదు వస్తే అందులోని నిజానిజాలను నిర్ధారించుకోవాల్సిన అవసరం ఉంది. ఆధారాలు లేకుండా కేసులు పెట్టడం చట్టవిరుద్ధం. కాగ్నిజబుల్ అఫెన్స్ విషయంలో ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా పోలీసులు కేసులు పెట్టొచ్చుగానీ.. పత్రికల్లో వచ్చిన వార్తలు, రాజకీయ విమర్శలపై కేసులు పెట్టడం సరికాదు. పత్రిక సంప్రదాయాలు, విలువలు కాపాడే విషయంలో ప్రచురితమైన వార్తపై అభ్యంతరాలుంటే ఏదైనా వివరణ లేదా రిజాయిండర్ ఇవ్వాలి. దానిని ఆ పత్రిక ప్రచురించకపోతే తదుపరి చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుంది.

– ఎన్.రాంచందర్‌రావు, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు

పత్రికాస్వేచ్ఛపై దాడే



సాక్షి ఎడిటర్‌పై అక్రమకేసును తీవ్రంగా ఖండిస్తున్నాం. ఏపీలో అదిరించి, బెదిరించి మీడియాను, రిపోర్టర్లను లొంగదీసుకోవాలనే ప్రయత్నంలో భాగంగా తప్పుడు కేసులు నమోదు చేసినట్లు భావిస్తున్నాం. ఒక రాజకీయ నాయకుడు తమ పార్టీ విధానం మేరకు మాట్లాడితే దాన్ని ప్రచురించడాన్ని అక్కడి ప్రభుత్వం తప్పుగా చిత్రీకరించడం, తప్పుడు కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్యంపైన, పత్రికాస్వేచ్ఛపైన దాడి చేయడమే.

– దాసోజు శ్రవణ్, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ

చట్టం ముందు నిలబడవు



ప్రజాస్వామ్యంలో పత్రికాస్వేచ్ఛ చాలా ప్రధానమైంది. ఒక రాజకీయ నాయకుడు పెట్టిన ప్రెస్‌మీట్ వార్తను ప్రచురించినందుకు సాక్షి దినపత్రిక ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిపై కేసు పెట్టడం ఏ మాత్రం సమంజసం కాదు. అది పత్రికాస్వేచ్ఛను హరించడమే. ఇలాంటి చర్యలు మీడియా గొంతు నొక్కేయడం తప్ప మరొకటి కాదు. పత్రికలు తమపని తాము చేసినప్పుడే సమాజంలోని అన్ని వర్గాల అభిప్రాయాలు ప్రజలకు చేరువవుతాయి. అలా చేరువ కావడం ద్వారానే ప్రజలు చైతన్యవంతులై ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. సాక్షి ఎడిటర్‌పై కేసులు పెట్టడాన్ని ఖండిస్తున్నాం. ఆధారాల్లేని కేసులు చట్టప్రకారమే కాదు.. ప్రజల ముందు కూడా నిలబడవు.

– జూలకంటి రంగారెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే

పత్రికా స్వేచ్ఛకు కళ్లెం వేయడమే



రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి భంగం కలిగించడమే. విలేకరుల సమావేశంలో ఒక వ్యక్తి పేర్కొన్న అంశాలను ప్రచురిస్తే కేసు పెట్టడం సరైంది కాదు. పత్రికాస్వేచ్ఛ విషయంలో సమాజంలోని అన్నివర్గాలు గౌరవ దృక్పథం కలిగి ఉండాలి. ప్రెస్‌మీట్ వార్తను ప్రచురించిన సాక్షి పత్రిక ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డికి నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకునేంత వరకు వెళ్లడం పత్రికాస్వేచ్ఛకు కళ్లెం వేయడం లాంటిదే.

– చాడ వెంకటరెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు

సమాజం హర్షించదు

ప్రజాస్వామ్యంలో పత్రికాస్వేచ్ఛ చాలా ముఖ్యమైనది. భావవ్యక్తీకరణకు, అభిప్రాయాలను పంచుకునేందుకు, ప్రభుత్వానికి ప్రజల వాణిని వినిపించేందుకు పత్రికలు చాలా కీలకపాత్ర పోషిస్తాయి. అలాంటి పత్రికలపై, పత్రికా సంపాదకులపై పనిగట్టుకుని కేసులు నమోదు చేయడం సమంజసం కాదు. ప్రెస్‌మీట్ వార్త ప్రచురించినందుకుగాను సాక్షి పత్రిక ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిపై ఏపీ పోలీసులు కేసు పెట్టడాన్ని ఖండిస్తున్నాం. ఇలాంటి ధోరణి ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టులాంటిది. ప్రభుత్వాలు ఏవైనా ఇలాంటి చర్యలను సమాజం స్వీకరించదు. ప్రభుత్వాలు ప్రజాస్వామ్యంపై నమ్మకముంచాలి.

– కలవెన శంకర్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు

రాజ్యాంగ హక్కులను కాలరాస్తోంది

సాక్షి ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిపై పలు సెక్షన్ల కింద అక్రమ కేసులు పెట్టడాన్ని ఖండిస్తున్నాం. ప్రజాసమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వవైఫల్యాల గురించి పత్రికలో రాస్తే ఏకంగా సాక్షి ఎడిటర్‌ను లక్ష్యంగా చేసుకుని పలు సెక్షన్ల కింద అక్రమ కేసులు పెట్టడం సబబు కాదు. ఇలాంటి చర్యలతో రాజ్యాంగ హక్కులను హరించినట్లే. ప్రజల గొంతుకగా నిలిచే మీడియా గొంతు నులిమే ప్రయత్నం చేయడం సరికాదు. పత్రికల్లో వచ్చిన వార్తల్లో అభ్యంతరాలుంటే వివరణ కోరాలి గానీ.. ఇలా అక్రమ కేసులు పెట్టి పత్రిక స్వేచ్ఛకు భంగం కలిగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం.

– జాజుల లింగంగౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి

ఇది దుర్మార్గం

సాక్షి పత్రిక ఎడిటర్, జర్నలిస్టులపై కేసులు భావ ప్రకటన స్వేచ్ఛను హరించడమే. పత్రిక గొంతు నులిమే ప్రయత్నం చేయడం, వార్తలు ప్రచురించకుండా బెదిరింపులకు దిగడం వంటివి దుర్మార్గం. వార్తాపత్రికలో ప్రచురితమైన వార్తపై అభ్యంతరాలుంటే వివరణ కోరవచ్చు. గుడ్డిగా రాజకీయ కక్ష సాధింపునకు పాల్పడడం సహించరానిది.

– కె.రాంనారాయణ, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

13న జాతీయ లోక్ అదాలత్

సాక్షి, హైదరాబాద్: ఎన్ఐ యాక్ట్, ఎక్సైజ్ కేసులు, కార్మిక వివాదాలు, మ్యాట్రిమోనియల్, సివిల్ కేసుల్లో రాజీ కోసం ఈ నెల 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ (టీఎస్ఎల్ఎస్ఏ) సభ్య కార్యదర్శి సీహెచ్. పంచాక్షరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా, ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. హైకోర్టుతో పాటు తాలూకా కోర్టుల్లోనూ లోక్ అదాలత్ జరుగుతుందని తెలిపారు. కేసులను పరిష్కరించుకోవాలనుకునే వారు.. జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, న్యాయసేవా సదన్, మండల న్యాయసేవా కమిటీలను సంప్రదించాలని సూచించారు.

రూ.14 కోట్ల గంజాయి పట్టివేత

- శంషాబాద్‌లో బ్యాంకాక్ ప్రయాణికుడి నుంచి స్వాధీనం



శంషాబాద్ (హైదరాబాద్): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో మంగళవారం అర్ధరాత్రి ఒక ప్రయాణికుడి వద్ద రూ.14 కోట్ల విలువైన గంజాయి పట్టుబడింది. బ్యాంకాక్ నుంచి వచ్చిన ఈ ప్రయాణికుడి కదలికలను అనుమానించిన భద్రతాధికారులు అతని లగేజీని తనిఖీ చేయగా.. హైడ్రోఫోనిక్ పద్ధతిలో పెంచిన గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. బహిరంగ మార్కెట్ వీటి విలువ సుమారు రూ.14 కోట్ల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రయాణికుడిని హైదరాబాద్ ప్రాంతానికి చెందిన సయ్యద్ రిజ్వీగా గుర్తించారు. హైడ్రోఫోనిక్ పద్ధతిలో పెంచిన గంజాయిని.. కొన్ని మాసాలుగా బ్యాంకాక్ సంబంధిత ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన సంఘటనలు ఇప్పటికి మూడు వరకు జరిగాయి. హైదరాబాద్‌లోని స్మగ్లర్లకు వీరు క్యారియర్లుగా పనిచేస్తున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు.

బోధన్‌లో ఉగ్ర కలకలం

- ఎన్ఐఏ అదుపులో ఉగ్ర లింకులున్న యువకుడు
- నిందితుడి ఇంట్లో ఎయిర్ గన్ స్వాధీనం

బోధన్ టౌన్ (బోధన్): నిజామాబాద్ జిల్లా బోధన్‌లో ఉగ్ర లింకులున్న యువకుడిని బుధవారం నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీకి చెందిన ఒక ఉగ్రవాదిని ఎన్ఐఏ పోలీసులు విచారించిన సమయంలో.. ఢిల్లీతో పాటు బోధన్‌లోనూ ఉగ్రలింకులున్న వారున్నట్లు తేలిందని తెలిసింది. దీంతో నిఘా వేసిన ఎన్ఐఏ పోలీసులు.. బోధన్ పట్టణంలోని ఆనీసా నగర్ కాలనీకి చెందిన హాజీ యామన్ అనే యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల కాలంలో హాజీ యామన్ అంతర్జాతీయ కాల్స్ ఎక్కువగా మాట్లాడినట్లు ఎన్ఐఏ పోలీసులు గుర్తించారు. పక్కా సమాచారంతో బోధన్‌కు వచ్చిన ఎన్ఐఏ పోలీసులు యువకుడిని పట్టుకున్నారు. నిందితుని ఇంట్లో సోదాలు నిర్వహించి ఎయిర్ గన్‌ను స్వాధీనం చేసుకున్నారు. తర్వాత యువకుడిని బోధన్ కోర్టులో హాజరుపరిచి, అనంతరం ఢిల్లీకి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఎన్ఐఏ పోలీసులు నిందితుడిని ఢిల్లీకి తీసుకెళ్లే ముందు.. నిజామాబాద్ పోలీసు కమిషనర్ సాయి చైతన్య ఎడపల్లి పోలీసు స్టేషన్‌లో విచారించినట్లు తెలిసింది. అల్లర్ల సమయంలో ఎలా వ్యవహరించాలో కొందరితో రహస్యంగా చర్చించానని విచారణలో నిందితుడు చెప్పినట్లు సమాచారం.

రిమ్స్, ఎంజీఎంలోనూ అవయవమార్పిడి సర్జరీలు

ప్రోత్సాహానికి చర్యలు తీసుకోవాలని మంత్రి దామోదర ఆదేశం

- సీనియర్ వైద్యులతో ప్రత్యేక బృందాలు
- అధికారులతో పలు అంశాలపై మంత్రి సమీక్ష



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఆసుపత్రులలో అవయవ మార్పిడి శస్త్రచికిత్సలను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. నిమ్స్, గాంధీ, ఉస్మానియా ఆసుపత్రులతో పాటు ఆదిలాబాద్ రిమ్స్, వరంగల్ ఎంజీఎంలోనూ అవయవమార్పిడి సర్జరీలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జీవన్‌దాన్ పథకం పనితీరు, ప్రభుత్వ దవాఖానాల్లో అవయవ మార్పిడి చికిత్సలు.. తదితర అంశాలపై బుధవారం జూబ్లీహిల్స్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో అధికారులతో ఆయన సమావేశమయ్యారు. అన్ని ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ఆర్గాన్ రిట్రైవల్ సెంటర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. సీనియర్ వైద్యులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని, ఒక్కో ఆర్గాన్‌కు ఒక్కో టీమ్ ఉండాలని ఆరోగ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తుకు మంత్రి సూచించారు. దీనికి సంబంధించి కేంద్ర చట్టానికి అనుగుణంగా కొత్త నిబంధనల రూపకల్పనపై సమావేశంలో చర్చించారు. ఈ చట్టం ప్రకారం ఇరువురు రోగుల కుటుంబ సభ్యులు ఒకరికొకరు అవయవాలు దానం చేసుకునే వెసులుబాటు ఉంటుందని, స్వాపింగ్ విషయంలో ఇతర రాష్ట్రాలు అవలంబిస్తున్న నిబంధనలను పరిశీలించి, బాధితులను ఆదుకునే విధంగా నిబంధనలు రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అవయవదానంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జీవన్‌దాన్ కోఆర్డినేటర్ డాక్టర్ భూషణ్‌రాజుకు మంత్రి సూచించారు. అవయవ దాతల దహన సంస్కారాలకు ఆర్థిక సాయం అందించడంతో పాటు, వారి కుటుంబాలకు అండగా ఉండేందుకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని మంత్రి ఆదేశించారు. ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో జరుగుతున్న అవయవమార్పిడి సర్జరీలపై నిరంతరం నిఘా పెట్టాలని ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించే ఆసుపత్రుల విషయంలో కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సమావేశంలో డీఎంఈ డాక్టర్ నరేంద్ర కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సెల్‌ఫోన్‌లో... రుణ రక్కసి..!

చేతిలో సెల్‌ఫోన్ ఉంటే చాలు ఎటువంటి ష్యూరిటీ లేకుండానే క్షణాల్లో రుణం పొంద వచ్చని ఆశ చూపుతారు. యాప్ డౌన్‌లోడ్ చేసి క్లిక్ చేస్తే ఇక అంతే సంగతులు. చేతికొచ్చే నగదు ఖర్చు చేసేలోపే యాప్ నిర్వాహకుల నుంచి ఫోన్ల మోత మొదలవుతుంది. వడ్డీ కట్టాలని వేధిస్తూ బూతులతో రెచ్చిపోతారు. కడతామని చెప్పినా.. వాళ్ల కర్కశం ఆగదు. మనకు తెలియకుండా డేటా చోరీ చేసి ఫేక్ నగ్న ఫొటోలను కాంటాక్ట్ లిస్టులో ఉన్నవాళ్లకు పంపే దుశ్చర్యకు పాల్పడతారు. ఇలా ఉక్కిరి బిక్కిరి చేసి మన పరువు తీసే వ్యూహానికి ఒడిగడతారు. వారి ఆగడాలకు బలైపోతున్న అభాగ్యులు ఎందరో ఉన్నారు. అందుకే రుణ రక్కసి వలలో చిక్కకుండా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

- లోన్ పేరుతో యువతకు యాప్‌ల వల
- ష్యూరిటీ లేకుండానే అప్పులు
- ఆపై అధిక వడ్డీల కోసం వేధింపులు
- ఆత్మహత్యలకు పాల్పడుతున్న బాధితులు

హిరమండలం: పెరుగుతున్న టెక్నాలజీని కొందరు కేటుగాళ్లు ఉపయోగించుకుంటూ అమాయకులకు గాలం వేస్తున్నారు. ష్యూరిటీ లేకుండానే రుణం అని చెప్పి ఆకర్షిస్తున్నారు. అలా ప్రైవేటు యాప్‌ల ద్వారా రుణం తీసుకున్న తర్వాత అసలు కథ మొదలవుతుంది. తీసుకున్న నగదు కంటే వడ్డీకి వడ్డీ వేసి అధిక మొత్తం కట్టాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. లేదంటే ఫేక్ నగ్న వీడియోలు వైరల్ చేస్తామని బ్లాక్ మెయిల్‌కు దిగుతారు. వారి టార్చర్ తట్టుకోలేక కొందరు లోలోపలే కుంగిపోతుంటే.. మరికొంతమంది ఆత్మహత్యలకు సైతం పాల్పడుతున్నారు. అందువలన ప్రైవేటు యాప్స్‌లో రుణాలు తీసుకుని మోసపోవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

అనేకమంది బాధితులు

మీ సెల్‌ఫోన్‌లో ఒకే ఒక క్లిక్‌తో యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి. హామీ లేకుండా రుణం పొందండంటూ రుణయాప్ నిర్వాహకులు ఇచ్చే ప్రకటనలతో కొందరు డౌన్‌లోడ్ చేసేస్తున్నారు. ఇదే వారి పాలిట శాపంగా మారుతోంది. ఒక్కసారి యాప్ వలలో చిక్కితే బయటపడడం అసాధ్యం. ఇలా యాప్‌ల బారిన పడినవారు అనేక మంది బాధితులు బయటకు చెప్పుకోలేక మదన పడుతున్నారు. లోన్‌యాప్స్ నిర్వాహకులు .. మీరు రుణం తీసుకోవడానికి ఎంపికయ్యారంటూ ఫోన్లు చేసి యువతకు వల వేస్తున్నారు. చూద్దామని చెబితే చాలు.. రుణం తీసుకునే వరకు ఫోన్ చేసి, ఏదోవిధంగా ఒప్పించి రుణం తీసుకునేలా చేస్తారు. తీరా లోన్ యాప్ ద్వారా రుణం తీసుకుంటే చుక్కలు చూపిస్తున్నారు.



వేధింపులు ఇలా..

రుణం తీసుకున్న రోజు నుంచే చెల్లింపుల కోసం నిర్వాహకులు తీవ్రంగా ఒత్తిడి చేస్తారు. చెల్లింపులు ఆలస్యమయ్యే కొద్దీ వేధింపులు తీవ్రతరమవుతాయి. రుణ గ్రహీత మొబైల్‌కు పరువు, ప్రతిష్టకు భంగం కలిగించే పోస్టులతో దుష్ప్రచారాలతో కూడిన సందేశాలు, అభ్యంతరకర ఫొటోలు పంపుతారు. బెదిరింపులను లెక్క చేయకపోతే రుణం తీసుకున్నవారి కుటుంబ సభ్యుల ఫొటోలను మార్ఫింగ్ చేసి, రుణం పొందిన వారి సెల్‌ఫోన్‌లోని కాంటాక్టు నంబర్లకు వాట్సప్‌కు పంపుతారు. వీరి ఆగడాలు కొందరు బయట చెప్పుకోలేక నలిగిపోతున్నారు. కొందరు యువకులు రుణం తీర్చడానికి కుటుంబ సభ్యులను మోసం చేయడం, చోరీలకు సైతం పాల్పడడం జరుగుతున్నాయి. ముఖ్యంగా యాప్‌ల నిర్వాహకులు గ్రామీణ ప్రాంతాలపైనే కన్నేశారు.

శ్రీకాకుళం జిల్లా హిరమండలానికి చెందిన ఒక వ్యాపారి కుమారుడు లోన్ యాప్ ద్వారా లోన్ తీసుకున్నాడు. అయితే అతను సక్రమంగా చెల్లించకపోవడంతో యాప్ నిర్వహకులు గ్రామంలోని ఒకరికి ఫోన్‌చేసి మీరు ష్యూరిటీ పెట్టారు కదా చెల్లించండని వేధించారు. విసిగిపోయిన ఆయన మీ మీద పోలీసులకు ఫిర్యాదు చేస్తాను.. అని గట్టిగా చెప్పడంతో అప్పటినుంచి ఫోన్ కాల్స్ రావడం లేదు. ఇలాంటి బాధితులు గ్రామాల్లో ఎంతో మంది ఉన్నారు. బయటకు చెప్పుకోలేక కుమిలిపోతున్నారు.

పోలీసులకు ఫిర్యాదు చేయాలి



స్మార్ట్ ఫోన్‌లో మనకు తెలియని యాప్‌లు కనిపిస్తే వాటి జోలికి వెళ్లవద్దు. అదేవిధంగా తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీలు చెప్పమని అడిగినా చెప్పవద్దు. ప్రతీ యాప్‌ను క్లిక్ చేయకూడదు. క్లిక్ చేశారంటే ఇబ్బందులను కొని తెచ్చుకున్నట్లే. రుణయాప్‌లో అప్పులు తీసుకుని మోసపోవద్దు. హామీ లేకుండా రుణాలు వస్తున్నాయని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆశ పడవద్దు. రుణాల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. లోన్‌యాప్ నిర్వాహకుల నుంచి ఎటువంటి వేధింపులు వచ్చినా పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

– సీహెచ్ ప్రసాద్, సీఐ, కొత్తూరు

క్లుప్తంగా...

రాష్ట్రానికి కొత్తగా 1,050 ఎలక్ట్రికల్ బస్సులు

ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

ఉదయగిరి: రాష్ట్రానికి త్వరలో కొత్తగా 1,050 ఎలక్ట్రికల్ బస్సులు వస్తున్నాయని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు తెలిపారు. ఆయన బుధవారం ఉదయగిరి ఆర్టీసీ డిపోను సందర్శించారు. ఈ ప్రాంతంలో స్త్రీశక్తి పథకం అమలుతీరు, ఎదురవుతున్న సమస్యలు తదితర అంశాలపై అధికారులు సిబ్బందితో సమీక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ స్త్రీశక్తి పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారన్నారు. ఎలక్ట్రికల్ బస్సులతోపాటు మరో 1,500 బస్సులు కొనుగోలు చేయనున్నాయన్నారు. ఫలితంగా ప్రయాణికుల రద్దీని తట్టుకోగలమన్నారు. ప్రస్తుతం ఆర్టీసీలో ఆక్యుపెన్సీ రేషియో పెరిగిందన్నారు. ఆర్టీసీ సిబ్బంది ప్రయాణికులతో మర్యాద పూర్వకంగా వ్యవహరిస్తూ, సంస్థ అభివృద్ధికి కృషి చేస్తూ మంచి పేరు తేవాలన్నారు. గతంలో 40 శాతం ఉన్న మహిళా ప్రయాణికుల శాతం ప్రస్తుతం 65 శాతం పైబడిందన్నారు. బస్టాండ్లలో మహిళలకు మెరుగైన వసతులు కల్పిస్తామన్నారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించి ఆదర్శ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందించారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ విరమించుకోవాలి: బీఎస్పీ



జాన్ మోషే

మలికిపురం: మెడికల్ కాలేజీలు ప్రైవేట్ పరం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోనసీమ జిల్లా బీఎస్పీ అధ్యక్షుడు బూశి జాన్ మోషే డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మలికిపురంలో విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు వైద్య విద్యను దూరం చేయడానికి మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేస్తూ క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవడంతో బహుజన విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, ఆయా విద్యార్థులకు వైద్య విద్య చదవాలనే ఆలోచన కూడా లేకుండా వారి కలలను చిదిమేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయం అన్యాయంగా ఉందని, ముఖ్యమంత్రి తీసుకువచ్చిన పీపీపీ విధానం ఆయన సామాజిక వర్గానికి ప్రయోజనంగా ఉందే తప్ప దీని వల్ల బహుజనులకు ప్రయోజనం లేదని, దానివల్ల ఎంబీబీఎస్ సీట్లు అన్నీ ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకుంటారని మెడికల్ కాలేజీలు ప్రైవేట్ పాలనలోకి వస్తే ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కోల్పోతారని అన్నారు.

ప్రాణాలు కాపాడిన ఎయిర్ బ్యాగ్



కారులో ఓపెన్ అయిన ఎయిర్ బ్యాగ్

రేణిగుంట: తిరుపతి జిల్లా రేణిగుంట మండలంలోని గాజుల మండ్యం కాలనీ సమీపంలోని తిరుపతి–చెన్నై జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారులోని ఎయిర్ బ్యాగ్ ఓపెన్ అవడంతో పెను ప్రమాదం తప్పింది. గాజుల మండ్యం ఎస్ఐ సుధాకర్ కథనం మేరకు.. నగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న దినేష్ బుధవారం ఉదయం తిరుపతి నుంచి నగిరికి భార్య పిల్లలతో కలిసి కారులో వెళుతుండగా, మార్గం మధ్యలో గాజుల మండ్యం కాలనీ సమీపంలో కారు అదుపుతప్పి పక్కనే ఉన్న కల్వర్టును ఢీకొంది. కారులోని ఎయిర్ బ్యాగ్ ఓపెన్ కావడంతో ప్రాణాపాయం తప్పింది. దినేష్‌కు, అతని భార్యకు గాయాలవగా స్థానికులు చికిత్స నిమిత్త ప్రవేట్ ఆస్పత్రికి తరలించారు. గాజుల మండ్యం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి గురైన కారుని తొలగించి ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు.

దిగొస్తున్న ద్విచక్ర వాహనాలు

- జీఎస్టీ 2.0తో భారీగా తగ్గనున్న బైక్ ధరలు
- 350 సీసీ లోపు బైక్‌లపై 28 నుంచి 18 శాతానికి తగ్గిన జీఎస్టీ
- ఈ నెల 22 నుంచి కొత్త రేట్లు
- రూ.10 వేలు నుంచి రూ.20 వేల వరకు తగ్గిస్తున్నట్లు కంపెనీల ప్రకటనలు



విశాఖ సిటీ : ద్విచక్ర వాహనాలు కొనాలనుకుంటున్నారా? రెండు వారాలు ఆగండి. జీఎస్టీ స్లాబుల సవరణతో బైక్‌ల ధరలు భారీగా తగ్గనున్నాయి. దసరా, దీపావళి పండగకు ముందే డిస్కౌంట్ల ఆఫర్లు అందుబాటులోకి రానున్నాయి. అన్ని ద్విచక్ర వాహనాలు రూ.10 వేలు నుంచి రూ.20 వేల వరకు తక్కువకు లభించనున్నాయి. జీఎస్టీ రేటు సవరణతో బైక్ మార్కెట్‌లో కొత్త జోష్ కనిపిస్తోంది. ఈ నెలాఖరు నుంచి భారీగా బైక్ విక్రయాలు జరుగుతాయని వ్యాపారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే దాదాపుగా అన్ని కంపెనీలు తగ్గింపు ధరలను సైతం ప్రకటించేశాయి.

350 సీసీ లోపు బైక్‌లపై భారీగా తగ్గింపు

కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ స్లాబులను సవరించింది. ఇందులో 350 సీసీ వరకు ఉన్న బైక్‌లపై జీఎస్టీ రేటును 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించింది. ఈ కొత్త రేట్లు ఈ నెల 22 నుంచి అమలులోకి రానున్నాయి. నవరాత్రి తొలి రాజు నుంచే ఈ కొత్త ధరలు అందుబాటులోకి రానున్నాయి. దీంతో బైక్‌ల ధరలు గణనీయంగా తగ్గనున్నాయి. వినియోగదారులు వేల రూపాయలు ఆదా చేసుకునే అవకాశం కలుగుతుంది. హీరో, హోండా, టీవీఎస్, బజాజ్ వంటి కంపెనీలతో పాటు జావా, రాయల్ ఎన్‌ఫీల్డ్, యెజ్డీ బైకులు కూడా ప్రస్తుతం కంటే తక్కువ ధరకే లభించనున్నాయి. 350 సీసీ ఇంజన్ కంటే ఎక్కువ సామర్థ్యం ఉన్న బైక్‌ల ధరలు మాత్రం పెరగనున్నాయి. ఇప్పటి వరకు వీటిపై 28 శాతం జీఎస్టీ ఉండగా.. ఈ నెల 22వ తేదీ నుంచి 40 శాతానికి పెరగనుంది. దీంతో లగ్జరీ బైక్‌ల ధరలు మాత్రం షాక్ కొట్టనున్నాయి. ఇప్పటి కంటే రూ.20 వేల నుంచి రూ.45 వేల వరకు పెరగనున్నాయి.

ధరలు తగ్గిస్తూ ప్రకటనలు

ప్రస్తుతం విశాఖ మార్కెట్‌లో 110, 125, 150 సీసీ ఇంజన్ బైక్‌ల వినియోగమే ఎక్కువగా ఉంది. వీటి కొనుగోలుకే ఎక్కువ మంది ఆసక్తి చూపిస్తున్నారు. ఆ తర్వాత 200, 250 సీసీ వరకు విక్రయాలు మధ్యస్తంగా ఉన్నాయి. దీంతో ఇప్పటికే వీటి ధరలు తగ్గిస్తూ కంపెనీలు కొత్త ధరలను ప్రకటించాయి. హీరో కంపెనీ బైక్‌లపై మోడల్, వేరియంట్‌ను బట్టి రూ.6 వేల నుంచి, హోండా కంపెనీ బైక్‌లపై రూ.8,500 నుంచి, టీవీఎస్ బైక్‌లపై రూ.8,700 నుంచి, బజాజ్ బైక్‌లపై రూ.8,500 నుంచి అత్యధికంగా రూ.15 వేలు వరకు తక్కువకు రానున్నాయి. అలాగే రాయల్ ఎన్‌ఫీల్డ్ 350 సీసీ వరకు బైక్‌లపై రూ.19 వేలకు పైగా తక్కువకు లభించనున్నాయి.

మార్కెట్ జోష్

జీఎస్టీ రేట్లలో సవరణతో బైక్ మార్కెట్ జోష్ పెరుగుతుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. సాధారణంగా దసరా, దీపావళికి ముందు కంపెనీలు ప్రత్యేక ఆఫర్లను అందిస్తుంటాయి. కానీ ఈసారి జీఎస్టీ రేటును తగ్గించి కేంద్రం కొనుగోలుదారులకు శుభవార్త చెప్పింది. దీనికి తగ్గట్టుగానే కంపెనీలు పోటాపోటీగా తగ్గింపు ధరలను ప్రకటించాయి. ఇప్పటికే కొనుగోలుదారులు ప్రస్తుతం బైక్‌లు కొనుగోలు చేయకుండా ప్రీ బుకింగ్‌లకు సిద్ధమవుతున్నారు. సెప్టెంబర్ 22 తర్వాత కొనుగోలుకు ఆసక్తి చూపిస్తున్నారు. తద్వారా రూ.10 వేలు నుంచి రూ.20 వేల వరకు తగ్గింపు పొందాలని చూస్తున్నారు. ఈ కొత్త ధరలు అందుబాటులోకి వచ్చిన తర్వాత బైక్ విక్రయాలు గణనీయంగా పెరిగే అవకాశాలు ఉన్నట్లు మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు.

చెరువు కాదు.. జాతీయ రహదారి



విశాఖలోని గురుద్వారా జంక్షన్‌లో జాతీయ రహదారి గోతులమయంగా మారిపోయింది. చిన్నపాటి వర్షానికే నీరు చేరి అక్కడ చెరువును తలపిస్తోంది. అక్కడే బస్టాప్ ఉండడంతో ప్రయాణికులు బస్సు ఎక్కి దిగడానికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. బస్సు ఎక్కే క్రమంలో పలువురు గోతుల్లో అడుగేసి పడిపోయిన పరిస్థితులు ఉన్నాయి. - ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్

కాలేజీ పిల్లలు వున్నారు.. ఇక్కడ బ్రాందీ షాపు పెట్టొద్దు..!



మద్యం దుకాణం పెట్టవద్దని ఆందోళన చేస్తున్న మహిళలు

తిరుపతిలో రోడ్డెక్కిన మహిళలు

తిరుపతి రూరల్: ''ఇక్కడ కాలేజీ పిల్లలు వున్నారు.. హాస్టళ్లు వున్నాయ్.. నిత్యం దినసరి కూలీలకు వెళ్లి చీకటి పడిన తరువాత ఇంటికి వచ్చే మహిళలు ఈ రోడ్డులోనే నడచి వస్తుంటారు.. తాగిన మైకంలో మందుబాబులు మహిళలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు.. నివాస గృహాల మధ్యన బ్రాందీ షాపు పెట్టడం ఎంత వరకు శ్రేయస్కరం.. ఇక్కడ బార్ పెట్టినపుడు కూడా ఆందోళనలు చేశాం.. అయినా అధికారులు పట్టించుకోలేదు.. ఇప్పుడు బార్ తీసేసి వైన్ షాప్ పెడుతామని చెబుతున్నారు.. ఆ దుకాణాన్ని అడ్డుకుంటాం.. చేతులెత్తి మొక్కుతున్నాం.. దయచేసి ఇక్కడ మద్యం దుకాణం పెట్టకండి''అంటూ తిరుపతిలోని శ్రీనగర్ కాలనీ, గాంధీపురం గ్రామాలకు చెందిన మహిళలు బుధవారం రోడ్డెక్కారు. తిరుపతి రూరల్ మండలం గాంధీపురం గ్రామానికి చెందిన మహిళలతో పాటు తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని శ్రీనగర్ కాలనీ వాసులు గతంలో విక్టరీ బార్ వున్న ప్రాంతానికి చేరుకుని 'ఇక్కడ బ్రాందీ షాపు పెట్టకండి'అంటూ నినాదాలు చేశారు. వద్దో.. వద్దు.. ఇక్కడ మద్యం దుకాణం వద్దు.. అంటూ నినదించారు. ఇదే విషయంపై గతంలో కూడా ఆందోళనలు చేసినప్పటికీ అధికారులు బార్ నిర్వహణకు అనుమతులు ఇచ్చారని, ఈ దపా మద్యం దుకాణం ఏర్పాటుకు అనుమతులు ఇస్తే ఎక్సైజ్ కార్యాలయం ముందు ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

అకస్మాత్తుగా పశువుల మృత్యువాత

- తూర్పు గోదావరి జిల్లా తాళ్లపూడి మండలంలో ఘటన
- 15 రోజుల్లో 25 గేదెల మృతి



పెద్దేవంలోని గుర్రపు డెక్కతో సుగంధి చెరువు

తాళ్లపూడి: తూర్పు గోదావరి జిల్లా తాళ్లపూడి మండలంలోని పెద్దేవం గ్రామంలో పాడి పశువులు (గేదెలు) వరుసగా మృత్యువాత పడడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 15 రోజుల వ్యవధిలో సుమారు 25 గేదెల వరకు ప్రాణాలు కోల్పోయాయి. అకస్మాత్తుగా నీరసపడి రెండు రోజులకే అవి మేత మేయక చనిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముందుగా గుర్తిస్తే ప్రాథమిక చికిత్స చేసి కొన్ని రోజుల ఆయుష్షు పెంచగలుగుతున్నా ప్రాణాలు మాత్రం నిలబెట్టలేకపోతున్నారని రైతులు అంటున్నారు. గ్రామంలోని సాయిబాబా, ఇతర ఆలయాల సమీపంలో ఉన్న సుగంధి చెరువు కలుషితం కావడం వల్లే పశువులు మృత్యువాత పడుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. గతంలో తాగునీటి చెరువుగా ఉండే చెరువు నేడు గుర్రపు డెక్క పేరుకుపోయి, మలమూత్ర విసర్జనలకు, మృత కళేబరాలకు కేంద్రమైందని రైతులు అంటున్నారు. మండల పశు సంవర్ధక శాఖాధికారి బాలాజీ బుధవారం గ్రామంలో పర్యటించి వివరాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పశువులకు వచ్చిన రోగ లక్షణాలు కొత్తగా ఉన్నాయని, కిడ్నీ, లివర్ దెబ్బ తింటున్నాయని, తీసుకునే ఆహారం కానీ, తాగే నీరు కానీ కలుషితమై ఉండచ్చని పేర్కొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుందాం

సీపీఎం నేత, ఎంపీ డాక్టర్ శివదాసన్

కడప కోటిరెడ్డిసర్కిల్ : దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన ప్రభుత్వ రంగ సంస్థలు ఎల్ఐసీని, జాతీయ బ్యాంకులను కేంద్ర ప్రభుత్వ విధానాలు బలహీన పరుస్తున్నాయని సీపీఎం రాజ్యసభ సభ్యుడు శివ దాసన్ విమర్శించారు. కడపలో బుధవారం ఆయన మాట్లాడారు. దేశంలో యూనివర్సిటీలలో రెగ్యులర్ ఫ్యాకల్టీ లేరని, విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపులు తగ్గిపోయాయన్నారు. ఆరోగ్య రంగంలో కేటాయింపులు తగ్గిపోవడం వల్ల చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు కూడా నియంత్రించలేని స్థితి నెలకొన్నదన్నారు.

ఈ రోడ్డుపై ప్రయాణం ఎలామహాప్రభో?



బురదలో కూర్చొని నిరసన తెలుపుతున్న ఆదివాసీ గిరిజనులు

రావికమతం: అనకాపల్లి జిల్లా రావికమతం మండలంలో చినపాచిలి నుంచి టి.అర్జాపురం వరకు బిఎస్ రోడ్డు పనులు పూర్తి చేయాలని బురదలో కూర్చొని ఆదివాసీ గిరుజనులు బుధవారం నిరసన తెలిపారు. కె.కొట్నాబిల్లి, గదపపాలెం తదితర గ్రామాల ఆదివాసీ గిరిజనులు ఈ రోడ్డు మీదుగానే ప్రయాణించాలి. ఈ రోడ్డుపై క్వారీ లారీలు తిరగం వల్ల రోడ్డుపై గుంతలు పడింది. దీంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2023 సంవత్సరం చివరలో హై ఇంపాక్ట్ రోడ్డు నిధులు నిమిత్తం పిఆర్ ప్రాజెక్ట్ వారికి 14 కిలోమీటర్ల రోడ్డుకు రూ.6 కోట్ల 98 లక్షలతో పనులు మొదలుపెట్టింది. ఎన్నికల కోడ్ రావడంతో రోడ్డు పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక రోడ్డు పనులు ప్రారంభం కాలేదు. దీంతో రోడ్డు పనులు తక్షణమే ప్రారంభించాలని కోరుతూ గిరిజనులు నిరసన వ్యక్తం చేశారు.

ఆకాశాన 'నారింజ' వాన



జడి వానకు తెరలేచిందా.. కరిమబ్బులు కమ్ముకొస్తాయా.. అనుకునేలోపు నల్లని మేఘాల మాటున సూరీడు దాగుడు మూతలు ఆడాడు. తెల్లని.. లేత నీలి రంగుల మధ్య నారింజ పండ్ల రసం ఆకాశ వీధుల్లో కుమ్మరించినట్లు అనిపించింది. ఈ సుందర దృశ్యం బుధవారం సాయంత్రం ఒంగోలు నగరవాసులకు కనువిందు చేసింది. - ఒంగోలు సిటీ

13న ఉద్యోగ, అధ్యాపక సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం

గుంటూరు ఎడ్యుకేషన్ : ప్రభుత్వ కళాశాలల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 13న విజయవాడలోని రాఘవయ్యపార్కు వద్ద ఉన్న ఎంబీ భవన్‌లో ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఏపీ ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్ట్ అధ్యాపక సంఘ అధ్యక్షుడు డాక్టర్ వై.జాన్‌బాబు, కార్యనిర్వాహక కార్యదర్శి బీజే గాంధీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ 2023 అక్టోబర్ 21న గత ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులు ఎన్నికల కోడ్ కారణంగా విద్యాశాఖలో అమలుకు నోచుకోలేదని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కాంట్రాక్టు అధ్యాపకుల క్రమబద్ధీకరణ నిలిపివేసిందని, దీనిపై అనేక విధాలుగా విజ్ఞప్తులు చేసినా స్పందన లేకపోవడంతో విధి లేని పరిస్థితుల్లో దశల వారీ పోరాట కార్యక్రమానికి నిర్ణయించినట్లు తెలిపారు. రౌండ్ టేబుల్ సమావేశానికి సైతం ప్రభుత్వం స్పందించని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా మహిళా కాంట్రాక్టు అధ్యాపకులతో 36 గంటల దీక్ష చేపట్టాలని నిర్ణయించామని తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు



తిరుమల : తిరుమలలో బుధవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 19 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 70,828 మంది స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.07 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేనివారికి 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు ఉంటే 3 గంటల్లో దర్శనమవుతోంది. ఈ క్రమంలోనే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి



కాణిపాకం: చిత్తూరు జిల్లా కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో బుధవారం సంకటహర చతుర్థి గణపతి వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రధాన ఆలయ అలంకార మండపంలో సిద్ధి బుద్ధి సమేత వినాయకస్వామి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం, సాయంత్రం సంకటహర చతుర్థి గణపతి వ్రతాన్ని భక్తులతో జరిపించారు.



జంగారెడ్డిగూడెం: పశ్చిమ గోదావరి జిలా గుర్వాయిగూడెంలో హరిహరసుత అయ్యప్ప స్వామి ఆలయంలో ఉపాలయమైన కన్నెమూల గణపతి సన్నిధిలో బుధవారం సంకటహర చతుర్థి పూజలు నిర్వహించారు. స్వామి వారికి పంచామృతాభిషేకాలు, గణపతి హోమం జరిపించారు. ట్రస్టీ సభ్యులు ప్రెసిడెంట్ వాసుస్వామి దంపతులు పూజలో పాల్గొన్నారు. అయ్యప్ప చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

మహిమాన్వితం.. మహారూపం

వైభవంగా ప్రారంభమైన వెంకటగిరి పోలేరమ్మ జాతర




వెంకటగిరి(సైదాపురం): వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతర అత్యంత వైభవంగా ప్రారంభమైంది. తల్లి దీవెనల కోసం పట్టణం భక్తజనసంద్రంగా మారింది. ఇసుకేస్తే రాలనంతగా ప్రజలు తరలివచ్చారు. జిల్లా నుంచే కాకుండా దేశవిదేశాల నుంచి వెంకటగిరీయులు స్వగృహాలకు చేరుకున్నారు.

వేడుకగా మడి భిక్షాలు

జాతర సందర్భంగా వెంకటగిరిలోని ప్రతి వీధి కళకళలాడుతోంది. పోలేరమ్మకు మడి భిక్షం పెట్టండి.. పోతురాజుకు టెంకాయ కొట్టండి అంటూ భక్తుల నినాదాలు హోరెత్తుతున్నాయి. ఈ క్రమంలోనే పట్టణంలోని ప్రతి ఇంట్లో పసుపుతో అమ్మవారి ప్రతిమను తయారు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంబలిని నైవేద్యంగా సమర్పించారు.

వైభవంగా రథోత్సవం

కుమ్మరివీధిలోని అమ్మవారి పుట్టింటిలో పోలేరమ్మ ప్రతిమను తయారు చేశారు. విగ్రహానికి నేత్రాలను అమర్చకుండా బుధవారం రాత్రి 7.30 గంటల సమయంలో కొలువుదీర్చారు. అమ్మవారి ప్రతిమను తయారు చేసిన వెంటనే దర్శించుకుంటే మంచి జరుగుతుందనే నమ్మకంతో భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. అత్యంత భక్తిశ్రద్ధలతో పోలేరమ్మను సేవించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అమ్మవారిని రథంపై కొలువుదీర్చి జీనిగలవారి వీధికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. అశేష భక్తజనం నడుమ రథోత్సవం వైభవంగా సాగింది. అక్కడ పోలేరమ్మ ప్రతిమను ప్రతిష్ఠించి సంపరదాయబద్ధంగా గాలి గంగులకు పూజలు నిర్వహించారు. బలి కార్యక్రమం ముగిసిన తర్వాత అమ్మవారికి కళ్లు అమర్చారు. దివ్యతేజస్సుతో అలరారుతున్న పోలేరమ్మ దివ్యరూపాన్ని రథంపై ఊరేగిస్తూ.. పాతకోట మీదుగా అమ్మవారి ఆలయానికి చేర్చారు. అక్కడ వేప మండలతో ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో మహిమాన్విత ప్రతిమను ప్రతిష్ఠించారు.



ఐదు నదులు ఒకేచోట కలిసే క్షేత్రం ఎక్కడ ఉందో మీకు తెలుసా.. ఒకే పాన వట్టం మీద 5 లింగాలను ఎప్పుడన్నా చూశారా? కంచి, పూరి లాగా ఆంధ్రదేశంలోని ఏకైక శంకరాచార్య మఠం ఏదో తెలుసా ? ఒకే క్షేత్రంలో ఒకే దేవుణ్ణి పది కంటే ఎక్కువ రూపాలలో కొలిచే క్షేత్రం గురించి తెలుసా? అన్నిటికీ ఒకే సమాధానం - పుష్పగిరిఆ క్షేత్రం గురించి తెలుసుకుందాం.

మహిమాన్వితం... ముక్తిప్రదం

పుష్పగిరి క్షేత్రం











పూర్వం తన తల్లి దాస్య విముక్తికోసం దేవలోకం నుంచి గరుత్మంతుడు అమృతభాండాన్ని తీసుకుపోతూండగా దేవేంద్రుడు ఎదిరించాడు. అప్పుడు ఇద్దరి మధ్యనా ఘోరయుద్ధం జరిగింది. ఆ పోరాటంలో అమృతబిందువు ఒకటి చింది, భూలోకంలో ఇప్పుడు ఆ మడుగు ఉండేచోటున పడిందట. దాని ఫలితంగా అప్పట్లో ఆ మడుగులో స్నానం చేసిన వారు సంపూర్ణ ఆరోగ్యవంతులుగానూ, యవ్వనవంతులుగానూ మారిపోవడంతోపాటు అమరత్వం కూడా పొందేవారట. దాని మహిమను ప్రత్యక్షంగా చూసిన నారదుడు బ్రహ్మదేవుడికి నూరిపోసిన మీదట, అమరత్వం యిచ్చే ఇటువంటి మడుగు భూలోకంలో ఉండకూడదు అని బ్రహ్మకు అనిపించింది. వెంటనే బ్రహ్మ, హనుమంతుని రప్పించి, ''హనూ! ఒక పర్వతం తెచ్చి పడవేసి, పినాకినిలో ఉండే ఆ మడుగును కప్పెట్టివేసెయ్యి' అన్నాడు.

చెప్పటమే తడవుగా ఆంజనేయుడు బ్రహ్మాండమైన పర్వతం ఒకటి తెచ్చి దభీమని ఆ మడుగులో పడవేశాడు.

కాని, ఆ పినాకినీ జల మహిమ యేమిటో కాని, హనుమంతుడు పడవేసిన పర్వతం మడుగును కప్పి వేయటానికి బదులు బెండు లాగా నీటిపైన తేలి ఆడుతూ వుంది.

ఈ చిత్రం చూచి బ్రహ్మకు కంగారుపుట్టింది. నారదుణ్ణి వెంటబెట్టుకుని, సరాసరి శివుని వద్దకు వెళ్లాడు. శివునికి కూడా ఈ విషయంలో ఏమీ పాలుపోక, ఆ ముగ్గురూ కలిసి వైకుంఠంలో వుండే విష్ణుమూర్తి వద్దకు పోయి జరిగిన వైనాలన్నీ పూసగుచ్చినట్టు ఆ జగన్నాటక సూత్రధారుడికి విన్నవించారు.

విష్ణుమూర్తి అంతా విని, ''నాకూ, శివునికి ఎప్పుడూ ఇటువంటివే చిక్కులు తగులుతూ ఉంటాయి. తిన్నగా ఉండడు కదా ఈ నారదుడు!' అని చెప్పి, బ్రహ్మనూ నారదుణ్ణి పంపివేశాడు.

తరువాత శివకేశవులు మానవరూపంతో భూలోకానికి దిగివచ్చి, ఆ మడుగు పైన తేలి ఆడుతూ వున్న పర్వతాన్ని ఒక వైపున శివుడూ, రెండోవైపున కేశవుడూ అదిమి పట్టి అణిచివేశారు.

అప్పుడు వారి ప్రభావంవల్ల ఆ పర్వతం భూమి పైన అణిగి వుండి, మడుగు మూసుకుపోయింది.

అస్థికలను పువ్వులుగా మార్చగల మహిమ గలిగింది- పినాకినీ నది జలం. అటువంటి నీటిలో ఆంజనేయుడు పర్వతాన్ని తెచ్చి పడవేశాడు. ఈ రెండు కారణాల వల్ల ఆ పర్వతానికి 'పుష్పగిరి' అనే పేరు వచ్చిందంటారు. శివకేశవులు ఇద్దరూ దిగివచ్చి ఆ పర్వతాన్ని అణచటంచేత, కొండకు రెండు పక్కలా ఆ ఇద్దరి ఆలయాలూ వెలిసి, అది ఈనాడు ఒక దివ్య క్షేత్రమై వెలుగొందుతోంది.

ఇక్కడ యేటా గొప్ప ఉత్సవాలు జరుగుతాయి. లక్షలాది జనం స్వాముల దర్శనానికి వస్తుంటారు. ఇది చెప్పదగిన పుణ్య క్షేత్రం గనకనే పుష్పగిరి స్వాములవారు ఇక్కడ మఠం ఏర్పరచుకొన్నారు. దక్షిణ కాశిగా ప్రసిద్ధి చెందిన పుష్పగిరి కడప నుంచి 16 కి.మీ. దూరంలో ఉంది. ఆదిశంకరులు పూజించిన చంద్రమౌళీశ్వర లింగం ఇక్కడ ఉంది.

కడప నుంచి కర్నూలుకు వెళ్ళే మార్గంలో చెన్నూరు సమీపంలో ఎడమ వైపు పక్క మార్గంలో వెళితే పుష్పగిరి వస్తుంది. ఈ క్షేత్రం కొండ మీద ఉంది. కింద పుష్పగిరి గ్రామం ఉంది. గ్రామానికి, క్షేత్రానికి మధ్య పెన్నా నది ప్రవహిస్తుంది. శైవులకూ, వైష్ణవులకూ కూడా పుష్పగిరి ప్రముఖ పుణ్య క్షేత్రం. వైష్ణవులు దీనిని 'మధ్య అహోబిలం' అనీ, శైవులు దీనిని 'మధ్య కైలాసం' అనీ అంటారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇదొక్కటే శంకరాచార్య మఠం. పుష్పగిరి సమీపంలో పాపఘ్ని, కుముద్వతి, వల్కల, మాండవి నదులు పెన్నలో కలుస్తాయి. అందుకే పుష్పగిరిని పంచనదీక్షేత్రమంటారు.

హరిహరాదుల క్షేత్రం

శివ స్వరూపుడైన వైద్యనాథేశ్వరుడు, విష్ణు స్వరూపుడైన చెన్నకేశవస్వామి నిలయమైన పుష్పగిరి హరిహర క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది.

జనమేజయుడు చేసిన సర్పయాగ పాప పరిహారార్థం శుక మహర్షి ఆదేశంపై పుష్పగిరి కొండపై ఈ ఆలయాన్ని నిర్మించినట్లు చరిత్ర ద్వారా తెలుస్తుంది.

చోళులు, పల్లవులు, కృష్ణదేవరాయలు ఆ తర్వాతి కాలంలో ఆలయాన్ని అభివృద్ధి చేశారని చరిత్ర ద్వారా తెలుస్తుంది.

కొండ మీద ఒకే ఆవరణంలో చెన్నకేశవాలయం, సంతాన మల్లేశ్వరాలయం ఉన్నాయి. ఈ ఆవరణంలోనే ఉమా మహేశ్వర, రాజ్యలక్ష్మి, రుద్రపాద, యోగాంజనేయ, సాక్షిమల్లేశ్వర స్వామి ఆలయాలను దర్శించుకోవచ్చు.

పుష్పగిరిలోనే పాపవినాశేశ్వరుడు, డుంటి వినాయకుడు, పుష్పనాథేశ్వరుడు, కమలసంభవేశ్వరుడు, దుర్గాంబ ఆలయాలున్నాయి. రుద్రపాదం, విష్ణుపాదం ఈ కొండ మీదే ఉన్నాయి.

వరదలు వచ్చినప్పుడు పెన్న దాటి ఆవలి వైపుకు వెళ్ళలేరు. అప్పుడు ఈవలి వైపు అభినవ చెన్నకేశవస్వామికి పూజలు జరుగుతాయి. పాతాళగణపతిని దర్శించుకొని పూజలు చేసేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలి వస్తారు.

జగద్గురువు ఆదిశంకరాచార్యులు స్వహస్తాలతో ప్రతిష్ఠించిన శ్రీ చక్రాన్ని దర్శించుకోవడం భక్తులు భాగ్యంగా భావిస్తారు.

– డి.వి.ఆర్

● ధర్మ సందేహం

తద్దినాలు పెడుతున్నాం కదా... మహాలయ పక్షాలు పెట్టాలా?

ఈ సందేహం దాదాపు అందరికీ కలుగుతుంది. ఎందుకంటే, మరణించిన తండ్రి తిథినాడు పుత్రుడు తద్దినం పెట్టడం హిందూ సాంప్రదాయంలో అనాది నుంచి వస్తున్న ఆచారం...

ప్రతి సంవత్సరం చేసే శ్రాద్ధం కన్నా అతి ముఖ్యమైన శ్రాద్ధాలు ఈ మహాలయపక్షం పదిహేను రోజులు చేయలేనివారు ఒక్క మహాలయమైనా చేసి తీరాలని చెబుతోంది శాస్త్రం...

పితృతిథినాడు పుత్రుడు తన తండ్రి, తాత, ముత్తాతలను తలచుకుని పితృయజ్ఞాన్ని నిర్వహిస్తాడు...

పుత్రులు లేనివారి సంగతి ఏమిటి మరి? వారి గతి అధోగతేనా? అంటే.. కాదు' అంటుంది శాస్త్రం.

మన కుటుంబాలలో ఏ కారణం చేతనో పెళ్లికాని సోదర, సోదరీలు మరణించి ఉండవచ్చు, లేదా..పెళ్లయినా సంతానం కలుగని దంపతులు మరణించి ఉండవచ్చు... లేదా ప్రమాదాల్లో మరణించిన చిన్నపిల్లలు ఉండవచ్చు, లేదా యుద్ధాలలో కానీ, శిక్షల ద్వారా కానీ, ఆత్మహత్యల ద్వారా కానీ, ప్రకృతి వైపరీత్యాల (వరదలు, భూకంపాలు) ద్వారా కానీ గుర్తు తెలియక మరణించి ఉండవచ్చు...



అటువంటి వారందరికి కూడా తిలోదకాలిచ్చి వారిని ఊర్ధ్వలోకాలకు పంపడం కోసం ఈ 'మహాలయ పక్షాలు' నిర్దేశించబడ్డాయి.

పితృతిథి నాడు మూడు తరాలవారికి (తండ్రి, తాత, ముత్తాత) మాత్రమే తిలోదకాలతో, పిండప్రదానం యివ్వబడుతుంది. ఏ కారణం చేతనైనా తద్దినం పెట్టలేని పరిస్థితి ఏర్పడి, తద్దినం పెట్టకపోతే.., ఆ తద్దినం పెట్టని దోషం 'మహాలయం' పెట్టడం వలన పోతుంది.

ఎలా పెట్టాలంటే..?

సాధారణంగా తండ్రి చనిపోయిన తిథినాడు 'మహాలయం' పెట్టడం ఉత్తమం.

ఏ కారణం చేతనైనా అలా పెట్టడం వీలుకాని పరిస్థితిలో 'మహాలయ అమావాస్య'నాడు పెట్టడం ప్రశస్తం. దీనినే 'సర్వ పితృ అమావాస్య' అంటారు. ఈ రోజునే మరణించిన బంధువులందరికీ..వారి వారి తిథులతో సంబంధం లేకుండా 'మహాలయం' పెట్టాలి.

మహాలయం పెట్టే కర్త శుచిగా స్నానంచేసి, పవిత్రమును(దర్భలతో చేసిన ఉంగరం) ధరించి, శ్రద్ధగా, భక్తిగా, మంత్రపూర్వకంగా ఐదుగురు బ్రాహ్మణభోక్తలతో ఈ పితృకార్యాన్ని నిర్వహించాలి. మహాలయం పెట్టలేని పక్షంలో కనీసం గతించిన పెద్దలను తలచుకుని వారి పేరు మీదుగా శక్తిమేరకు శుచిగా వంట చేసి భోజనాలు పెట్టాలి. ఇలాంటి క్రతువులపై విశ్వాసం లేనివారు కూడా పేదలకు అన్నదానం చేయడం ఆవులకు పచ్చగడ్డి తినిపించడం, శునకాలకు, కాకులకు ఆహారం పెట్టడం మంచిది.

మహాలయ పక్షాలలో శ్రాద్ధ కర్మ చేత పితృదేవతలకు సంతృప్తి కలిగించిన వ్యక్తికి భౌతికంగా సుఖ సంతోషాలు, పరలోకంలో ఉత్తమ గతులు లభిస్తాయని శాస్త్రవచనం.

(సెప్టెంబర్ 8 నుంచి 21 వరకు మహాలయ పక్షాలు)

● నిర్మల వాణి

విశుద్ధి చక్ర నిలయా..!



475వ నామం వద్ద అమ్మవారిని 'విశుద్ధి చక్ర నిలయా' అనగా విశుద్ధి చక్రంలో నివసించునది అని వర్ణిస్తారు. ఈ చక్రం మన సూక్ష్మ శరీరంలో కంఠం వద్ద ఉంటుంది. కుండలినీ శక్తి ఈ చక్రాన్ని దాటునప్పుడు మనిషికి సంఘ జీవనం అలవడి, సాక్షీభూత స్థితిలో దైవికమైన చాతుర్యంతో మాట్లాడగల వాక్ శక్తి లభిస్తుంది.

103వ నామం వద్ద అమ్మవారిని 'ఆజ్ఞా చక్రాంత రాళస్థా'అనగా ఆజ్ఞాచక్రం మధ్యలో ఉండునది అంటూ వర్ణిస్తారు. ఈ ఆజ్ఞాచక్రం మనం నుదురు మీద బొట్టు పెట్టుకునే ప్రాంతంలో ఉంటుంది, కుండలినీ శక్తి ఈ చక్రాన్ని దాటినప్పుడు మనిషి లోపల క్షమాగుణం నెలకొని పరిపూర్ణ నిర్విచార స్థితి అనగా ఆలోచనలు లేని స్థితిని పొందుతాడు. సాధారణం గా మనిషికి ఆలోచనలు లేకుండా ఉండడం నిద్రలో మాత్రమే సాధ్యమవుతుంది. కానీ ఈ స్థితిని చేరుకున్న మనిషి మెలకువగా ఉన్నప్పుడు కూడా ఆలోచనలు లేని స్థితిని పొందగలుగుతాడు.



105వ నామం వద్ద 'సహస్రారాంబుజారూఢా' అనగా సహస్ర దళ పద్మంలో నివసించునది అని వర్ణిస్తారు. ఈ చక్రం మన తల మీద మాడు ప్రాంతం లేదా బ్రహ్మ రంధ్రం వద్ద ఉంటుందని, కుండలినీ శక్తి ఈ చక్రాన్ని ఛేదించుకొని పైకి వచ్చినప్పుడు మనిషికి యోగం లభిస్తుందని వివరిస్తారు. మానవ చేతన తన చుట్టూ ఉండే భగవంతుని పరమ చైతన్య శక్తితో అనుసంధానాన్ని పొందుతుందని, మానవ మెదడును లోపల నుండి గమనిస్తే, 1000 నరాలు కలిసి, 1000 దళాలు గల పద్మంలా కన్పిస్తుందని, అందుకే 'సహస్రారం' అని పిలుస్తారని చెప్తారు. 106వ నామం వద్ద 'సుధాసారాభి వర్షిణీ' అనగా అమృతధారలు కురిపించునది అని వర్ణిస్తారు. కుండలినీ శక్తి సహస్రార చక్రాన్ని దాటిన తరువాత చైతన్య తరంగాల అనుభూతి మొదలవుతుంది. అమృత ధారల వంటి ఈ చైతన్య తరంగాలను అనుభూతి చెందడం కుండలినీ జాగృతి వల్లే సాధ్యమవుతుంది. ఆ సమయంలో సాధకులు బ్రహ్మానందానుభూతిలో లీనమవుతారు.

– డా. పి. రాకేష్
పరమ పూజ్య శ్రీ మాతాజీ నిర్మలా దేవి గారి ప్రవచనాల ఆధారంగా

● ఇస్లాం వెలుగు

మహోపకారి ముహమ్మద్ (స)



ఆయన జీవితం మానవాళికి ఒక నమూనా. ఆయన ధైర్య సాహసాలు మనకు స్ఫూర్తి పాఠాలు. ఆయనే ప్రవక్త ముహమ్మద్ (స). ఆయన జీవితాన్ని మనం సరిగా అవగాహన చేసుకొని, ఆయన బోధనలను ఆచరించినప్పుడే జీవితంలో విజయం సాధించగలుగుతాం. అల్లాహ్(దేవుడు) తప్ప మరో ఆరాధ్యుడు లేడని ఆయన విప్లవాత్మక నినాదం ఇచ్చారు. తన ఉద్యమాన్ని నైతిక విలువల బోధన, ఆధ్యాత్మిక ప్రమాణాల ప్రచారానికే పరిమితం చేయకుండా జీవనోపాధికి ఎలాంటి మార్గాలు అవలంబించాలన్నదీ తెలియజేశారు. ఆయన వ్యక్తిగత, సామాజిక జీవితం ఆదర్శప్రాయం. తన ప్రజా ధనాగారంలోకి వచ్చిన సంపదను ఆయన పేదలకు పంపిణీ చేసేవారు. తాను చేపట్టిన సత్య సందేశ ఉద్యమం కోసం ఆయన తన వ్యాపారాన్ని వదులుకున్నారు. తన సంపద మొత్తాన్ని ఉద్యమానికి ఇచ్చేశారు. అలాంటి మహనీయుడి జీవిత విశేషాలను, బోధనలను సమగ్రంగా వివరిస్తుంది 'మానవ మహోపకారి' పుస్తకం. ఇస్లామియా రాజ్య స్థాపన కోసం ఆయన చేసిన పోరాటాన్ని ఈ పుస్తకం మన కళ్లకు కడుతుంది. సమసమాజ నిర్మాణం కోసం ఆయన చేసిన కృషిని వివరిస్తుంది. అశాంతి, స్వార్థం, నైతిక విలువల పతనం నెలకొన్న నేటి సమాజంలో ఆయన బోధనలు ఆచరించడం తక్షణావసరం. ఆ పని మనం నిజంగా చేస్తున్నామా లేదా అనే విషయాన్నీ ఈ పుస్తకం చర్చిస్తుంది. ఆయన వ్యక్తిగత జీవితం, ఉద్యమంపై నెలకొన్న అపోహలను తొలగిస్తుంది. ఆయన రాజకీయ, సైనిక విధానాలను వివరిస్తుంది. ఒక బోధకుడిగా, మత ప్రచారకుడిగా, రాజ్యాధిపతిగా, జీవన వ్యవస్థ నిర్మాతగా, సంఘ సంస్కర్తగా ఆయన సాధించిన విజయాలను వివరిస్తుంది. దివ్యఖురాన్‌ను సరిగా అర్థం చేసుకోవడానికి ముహమ్మద్ ప్రవక్త(స) జీవితాన్ని వివరించే ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రామాణిక ఆధారాలతో ప్రవక్త (స) పవిత్ర జీవితాన్ని వివరించిన ఈ పుస్తకం ప్రతి ఒక్కరూ చదవదగినది.

మానవ మహోపకారి ముహమ్మద్ (స)
ఉర్దూ మూలం: నయీమ్ సిద్దీఖీ
తెలుగు అనువాదం: అబ్దుల్ వాహెద్
పుటలు: 358; వెల: రూ. 230, ప్రతులకు: 9700255736

– ముహమ్మద్ ముజాహిద్

● మంచి మాటలు

● సహనం మంచివారి వద్ద ఉంటుంది.
కోపం చెడ్డవారి వద్ద ఉంటుంది.
ప్రేమ మనసున్న వారి వద్ద ఉంటుంది.
గర్వం అసూయపరుల వద్ద ఉంటుంది.
జ్ఞానం గురువును, దైవాన్ని మనస్ఫూర్తిగా నమ్మే గుణవంతుల వద్ద ఉంటుంది

● ఒక మంచి మాట వైరాన్ని అంతం చేస్తుంది.
ఒక మంచి వ్యక్తిత్వం జీవితాన్నే మార్చేస్తుంది.

● ఒక వేలు పొట్టిగా ఉన్నంత మాత్రాన విలువలు మారవు.
అక్షరం రాయాలన్నా అన్నం తినాలన్నా ఐదువేళ్ళూ కలవాల్సిందే. మనుషులైనా అంతే.
చిన్న- పెద్ద అన్న తేడా వద్దు. ఎవరి ప్రాముఖ్యం వాళ్లదే.'


● 'అందమైన జీవితం అందరికీ ఉండదు కానీ మనస్ఫూర్తిగా
అభిమానం పంచే వాళ్ళు ఉంటే ఆ లోటే తెలియదు.

● ఏదయినా ముగిసి పోయింది అనుకున్నప్పుడు కూడా ఆశ వదులుకోకు.
ఎందుకంటే భగవంతుడు చివరి నిమిషంలో కూడా అద్భుతాలు సృష్టిస్తాడు!

● 'డబ్బు, కాలం రెండూ జీవితంలో భరించరాని బరువులే..
వాటిని సద్వినియోగం చేసుకోనివారు ఎవరైనా
నిర్భాగ్యులే'....!

● సువార్త

యోసేపు ఉపాయం



నాయకులు లేని జనులు చెడిపోవుదురు.ఆలోచనకర్తలు అనేకులు ఉండుట రక్షణకరము'

– సామెతలు 11:14

యోసేపు దేశ సంచారం ద్వారా ఆ దేశానికి ఒనగూరిన ప్రయోజనాలు గూర్చి కూడా ఒక్కింత చూస్తే –

ఫరో రాజుకు తన దివ్య దర్శనంతో గొప్ప ఆలోచన చెప్పుట ద్వారా ఐగుప్తు దేశానికి ప్రధానిగా నియమించబడ్డ యోసేపు అతడు సింహాసనం ఎక్కిన వెంటనే భూమి విషయమై ప్రత్యేక శ్రద్ధ తీసుకొను నిమిత్తం ఆ దేశం అంతటా సంచారం చేశాడు (ఆది 41:46). 'నాయకత్వం పదవి కాదు. చేతల సమాహారం' అన్నదానికి యోసేపు జీవితం ఒక చక్కని ఉదాహరణ. ప్రత్యక్ష నిరూపణ ప్రక్రియగా దీన్ని అతడు చేతల పరంగా వెల్లడిచేయడం కాబోయే నాయకులకు ఇది గొప్ప స్ఫూర్తే అని చెప్పక తప్పదు. అన్ని విధాలా దేవునికి విధేయుడైనందునే అనేకనేక కష్టాల అనంతరం యోసేపు ఇంతటి హెచ్చు స్థాయికి చేరగలిగాడు. రాజు తర్వాత రాజు అంతటి స్థాయి యోసేపుది. పెళ్ళి అయ్యింది. అత్యున్నత పదవి చేపట్టాడు. అయితే దేశం ఎదుర్కొనబోయే సమస్యకు పరిష్కారం ఇంకా వెదకే పనిలో కాక, ఎంతగా ఉపాయాన్ని అమలులో పెడితే అంతగా ఉపయోగం అన్న విషయంలో అతనికి ఉన్న స్పష్టతే అతన్ని ముందుకు నడిపించింది. దేశ సంచారంతో వచ్చిన ఉపాయాల వెల్లువతో, వివిధ పథకాలతో దేశాన్ని అభివృద్ధి బాట పట్టించాడు.

రథాలను పొలం వరకే తీసుకు వెళ్లినా కూడా, అక్కడ నుండి గట్ల వెంబడి నడుస్తూ పంటలు పండే వ్యవసాయ క్షేత్రాలను అతి దగ్గరగా యోసేపు చూచుట ద్వారానే పంటల రవాణాకు మెరుగైన మౌలిక వసతులు కల్పించి రహదారులు వేసి ఎద్దు, గుర్రం, గాడిద, ఒంటెల వంటి ఆనాటి బండ్లకు మార్గం సుగమం చేసాడు. పండిన పంటలను సకాలంలో ధాన్యాగారాలకు చేర్చుటకు నిల్వ చేయుటకు బండ్లు, రహదారులు, గిడ్డంగుల అవసరతలను తక్షణమే గుర్తించినవాడు యోసేపు. సమృద్ధిగా ఏడు సంవత్సరాలు పంటలు పండించి దాన్ని నిలువ చేసే బాధ్యత యోసేపుపై దేవుడే పెట్టాడు. ఎందుకంటే ఏడు సంవత్సరాలు పంటలు పండాక మరో ఏడు సంవత్సరాలు ఈ భూమి మీద తీవ్ర కరువు రాబోతుందని దేవున్ని బట్టి ఫరో కన్న కల ద్వారా అతనికి తెలిసింది (ఆది 41: 1–57). మానవులు సృష్టించే కరువును ఎదుర్కొగలను గానీ దేవుని కరువును ఎదుర్కోవడం తన వలన కాదని ఫరో గ్రహించి పాలన పగ్గాలు యోసేపుకు అప్పగించడం తెలివైన నిర్ణయమే. యోసేపు నాయకత్వం, అతని క్షేత్ర స్థాయి పర్యటనలు ఆ దేశానికి ఏంతో గొప్ప మేలు చేసి పెట్టాయి.

ముప్పది సంవత్సరముల వయస్సుగలవాడైన యోసేపు వ్యవసాయాన్ని కొత్త పుంతలు తొక్కించి తన ఏలుబడిలో ఐగుప్తును అపార ఆహార ధాన్యాల నిల్వల కేంద్రంగానే కాక గొప్ప ధనాగార దేశంగా కూడా దాన్ని మార్చాడు (ప్రసంగి 5:9, సామెత 12:11). ప్రతి దేశానికి కరువు తీవ్రత ఎక్కువై భారమైనందున సమస్త దేశములవారు యోసేపు వద్ద ధాన్యము కొనుటకు ఐగుప్తునకు వస్తూ ఉన్నారు. ఏడు సంవత్సరాలు పంటలు పండుతాయి. అటు పిమ్మట ఏడు సంవత్సరాలు ఎలాంటి పంటలు పండక తీవ్ర కరువు వస్తుందనే విషయం భక్తిపరుడైన యోసేపు జ్ఞానం బట్టి ఒక్క ఐగుప్తు దేశానికి అనగా దాని అధికారులకు తప్ప మరి ఏ దేశానికి తెలియదు. ఏడు సంవత్సరాల పాటు ఏడు సంవత్సరాలకు సరిపడే విధంగా ఆహారోత్పత్తులను సమృద్ధిగా పండించి వాటిని గిడ్డంగులలో భద్రంగా నిలువ చేయడం గొప్ప ఘన కార్యమే. దీన్ని సుసాధ్యం చేసి చూపుటలో యోసేపు విజయవంతం అయ్యాడు. నేటి అంకుర సంస్థలకు మార్గదర్శకుడు అయ్యాడు.

– జేతమ్

● తాత్త్విక చింతన

సర్వాంతర్యామి ఎవరు? ఎక్కడ ఉంటాడు?



సర్వాంతర్యామి అంటే ఎంతటి వాడు? ఎలా ఉంటాడు? ఎక్కడ ఉంటాడు? ఏ రూపగుణాలను కలిగి ఉంటాడు... వంటి ప్రశ్నలు మదిని తొలిచేస్తుంటాయి. అదేవిధంగా తన రూపానికి కారణం ఏంటి? తన చుట్టూ ఉన్న దృశ్యమాన ప్రపంచం ఎప్పుడు, ఎందుకు, ఎలా ఏర్పడిందనేవి నిరంతరం సమాధానాలు వెతుక్కునే ప్రశ్నలు.

మానవుడు తనను తాను ఉత్కృష్ట రూపంగా, తన జన్మ మహోన్నతమైనదిగా ఊహించుకుని భగవంతుడు కూడా అదే విధంగా ఉంటాడనుకుంటాడు. మరింత శక్తిమంతుడు కాబట్టి, అనేక శిరస్సులు, బాహువులతో ఊహించుకుంటాడు. కానీ, ఉపనిషత్తుల్లోని జ్ఞానం మానవునికి ఆ భగవంతుని రూపాన్ని అనంతమైనశక్తిగా, ఇంద్రియాలు గ్రహించలేని సూక్ష్మరూపమైననూ, తాను లేని ప్రాంతంగాని, పదార్థాలు గాని లేనట్టి హేతువుగానూ తేల్చేసాయి. వేలప్రశ్నలకు, సందేహాలకు నిత్య నూతన సమాధానాలు ఉపనిషత్తులలో చూడగలం. ఉపనిషత్తులలో ఆధ్యాత్మికతను వెతికితే ఆధ్యాత్మికత, విజ్ఞానశాస్త్రాన్ని వెతికితే విజ్ఞాన శాస్త్రం, భగవంతుని వెతికితే భగవంతుడు కనిపిస్తాడు. అంటే ఈ మూడింటినీ సమాధానపరిచే అద్భుత జ్ఞానం వాటిల్లో ఉందన్నమాట. ఆత్మనైనా, అనంత శక్తినైనా, భగవంతుడి నైనా జ్ఞానాన్ని ఆధారం చేసుకునే తెలుసుకోవాలి.

ఆ జ్ఞానం సాహిత్యరూపంలో నిండి ఉంది. అయితే, భగవంతుని అర్థం చేసుకోవడానికి ఇక్కడొక వెంట్రుకవాసి వ్యత్యాసం ఉంటుంది. కేవలజ్ఞానం ద్వారా ఆ అనంతశక్తిని తెలుసు కున్నా అది పూర్తిగా అవగతం కాదు. ఎప్పుడైతే ఆ జ్ఞానాన్ని ఆధారం చేసుకుని, నిరంతర చింతన ద్వారా అటువంటి జ్ఞానాన్ని అనుభవిస్తామో, ఎప్పుడైతే అలాంటి జ్ఞానాన్ని మనసులో రమింపజేస్తామో అప్పుడే ఆ పరమాత్మను లేక అనంత శక్తిని లేదా భగవంతుని సందర్శించగలుగుతాము. అప్పుడే 'అహం బ్రహ్మాస్మి' స్థితి సాధ్యమవుతుంది. అంటే ఆత్మకు, సాధకునికి మధ్య అభేదం ఏర్పడుతుంది. ఆ సాధకునికి పంచేంద్రియాల ద్వారా ఏ విషయాన్ని గ్రహించినా ఆత్మానందమే కలుగుతుంది. ఎందుకంటే ఈ దృశ్యమాన ప్రపంచం లోపలా, బయటా అంతటా తాను ఆ ఆత్మనే సందర్శించగలుగుతాడు. తనలో కూడా ఆ ఆత్మని అనుభవించగలుగుతాడు. అదే బ్రహ్మానందం. అదే ఆధ్యాత్మిక మకరందం. దానిని మించిన తీపి దొరకదు, దానిని మించిన ఆనందం లభించదు.

– డా. రావుల గిరిధర్

బిజినెస్ రీల్

అమెజాన్ సేల్‌కు 'జీఎస్‌టీ' దన్ను



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పలు ఉత్పత్తులపై జీఎస్‌టీ (వస్తు, సేవల పన్ను) తగ్గనున్న నేపథ్యంలో గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్‌కి గణనీయంగా ఊతం లభిస్తుందని ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ ఇండియా భావిస్తోంది. సాధారణంగా పండుగ సీజన్ కోసం ఎదురు చూసే కస్టమర్లతో పాటు జీఎస్‌టీ తగ్గింపు అమల్లోకి వచ్చే వరకు కొనుగోళ్లను వాయిదా వేసుకుంటున్న వారు కూడా తోడవుతారు కాబట్టి మరింతగా డిమాండ్ నెలకొంటుందని ఆశిస్తోంది. కంపెనీ డైరెక్టర్లు జెబా ఖాన్, కిశోర్ తోట బుధవారమిక్కడ విలేకరుల సమావేశంలో ఈ విషయాలు తెలిపారు. ఈ నెల 23 నుంచి గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ ప్రారంభం కానుంది. డిమాండ్‌కి తగ్గ స్థాయిలో సేవలు అందించేందుకు అన్ని సన్నాహాలు చేసుకున్నట్లు కిశోర్ తెలిపారు. తెలంగాణలో 57,000 మంది, ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 23,000 మంది విక్రేతలు తమ ప్లాట్‌ఫాంలో ఉన్నారని చెప్పారు. అలాగే ఏపీలో 1, తెలంగాణలో మూడు ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లు ఉన్నాయని వివరించారు. స్మార్ట్‌ఫోన్ల నుంచి క్యూఎల్‌ఈడీ టీవీల వరకు వివిధ కేటగిరీల్లో తెలంగాణలోని కస్టమర్లు ప్రీమియం ఉత్పత్తుల వైపు మొగ్గు చూపుతున్నట్లు జెబా వివరించారు.

అమెరికాలో 'అజూర్ పవర్' లంచం కేసు సెటిల్మెంట్

2.3 కోట్ల డాలర్లు చెల్లించిన సంస్థ



న్యూఢిల్లీ: లంచం, ఇతరత్రా అవకతవకల ఆరోపణల కేసును సెటిల్ చేసుకున్నట్లు సౌర విద్యుదుత్పత్తి సంస్థ అజూర్ పవర్ వెల్లడించింది. ఇందుకోసం 2.3 కోట్ల డాలర్లు చెల్లించినట్లు వివరించింది. కొత్త ప్రాజెక్టులను దక్కించుకునేందుకు కీలక డేటాను తప్పుగా చూపించినట్లు, లంచాలు చెల్లించినట్లు అజూర్ పవర్‌తో పాటు దాని మాజీ ఎగ్జిక్యూటివ్‌లు రంజిత్ గుప్తా, మురళి సుబ్రమణియన్, పవన్ కుమార్ అగ్రవాల్‌పై ఆరోపణలు ఉన్నాయి. అమెరికాలోని న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజీలో అజూర్ షేర్లు లిస్టయి ఉన్నాయి. నిబంధనలను పాటించే విషయంలో వారు తప్పుదోవ పట్టించే, తప్పుడు ప్రకటనలు చేశారని, ఫలితంగా కృత్రిమంగా పెరిగిపోయిన షేర్లను కొనుగోలు చేసిన ఇన్వెస్టర్లకు తీవ్ర నష్టం వాటిల్లిందని క్లాస్ యాక్షన్ సూట్ నమోదైంది. దీంతో వివాదాన్ని పరిష్కరించుకునేందుకు కంపెనీ నిర్దేశిత మొత్తాన్ని చెల్లించేందుకు అంగీకరించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

11-9-2025

విశాఖ	555-00
చిత్తూరు	563-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	545-00
విజయవాడ	550-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	535-00
వరంగల్	537-00
రిటైల్ ధర	5.95

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BEL	389	4.58
WIPRO	255.71	2.63
HCLTECH	1,464.20	2.6
HDFCLIFE	777.9	2.21
BAJFINANCE	967.5	2.01

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
M&M	3,609.00	-2.36
BAJAJ-AUTO	9,232.50	-1.6
MARUTI	15,134.00	-1.5
HEROMOTOCO	5,345.00	-1.45
EICHERMOT	6,818.50	-0.81

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	8,908
ఎన్ఎస్ఈ	1,02,041
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,35,208
ఎఫ్ఐఐ	- 116
డీఐఐ	+ 5,004

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	63.74 (రాత్రి 11.30కు)	$ 62.63
బ్రెంట్	67.57 (రాత్రి 11.30కు)	$ 66.39

భారత వృద్ధి అంచనాలు అప్!

- 6.9 శాతానికి పెంచిన ఫిచ్
- క్యూ1లో బలమైన జీడీపీ రేటు
- వినియోగం పెరిగే చాన్స్



న్యూఢిల్లీ: ఫిచ్ రేటింగ్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి భారత్ వృద్ధి అంచనాలను పెంచింది. జీడీపీ 6.5 శాతం వృద్ధి చెందుతుందన్న గత అంచనాను 6.9 శాతం చేసింది. జూన్ త్రైమాసికంలో అంచనాలకు మించి బలమైన పనితీరు నమోదు కావడం, దేశీ వినియోగ ఆధారిత డిమాండ్ పుంజుకోవడాన్ని అంచనాలు పెంచేందుకు కారణాలుగా పేర్కొంది. అమెరికా టారిఫ్‌లతో భారత వృద్ధి అంచనాలను తగ్గిస్తున్నట్టు లోగడ పలు అంతర్జాతీయ ఏజెన్సీలు ప్రకటించగా.. అంచనాలను పెంచిన తొలి సంస్థ ఫిచ్ కావడం గమనార్హం. మార్చి, జూన్ త్రైమాసికాల్లో ఆర్థిక కార్యకలాపాలు వేగాన్ని పుంజుకున్నట్టు ఫిచ్ రేటింగ్స్ తన తాజా నివేదికలో పేర్కొంది. జీడీపీ జనవరి-మార్చి త్రైమాసికంలో 7.4 శాతం వృద్ధి చెందగా, జూన్ త్రైమాసికంలో 7.8 శాతానికి పెరగడాన్ని ప్రస్తావించింది. వాస్తవానికి జూన్ త్రైమాసికంలో జీడీపీ వృద్ధి 6.7 శాతంగా ఉంటుందని ఫిచ్ ఈ ఏడాది ఏప్రిల్‌లో తన అంచనాలను ప్రకటించగా, దీనికి మించి బలమైన వృద్ధి రేటు నమోదైంది. దీనికి తోడు జీఎస్‌టీలో తీసుకొచ్చిన సంస్కరణలతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత జీడీపీ మంచి వృద్ధిని నమోదు చేస్తుందంటూ తాజా అంచనాలను ఫిచ్ విడుదల చేసింది.

వినియోగమే బలమైన చోదకం..

"అమెరికాతో వాణిజ్య ఉద్రిక్తతలు ఇటీవలి నెలల్లో పెరిగాయి. భారత ఉత్పత్తులపై అమెరికా 25 శాతం అదనపు టారిఫ్‌లు విధించగా, ఇవి ఆగస్ట్ 27 నుంచి అమల్లోకి వచ్చాయి. దీంతో అమెరికాలో భారత ఉత్పత్తులపై టారిఫ్‌లు 50 శాతానికి పెరిగాయి. చర్చల ద్వారా టారిఫ్ రేట్లు అంతిమంగా తగ్గుతాయని అంచనా వేస్తున్నాం. వాణిజ్య సంబంధాల విషయంలో నెలకొన్న అనిశ్చితి వ్యాపార వాతావరణాన్ని దెబ్బతీస్తుంది. పెట్టుబడులపై దీని ప్రభావం పడుతుంది. జీఎస్‌టీలో ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలు సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి రానున్నాయి. వీటితో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మిగిలిన కాలంతోపాటు వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ వినియోగం బలంగా పెరుగుతుంది" అని ఫిచ్ రేటింగ్స్ వెల్లడించింది. వృద్ధికి దేశీ వినియోగం కీలక చోదకంగా పనిచేస్తుందని తెలిపింది. సానుకూల ఆర్థిక పరిస్థితులు పెట్టుబడులను ఇతోధికం చేస్తాయని అంచనా వేసింది. కాకపోతే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయ ఆరు నెలల్లో వృద్ధి కొంత నిదానిస్తుందని ఫిచ్ అభిప్రాయపడింది.

2026-27లో 6.3 శాతం..

2026-27 ఆర్థిక సంవత్సరంలో భారత జీడీపీ వృద్ధి 6.3 శాతానికి, తదుపరి ఆర్థిక సంవత్సరంలో (2027-28)లో 6.2 శాతానికి పరిమితం అవుతుందని ఫిచ్ రేటింగ్స్ అంచనా వేసింది. సగటు కంటే అధిక వర్షపాతం, అధిక నిల్వలతో ఆహార ధరలు తక్కువ స్థాయిలోనే కొనసాగుతాయని తెలిపింది. దీంతో ద్రవ్యోల్బణం 2025 చివర్లోనే 3.2 శాతానికి పెరుగుతుందని అంచనా వేసింది. 2026 చివరికి 4.1 శాతానికి చేరుకోవచ్చని పేర్కొంది. ఆర్‌బీఐ ఈ ఏడాది చివరికి పావు శాతం రేటు తగ్గిస్తుందని అంచనా వేస్తున్నట్టు తెలిపింది.

టారిఫ్‌లతో 0.2-0.3% వృద్ధి తగ్గొచ్చు

- జీడీపీ సంస్కరణలు ఆదుకుంటాయ్
- సీఈఏ అనంత నాగేశ్వరన్



న్యూఢిల్లీ: అమెరికా టారిఫ్‌ల కారణంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత జీడీపీపై నికరంగా పడే ప్రభావం 0.2-0.3 శాతం వరకు ఉండొచ్చని కేంద్ర ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు వి.అనంత నాగేశ్వరన్ అంచనా వేశారు. అయితే జీఎస్‌టీలో తీసుకొచ్చిన సంస్కరణలు దేశీ డిమాండ్‌ను పెంచడం ద్వారా ఈ ప్రభావాన్ని భర్తీ చేస్తాయని అభిప్రాయపడ్డారు. ఒక కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఆర్థిక సంవత్సరం మొత్తం మీద అమెరికాకు చేసిన ఎగుమతుల్లో సగం మేర ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఐదు నెలల్లోనే నమోదైనట్టు గుర్తు చేశారు. సుంకాలు స్వల్పకాలమే గానీ, దీర్ఘకాలం పాటు కొనసాగకపోవచ్చన్నారు. ఒకవేళ దీర్ఘకాలం పాటు కొనసాగితే అప్పుడు ద్వితీయ, తృతీయ అంచ ప్రభావాలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయంటూ.. పెట్టుబడులు, మూలధన వ్యయాలు, ఆర్థిక వ్యవస్థ సెంటిమెంట్‌పై దీని తాలూకూ అనిశ్చితి ఉంటుందని చెప్పారు. అయితే, జీఎస్‌టీలో తీసుకొచ్చిన సంస్కరణలు దేశీయంగా బలమైన వినియోగ సృష్టి ద్వారా టారిఫ్‌ల తాలూకూ ద్వితీయ, తృతీయ అంచ ప్రభావాలను అధిగమించేందుకు సాయపడతాయన్నారు. కనుక మొత్తం మీద జీడీపీపై పడే ప్రభావం 0.3 శాతం మించి ఉండదన్నారు. 2025-26 సంవత్సరానికి 6.3-6.8% మధ్య జీడీపీ వృద్ధి నమోదు కావొచ్చన్న తమ అంచనాలను గుర్తు చేశారు.

సాగులో సంస్కరణలు..

వ్యవసాయ రంగం జీడీపీకి మరో 0.5-0.70 శాతం వరకు తోడ్పాటునివ్వగలదని నాగేశ్వరన్ తెలిపారు. ఇందుకు గాను రైతులు వారు కోరుకున్న చోట విక్రయించే హక్కు అవసరమన్నారు. ప్రకృతి విపత్తులపై సాగు దిగుబడులు ఆధారపడి ఉన్నందున వారికి బీమా రూపంలోనూ దన్నుగా నిలవాలన్నారు. ప్రపంచ వాణిజ్యం విషయంలో అంతర్జాతీయ కరెన్సీగా ఉన్న డాలర్ స్థానాన్ని భర్తీ చేసే ఎలాంటి ప్రతిపాదన లేదని సీఈఏ అనంత నాగేశ్వరన్ స్పష్టం చేశారు. అటువంటి చర్యలో భారత్ పాలుపంచుకోదని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. డాలర్‌కు మెరుగైన ప్రత్యామ్నాయం ప్రస్తుతానికి లేదంటూ.. ఇందుకు చాలా కాలం పట్టొచ్చన్నారు. గతేడాది జరిగిన బ్రిక్స్ సదస్సులో భాగస్వామ్య దేశాల మధ్య వాణిజ్యానికి స్థానిక కరెన్సీల్లో చెల్లింపులకు, ప్రత్యేకంగా బ్రిక్స్ కరెన్సీ ఏర్పాటుకు అంగీకారం కుదరడం గమనార్హం.

రొయ్యల ఎగుమతులకు టారిఫ్ ఎఫెక్ట్..

- ఈసారి 12 శాతం తగ్గనున్న పరిశ్రమ ఆదాయం
- ఇండ్-రా నివేదిక



ముంబై: రొయ్యల ఎగుమతిదార్లపై అమెరికా టారిఫ్‌ల ప్రభావం భారీగానే ఉండనుంది. దీని వల్ల ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2025-26) పరిశ్రమ ఆదాయం 12 శాతం క్షీణించే అవకాశం ఉందని ఇండియా రేటింగ్స్ అండ్ రీసెర్చ్ (ఇండ్-రా) ఒక నివేదికలో తెలిపింది. భారత ఫ్రోజెన్ రొయ్యలకు అమెరికా కీలక మార్కెట్‌గా ఉంటోంది. ఎగుమతుల పరిమాణంలో 41 శాతం, విలువపరంగా 48 శాతం వాటా అమెరికాదే ఉంటోంది. 50 శాతం ప్రతీకార సుంకాల (అదనంగా యాంటీ-డంపింగ్ డ్యూటీ మొదలైనవి కూడా కలిపితే 58 శాతం) వల్ల వాణిజ్యం గణనీయంగా దెబ్బతింటుందని నివేదిక పేర్కొంది. దీనితో ఈక్వెడార్, వియత్నాం, ఇండొనేషియాలాంటి దేశాలతో భారత్ పోటీపడలేని పరిస్థితి ఏర్పడుతుందని, ఫలితంగా ఎగుమతుల పరిమాణంపై ప్రతికూల ప్రభావం పడుతుందని వివరించింది. ప్రధాన రొయ్యల కంపెనీల ఆర్థిక స్థితిగతుల విశ్లేషణ ప్రకారం 2025-26లో ఆదాయాలు 12 శాతం మేర, మార్జిన్లు సుమారు 150 బేసిస్ పాయింట్ల (దాదాపు ఒకటిన్నర శాతం) మేర తగ్గే అవకాశం ఉందని ఇండ్-రా తెలిపింది. నిర్వహణ మూలధనపరంగా కూడా కొంత ఒత్తిడి నెలకొనవచ్చని వివరించింది. అధిక టారిఫ్‌లను అమెరికా కొనసాగిస్తే మధ్యకాలికంగా రొయ్యల ఎగుమతులపై ప్రతికూల ప్రభావం తప్పదని పేర్కొంది. ఎగుమతుల పరిమాణం, మార్జిన్లపై ఒత్తిళ్ల వల్ల ఆర్థికంగా అంత పటిష్టంగా లేని మధ్య స్థాయి సంస్థల రుణపరపతి దెబ్బతినే అవకాశం ఉన్నట్లు వివరించింది.

ఇతర దేశాల వైపు చూపు ..

భారతీయ రొయ్యల ప్రాసెసింగ్ సంస్థలు దేశీ మార్కెట్‌తో పాటు అమెరికాయేతర మార్కెట్లలోకి (చైనా, యూరోపియన్ యూనియన్, జపాన్, బ్రిటన్) కూడా మరింతగా విస్తరించే అవకాశాలు పరిశీలిస్తున్నట్లు ఇండ్-రా అసోసియేట్ డైరెక్టర్ ఆదర్శ్ గుత్తా తెలిపారు. అయితే, ఈ ప్రాంతాల్లో అంతగా అధిక ధర లభించదని, పైగా పరిమిత స్థాయిలోనే ఎగుమతి అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. వ్యూహాత్మక డైవర్సిఫికేషన్, ఉత్పత్తులకు మరింత విలువను జోడించడంపై పెట్టుబడులు పెట్టడం, నిర్వహణ సామర్థ్యాలను మెరుగుపర్చుకోవడంలాంటివి పోటీతత్వాన్ని, ఆర్థిక స్థిరత్వాన్ని నిలబెట్టుకునేందుకు కీలకంగా ఉంటాయని ఆదర్శ్ చెప్పారు.

చిన్న సంస్థలకు ఈ-కామర్స్ దన్ను

- దేశవ్యాప్తంగా కస్టమర్లకు చేరువయ్యేందుకు ఊతం
- డెలాయిట్ నివేదికలో వెల్లడి



న్యూఢిల్లీ: దేశీయంగా చిన్న, మధ్య తరహా సంస్థలు (ఎంఎస్ఎంఈ) తమ కార్యకలాపాలను మరింతగా విస్తరించుకోవడానికి ఈ-కామర్స్ మాధ్యమం దన్నుగా నిలుస్తోంది. సుస్థిర, సమ్మిళిత అభివృద్ధికి దోహదకారిగా ఉంటోంది. కన్సల్టెన్సీ సంస్థ డెలాయిట్ రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం, దేశవ్యాప్తంగా వినియోగదారులకు నేరుగా చేరువ కావడానికి, వ్యాపార వృద్ధికి అమెజాన్‌లాంటి డిజిటల్ మార్కెట్‌ప్లేస్‌ల రూపంలో చిన్న వ్యాపారాలకు కొత్తగా మరిన్ని అవకాశాలు లభిస్తున్నాయి. మరో వైపు, ఎఫ్ఎంసీజీ (వేగంగా అమ్ముడయ్యే వినియోగ వస్తువులు) అమ్మకాలు, పట్టణ మార్కెట్లలో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో గణనీయ స్థాయిలో ఉంటున్నాయి. ప్రస్తుతం ఆన్‌లైన్ లావాదేవీల్లో 60 శాతం వాటా ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలదే ఉంటోంది. దీంతో దేశవ్యాప్తంగా వినియోగదారులకు నేరుగా చేరువ చేసే డిజిటల్ మార్కెట్‌ప్లేస్‌ల రూపంలో చిన్న సంస్థలకు కొత్త వ్యాపార అవకాశాలు లభిస్తున్నాయి.

వ్యాపార వృద్ధికి దోహదకారి..

'భారత ఈ-కామర్స్ వ్యవస్థ, ఎంఎస్ఎంఈలకు కీలకమైన వృద్ధి చోదకంగా మారింది. డిమాండ్ భారీగా ఉండే పండుగల సీజన్‌లో ఇది మరింత ఉపయోగకరంగా ఉంటోంది.అలాగే, లోకల్ షాప్‌లు, ఔత్సాహిక మహిళా వ్యాపారవేత్తలు, వినూత్నమైన స్టార్టప్‌లను ప్రోత్సహించే ప్రోగ్రాంలతో చిన్న వ్యాపారాలు దేశవ్యాప్తంగా విస్తరించేందుకు వీలవుతోంది. సీజనల్ నియామకాలు కూడా ఆర్థికంగా సానుకూల ప్రభావం చూపుతున్నాయి. లక్షల కొద్దీ ఉద్యోగాలు కల్పిస్తున్నాయి' అని ఇండియా ఎస్ఎంఈ ఫోరం ప్రెసిడెంట్ వినోద్ కుమార్ తెలిపారు. డిజిటల్ మార్కెట్‌ప్లేస్‌ల ద్వారా అదే రోజు లేదా మరుసటి రోజే డెలివరీ ఆప్షన్లతో వినియోగదారులకు సత్వరం సేవలు అందించేందుకు వీలవుతోందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి.

కూకట్‌పల్లిలో 12న జోయాలుక్కాస్ రెండో షోరూమ్



హైదరాబాద్: ప్రముఖ జ్యువెలరీ బ్రాండ్ జోయాలుక్కాస్ విస్తరణ ప్రణాళికల్లో భాగంగా కూకట్‌పల్లిలో రెండో షోరూమ్‌ను ఏర్పాటు చేయనుంది. సెప్టెంబర్ 12న (శుక్రవారం) ప్రారంభించనున్న ఈ షోరూమ్‌ను ప్రీమియం సదుపాయాలతో తీర్చిదిద్దినట్లు జోయాలుక్కాస్ తెలిపింది. అంతర్జాతీయ జువెలరీ షాపింగ్ అనుభూతిని అందిస్తుందని పేర్కొంది. ఈ సందర్భంగా ప్రతి కొనుగోలుపై ఒక ఉచిత బహుమతిని ఇస్తున్నట్లు వివరించింది. 'కూకట్‌పల్లిలో రెండో షోరూమ్‌ను ప్రారంభించటం ఎంతో సంతోషంగా ఉంది. ఉత్తమ ఆఫర్లు, ప్రత్యేక బహుమతులతో సంబరాలు జరుపుకునేందుకు ఎదురుచూస్తున్నాము.' అని జోయాలుక్కాస్ గ్రూప్ చైర్మన్ జోయ్ ఆలుక్కాస్ అన్నారు.

యూరో ప్రతీక్ @ రూ. 235-247

- ఈ నెల 16-18 మధ్య ఐపీవో
- రూ. 451 కోట్ల సమీకరణకు సై



న్యూఢిల్లీ: డెకొరేటివ్ వాల్ ప్యానల్ పరిశ్రమలో కార్యకలాపాలు కలిగిన యూరో ప్రతీక్ సేల్స్ పబ్లిక్ ఇష్యూకి రూ. 235-247 ధరల శ్రేణి ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 16న ప్రారంభమై 18న ముగియనుంది. దీనిలో భాగంగా కంపెనీ ప్రమోటర్లు రూ. 451.32 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను విక్రయానికి ఉంచనున్నారు. తద్వారా అంతేమొత్తం అందుకోనున్నారు. కంపెనీ రెసిడెన్షియల్, కమర్షియల్ అప్లికేషన్ విభాగాలలో వివిధ ప్రొడక్టులను ఆఫర్ చేస్తోంది. యూరో ప్రతీక్, గ్లోయ్‌రియో బ్రాండ్లతో ఉత్పత్తులను విక్రయిస్తోంది. కంపెనీ ప్రొడక్టుల తయారీలో ఔట్‌సోర్సింగ్‌కు ప్రాధాన్యత ఇస్తోంది. తద్వారా అసెట్ లైట్ విధానంలో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. దేశవ్యాప్తంగా 116 పట్టణాలలో పంపిణీ నెట్‌వర్క్‌ను విస్తరించింది. గతేడాది(2024-25) ఆదాయం 28 శాతం ఎగసి రూ. 284 కోట్లను తాకగా.. నికర లాభం 22 శాతం వృద్ధితో రూ. 76 కోట్లను దాటింది.

యస్ బ్యాంక్‌కు ఆర్‌బీఐ ఓకే

- నామినీ డైరెక్టర్ల నియామకానికి అనుమతి
- బ్యాంక్‌లో ఎస్ఎంబీసీ పెట్టుబడుల నేపథ్యం



న్యూఢిల్లీ: బోర్డులో నామినీ డైరెక్టర్ల నియామకానికి తాజాగా రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు యస్ బ్యాంక్ వెల్లడించింది. ఇందుకు ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్(ఏవోఏ)లో ప్రతిపాదిత సవరణలకు అనుమతించినట్లు పేర్కొంది. దీంతో సుమితోమో మిత్సుయి బ్యాంకింగ్ కార్పొరేషన్(ఎస్ఎంబీసీ) ఇద్దరు నామినీ డైరెక్టర్లను నామినేట్ చేసేందుకు వీలు చిక్కనుంది. మరో నామినీ డైరెక్టర్‌ను పీఎస్‌యూ దిగ్గజం స్టేట్‌బ్యాంక్(ఎస్‌బీఐ) ఎంపిక చేయనుంది. యస్ బ్యాంక్‌లో ఎస్‌బీఐసహా ఏడు ఇతర బ్యాంకులకు గల వాటాలను జపనీస్ దిగ్గజం ఎస్ఎంబీసీ సొంతం చేసుకున్నాక బోర్డులో నియామకాలకు తెరలేవనుంది. కాగా.. సెకండరీ కొనుగోళ్ల ద్వారా బ్యాంకులో 20 శాతం వాటాను ఎస్ఎంబీసీ చేజిక్కించుకోనున్నట్లు మే 9న యస్ బ్యాంక్ వెల్లడించిన విషయం విదితమే. దీనిలో భాగంగా ఎస్‌బీఐ నుంచి 13.19 శాతం వాటాను కొనుగోలు చేయనుండగా.. యాక్సిస్, బంధన్, ఫెడరల్, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ, ఐడీఎఫ్‌సీ ఫస్ట్, కొటక్ మహీంద్రా బ్యాంకుల నుంచి మిగిలిన 6.81 శాతం వాటాను సొంతం చేసుకోనున్నట్లు వివరించింది. ఈ నెల మొదట్లో ప్రతిపాదిత డీల్‌కు కాంపిటీషన్ కమిషన్(సీసీఐ) గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. గత నెలలో ఆర్‌బీఐ సైతం ఇందుకు అనుమతిస్తూ ఎస్ఎంబీసీ ప్రమోటర్‌గా గుర్తింపు పొందబోదని తెలియజేసింది. ప్రస్తుతం యస్ బ్యాంక్‌లో ఎస్‌బీఐకు 24 శాతం వాటా ఉంది. తాజా డీల్ తదుపరి 10.81 శాతానికి వాటా పరిమితంకానుంది.

ఈ వార్తల నేపథ్యంలో యస్ బ్యాంక్ షేరు 2.1 శాతం బలపడి రూ. 20.8 వద్ద ముగిసింది.

కొటక్ బ్యాంక్‌లో వాటా విక్రయం

1.62 శాతం అమ్మిన ఎస్ఎంబీసీ ■ డీల్స్ విలువ రూ. 6,256 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం కొటక్ మహీంద్రా బ్యాంక్‌లో జపనీస్ దిగ్గజం సుమితోమో మిత్సుయి బ్యాంకింగ్ కార్పొరేషన్(ఎస్ఎంబీసీ) తాజాగా 3.22 కోట్ల షేర్లు విక్రయించింది. 1.62 శాతం వాటాకు సమానమైన వీటి విలువ రూ. 6,256 కోట్లు. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా షేరుకీ రూ. 1,940.80 ధరలో షేర్లను అమ్మివేసింది. ఎన్ఎస్ఈ బ్లాక్‌డీల్ గణాంకాల ప్రకారం వాటా కొనుగోలు చేసిన సంస్థలలో సిటీగ్రూప్ గ్లోబల్ మార్కెట్స్ మారిషస్, బజాజ్ లైఫ్ ఇన్సూరెన్స్, ఫిడెలిటీ, ప్రుడెన్షియల్(యూకే), ప్రభుత్వ పెన్షన్ ఫండ్ గ్లోబల్(నార్వే), నిప్పన్ ఇండియా ఎంఎఫ్, మోర్గాన్ స్టాన్లీ తదితరాలున్నాయి. తాజా డీల్స్ తదుపరి కొటక్ మహీంద్రా బ్యాంక్‌లో ఎస్ఎంబీసీ వాటా 0.03 శాతానికి పరిమితమైంది.

బ్లాక్ డీల్స్ నేపథ్యంలో కొటక్ బ్యాంక్ షేరు ఎన్ఎస్ఈలో 0.65 శాతం బలపడి రూ. 1,973 వద్ద ముగిసింది.

ఈక్విటీ ఫండ్స్‌లో తగ్గిన పెట్టుబడుల జోరు!



న్యూఢిల్లీ: ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ పథకాల్లో పెట్టుబడుల జోరు ఆగస్ట్‌లో కొంత తగ్గింది. రూ.33,430 కోట్ల నికర పెట్టుబడులు వచ్చాయి. జూలైలో రూ.42,702 కోట్ల పెట్టుబడులతో పోల్చి చూస్తే 22 శాతం తగ్గాయి. ఈ ఏడాది జూన్‌లో రూ.23,587 కోట్ల పెట్టుబడులు రావడం గమనార్హం. 2024 ఆగస్ట్‌లో ఈక్విటీ ఫండ్స్‌లోకి వచ్చిన పెట్టుబడులు రూ.38,239 కోట్లుగా ఉన్నాయి. డెట్ మ్యూచువల్ ఫండ్స్ నుంచి రూ.7,980 కోట్లు నికరంగా బయటకు వెళ్లాయి. జూలైలో రూ.1.06 లక్షల కోట్ల నికర డెట్ పెట్టుబడులతో పోల్చి చూస్తే భిన్నమైన పరిస్థితి కనిపించింది. దీంతో ఆగస్ట్ చివరికి మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమ నిర్వహణలోని మొత్తం ఆస్తుల విలువ రూ.75.20 లక్షల కోట్లకు పరిమితమైంది. జూలై చివరికి ఈ మొత్తం రూ.75.36 లక్షల కోట్లుగా ఉంది. మ్యూచువల్ ఫండ్స్ సంస్థల అసోసియేషన్ (యాంఫి) ఈ గణాంకాలను విడుదల చేసింది. ఆగస్ట్‌లో ఈక్విటీ ఫండ్స్‌లోకి పెట్టుబడులు నీరసించడం వెనుక కొత్త పథకాల (ఎన్ఎఫ్‌వో) ఆవిష్కరణ తగ్గడమే కారణమని నిపుణులు చెబుతున్నారు. "గత ధోరణుల ఆధారంగా ఆగస్ట్ నెలలో సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) పెట్టుబడులు అధికంగా నమోదవుతాయని ఆశించాం. కానీ, అవి ఫ్లాట్‌గా రూ.28,265 కోట్ల స్థాయిలో ఉన్నాయి. అంతర్జాతీయంగా అనిశ్చితులు నెలకొన్నప్పటికీ, ఎఫ్‌పీఐలు విక్రయాలు కొనసాగిస్తున్నా కానీ, భారత ఇన్వెస్టర్లు ఈక్విటీల్లో పెట్టుబడులు కొనసాగిస్తున్నారు. మార్కెట్లకు ఇంది ఎంతో అనుకూలం" అని మోతీలాల్ ఓస్వాల్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (ఏఎంసీ) చీఫ్ బిజినెస్ ఆఫీసర్ అఖిల్ చతుర్వేది తెలిపారు.

- ఆగస్ట్‌లో రూ.33,430 కోట్ల పెట్టుబడులు
- జూలై నెల కంటే 22 శాతం తక్కువ
- ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్, గోల్డ్ ఈటీఎఫ్‌లకు ఆదరణ

విభాగాల వారీగా..

- ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్‌లోకి అధికంగా రూ.7,679 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఆ తర్వాత మిడ్‌క్యాప్ ఫండ్స్ రూ.5,330 కోట్లను ఆకర్షించాయి.
- స్మాల్‌క్యాప్ పథకాల్లోకి రూ.4,993 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. రూ.3,893 కోట్ల పెట్టుబడులతో సెక్టోరల్/థీమ్యాటిక్ ఫండ్స్ తర్వాతి స్థానంలో నిలిచాయి.
- మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్స్‌లోకి రూ.3,527 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. లార్జ్‌క్యాప్ ఫండ్స్‌లో రూ.2,835 కోట్లను ఆకర్షించాయి.
- 23 న్యూ ఫండ్ ఆఫర్లు (కొత్త పథకాలు) ఆగస్ట్‌లో రాగా, ఇవన్నీ కలసి రూ.2,859 కోట్లను సమీకరించాయి.
- డైనమిక్ అసెట్ అలోకేషన్/బ్యాలన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్స్ రూ.2,316 కోట్ల పెట్టుబడులు ఆకర్షించాయి.
- హైబ్రిడ్ ఫండ్స్ (ఈక్విటీ డెట్ కలయికతో కూడిన)లోకి పెట్టుబడులు జూలైతో పోల్చితే ఆగస్ట్‌లో 27 శాతం తగ్గి రూ.15,293 కోట్లుగా ఉన్నాయి.
- డెట్ విభాగం నుంచి నికరంగా రూ.7,890 కోట్లను ఇన్వెస్టర్లు ఉపసంహరించుకున్నారు. ముఖ్యంగా లిక్విడ్ ఫండ్స్ నుంచి రూ.13,350 కోట్లు బయటకు వెళ్లిపోయాయి. ఓవర్‌నైట్ ఫండ్స్ రూ.4,950 కోట్లను ఆకర్షించాయి. గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి రూ.2,189 కోట్ల పెట్టుబడులు వచ్చాయి.
- మొత్తం మీద మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమలోకి ఆగస్ట్ మాసంలో నికరంగా రూ.52,443 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. జూలైలో వచ్చిన రూ.1.8 లక్షల కోట్లతో పోలిస్తే గణనీయంగా తగ్గాయి.
- మ్యూచువల్ ఫండ్స్ ఫోలియోలు (పెట్టుబడి ఖాతాలు) 24.89 కోట్లకు చేరాయి. జూలై చివరికి ఇవి 24.13 కోట్లుగా ఉన్నాయి.



న్యూజిలాండ్ కెప్టెన్‌గా సోఫీ డివైన్

ఆక్లాండ్: మహిళల వన్డే ప్రపంచకప్ కోసం న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు బలమైన జట్టును ప్రకటించింది. వెటరన్ ఆల్‌రౌండర్ సోఫీ డివైన్ కివీస్ జట్టుకు సారథ్యం వహించనుండగా... నలుగురు కొత్త ప్లేయర్లకు వరల్డ్‌కప్ జట్టులో చోటు దక్కింది. ఈ నెల 30 నుంచి భారత్, శ్రీలంక సంయుక్త ఆతిథ్యంలో ప్రారంభం కానున్న ఐసీసీ వన్డే ప్రపంచకప్ కోసం న్యూజిలాండ్ బోర్డు బుధవారం 15 మందితో కూడిన జట్టును ప్రకటించింది. సుజీ బేట్స్, లీ తహుహు, సోఫీ డివైన్ ఐదోసారి ప్రపంచ కప్ బరిలోకి దిగనుండగా... మ్యాడీ గ్రీన్, మెలియా కెర్‌కు ఇది మూడోది. 8 జట్లు పాల్గొంటున్న ఈ మెగా టోర్నీ కోసం ప్రకటించిన కివీస్ జట్టు అటు అనుభవజ్ఞులు, ఇటు యువ ప్లేయర్లతో సమతూకంగా ఉందని న్యూజిలాండ్ కోచ్ బెన్ సాయర్ అన్నాడు. వరల్డ్‌కప్‌లో భాగంగా వచ్చే నెల 1న డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాతో న్యూజిలాండ్ తొలి మ్యాచ్ ఆడనుంది.

న్యూజిలాండ్ జట్టు: సోఫీ డివైన్ (కెప్టెన్), సుజీ బేట్స్, ఈడెన్ కార్సన్, ఫ్లోరా డెవాన్‌షైర్, ఇజీ గేజ్, మ్యాడీ గ్రీన్, బ్రూకీ హాలిడే, బ్రీ ఇలింగ్, పాలీ ఇన్‌గ్లిస్, బెల్లా జేమ్స్, మెలీ కెర్, జెస్ కెర్, రోజ్‌మేరీ మైర్, జార్జియా ప్లిమర్, లీ తహుహు.

భారత పిస్టల్ షూటర్లకు నిరాశ

నింగ్బో (చైనా): అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) ప్రపంచకప్‌లో భారత షూటర్ల పేలవ ప్రదర్శన కొనసాగుతోంది. పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో సమ్రాట్ రాణా, అమిత్ శర్మ, నిశాంత్ రావత్ ఫైనల్‌కు చేరడంలో విఫలమయ్యారు. క్వాలిఫయింగ్‌లో 20 ఏళ్ల సమ్రాట్ రాణా 582 పాయింట్లతో 10వ స్థానంలో, అమిత్ శర్మ 576 పాయింట్లతో 28వ స్థానంలో, నిశాంత్ 568 పాయింట్లతో 42వ స్థానంలో నిలిచారు. టాప్-8లో నిలిచిన వారు మాత్రమే ఫైనల్‌కు అర్హత సాధిస్తారు. ఈ టోర్నీలో చైనా నాలుగు పతకాలతో పట్టిక అగ్రస్థానంలో ఉండగా... భారత్ ఇంకా పతకాల బోణీ కొట్టలేదు.



సింధుకు షాక్

హాంకాంగ్ ఓపెన్ నుంచి తొలి రౌండ్‌లోనే నిష్క్రమణ

అన్‌సీడెడ్ క్రీడాకారిణి చేతిలో ఓటమి ● అనుపమ, రక్షిత శ్రీ కూడా అవుట్

హాంకాంగ్: ఈ ఏడాది తొలి టైటిల్ కోసం భారత స్టార్ ప్లేయర్ పీవీ సింధు వేట ఇంకా కొనసాగనుంది. హాంకాంగ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్ -500 బ్యాడ్మింటన్ టోర్నీలో ప్రపంచ 14వ ర్యాంకర్ సింధు తొలి రౌండ్‌లోనే వెనుదిరిగింది. ప్రపంచ 27వ ర్యాంకర్, అన్‌సీడెడ్ లినె క్రిస్టోఫర్సన్ (డెన్మార్క్)తో బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో సింధు 21-15, 16-21, 19-21తో ఓటమి పాలైంది. గతంలో లినె క్రిస్టోఫర్సన్‌తో ఆడిన ఐదుసార్లూ విజయం సాధించిన సింధు ఆరోసారి మాత్రం ఓటమి తప్పలేదు. 58 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సింధు నిర్ణాయక మూడో గేమ్‌లో 16-13తో, 17-15తో ఆధిక్యంలోకి వెళ్లి విజయం దిశగా సాగింది. ఈ కీలక తరుణంలో సింధు అనవసర తప్పిదాలు చేయడం... 15-17తో వెనుకబడిన లినె వరుసగా నాలుగు పాయింట్లు నెగ్గి ఒక్కసారిగా 19-17తో ముందంజ వేసింది. ఆ తర్వాత సింధు ఒక పాయింట్ గెలిచినా... ఆ వెంటనే లినె రెండు పాయింట్లు నెగ్గి తన కెరీర్‌లో **తొలిసారి భారత స్టార్‌**పై విజయాన్ని ఖాయం చేసుకుంది. భారత్‌కే చెందిన అనుపమ, రక్షిత శ్రీ కూడా తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. అనుపమ 17-21, 22-20, 14-21తో తొమ్మిదో ర్యాంకర్ టొమోకా మియకాజి (జపాన్) చేతిలో, రక్షిత శ్రీ 13-21, 7-21తో ప్రపంచ మాజీ చాంపియన్ రచనోక్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయారు.



లక్ష్య సేన్

లక్ష్య సేన్, ప్రణయ్ ముందంజ

పురుషుల సింగిల్స్ విభాగంలో బరిలోకి దిగిన నలుగురు భారత క్రీడాకారులు లక్ష్య సేన్, ప్రణయ్, కిరణ్ జార్జి, ఆయుశ్ శెట్టి శుభారంభం చేశారు. తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో లక్ష్య సేన్ 22-20, 16-21, 21-15తో వాంగ్ జు వె (చైనీస్ తైపీ)పై, **ప్రణయ్ 21-17, 21-14తో లు గ్వాంగ్ జు** (చైనా)పై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లో ముఖాముఖి పోరుకు సిద్ధమయ్యారు. కిరణ్ జార్జి 21-16, 21-11తో జియా హెంగ్ జేసన్ (సింగపూర్)పై, ఆయుశ్ 15-21, 21-19, 21-13తో సు లి యాంగ్ (చైనీస్ తైపీ)లపై నెగ్గి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరుకున్నారు.

మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో రుతపర్ణ-శ్వేతాపర్ణ (భారత్) ద్వయం 21-17, 21-9తో పాంగ్ వనెస్సా-వాంగ్ సమ్ (హాంకాంగ్) జంటను ఓడించింది. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో గద్దె రుత్విక శివాని-రోహన్ (భారత్) జోడీ 14-21, 17-21తో ప్రపంచ రెండో ర్యాంక్ జంట ఫెంగ్ యాన్ జె-హువాంగ్ డాంగ్ పింగ్ (చైనా) చేతిలో... తనీషా క్రాస్టో-ధ్రువ్ కపిల (భారత్) ద్వయం 16-21, 11-21తో చెన్ చెంగ్ కువాన్-సు యిన్ హుయ్ **(చైనీస్ తైపీ) జంట చేతిలో ఓడిపోయాయి.**

కాంస్య పతక మ్యాచ్‌లో దీపిక బృందం ఓటమి

తొలి రౌండ్‌లోనే ఓడిన ధీరజ్



గ్వాంగ్జు (దక్షిణ కొరియా): ప్రపంచ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో రికర్వ్ విభాగంలో భారత ప్లేయర్లు నిరాశపరిచారు. మహిళల టీమ్ విభాగంలో కాంస్య పతకం కోసం పోటీపడిన భారత జట్టుకు ఓటమి ఎదురైంది. ప్రపంచ మాజీ నంబర్‌వన్, నాలుగు సార్లు ఒలింపిక్స్‌లో ఆడిన దీపిక కుమారి, అంకిత, గాథ సభ్యులుగా ఉన్న భారత జట్టు కాంస్య పతక మ్యాచ్‌లో 3-5 (51-54, 57-57, 57-54, 56-58)తో ఆన్ సాన్, లిమ్ సియోన్, కాంగ్ చెయంగ్‌లతో కూడిన దక్షిణ కొరియా జట్టు చేతిలో ఓటమి పాలైంది. రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో దీపిక కుమారి-నీరజ్ చౌహాన్ (భారత్) జోడీ ప్రిక్వార్టర్ ఫైనల్లో నిష్క్రమించింది. తొలి రౌండ్‌లో 'బై' పొంది నేరుగా ప్రిక్వార్టర్ ఫైనల్ ఆడిన దీపిక-నీరజ్ ద్వయం 4-5తో (36-37, 36-36, 37-37, 38-37, 18-19)తో అసకునో ననామి-కవాటా యుకీ (జపాన్) జంట చేతిలో ఓడిపోయింది. పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ బొమ్మదేవర ధీరజ్, నీరజ్ తొలి రౌండ్‌లోనే వెనుదిరగ్గా... రాహుల్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓటమి చవిచూశాడు. 'పారిస్ ఒలింపియన్' ధీరజ్ 2-6తో (29-29, 28-29, 28-29, 29-29) డిఫెండింగ్ చాంపియన్ మెటె గాగోజ్ (టర్కీ) చేతిలో... నీరజ్ 0-6తో (27-29, 27-28, 26-29) బోబోరజబోవ్ (ఉజ్బెకిస్తాన్) చేతిలో... రాహుల్ 5-6తో (28-28, 30-26, 28-27, 26-30, 27-28, 8-10) మచవరియాని (జార్జియా) చేతిలో పరాజయం పాలయ్యారు.

క్వార్టర్ ఫైనల్లో స్నేహిత్



న్యూఢిల్లీ: అల్టిమేట్ టేబుల్ టెన్నిస్ (యూటీటీ) జాతీయ ర్యాంకింగ్ చాంపియన్‌షిప్ పురుషుల సింగిల్స్‌లో తెలంగాణ ప్లేయర్ సూరావజ్జుల స్నేహిత్ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. బుధవారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో స్నేహిత్ 3-2తో ప్రియానుజ్ భట్టాచార్య (అస్సాం)పై గెలుపొందాడు. ఈ టోర్నీలో స్నేహిత్ ఇండియన్ ఆడిట్ అండ్ అకౌంట్స్ డిపార్ట్‌మెంట్ (ఐఏ అండ్ ఏడీ) జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. స్నేహిత్‌తోపాటు అంకుర్ భట్టాచార్య (పశ్చిమ బెంగాల్), హర్మీత్ దేశాయ్ (పీఎస్‌పీబీ), రీగన్ (మహారాష్ట్ర), పాయస్ జైన్ (ఢిల్లీ), ఆకాశ్ పాల్ (ఆర్‌ఎస్‌పీబీ), పునీత్ బిశ్వాస్ (పశ్చిమ బెంగాల్), సత్యన్ (పీఎస్‌పీబీ) కూడా క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టారు.

తొలి రౌండ్‌లోనే శ్రీజ పరాజయం



మకావ్: వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) మకావ్ చాంపియన్స్ లెవెల్ టోర్నమెంట్‌లో భారత నంబర్‌వన్, తెలంగాణ క్రీడాకారిణి ఆకుల శ్రీజకు నిరాశ ఎదురైంది. వరల్డ్ ర్యాంకింగ్స్ ప్రకారం భారత్ నుంచి ఈ టోర్నీలో ఆడేందుకు శ్రీజ మాత్రమే అర్హత సాధించింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 43వ ర్యాంకర్ శ్రీజ 5-11, 1-11, 6-11తో ప్రపంచ ఏడో ర్యాంకర్ జు యులింగ్ (మకావ్) చేతిలో ఓడిపోయింది. 18 నిమిషాల్లోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో శ్రీజ కేవలం 12 పాయింట్లు గెలిచింది. తన సర్వీస్‌లో నాలుగు పాయింట్లు నెగ్గిన ఆమె ప్రత్యర్థి సర్వీస్‌లో ఎనిమిది పాయింట్లు సాధించింది. మరోవైపు జు యులింగ్ తన సర్వీస్‌లో 15 పాయింట్లు, శ్రీజ సర్వీస్‌లో 18 పాయింట్లు సంపాదించింది. తొలి రౌండ్‌లో ఓడిన శ్రీజకు 8000 డాలర్ల (రూ. 7 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 15 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

ఆరో స్థానంలో రవి బిష్ణోయ్

ఐసీసీ టి20 బౌలింగ్ ర్యాంకింగ్స్



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) టి20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో భారత ప్లేయర్లు ముందడుగు వేశారు. స్పిన్నర్ రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్ సింగ్ ఒక్కో స్థానం మెరుగు పరుచుకున్నారు. ఈ జాబితాలో టీమిండియా నుంచి అత్యుత్తమంగా వరుణ్ చక్రవర్తి (706 పాయింట్లు) నాలుగో స్థానంలో ఉండగా... రవి బిష్ణోయ్ (674 పాయింట్లు) ఆరో ర్యాంక్‌లో, అర్ష్‌దీప్ సింగ్ (653 పాయింట్లు) పదో స్థానంలో ఉన్నారు. అక్షర్ పటేల్ (636 పాయింట్లు) సైతం ఒక స్థానం మెరుగు పరుచుకొని 13వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. టి20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అభిషేక్ శర్మ (829 పాయింట్లు) అగ్రస్థానంలో కొనసాగుతుండగా... తిలక్ వర్మ (804 పాయింట్లు) రెండో ర్యాంక్‌లో ఉన్నాడు. టీమిండియా టి20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఆరో స్థానంలో ఉండగా... ఆసియా కప్ టోర్నీకి ఎంపిక కాని ఓపెనర్ యశస్వి జైస్వాల్ ఒక స్థానం కోల్పోయి 11వ ర్యాంక్‌లో నిలిచాడు. ఆల్‌రౌండర్ల జాబితాలో హార్దిక్ పాండ్యా 252 పాయింట్లతో 'టాప్'లో ఉన్నాడు. వన్డే ర్యాంకింగ్స్‌లో ఎలాటి మార్పులు చోటుచేసుకోలేదు. బ్యాటింగ్‌లో శుబ్‌మన్ గిల్ (784 పాయింట్లు), రోహిత్ శర్మ (756 పాయింట్లు) వరుసగా తొలి రెండు స్థానాల్లో కొనసాగుతున్నారు. విరాట్ కోహ్లి (736 పాయింట్లు) నాలుగో ర్యాంక్‌లో ఉన్నాడు.

చమరి సారథ్యంలో...

మహిళల వన్డే ప్రపంచ కప్‌నకు శ్రీలంక జట్టు ప్రకటన



కొలంబో: మహిళల వన్డే ప్రపంచ కప్‌లో పాల్గొనే శ్రీలంక క్రికెట్ జట్టుకు చమరి ఆటపట్టు కెప్టెన్‌గా వ్యవహరించనుంది. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ టోర్నీ కోసం బుధవారం 15 మందితో కూడిన శ్రీలంక జట్టును ప్రకటించారు. ఇప్పటి వరకు 12 సార్లు ప్రపంచకప్ జరగగా... అందులో ఒక్కసారి కూడా ఫైనల్ చేరలేకపోయిన లంక జట్టు... సొంతగడ్డపై జరుగుతున్న టోర్నీలో సత్తా చాటేందుకు సమాయత్తమవుతోంది. ఈ ఏడాది ఆడిన ఎనిమిది వన్డేల్లో లంక జట్టు కేవలం రెండు మ్యాచ్‌ల్లోనే నెగ్గింది. హర్షిత సమరవిక్రమ, నిలాక్షిక సిల్వా, అనుష్క సంజీవని వంటి పలువురు ప్రతిభవంతులైన ప్లేయర్లకు జట్టులో చోటు దక్కింది. వరల్డ్‌కప్‌లో భాగంగా ఈనెల 30న జరిగే తొలి మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత జట్టుతో శ్రీలంక ఆడుతుంది.

శ్రీలంక జట్టు: చమరి ఆటపట్టు (కెప్టెన్), హాసిని పెరీరా, విష్మి గుణరత్నే, హర్షిత సమరవిక్రమ, కవీషా దిల్హారీ, నీలాక్షి, అనుష్క సంజీవని, ఇమేషా దులానీ, దేవ్‌మీ విహంగ, వత్సల, ఇనోక రణవీర, సుగంధిక, ప్రబోధని, మల్కీమదర, అచిని కులసూర్య.

ఎవరిదో దులీప్ ట్రోఫీ?

టైటిల్ కోసం సెంట్రల్ జోన్‌తో సౌత్ జోన్ పోరు

- సమతూకంగా రెండు జట్లు
- యువ ఆటగాళ్లకు మంచి అవకాశం




దానిశ్ మాలేవర్
రజత్ పాటీదార్

బెంగళూరు: దేశవాళీ టోర్నీ దులీప్ ట్రోఫీ ఫైనల్‌కు రంగం సిద్ధమైంది. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ గ్రౌండ్‌లో గురువారం ప్రారంభం కానున్న ఈ తుది పోరులో సెంట్రల్ జోన్‌తో సౌత్ జోన్ తలపడనుంది. ఓ వైపు టీమిండియా ఆసియాకప్ టి20 టోర్నమెంట్‌లో పాల్గొంటుండగా... మరోవైపు భారత 'ఎ' జట్టు ఆస్ట్రేలియా 'ఎ'తో అనధికారిక టెస్టు సిరీస్‌కు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో కొత్త ఆటగాళ్లు తమ సత్తా చాటుకునేందుకు దులీప్ ట్రోఫీ చక్కటి వేదిక కానుంది. గతేడాది మాదిరిగా కాకుండా తిరిగి పాత పద్ధతిలో జరుగుతున్న ఈ టోర్నీలో నార్త్ జోన్‌పై విజయంతో సౌత్ జోన్... వెస్ట్ జోన్‌ను ఓడించి సెంట్రల్ జోన్ ఫైనల్‌కు చేరాయి. సౌత్ జోన్ జట్టు చివరిసారిగా 2023లో దులీప్ ట్రోఫీ విజేతగా నిలవగా... 2014-15 సీజన్‌లో సెంట్రల్ జోన్ ట్రోఫీ చేజిక్కించుకుంది. అప్పుడు కూడా సౌత్‌జోన్‌పైనే నెగ్గిన సెంట్రల్ జోన్ అదే ఫలితం పునరావృతం చేయాలని యోచిస్తోంది. రజత్ పాటీదార్, దానిశ్ మాలేవర్, శుభమ్ శర్మ, యశ్ రాథోడ్, దీపక్ చాహర్, తన్మయ్ అగర్వాల్, తనయ్ త్యాగరాజన్, షేక్ రషీద్, రికీ భుయ్, మొహమ్మద్ అజహరుద్దీన్ వంటి వాళ్లు మెరుగైన ప్రదర్శన చేసి సెలెక్టర్ల దృష్టిలో పడాలని భావిస్తున్నారు.

మనవాళ్లు ఆకట్టుకునేనా...

ముందస్తు షెడ్యూల్ ప్రకారం హైదరాబాద్ ఆటగాడు తిలక్ వర్మ సౌత్ జోన్ జట్టుకు సారథ్యం వహించాల్సి ఉండగా... ఆసియా కప్‌లో ఆడుతున్న భారత జట్టుకు అతను ఎంపిక కావడంతో ఫైనల్‌కు దూరమయ్యాడు. దీంతో కేరళకు చెందిన మొహమ్మద్ అజహరుద్దీన్‌కు సారథ్య బాధ్యతలు దక్కాయి. ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ రికీ భుయ్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. దేవదత్ పడిక్కల్, జగదీశన్ కూడా అందుబాటులో లేకపోవడంతో... స్మరణ్, సిద్ధార్థ్‌లకు జట్టులో చోటు దక్కింది. హైదరాబాద్ ఆటగాళ్లు తన్మయ్ అగర్వాల్, తనయ్ త్యాగరాజన్, ఆంధ్ర ప్లేయర్లు షేక్ రషీద్, రికీ భుయ్ సౌత్ జోన్ జట్టుకు కీలకం కానున్నారు.



రికీ భుయ్



తన్మయ్ అగర్వాల్

మోహిత్ కాలె, స్మరణ్, సల్మాన్ నిజార్‌తో సౌత్ జోన్ బ్యాటింగ్ బలంగానే ఉంది. ఇక అజహరుద్దీన్ సారథిగా, వికెట్‌కీపర్‌గా, బ్యాటర్‌గా కీలకం కానున్నాడు. గుర్‌జపనీత్ సింగ్, వాసుకి కౌశిక్, నిధీశ్, తనయ్ త్యాగరాజన్ బౌలింగ్ భారం మోయనున్నారు. పిచ్ అటు బౌలింగ్‌కు ఇటు బ్యాటింగ్‌కు సమానంగా అనుకూలించనుంది. ఆరంభంలో కాస్త జాగ్రత్త వహిస్తే భారీ స్కోర్లు చేయడం పెద్ద కష్టం కాకపోవచ్చు. మ్యాచ్ జరిగే ఐదు రోజుల్లోనూ వర్షం ముప్పు ఉంది.

బ్యాటింగ్ బలంగా...

సౌత్ జోన్‌తో పోల్చుకుంటే... సెంట్రల్ జోన్ బ్యాటింగ్ బలంగా ఉంది. ఈ టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన జాబితాలో సెంట్రల్ జోన్ ప్లేయర్లు ముందు వరుసలో ఉన్నారు. దానిశ్ మాలేవర్ 294 పరుగులతో అగ్రస్థానంలో ఉంటే... రజత్ పాటీదార్ 268, శుభమ్ శర్మ 252 పరుగులతో ఆకట్టుకున్నారు. ముఖ్యంగా పాటీదార్ 100కు పైగా స్ట్రయిక్ రేట్‌తో పరుగులు రాబట్టడం విశేషం. అతడు ఇదే జోరు తుదిపోరులోనూ కనబరిస్తే సౌత్ జోన్‌కు కష్టాలు తప్పకపోవచ్చు. ఇప్పటి వరకు ఈ టోర్నీలో పాటీదార్ వరుస ఇన్నింగ్స్‌లలో 125, 66, 77 పరుగులు చేశాడు. ఐపీఎల్‌లో తొలిసారి రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)కి టైటిల్ అందించిన పాటీదార్ సారథ్య అనుభవం కూడా సెంట్రల్ జోన్‌కు కలిసిరానుంది. ఖలీల్ అహ్మద్, మానవ్ సుతార్ వంటి వాళ్లు అందుబాటులో లేకపోయినా... సెంట్రల్ జోన్‌కు పెద్దగా ఇబ్బందులు లేవు. టీమిండియా ప్లేయర్ దీపక్ చాహర్‌తో పాటు వెస్ట్ జోన్‌తో సెమీఫైనల్లో 8 వికెట్లు పడగొట్టిన సారాంశ్ జైన్ బౌలింగ్‌లో కీలకం కానున్నారు.



కాఠ్మండులో ఆందోళనకారులు నిప్పుపెట్టడంతో తగలబడిన ఒక సూపర్‌మార్కెట్



రహదారుల మంత్రిత్వ శాఖ ఆవరణలో కాలిపోయిన వాహనాలు



బీర్గంజ్ పట్టణంలో పూర్తిగా కాలిపోయిన ఒక భవనం

నేపాల్‌కు నిప్పు పెట్టిందెవరు?

శాంతియుత ర్యాలీలు చేశామేగానీ హింసాత్మక ఘటనలకు దిగలేదన్న జెన్ జెడ్ యువత

రాజకీయ అవకాశవాదుల పనే ఇదంతా అని మండిపాటు

బంగ్లాదేశ్‌లో ఉద్యమ తరహాలో నిరసనను హైజాక్ చేస్తున్నారని ఆరోపణ

కాఠ్మండు: చేతికి ఆరో వేలుగా అతుక్కుపోయిన స్మార్ట్‌ఫోన్‌లో సోషల్‌మీడియా యాప్స్ అనేవి ఓ రకంగా ఆత్మ వంటివి. అలాంటి ఆత్మను చంపేస్తామంటూ ఊరుకోబోమని తెలియజేప్పేందుకే శాంతియుత నిరసన ర్యాలీలు చేపట్టామని నేపాల్‌లోని జెన్ జెడ్ యువత చెబుతోంది. దేశాన్ని చీడపీడలా తొలిచేస్తున్న అవినీతి, వారసత్వ రాజకీయాలు, ఉన్నతవర్గాల విలాసవంత జీవనాన్ని ప్రశ్నించేందుకు కదం తొక్కామని, మూడ్రోజులుగా జరుగుతున్న హింసాత్మక ఘటనలతో తమకు ఎలాంటి సంబంధం లేదని జెన్ జెడ్ విద్యార్థులు, యువజన సంఘాలు స్పష్టంచేశాయి. రాజకీయ అవకాశవాదులు ఉద్యమకారుల మాటున నిరసనకార్యక్రమాల్లో దూరిపోయి నేపాల్‌ను అగ్నిగుండంలా మార్చేశారని విద్యార్థులు ఆరోపించారు. బంగ్లాదేశ్‌లో విద్యార్థుల నిరసనతో మొదలైన ఆందోళనలు తీవ్రరూపం దాల్చి చివరకు ప్రభుత్వాన్ని పడగొట్టాయని, నేపాల్‌లోనూ అదే కుట్ర జరుగుతోందని విద్యార్థులు తీవ్ర ఆరోపణలు చేశారు. లూటీలు, దోపిడీలకు తాము ఆమడదూరంలో ఉండిపోయామని, పోలీసులపై రాళ్లదాడి ఘటనలతో తమకెలాంటి సంబంధం లేదని



నేపాల్ అధ్యక్షుడు రామచంద్ర పాదెల్ ఇంటికి నిరసనకారులు నిప్పుపెట్టిన దృశ్యం

స్పష్టంచేశారు. ఈ విధ్వంసం వెనుక బయటి శక్తుల హస్తముందని విద్యార్థులు ఆరోపించారు. ఏకపక్షంగా సామాజిక మాధ్యమాలపై ఆకస్మిక నిషేధం వల్ల కలిగే అనర్థాలకు ప్రభుత్వానిదే బాధ్యత అని తెలియజేప్పేందుకే వీధుల్లోకి వచ్చామని, విధ్వంసం చేయడం తమ ఉద్దేశ్యంకాదని స్పష్టంచేశారు.

మద్దతు పలికిన మాజీ ప్రధాని

విద్యార్థుల వాదనలకు పరోక్షంగా మాజీ ప్రధాని బాబూరామ్ భట్టారాయ్ మద్దతు పలికారు. ''నాకు తెల్సిన విద్యార్థులు ఇలాంటి విధ్వంసాలకు అస్సలు దిగరు. వారసత్వ రాజకీయాలు, రాజకీయనేతలు, ఉన్నతవర్గాల విలాసవంత జీవితం, అవినీతిపై విద్యార్థుల తిరుగుబాటు మొదలైంది. తీరాచూస్తే ఈ తిరుగుబాటుకు వ్యతిరేకంగా మరో 'తిరుగుబాటు'ఆరంభమైనట్లు తాజా ఘటనలు నిరూపిస్తున్నాయి. మేకవన్నె పులులు మీ ఉద్యమ మందల్లో దూరిపోయాయి. వారితో జాగ్రత్త అని మొదట్నుంచీ హెచ్చరిస్తూనే ఉన్నా''అని విద్యార్థులను భట్టారాయ్ హెచ్చరించారు. ఉద్యమంలో బయటిశక్తులనుద్దేశిస్తూ.. 'నేపాల్ ప్రజాస్వామ్య పునాదులనే పెకలించే దుస్సాహసానికి వాళ్లు దిగారు. వాళ్ల తదుపరి దారుణ లక్ష్యం ఏమిటో''అని ఆందోళన వ్యక్తంచేశారు. సొంత దేశాన్ని తగలబెడుతున్న విద్యార్థులు అంటూ వస్తున్న వార్తలను భట్టారాయ్ తప్పుబట్టారు. ''మొసలికన్నీరు కార్చడానికి విద్యార్థులేమీ రాజకీయనేతలు కాదు. అల్లర్లు, ఘర్షణలు చూసి విద్యార్థులే అవాక్కవుతున్నారు. శాంతియుత నిరసన కార్యక్రమాన్ని బయటి శక్తులు దురుద్దేశ్యంతో ఉగ్రరూపంలోకి మార్చేశారని విద్యార్థులు బాధపడుతున్నారు. తాజా వినాశనానికి బయటిశక్తులే కారణం''అని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు.

తీవ్రంగా ఖండించిన యువజన, ఎన్‌జీవో సంఘాలు

హింసాత్మక ఘటనలను యువజన, విద్యార్థి, లాభాపేక్షలేని ప్రభుత్వేతర ఎన్‌జీవోలు ఖండించాయి. ముఖ్యంగా తొలుత శాంతియుత నిరసన ప్రదర్శనలకు నాయకత్వం వహించిన జెన్ జెడ్ నేపాల్, హమీ నేపాల్ సంస్థలు ఈ విధ్వంసకాండపై ధ్వజమెత్తాయి. ఈ మేరకు బహిరంగ ప్రకటన చేశాయి. ''మొదట్నుంచీ విధ్వంసాన్ని మేం అడ్డుకునేందుకే ప్రయత్నించాం. వినాశనానికి మాకు వీసమెత్తయినా సంబంధం లేదు. విద్యార్థులెవరూ ఇలా ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులను ధ్వంసంచేయలేదు. ప్రధాని, మాజీ ప్రధానులు, ప్రభుత్వ కార్యాలయాలపై దాడులతో మాకు ఎలాంటి సంబంధం లేదు''అని బుధవారం ప్రకటనలో స్పష్టం చేశాయి. ''ఘటనాస్థలికి మేం తర్వాత వచ్చాం. బాధితులను కాపాడాం. సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాం. ప్రజల ఆస్తుల పరిరక్షణకు పాటుపడ్డాం''అని జెన్‌జెడ్ నేపాల్ మరో ప్రకటనలో పేర్కొంది. ''సహేతుకమైన, ప్రజాస్వామ్యయుత ఉద్యమపంథాలో సాగుతున్న మమ్మల్ని విధ్వంసకపర్వంలో భాగస్వాములుగా చిత్రించకండి. అధికారమే పరమావధిగా కుట్రలు చేసే రాజకీయ శక్తులు, అవకాశవాదులే ఈ వినాశనానికి సృష్టికర్తలు. మా ఉద్యమానికి తప్పుడు మరకలు అంటించే కుట్రలు జరుగుతున్నాయి. మంచి కోసం పోరాడుతున్న మమ్మల్ని దేశవినాశకారులుగా చిత్రించే కుట్రలు జరుగుతున్నాయి''అని జెన్‌జెడ్ ఆరోపించింది. ''మా వైపు నుంచి ఎలాంటి తప్పు జరగలేదు. కూల్చడం మా పనికాదు. దేశ పునర్‌నిర్మాణమే మా ధ్యేయం. దేశవ్యతిరేక యుద్ధం మేం చేయట్లేము. చెడుకు వ్యతిరేకంగా సాగుతున్న సంఘర్షణలో మాత్రమే విజయం సాధించాలని కోరుకుంటున్నాం. నఖూ జైలును మేం బద్దలుకొట్టలేదు. మాజీ ఉప ప్రధానమంత్రి రవి లమీచ్ఛానేను మేం జైలు నుంచి విడిపించలేదు''అని హమీ నేపాల్ ఒక ప్రకటనలో పేర్కొంది.

క్రాస్ ఓటింగ్‌పై అంతర్గత విచారణ?

- దాదాపు 20ఓట్లు ఇండియా కూటమి పక్షాల నుంచి క్రాస్ ఓటింగ్ !
- క్రాస్ ఓటింగ్‌పై విచారణ జరిపించాలని కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ డిమాండ్
- ఆప్, ఉద్ధవ్ శివసేన, డీఎంకే నుంచి ఎక్కువగా ఓట్లు ఎన్డీఏకు వెళ్లాయని విశ్లేషణ

సాక్షి, న్యూఢిల్లీ: ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో అనుకున్నదానికంటే ఎన్‌డీఏ అభ్యర్థికి రాధాకృష్ణన్‌కు అధిక మెజారిటీ సాధించడం వెనుక క్రాస్ ఓటింగ్ దాగిఉందన్న వాదన మరింత పెరిగింది. సొంత ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డికి ఓటేయకుండా రాధాకృష్ణన్ వైపు కొందరు విపక్ష 'ఇండియా'కూటమి పార్టీల ఎంపీలు మొగ్గుచూపారని వార్తలు ఎక్కువయ్యాయి. ఇండియా కూటమి పక్షాల ఎంపీలు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డారని ఆరోపణలు రాజకీయ వివాదంగా మారిన నేపథ్యంలో ఈ అంశంపై అంతర్గత విచారణ చేయించాలని కాంగ్రెస్ సహా దాని మిత్రపక్షాలు నిర్ణయించినట్లుగా తెలుస్తోంది. బిహార్ సహా ఇతర రాష్ట్రాల ఎన్నికలకు ముందు ఈ అంశం పార్టీల ఐక్యతకు ప్రశ్నిస్తోంది. దీంతో ఐక్యత పెద్ద సవాల్‌గా మారుతున్న నేపథ్యంలో కూటమిలోని లోటుపాట్లను గుర్తించి, వాటిని వీలైనంత త్వరగా సవరించుకోవాలనే అభిప్రాయంతో విపక్ష పార్టీలు ముందుకెళ్తున్నట్లు సమాచారం. మంగళవారం వెల్లడైన ఉప రాష్ట్రపతి ఎన్నికల ఫలితాల్లో సుమారు 20 ఓట్లు రాధాకృష్ణన్‌కు పడినట్లు విశ్వసిస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డికి 324 ఓట్లు వస్తాయని అంచనా వేశారు. కానీ ఆయనకు కేవలం 300 ఓట్లు పడ్డాయి. రాధాకృష్ణన్ గరిష్టంగా 436 ఓట్లు సాధించవచ్చని అంతా భావించారు. కానీ అనూహ్యంగా ఆయన 452 ఓట్లు సాధించారు. మరింత స్పష్టమైన మెజారిటీ ఒడిసిపట్టారు. పోలింగ్ పూర్తయిన వెంటనే తమ అనుకూల ఓట్లపై ఓ అంచనాకు వచ్చిన కాంగ్రెస్ సైతం తమకు అనుకూలంగా 315 ఓట్లు వస్తాయని లెక్కగట్టింది. అయితే కాంగ్రెస్ పేర్కొన్నట్లుగానే 15 ఓట్లు ఇక్కడే క్రాస్ ఓటింగ్ అయ్యాయి. దీంతో పాటు చెల్లని ఓట్లు సైతం ఇండియా కూటమి పక్షాలవేనని ప్రచారం జరుగుతోంది. భారీ క్రాస్ ఓటింగ్ దృష్ట్యా ఈ అంశంపై కచ్చితంగా విచారణ జరగాలని కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ డిమాండ్ చేశారు. దీనిని తీవ్రమైన విశ్వాస ఉల్లంఘనగానే పరిగణించాలని, ఇది విపక్షాల అంతర్గత ఐక్యతపై ప్రశ్నలు లేవనెత్తుతోందని ఆయన వ్యాఖ్యానించారు. తివారీతో పాటు కాంగ్రెస్ పార్టీలోని ఇతర నేతలు సైతం ఈ విషయంపై విచారణ కోరుకుంటున్నారని ఢిల్లీలోని ఏఐసీసీ వర్గాలు అంటున్నాయి. ప్రధానంగా ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) నుంచి రావాల్సిన 12 ఓట్లలో కనీసంగా 3 ఓట్లు, తమిళనాట డీఎంకే నుంచి రావాల్సిన 32 ఓట్లలో కనీసంగా 4 ఓట్లు, ఆర్‌జేడీ నుంచి రెండు ఓట్లు, శివసేన(ఉద్ధవ్) పార్టీ నుంచి కొన్ని ఓట్లు క్రాసింగ్ జరిగినట్లు అంచనాలు వేస్తున్నారు.

మాకు సంబంధం లేదన్న పార్టీలు

అయితే క్రాస్ ఓటింగ్ వివాదంపై విపక్ష పార్టీల వాదన భిన్నంగా ఉంది. తమ సభ్యులెవరూ రాధాకృష్ణన్‌కు ఓటేయలేదని కాంగ్రెస్ మిత్రపక్షాలు కరాఖండీగా చెప్పాయి. దీనిపై ఇప్పటికే ఆర్‌జేడీ, డీఎంకే, ఎస్పీ పార్టీలు తమ ఎంపీలు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడలేదని ప్రకటనలు సైతం ఇచ్చాయి. ఇక కాంగ్రెస్ సైతం తమ ఓట్లు నూటికి నూరు శాతం కూటమి అభ్యర్థికే బలంగా పడ్డాయని చెబుతున్నాయి. అయితే బిహార్, తమిళనాడు, పశ్చిమబెంగాల్ ఎన్నికల దృష్ట్యా కూటమిలో ఐక్యత కొనసాగి ఎన్నికల్లో పోరాడాలంటే క్రాస్ ఓటింగ్‌పై విచారణ జరపాలని కాంగ్రెస్ నేతల నుంచి డిమాండ్ వస్తోంది. ఇదే సమయంలో విపక్షాల అభ్యర్థికి 40 శాతం ఓట్ల వాటాను 'నైతిక విజయం'గా కాంగ్రెస్ నాయకులు అభివర్ణిస్తున్నారు. 2022 ఎన్డీఏకు చెందిన జగదీప్ ధన్‌ఖడ్‌పై పోటీ చేసిన విపక్షాల అభ్యర్థి మార్గరెట్ అల్వాకు వచ్చిన ఓట్లతో పోలిస్తే ఈసారి తమకు దాదాపు 14 శాతం ఎక్కువ ఓట్లు వచ్చాయని అంటున్నారు. ఇక వీటిని తిప్పికొడుతున్న బీజేపీ 15 మంది ప్రతిపక్ష ఎంపీలు ఎన్డీఏ అభ్యర్థికి ఓటు వేశారని, మరో 15 మంది ఉద్దేశపూర్వకంగా చెల్లని ఓట్లు వేశారని కౌంటర్‌లు ఇస్తోంది.

ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీకి మోదీ ఫోన్

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై చర్చ

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ఇటలీ ప్రధానమంత్రి జార్జియా మెలోనీతో ఫోన్‌లో మాట్లాడారు. భారత్–ఈయూ మధ్య ప్రతిపాదిత స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ)పై వారు చర్చించారు. ఈ ఒప్పందానికి మద్దతు ఇస్తున్నందుకు మెలోనీకి మోదీ కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే ఉక్రెయిన్‌లో కొనసాగుతున్న ఘర్షణ, ఇండియా–మిడిల్ ఈస్ట్–యూరప్ ఎకనామిక్ కారిడార్‌పైనా చర్చించారు. అభిప్రాయాలు పంచుకున్నారు. జార్జియా మెలోనీతో అద్భుతమైన సంభాషణ జరిగిందని మోదీ 'ఎక్స్'లో పోస్టుచేశారు. ఇండియా–ఇటలీ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసుకోవాలని నిర్ణయించామని తెలిపారు. ఉక్రెయిన్‌లో ఘర్షణకు సాధ్యమైనంత త్వరగా తెరపడాలన్నదే తమ ఉద్దేశమని వివరించారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి ఈ ఏడాది ఆఖరుకల్లా అమల్లోకి తీసుకురావాలని భారత్, ఈయూ భావిస్తున్నాయి. ఈ అంశంపై ఢిల్లీలో త్వరలో ఇరుపక్షాల మధ్య 13వ దఫా చర్చలు జరుగబోతున్నాయి.

తేలికపాటి వ్యోమనౌకల తయారీకి ఏర్పాట్లు

ఇస్రో, ఇన్‌స్పేస్, ఎన్‌ఎస్‌ఐఎల్‌తో హెచ్‌ఏఎల్ ఒప్పందం

సాక్షి బెంగళూరు: తేలికపాటి ఉపగ్రహ వ్యోమనౌకల తయారీకి రంగం సిద్ధమైంది. స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (ఎస్‌ఎస్‌ఎల్‌వీ) సాంకేతికత మార్పిడికి బుధవారం బెంగళూరులో ముందడుగు పడింది. ఈ మేరకు ఎస్‌ఎస్‌ఎల్‌వీ సాంకేతిక బదిలీ ఒప్పందంపై హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్‌ఏఎల్), ఇస్రో, ఇన్‌స్పేస్, ఎన్‌ఎస్‌ఐఎల్ ప్రతినిధులు సంతకం చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఏఎల్ సీఎండీ డాక్టర్ కె.సునీల్ మాట్లాడుతూ.. పూర్తి స్వదేశీ, తేలికపాటి వాణిజ్య ఎస్‌ఎస్‌ఎల్‌వీని తయారీకి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కమ్యూనికేషన్, భూపరిశీలన, నావిగేషన్ ఇతరత్ర అంశాల్లో ఎంతో కీలకమైన తేలికపాటి ఉపగ్రహాలకు ప్రస్తుతం డిమాండ్ అధికంగా ఉందన్నారు. కేవలం ఎస్‌ఎస్‌ఎల్‌వీ తయారీ మాత్రమే కాకుండా ఎంఎస్‌ఎంఈ, స్టార్టప్ రంగాల్లో హెచ్‌ఏఎల్ అనేక కొత్త ప్రయోగాలు చేస్తోందని తెలిపారు. కాగా, మూడు దశల్లో ఉపగ్రహాలను లాంచ్ చేసే వ్యోమనౌకలను తయారు చేయనున్నారు. దిగువ భూకక్ష్యలో ఉపగ్రహాలను చేరవేసేలా 500 కేజీల కంటే తక్కువ బరువున్న వ్యోమనౌకలను సిద్ధం చేయనున్నారు. ఈ ఒప్పంద కార్యక్రమం హెచ్‌ఏఎల్ సీఎండీ సునీల్, ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్, ఇన్‌స్పేస్ సంస్థ చైర్మన్ డాక్టర్ పవన్‌కుమార్ గోయెంకా సమక్షంలో జరిగింది.

సంజయ్ ఆస్తుల వివరాలు బయటపెట్టండి: ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ: బాలీవుడ్ నటి కరిష్మా కపూర్ మాజీ భర్త, దివంగత సంజయ్ కపూర్‌కు సంబంధించినమొత్తం ఆస్తుల వివరాలను బహిర్గతం చేయాలని ఆయన మూడో భార్య ప్రియా కపూర్(ప్రియా సచ్‌దేవ్)ను ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. తమ తండ్రి ఆస్తుల్లో వాటా ఇవ్వాలంటూ కరిష్మా కపూర్ కుమార్తె, కుమారుడు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతి సింగ్ బుధవారం విచారణ చేపట్టారు. ప్రియా కపూర్ తరఫు న్యాయవాది రాజీవ్ నాయర్ వాదనలు వినిపించారు. కరిష్మా కపూర్ కుమార్తె సమైరా(20), కుమారుడు కియాన్‌రాజ్(15)కు ఫ్యామిలీ ట్రస్టు నుంచి ఇప్పటికే రూ.1,900 కోట్ల విలువైన ఆస్తులు ఇచ్చినట్లు వెల్లడించారు. వారికి ఇంకా ఏం కావాలని ప్రశ్నించారు. సంజయ్ కపూర్ బతికి ఉన్నప్పుడు ఏనాడూ పట్టించుకోని వారు ఇప్పుడు ఆయన ఆస్తుల కోసం ఆరాటపడుతున్నారని తప్పుపట్టారు. సంజయ్ కపూర్ రాసిన విల్లును రిజిస్టర్ చేశారా? అని న్యాయమూర్తి ప్రశ్నించగా.. రిజిస్టర్ చేయనంత మాత్రాన విల్లు చెల్లుబాటు కాకుండాపోదని రాజీవ్ నాయర్ బదులిచ్చారు. దీంతో ప్రియా కపూర్‌కు న్యాయమూర్తి నోటీసు జారీచేశారు. సంజయ్ కపూర్‌కు సంబంధించిన స్థిర చరాస్తుల వివరాలన్నీ బయటపెట్టాలని ఆదేశించారు. తదుపరి విచారణను వచ్చే నెల 9వ తేదీకి వాయిదా వేశారు.

90 శాతం బిల్లులకు నెల లోపలే సమ్మతి

సుప్రీంకోర్టుకు తెలియజేసిన కేంద్రం

న్యూఢిల్లీ: పార్లమెంట్ లేదా రాష్ట్రాల అసెంబ్లీల్లో ఆమోదించి, సమ్మతి కోసం పంపించిన బిల్లులపై రాష్ట్రపతి/గవర్నర్లు జాప్యం చేయడం లేదని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. 1970 నుంచి చూస్తే 90 శాతం బిల్లులకు నెల రోజులలోపే సమ్మతి లభించిందని వెల్లడించింది. 17,150 బిల్లుల్లో కేవలం 20 బిల్లులను గవర్నర్లు పెండింగ్‌లో పెట్టారని పేర్కొంది. పార్లమెంట్ లేదా అసెంబ్లీ నుంచి వచ్చిన బిల్లులపై మూడు నెలల్లోగా ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని రాష్ట్రపతి/గవర్నర్లకు సుప్రీంకోర్టు ఇటీవల గడువు నిర్దేశించిన సంగతి తెలిసిందే. దీనిపై రాష్ట్రపతి ముర్ము సందేహాలు లేవనెత్తారు. బిల్లులకు ఆమోదముద్ర వేసే విషయంలో రాష్ట్రపతి/గవర్నర్లకు గడువు విధించే అధికారం కోర్టులకు ఉందా? అని ప్రశ్నించారు. స్పష్టత ఇవ్వాలని సూచించారు. ఈ మేరకు రాష్ట్రపతి రిఫరెన్స్‌పై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం బుధవారం సైతం విచారణ కొనసాగించింది. కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. పెండింగ్‌లో ఉన్న 20 బిల్లుల్లో ఏడు బిల్లులు తమిళనాడుకు సంబంధించినవేనని తెలిపారు. దీనిపై సీనియర్ లాయర్లు కపిల్ సిబల్, అభిషేక్ సింఘ్వీ స్పందించారు. ఇలాంటి డేటాను కోర్టుకు సమర్పించేందుకు గతంలో తమకు అనుమతి ఇవ్వలేదని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం తరఫున నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. మంత్రివర్గం సలహా మేరకే గవర్నర్ నడుచుకోవాల్సి ఉంటుందని స్పష్టంచేశారు. తదుపరి విచారణను ధర్మాసనం వాయిదా వేసింది.

బిహార్‌లో వేల కోట్ల ప్రాజెక్ట్‌లకు ఓకే

న్యూఢిల్లీ: త్వరలో శాసనసభ ఎన్నికలు జరగనున్న బిహార్‌లో రోడ్డు, రైల్వే అభివృద్ధి పనులకు మోదీ సర్కార్ పచ్చజెండా ఊపింది. నాలుగు వరసల బక్సర్–బాగల్పూర్ హైస్పీడ్ కారిడార్ రోడ్డు నిర్మాణం కోసం రూ.4,447.38 కోట్లు కేటాయించేందుకు కేంద్రం ఓకే చెప్పింది. ఈ మేరకు బుధవారం ఢిల్లీలో ప్రధాని మోదీ సారథ్యంలోని ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ నిర్ణయం తీసుకుంది. మోకామా–ముంగేర్ సెక్షన్‌లో 82.4 కిలోమీటర్ల పొడవునా రోడ్డు నిర్మించనున్నారు. ఈ కేబినెట్ భేటీ వివరాలను సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తర్వాత మీడియాకు చెప్పారు. బిహార్‌లో 177 కిలోమీటర్ల పొడవునా ఉన్న భాగల్పూర్–దుమ్కా–రామ్‌పుర్హాట్ మధ్య సింగిల్ రైల్వేలైన్ సెక్షన్‌లో డబ్లింగ్ పనుల కోసం రూ.3,169 కోట్లు కేటాయించేందుకు కేబినెట్ ఓకే చెప్పింది.. బహుళార్థక అనుసంధానం, సరఫరా సామర్థ్యం పెంపు లక్ష్యంగా ప్రధానమంత్రి గతిశక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్‌లో భాగంగా ఈ ప్రాజెక్టుకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది.

రష్యా డ్రోన్లను కూల్చిన పోలండ్

వార్సా: అనుమతి లేకుండా తమ గగనతలంలోకి ప్రవేశించిన రష్యా డ్రోన్లను కూల్చివేసినట్లు పోలండ్ బుధవారం వెల్లడించింది. మంగళవారం రాత్రి కొన్ని గంటల వ్యవధిలో పెద్ద సంఖ్యలో రష్యా డ్రోన్లను నేలమట్టం చేశామని, ఇందుకు 'నాటో'దేశాలు సైతం సహకరించాయని తెలియజేసింది. రష్యా తీరును దురాక్రమణ చర్యగానే పరిగణిస్తున్నట్లు స్పష్టంచేసింది. కొన్ని డ్రోన్లు రష్యా మిత్రదేశమైన బెలారస్ భూభాగం గుండా తమ గగనతలంలోకి వచ్చాయని పేర్కొంది. ''గత రాత్రి రష్యా డ్రోన్లు మా గగనతలాన్ని ఉల్లంఘించాయి. మాకు ముప్పుగా మారిన ఆ డ్రోన్లను కూల్చివేశాం''అని పోలండ్ ప్రధానమంత్రి డొనాల్డ్ టస్క్ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. డ్రోన్లతో దాడులు జరగొచ్చన్న అంచనాతో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం దాకా పోలండ్ సైన్యం అప్రమత్తంగా వ్యవహరించింది. పదికిపైగా డ్రోన్లు తమ గగనతలంలోకి ప్రవేశించినట్లు పోలండ్ రక్షణ శాఖ మంత్రి వ్లాడిస్లావ్ పేర్కొన్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా వార్సా ఎయిర్‌పోర్టు నుంచి విమానాల రాకపోకలను కొన్ని గంటలపాటు నిలిపివేశారు. మరోవైపు ఉక్రెయిన్‌లోని పశ్చిమ ప్రాంతాలపై రష్యా సైన్యం డ్రోన్లతో దాడులకు దిగింది. ఈ దాడుల్లో ముగ్గురు మరణించారు. రష్యా–బెలారస్ ఉమ్మడిగా మిలటరీ డ్రిల్స్ నిర్వహిస్తున్నాయి. ఈ నెల 16వ తేదీ దాకా ఇవి కొనసాగుతాయి. అయితే, సాంకేతిక సమస్యల వల్ల కొన్ని డ్రోన్లు పోలండ్ గగనతలంలోకి ప్రవేశించాయని బెలారస్ సైన్యం వెల్లడించింది. అలా దారితప్పి వెళ్లిన డ్రోన్లనే పోలండ్ కూల్చివేసినట్లు స్పష్టంచేసింది.

పోలండ్‌ను టార్గెట్ చేయలేదు: రష్యా

తమ డ్రోన్లను పోలాండ్ కూల్చడంపై రష్యా రక్షణ శాఖ స్పందించింది. తమ టార్గెట్ పోలండ్ కాదని బుధవారం వివరణ ఇచ్చింది. ఉక్రెయిన్ పశ్చిమ ప్రాంతంలోని సైనిక–పారిశ్రామిక కాంప్లెక్స్‌పై దాడి చేయడానికి డ్రోన్లను ప్రయోగించినట్లు తెలిపింది. పోలండ్ భూభాగంపై దాడి చేయాలన్న ఉద్దేశం ఎంతమాత్రం లేదని వివరణ ఇచ్చింది. డ్రోన్ల అంశంపై ఆ దేశ రక్షణ శాఖతో చర్చించడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించింది.

ఓట్ల చోరీపై పోరాటం ఉధృతం చేస్తాం

రాయ్‌బరేలీలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రకటన

రాయ్‌బరేలీ: 'ఓటు చోర్, గద్దీ చోడ్' నినాదం దేశమంతటా వినిపిస్తోందని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ అన్నారు. ఓట్ల చోరీ బాగోతాన్ని భిన్నరూపాల్లో బయటపెడతామని చెప్పారు. ఓట్ల దొంగలు పదవుల నుంచి దిగిపోవాలని ప్రజలు నినదిస్తున్నారని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ రెండు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ పార్లమెంట్ నియోజక వర్గానికి చేరుకున్నారు. పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఓట్ల చోరీ ముమ్మాటికీ నిజమని తేల్చిచెప్పారు. ప్రజల ఓట్లను దొంగలించి గద్దెనెక్కినవారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. మహారాష్ట్ర, కర్ణాటకలో జరిగిన ఓట్ల చోరీపై తమవద్ద స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని పునరుద్ఘాటించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కోటి మంది కొత్తగా ఓటర్లుగా చేర్పించి బీజేపీ గెలిచిందని ఆరోపించారు. ఉత్తరప్రదేశ్, హరియాణా, మధ్యప్రదేశ్, గుజరాత్ తదితర రాష్ట్రాల్లోనూ భారీ ఎత్తున ఓట్ల దొంగతనం జరిగిందని మండిపడ్డారు. ఓట్ల చోరీపై పోరాటం మరింత ఉధృతం చేస్తామని స్పష్టంచేశారు. కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తే రాజ్యాంగాన్ని, జాతీయ జెండాను కూడా కాపాడినట్లేనని రాహుల్ అన్నారు. దేశ సంపద ప్రజలందరికీ చెందుతుందని రాజ్యాంగం నిర్దేశిస్తున్నట్లు గుర్తుచేశారు. ఇదిలా ఉండగా,



రాయ్‌బరేలీలో రాహుల్ గాంధీతోపాటు ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ ఫోటోలతో కూడిన పోస్టర్లు ఏర్పాటు చేశారు. 'భారతదేశం చివరి ఆశ కలియుగ బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుడు' అంటూ వాటిపై నినాదాలు రాశారు.

ఇండోర్.. అమరావతి.. దేవాస్..!

సాక్షి, న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్‌లోని ఇండోర్, మహారాష్ట్రలోని అమరావతి, మధ్యప్రదేశ్‌లోని దేవాస్.. దేశంలోనే నాణ్యమైన గాలి కలిగిన నగరాలుగా నిలిచాయి. కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ ప్రకటించిన స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ అవార్డులను గెలుచుకున్నాయి. ఢిల్లీలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో మంత్రి భూపేందర్ యాదవ్ అవార్డులను ప్రదానం చేశారు. పారిశ్రామిక కేంద్రాలు, బొగ్గు గనుల వంటివి ఉన్నప్పటికీ ఇవి మంచి ఫలితాలను సాధించాయన్నారు. జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమం (ఎన్‌సీఏపీ) కింద దేశంలోని 130 నగరాల్లో గాలి నాణ్యతను మెరుగుపరిచేందుకు చేపట్టిన చర్యల ఆధారంగా ఈ ర్యాంకులను కేటాయించారు. నగర జనాభాను బట్టి మూడు కేటగిరీల్లో అవార్డులు ప్రకటించారు. కేటగిరీ–1 (10 లక్షలకు పైగా జనాభా)లో మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ రూ.1.5 కోట్ల నగదు బహుమతితో మొదటి స్థానంలో నిలిచింది. మధ్యప్రదేశ్‌కే చెందిన జబల్‌పూర్ రూ.1 కోటితో ఈ కేటగిరీలో రెండో స్థానం, యూపీలోని ఆగ్రా, గుజరాత్‌లోని సూరత్ చెరో రూ.25 లక్షలతో మూడో స్థానంలో నిలిచాయి. కేటగిరీ–2 (3–10 లక్షల జనాభా)లో మహారాష్ట్రలోని అమరావతి రూ.75 లక్షలతో మొదటి స్థానం దక్కించుకుంది. ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీ, మొరాదాబాద్‌లు సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచాయి. కేటగిరీ–3 (3 లక్షల లోపు జనాభా)లో దేవాస్ (మధ్యప్రదేశ్) రూ.37.50 లక్షలతో ప్రథమ స్థానంలో నిలిచింది. దేశ రాజధాని ఢిల్లీ 32వ స్థానంలో నిలవడం గమనార్హం.

గాలి కాలుష్యాన్ని అడ్డుకోవడంలో టాప్

- దక్కిన జాతీయ స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ అవార్డులు
- మొదటి కేటగిరీలో జబల్‌పూర్, ఆగ్రా, సూరత్‌లకు చోటు
- విజేతల జాబితాలో కనిపించని ఏపీ, తెలంగాణ నగరాలు

తెలుగు రాష్ట్రాల పరిస్థితి ఏంటి?

జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమం (ఎన్‌సీఏపీ) కింద ఎంపిక చేసిన 130 నగరాల జాబితాలో హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ వంటి తెలుగు రాష్ట్రాలకు చెందిన నగరాలు కూడా ఉన్నాయి. ఈ నగరాల్లో గాలి నాణ్యతను మెరుగుపరిచేందుకు కేంద్రం భారీగా నిధులు కేటాయిస్తోంది. ఇప్పటివరకు 130 నగరాలకు రూ.20,130 కోట్లు కేటాయించగా, వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా సుమారు రూ.1.55 లక్షల కోట్లను సమీకరించారు. ఇంత పెద్ద మొత్తంలో నిధులు అందుతున్నా, తెలుగు నగరాలు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడంలో వెనుకబడటం గమనార్హం.

వార్డు స్థాయికి విస్తరిస్తాం

రామ్‌సర్ కన్వెన్షన్ విభాగం కింద ఇండోర్, ఉదయ్‌పూర్ నగరాలకు 'వెట్‌ల్యాండ్ సిటీ అక్రిడిటేషన్'(చిత్తడి నేలల నగర గుర్తింపు) సర్టిఫికెట్లను మంత్రి భూపేందర్ యాదవ్ అందజేశారు. పట్టణ చిత్తడి నేలల పరిరక్షణకు ఈ నగరాలు అసాధారణమైన చర్యలు తీసుకున్నాయని కొనియాడారు. దేశంలోని 103 నగరాల్లో గాలి నాణ్యత గణనీయంగా మెరుగుపడిందని కేంద్రమంత్రి భూపేంద్ర యాదవ్ తెలిపారు. వచ్చే ఏడాది నుంచి వార్డుల్లో వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు తీసుకున్న చర్యల ఆధారంగానూ అవార్డులు అందజేస్తామని తెలిపారు. తద్వారా క్షేత్రస్థాయిలో మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు అవకాశముందని తెలిపారు. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను ఆయన విడుదల చేశారు.

వివాహం వల్ల ఏర్పడే బంధువులను ఏమంటారు?

సమాజం అనేది ఒక క్రమపూర్వకమైన సామాజిక సంబంధాల వ్యవస్థగా ఉంటుంది. ప్రమాణాలు, విలువలపై ఆధారపడిన వ్యవస్థీకృత సమూహాన్ని 'సామాజిక సంస్థ'గా పేర్కొనవచ్చు. ప్రాథమిక అవసరాలు తీర్చుకోవడానికి ఒక తరం నుంచి మరో తరానికి సంబంధాలు జాగ్రత్తగా కొనసాగుతాయి. ప్రతి సమాజంలోనూ బంధుత్వం, వివాహం, కుటుంబం, మతం, విద్య, ఆర్థిక, రాజకీయ సంస్థలు అనే ప్రాథమిక అంశాలుంటాయి.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

సోషియాలజీ



బంధుత్వం

సమాజంలో మానవుడు ఒంటరిగా జీవించలేడు. పుట్టింది మొదలు మరణించే వరకు ప్రతి వ్యక్తి సమాజంలోని విభిన్న వ్యక్తులతో విభిన్న సంబంధాలను ఏర్పరచుకుంటాడు. సమాజంలో వ్యక్తుల మధ్య ఏదో ఒక రకమైన సంబంధం కొనసాగుతూనే ఉంటుంది. అయితే వీటిలో రక్త సంబంధాలు లేదా వివాహం ఆధారంగా ఏర్పడే బంధాలు దగ్గరగా ఉంటాయి.

రక్తసంబంధం వల్ల లేదా వివాహం ద్వారా ఏర్పడే సంబంధాన్ని 'బంధుత్వం' అంటారు. పుట్టిన ప్రతి వ్యక్తి ఒక కుటుంబంలోని సభ్యుడే. పుట్టుకతో ప్రతి వ్యక్తి నిస్సహాయుడిగా ఉంటాడు. ఈ దశలో అతడికి సంరక్షణ కల్పించడంలో తల్లి ప్రధానపాత్ర పోషిస్తుంది. వ్యక్తి మొదటగా తల్లిదండ్రుల ద్వారా ఆ కుటుంబ సభ్యుల మధ్య ఉన్న సంబంధాన్ని తెలుసుకొని దానికి అనుగుణంగా ప్రవర్తిస్తాడు.

అంతర్గత మానవ ప్రబోధన (ఇన్‌హెరెంట్ హ్యూమన్ డ్రైవ్)పై ఆధారపడి సర్వవ్యాప్తమైన బంధాలన్నింటిలో మౌలికంగా విలసిల్లేదే 'బంధుత్వం' (కిన్‌షిప్)అని డాక్టర్ ఎస్.మజుందార్ పేర్కొన్నారు.

బంధుత్వం - రకాలు

బంధుత్వం 2 రకాలు. **అవి:**

1. వైవాహిక బంధుత్వం
2. రక్త సంబంధ బంధుత్వం

వైవాహిక బంధుత్వం

వివాహం ద్వారా స్త్రీ, పురుషుల మధ్య ఏర్పడే సంబంధాన్ని 'వైవాహిక బంధుత్వం' అంటారు.

ఉదా: పెళ్లి ద్వారా సంబంధిత యువతీ యువకులకు ఇరుపక్షాల్లో వివిధ వ్యక్తులతో బంధుత్వం ఏర్పడుతుంది. వివాహం వల్ల ఏర్పడే బంధువులను వైవాహిక బంధువులుగా పేర్కొంటారు.

రక్త సంబంధ బంధుత్వం

ఒక కుటుంబంలో భార్య, భర్త, వారి పిల్లల మధ్య ఏర్పడే పరస్పర బంధాలను 'రక్త సంబంధ బంధుత్వం'గా పేర్కొంటారు. ఒక దంపతులకు పుట్టిన బిడ్డలందరి మధ్య రక్త సంబంధం ఉంటుంది. ఈ రక్త సంబంధాన్ని తెలిపేదే ఏకరక్త బంధుత్వం.

సమాజంలో ఏకరక్త బంధువులందరి మధ్య తప్పకుండా రక్తసంబంధం ఉంటుందని చెప్పలేం. కొంతమంది దత్తత తీసుకున్న శిశువును కూడా పుట్టిన బిడ్డగానే పరిగణిస్తారు. ఈ విధంగా రక్తసంబంధం సమాజ గుర్తింపు ఆధారంగా కూడా ఉంటుంది. సమాజం గుర్తించే బంధుత్వాన్ని సామాజిక బంధుత్వం (సోషియలాజికల్ కిన్‌షిప్)గా పేర్కొంటారు.

బంధుత్వ స్థానం (డిగ్రీ ఆఫ్ కిన్‌షిప్)

శాస్త్రీయ దృక్పథంలో బంధువులను 3 రకాలుగా వర్గీకరించవచ్చు. **అవి:**

I. ప్రాథమిక బంధుత్వం
II. ద్వితీయ బంధుత్వం (గౌణ బంధుత్వం)
III. తృతీయ బంధుత్వం

ప్రాథమిక బంధుత్వం

బంధువర్గంలోని వ్యక్తులను దగ్గరి లేదా దూరపు బంధువులుగా వర్గీకరించవచ్చు. వీరిలో కొంత మంది చాలా సన్నిహితంగా, ప్రత్యేకంగా ఉంటారు.

ఉదా: తండ్రి – కుమారుడు
సోదరి– సోదరుడు
భార్య – భర్త

వీరిని ప్రాథమిక బంధువులుగా పిలుస్తారు.

సామాజిక శాస్త్రవేత్త 'దూబే' ప్రకారం ప్రాథమిక బంధువులు 8 మంది. వారు..

1. భర్త – భార్య
2. తండ్రి– కుమారుడు
3. తల్లి – కుమార్తె
4. తండ్రి – కూతురు
5. తల్లి– కుమారుడు
6. సోదరులు
7. సోదరీమణులు
8. సోదరి – సోదరుడు

ద్వితీయ బంధువులు

ఒక వ్యక్తికి సంబంధించిన ప్రాథమిక బంధువుల ప్రాథమిక బంధువులు ఆ వ్యక్తికి ద్వితీయ బంధువులు అవుతారు.

ఉదా: తండ్రి సోదరుడు

తృతీయ బంధువులు

ఒక వ్యక్తి ద్వితీయ బంధువుల ప్రాథమిక బంధువులు ఆ వ్యక్తికి తృతీయ బంధువులు అవుతారు.

ఉదా: భార్య యొక్క బావ

యుర్డాక్ ప్రకారం ప్రతి వ్యక్తికి 33 ద్వితీయ, 151 తృతీయ బంధుత్వాలు ఉంటాయి.

బంధుత్వ పరిభాష

బంధువర్గంలోని వ్యక్తులను సంబోధించే వరసలనే 'బంధుత్వ పరిభాష' అంటారు.

ఉదా: సాధారణంగా తెలుగు భాషలో బంధువులను పిలవడానికి ఉపయోగించే నాన్న, అమ్మ, చెల్లి, అక్క, అత్త.

బంధుత్వ పరిభాషను మోర్గాన్ 2 రకాలుగా వర్గీకరించాడు.

1. **వర్గాత్మక వ్యవస్థ:** వర్గాత్మక వ్యవస్థలో వివిధ సంబంధీకులందరినీ ఒకే వర్గంలో చేర్చడంతోపాటు వారిని ఒకే పదంతో సంబోధిస్తారు.

ఉదా: 'మామ' ఒక వర్గాత్మక పదం.

వర్గాత్మక వ్యవస్థలో బంధువులను సంబోధించే పద్ధతి ఆధారంగా బంధుత్వ పదాలను 3 రకాలుగా పేర్కొనవచ్చు.

ఎ. సంబోధన పదాలు
బి. అన్వయ పదాలు
సి. టెక్నానమీ

ఎ. **సంబోధన పదాలు:** ఒక వ్యక్తి తన బంధువులతో సంభాషించినప్పుడు వాడే పదాలనే సంబోధన పదాలు అంటారు.

ఉదా:
1. ఒక వ్యక్తి తన చెల్లితో సంభాషించినప్పుడు సోదరి అంటాడు.
2. ఒక వ్యక్తి తన తండ్రితో సంభాషించినప్పుడు 'నాన్నా' అని వాడతాడు.

బి. **అన్వయ పదాలు:** ఒక వ్యక్తి మూడో వ్యక్తితో తన బంధువుల్లో ఒకరి గురించి చెప్పేటప్పుడు ఉపయోగించే సంభాషణా పదమే 'అన్వయ పదం'.

ఉదా: ఒక వ్యక్తి తన నాన్న సోదరుడి గురించి మరో వ్యక్తికి చెప్పినప్పుడు నా 'చిన్నాన్న' అని వర్ణిస్తాడు.ఇక్కడ 'చిన్నాన్న' అనేది అన్వయ పదం.

సి. **టెక్నానమీ:** కొన్నిసార్లు కుటుంబంలోని ఓ బంధం గురించి మూడో వ్యక్తికి చెప్పినప్పుడు అతడి పేరు పెట్టి చెప్పకుండా ఒక ప్రత్యేకమైన బంధుత్వ పదాన్ని ఉపయోగిస్తారు. దీన్నే 'టెక్నానమీ' అంటారు.

ఉదా: ఒక మహిళ ఆమె భర్త గురించి మూడో వ్యక్తికి చెప్పేటప్పుడు అతడిని వారి పిల్లల తండ్రిగా పేర్కొంటుంది.

2. **వివరణాత్మక వ్యవస్థ:** ఇందులో ఒక సంబంధానికి ఒక పదాన్ని మాత్రమే సూచిస్తారు. వివరణాత్మక వ్యవస్థలో భాషా నిర్మిత పరంగా బంధుత్వ పదాలను 3 రకాలుగా వర్గీకరించవచ్చు.

i. ప్రాథమిక పదాలు
ii. ఉత్పన్న పదాలు
iii. వివరణాత్మక పదాలు

i. ప్రాథమిక పదాలు: కుటుంబంలోని దగ్గరి బంధువులను పిలవడానికి ఉపయోగించేవి ప్రాథమిక పదాలు. వీటిని విభజించడానికి వీలుకాదు.

ఉదా: తండ్రి, తల్లి

ii. ఉత్పన్న పదాలు: ఉత్పన్న పదాలను విడదీయవచ్చు. వీటిలో ఒక ప్రాథమిక పదం, మరో ఉత్పన్న పదంతో కలిసి కొత్త పదంగా ఏర్పడుతుంది.

ఉదా: చిన్నమ్మ
ఇక్కడ చిన్న + అమ్మ = చిన్నమ్మ
చిన్న → ఉత్పన్న పదం
అమ్మ → ప్రాథమిక పదం

iii. వివరణాత్మక పదాలు: రెండు లేదా అంతకంటే ఎక్కువ ప్రాథమిక పదాలు కలవడం వల్ల ఒక కొత్త పదం ఏర్పడితే దాన్ని వివరణాత్మక పదం అంటారు.

ఉదా: నాన్నమ్మ → నాన్న+ అమ్మ
నాన్న → ప్రాథమిక పదం
అమ్మ → ప్రాథమిక పదం


సాపేక్షతా సిద్ధాంతం కనుగొన్నవారు?

ఆధునిక భౌతిక శాస్త్రం


ప్రపంచమంతా పదార్థంతో నిర్మితమైంది. పదార్థ ధర్మం అందులోని కణాలపై ఆధారపడి ఉంటుంది. కణాలు,పదార్థ ధర్మం గురించి వివరించడానికి ఈ ఆధునిక భౌతికశాస్త్రం దోహదపడుతుంది.

19వ శతాబ్దంలో 'మాక్స్‌ప్లాంక్' అనే భౌతిక శాస్త్రవేత్త 'క్వాంటం సిద్ధాంతం' ప్రతిపాదించారు. ఈ సిద్ధాంతం భౌతికశాస్త్ర విభాగంలో ఎన్నో అంశాలను వివరించడంతోపాటు నూతన ఆవిష్కరణలకు పునాది వేసింది. ఈ పాఠంపై అనేక పోటీ పరీక్షల్లో వస్తున్న ప్రశ్నలను దృష్టిలో ఉంచుకొని రూపొందించిన కొన్ని ముఖ్యాంశాలు.

- ఆటమ్ అంటే గ్రీకు భాషలో విభజించడానికి వీలులేనిది అర్థం.
- పరమాణువు అత్యంత సూక్ష్మమైన కణం అని డాల్టన్ అనే శాస్త్రవేత్త భావించారు. ఈయన 1808లో పరమాణు సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. డాల్టన్‌ను పరమాణు పితామహుడిగా అభివర్ణిస్తారు.
- పరమాణువును విభజించవచ్చని అభిప్రాయపడి, పరమాణు నమూనాను పుచ్చకాయతో పోల్చినవారు -జేజే థామ్సన్
- పుచ్చకాయలోని నల్లని గింజలు రుణావేశాన్ని కలిగి ఉంటాయి.
- పరమాణువులో ఉండే ప్రాథమిక కణాలు -ప్రోటాన్, ఎలక్ట్రాన్, న్యూట్రాన్
- పరమాణు కేంద్రకంలో ఉండే కణాలు -ప్రోటాన్‌లు, న్యూట్రాన్‌లు
- పరమాణు కేంద్రకంలో లేని కణం - ఎలక్ట్రాన్
- పరమాణు కేంద్రకం ధనావేశాన్ని కలిగి ఉంటుంది.
- ప్రాథమిక కణాల్లో ఆవేశ రహిత కణం - న్యూట్రాన్
- ప్రాథమిక కణాల్లో ద్రవ్యరాశి స్వల్పంగా ఉండే కణం - ఎలక్ట్రాన్
- పరమాణు పరిమాణాన్ని తెలిపేందుకు వాడే ప్రమాణం ¯ ఆంగ్‌స్ట్రామ్).
  1¯= 10^{-8} సెం.మీ. లేదా 10^{-10} మీ.
- పరమాణు కేంద్రక వ్యాసార్ధాన్ని తెలిపే ప్రమాణం ఫెర్మి
  ఫెర్మి = 10^{-13}సెం.మీ. లేదా 10^{-15}మీ.
  పొడవును కొలవడానికి ఉపయోగించే అతి చిన్న ప్రమాణమే ఫెర్మి. అమెరికాలో 1942, డిసెంబర్‌లో న్యూక్లియర్ రియాక్టర్‌ను తయారుచేసిన ఎన్‌రిక్ ఫెర్మి పేరు మీదనే ఈ ప్రమాణాన్ని తీసుకున్నారు.



- పొడవును కొలవడానికి వాడే అతిపెద్ద ప్రమాణం పార్‌సెక్.
  పార్‌సెక్ = 3.26 కాంతి సంవత్సరం
- పార్‌సెక్‌ను నక్షత్రాల మధ్య దూరం కొలవడానికి ఉపయోగిస్తారు.
- కాంతి శూన్యంలో ఒక సంవత్సర కాలంలో ప్రయాణించిన దూరాన్ని కాంతి సంవత్సరం అంటారు.
- భూమి, నక్షత్రాల మధ్య దూరాన్ని కాంతి సంవత్సరాల్లో కొలుస్తారు.
- కాంతి సంవత్సరం = 9.46×10^{12} కి.మీ.
  = 9.46×10^{15} మీ.
- పరమాణు కేంద్రకానికి ధనావేశం ఉంటుందని రూథర్‌ఫర్డ్ α – కణ పరిక్షేపణ ప్రయోగంతో వివరించారు. ఈయన్ని పరమాణు కేంద్రక పితామహుడు అని పేర్కొంటారు. పరమాణు నిర్మాణాన్ని గ్రహమండల నమూనాతో వివరించారు.
- పరమాణు కేంద్రకంలో ఉండే కణాల మధ్య బలాలు - కూలుంబ్ బలాలు.
- పరమాణు కేంద్రకానికి, దానిచుట్టూ తిరిగే ఎలక్ట్రాన్‌కు మధ్య పని చేసే బలాలు - స్థిర విద్యుదాకర్షణ బలాలు
- పరమాణు కేంద్రకంలో ఉండే ప్రోటాన్‌ల సంఖ్యను పరమాణు సంఖ్య(z) అంటారు.
- పరమాణు కేంద్రకంలో ఉండే కణాల ద్రవ్యరాశుల మొత్తాన్ని పరమాణు ద్రవ్యరాశి అంటారు.



టెట్/డీఎస్సీ - ప్రత్యేకం

ఫిజికల్ సైన్స్

- కేంద్రకంలోని విడివిడి అనుఘటకాల మొత్తం ద్రవ్యరాశికి, కేంద్రకం మొత్తం ద్రవ్యరాశికి మధ్య ఉండే వ్యత్యాసాన్ని ద్రవ్యరాశి లోపం (Δm) అంటారు.
- ద్రవ్యరాశి లోపం అనేది కేంద్రక స్థిరత్వానికి కొలమానం.
- జర్మనీ దేశానికి చెందిన శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ ద్రవ్యరాశి శక్తి తుల్యతా నియమాన్ని ప్రతిపాదించారు.

ఐన్‌స్టీన్ ప్రతిపాదనలు

- ద్రవ్యరాశి– శక్తి తుల్యతా నియమం
  $E = mc^2$
- సాపేక్షతా సిద్ధాంతం
- కాంతి విద్యుత్ ఫలితం. ఈ ఫలితాన్ని నిరూపించినందుకు 1921లో ఐన్‌స్టీన్‌కు నోబెల్ బహుమతి లభించింది.
- ఐన్‌స్టీన్‌ను మిలీనియం శాస్త్రవేత్తగా పిలుస్తారు
- కేంద్రకంలోని కణాలను బంధించడానికి అవసరమయ్యే శక్తిని బంధన శక్తి అంటారు.
  కేంద్రక బంధన శక్తి (B.E.) =
  ద్రవ్యరాశి లోపం (Δm) × 931.5 mev
- ఒకే పరమాణు సంఖ్య కలిగి విభిన్న ద్రవ్యరాశి సంఖ్యలు, విభిన్న న్యూట్రాన్‌ల సంఖ్యలు ఉండే మూలకపు పరమాణువులను ఐసోటోపులు అంటారు.
- ఐసోటోపులను థామ్సన్, ఆస్టన్ కనుగొన్నారు.
- మానవ శరీరంలోని రక్త సరఫరాలో ఉండే లోపాలు తెలుసుకోవడానికి, హృదయస్పందనను నియంత్రించడానికి వాడే ఐసోటోపు - రేడియో సోడియం
- యంత్ర భాగాల అరుగుదల, మొక్కలు గ్రహించిన నీటిశాతం కనుగొనడానికి, మెదడులో ఏర్పడిన కణితి స్థానం గుర్తించడానికి వాడే ఐసోటోపు - రేడియో పాస్ఫరస్
- కాన్సర్ గడ్డల చికిత్సలో వాడే ఐసోటోపు - రేడియో కోబాల్ట్
  (కోబాల్ట్ ఉపయోగించి చేసే చికిత్సను కోబాల్ట్ థెరపీ అంటారు)
- శిలాజాల వయస్సును కనుగొనడానికి ఉపయోగించే పద్ధతి -కార్బన్ డేటింగ్
  (కార్బన్ డేటింగ్‌ను లిబ్బి అనే శాస్త్రవేత్త వివరించారు.)
- భూమి, శిలల వయస్సును అంచనా వేయడానికి, ఉపయోగించే ఐసోటోపు - యురేనియం డేటింగ్
- ఖనిజ లవణాలను కనుగొనడానికి ఉపయోగించే ఐసోటోపు -రేడియో సల్ఫర్
- రేడియో ఐసోటోపుల ఉత్పత్తిలో ప్రపంచంలో ప్రథమ స్థానంలో ఉన్న దేశం -భారత్
- ఒకే ద్రవ్యరాశి సంఖ్య కలిగి ఉండి, విభిన్న పరమాణు సంఖ్యలు, విభిన్న న్యూట్రాన్ సంఖ్యలు ఉండే మూలక కేంద్రాన్ని ఐసోబార్ అంటారు.
- ఒకే న్యూట్రాన్ సంఖ్య కలిగి, విభిన్న ద్రవ్యరాశి సంఖ్యలు, విభిన్న పరమాణు సంఖ్యలు ఉండే మూలక కేంద్రాన్ని ఐసోటోన్‌లు అంటారు.
- ఒకే పరమాణు సంఖ్య, ఒకే ద్రవ్యరాశి సంఖ్య, ఒకే న్యూట్రాన్ సంఖ్య కలిగి, విభిన్న రేడియోధార్మికతలు, విభిన్న భౌతిక ధర్మాలు ఉండే మూలక కేంద్రాన్ని ఐసోమర్ అంటారు.
- రేడియోధార్మికతను 1896లో ఫ్రెంచి భౌతిక శాస్త్రవేత్త ఎ.హెచ్. బెక్వరల్ వివరించారు.
- రేడియోధార్మికత కేంద్రక బలాల స్వభావంపై ఆధారపడి ఉంటుంది.
- ప్రకృతిలోని ప్రాథమిక బలాల్లో అత్యంత బలమైంది - బలమైన కేంద్రక బలం.
- ప్రకృతిలో అత్యంత బలహీనమైన బలం - గురుత్వాకర్షణ బలం.
- కేంద్రకంలోని బలాలను కూలుంబ్ వర్గీకరించారు.
- ఆవేశానికి ప్రమాణం -కూలుంబ్
- పరమాణు సంఖ్య అధికంగా ఉన్నా, స్థిరత్వ ధర్మాన్ని ప్రదర్శించే మూలకం -సీసం.
  (సీసం లాటిన్ పేరు ప్లంబం. కాబట్టి దీన్ని pb తో సూచిస్తారు)
- ప్రొటీయం, డ్యుటీరియం, ట్రిటియంలను ఏర్పరిచే మూలకం -హైడ్రోజన్
- హైడ్రోజన్‌ను హెన్రీ కావెండిష్ కనుగొన్నారు. ఇది అత్యంత తేలికైన మూలకం.
- న్యూట్రాన్ రహిత ఏకైక మూలకం - హైడ్రోజన్
- అయోడిన్ లోపం వల్ల కలిగే వ్యాధి - గాయిటర్
- పరమాణు సంఖ్య 83 కంటే ఎక్కువగా ఉండే మూలక కేంద్రకాలు అస్థిరత్వం వల్ల వికిరణాలను ఉద్గారం చేస్తూ స్వచ్ఛంద, విఘటనం చెందే దృగ్విషయాన్ని సహజ రేడియోధార్మికత అంటారు.
- సహజ రేడియోధార్మికతను ఎ.హెచ్. బెక్వరల్ వివరించారు.
- యురేనియం నుంచి విడుదలైన వికిరణాలను బెక్వరల్ కిరణాలు పిలుస్తారు.
- DAE అంటే..
  Department of Atomic Energy
- BRIT అంటే..
  Board of Radiation and Isotope Technology

ఎలక్ట్రాన్

- పరమాణువులోని మూల కణాల్లో మొదట కనుగొన్న కణం - ఎలక్ట్రాన్
- దీనిని 1897లో కనుగొన్నారు.
- ఎలక్ట్రాన్‌ను జె.జె.థామ్సన్ ప్రయోగపూర్వకంగా కనుగొన్నాడు.
- రుణావేశ కణానికి జి.జె. స్టోనీ ఎలక్ట్రాన్ అని పేరు పెట్టాడు.
- ఎలక్ట్రాన్ ద్రవ్యరాశి, ప్రోటాన్ ద్రవ్యరాశిలో 1837వ వంతు ఉంటుంది.
- ఎలక్ట్రాన్ ఆవేశం, ద్రవ్యరాశుల మధ్య నిష్పత్తిని ఎలక్ట్రాన్ విశిష్టావేశం అంటారు.
- ఎలక్ట్రాన్ విశిష్టావేశం (e/m) (సెం.మీ) విలువ: 1.759×10^{11} col / kg
- ఈ విలువను జేజే థామ్సన్ కనుగొన్నాడు.

న్యూట్రాన్

- న్యూట్రాన్‌ను 1932లో జేమ్స్ ఛాడ్విక్ కనుగొన్నాడు.
- న్యూట్రాన్‌కు కేంద్రకం బయట జీవితకాలం.. 13 నిమిషాలు.
- న్యూట్రాన్ ద్రవ్యరాశి విలువ ప్రోటాన్ మూలకణ ద్రవ్యరాశికి దాదాపుగా సమానంగా ఉంటుంది.
- కేంద్రక విచ్ఛిత్తి ప్రక్రియలో ఉపయోగపడే మూలకణం న్యూట్రాన్.

ప్రోటాన్

- ప్రోటాన్‌ను మొదట గోల్డ్ స్టెయిన్ గుర్తించాడు.
- 1920లో రూథర్‌ఫర్డ్ ప్రోటాన్‌ను ప్రయోగపూర్వకంగా కనుగొన్నాడు.
- ప్రోటాన్ ద్రవ్యరాశి: 1.0073 a.m.u.
- ప్రోటాన్ ఆవేశం $+1.602\times10^{-19}$ col
- పరమాణు కేంద్రకం ఆవేశానికి కారణమైన మూలకం ప్రోటాన్.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. పరమాణువులోని న్యూక్లియర్ వ్యాసం?
   ఎ) 10^{-10} సెం.మీ.
   బి) 10^{-13} సెం.మీ.
   సి) 10^{10} సెం.మీ.
   డి) 10^{13} సెం.మీ.
2. ప్రోటాన్‌ను మొదట గుర్తించిన శాస్త్రవేత్త?
   ఎ) ఛాడ్విక్ బి) స్మిత్
   సి) థామ్సన్ డి) గోల్డ్ స్టెయిన్
3. ఎలక్ట్రాన్‌ను కనుగొన్న శాస్త్రవేత్త?
   ఎ) డా. ఎవంజిలానా విల్లెగాస్
   బి) పి.ఎస్. రాస్మునిస్
   సి) రూథర్‌ఫర్డ్
   డి) ఎవరూ కాదు
4. రేడియోధార్మికత కింది వాటిలో దేనికి సంబంధించింది?
   ఎ) అమెచ్యూర్ రేడియో
   బి) రేడియో ఖగోళం
   సి) మూలక కేంద్రం డి) పైవన్నీ
5. రేడియోధార్మికత లేని మూలకం?
   ఎ) హీలియం బి) రేడియం
   సి) థోరియం డి) యురేనియం
6. సాపేక్షతా సిద్ధాంతం కనుగొన్నవారు?
   ఎ) మార్కొని బి) ఐన్‌స్టీన్
   సి) జి.జె.స్టోనీ డి) బెర్లిన్

సమాధానాలు

1) బి; 2) డి; 3) డి; 4) సి; 5) ఎ; 6) బి.

విద్య, ఉద్యోగ సమాచారం

సీబీఎస్ఎల్‌లో ట్రైనీ పోస్టులు

కెనరా బ్యాంక్ అనుబంధ సంస్థ కెనరా బ్యాంక్ సెక్యూరిటీస్ లిమిటెడ్(సీబీఎస్ఎల్).. ఒప్పంద ప్రాతిపదికన ట్రైనీ(సేల్స్ అండ్ మార్కెటింగ్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** ఏదైనా విభాగంలో కనీసం 50 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. సేల్స్, మార్కెటింగ్ అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుంది.
» **వయసు:** 20 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.22,000.
» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది జనరల్ మేనేజర్, హెచ్ఆర్ డిపార్ట్‌మెంట్, కెనరా బ్యాంక్ సెక్యూరిటీస్ లిమిటెడ్, ఏడో ఫ్లోర్, మార్కర్ ఛాంబర్3, నారీమన్ పాయింట్, ముంబై-400021 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 06.10.2025.
» **వెబ్‌సైట్:** www.canmoney.in

బీఈఎంఎల్, బెంగళూరులో 46 నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

బెంగళూరులోని భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్(బీఈఎంఎల్) ఒప్పంద ప్రాతిపదికన నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 46.
» **ట్రేడుల వారీగా ఖాళీలు:** డిప్లొమా–మెకానికల్ –20, డిప్లొమా–ఎలక్ట్రికల్–10, ఐటీఐ–ఫిట్టర్ –10, –ఐటీఐ–ఎలక్ట్రీషియన్–06.
» **అర్హత:** సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 29 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు మొదటి ఏడాది డిప్లొమా సర్వీస్ పర్సనల్స్‌కు రూ.27,000, ఐటీఐ సర్వీస్ పర్సనల్స్‌కు రూ.24,000, రెండో ఏడాది రూ.28,500, మూడో ఏడాది రూ.30,000, నాలుగో ఏడాది రూ.32,500.
» **దరఖాస్తు ఫీజు:**ఇతరులకు రూ.200. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు లేదు.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ ఆధారిత రాతపరీక్ష, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 12.09.2025
» **వెబ్‌సైట్:** https://www.bemlindia.in

బీఈఎంఎల్, బెంగళూరులో 56 సెక్యూరిటీ గార్డ్, ఫైర్ సర్వీస్ పర్సనల్స్ పోస్టులు

బెంగళూరులోని భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్ (బీఈఎంఎల్) ఒప్పంద ప్రాతిపదికన గ్రూప్–బి సెక్యూరిటీ గార్డ్, ఫైర్ సర్వీస్ పర్సనల్స్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 56.
» **పోస్టుల వివరాలు:** సెక్యూరిటీ గార్డ్–44, ఫైర్ సర్వీస్ పర్సనల్స్–12.
» **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు నుంచి మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి. **వయసు:** 29 ఏళ్లు మించకూడదు.
» **పే స్కేల్:** రూ.16,900 నుంచి రూ.60,650.
» **దరఖాస్తు ఫీజు:** ఇతరులకు రూ.200. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు లేదు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 12.09.2025
» **వెబ్‌సైట్:** www.bemlindia.in

సరైన ప్రణాళికలే సమస్యకు పరిష్కారం!

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ ఎకానమీ



భారతదేశంలో ఉపాధి స్థితిగతులు

అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ అయిన భారతదేశంలో నిరుద్యోగ స్వభావం అభివృద్ధి చెందిన దేశాలకు భిన్నంగా ఉంటుంది. సార్థక డిమాండ్ లోపించడం వల్ల అభివృద్ధి చెందిన దేశాల్లో నిరుద్యోగం ఏర్పడుతుందని ఆర్థికశాస్త్ర నిపుణులు కీన్స్ అభిప్రాయపడ్డారు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ప్రచ్ఛన్న నిరుద్యోగిత, వ్యవస్థాపరమైన నిరుద్యోగిత, అల్ప ఉద్యోగిత, రుతు సంబంధ నిరుద్యోగిత, విద్యావంతుల్లో నిరుద్యోగిత అనే వివిధ రకాలైన నిరుద్యోగం ఏర్పడుతుంది. స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో నిరుద్యోగ సమస్య నివారణకు అనేక స్వయం ఉపాధి, వేతన ఉపాధి పథకాలను అమలు పరిచారు. అయినప్పటికీ పథకాల అమల్లో లోపాల కారణంగా ఇప్పటికీ నిరుద్యోగ సమస్య పరిష్కారం కాలేదు.

15 నుంచి 60 ఏళ్ల మధ్య వయసు కలిగి, పనిచేసే సామర్థ్యం, పని చేయాలనే కోరిక ఉన్న వ్యక్తులకు మార్కెట్‌లో నెలకొన్న వేతన రేట్ల వద్ద పని లభించని పరిస్థితిని 'నిరుద్యోగ స్థితి'గా పేర్కొనవచ్చు. నిరుద్యోగ సమస్యపై పరిశీలన కోసం బి. భగవతి నేతృత్వంలో ఒక కమిటీని నియమించారు. ఇది 1973 మేలో ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. దీని ప్రకారం.. 1971లో దేశంలో మొత్తం శ్రామిక శక్తి 180.4 మిలియన్లు కాగా, వీరిలో 148.4 మిలియన్ల మంది గ్రామీణ ప్రాంతాల్లో, 32 మిలియన్ల మంది పట్టణ ప్రాంతాల్లో ఉన్నారు. దేశంలో మొత్తం నిరుద్యోగితను 18.7 మిలియన్లుగా కమిటీ అంచనా వేసింది. వీరిలో 9 మిలియన్ల మందికి ఏవిధమైన ఉపాధి లేదు. మిగిలిన 9.7 మిలియన్ల మంది వారంలో 14 గంటల కంటే తక్కువ ఉపాధి పొందుతున్న వారున్నారు. మొత్తం 18.7 మిలియన్ల నిరుద్యోగుల్లో 16.1 మిలియన్ల మంది గ్రామీణ ప్రాంతాల్లో, 2.6 మిలియన్ల మంది పట్టణ ప్రాంతాల్లో ఉన్నారు. దేశంలో మొత్తం శ్రామిక శక్తిలో నిరుద్యోగిత వాటా 10.4 శాతం. గ్రామీణ ప్రాంతాల్లో ఇది 10.9 శాతంగా, పట్టణ ప్రాంతాల్లో 8.1 శాతంగా నమోదైంది.

నేషనల్ శాంపిల్ సర్వే అంచనాలు

దేశంలో పంచవర్ష ప్రణాళికల అమలు ప్రారంభమైన తర్వాత వివిధ సంస్థలు, వ్యక్తులు విభిన్న పద్ధతుల్లో నిరుద్యోగితను అంచనా వేశారు. వీటిలో ముఖ్యమైంది 'జాతీయ నమూనా సర్వే వ్యవస్థ'. నిరుద్యోగిత అంచనాల కోసం ప్రణాళికా సంఘం 1969లో దంత్‌వాలా అధ్యక్షతన ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ సిఫార్సుల మేరకు జాతీయ నమూనా సర్వే వ్యవస్థ తన 27వ రౌండు నుంచి (1972-73) దేశ పరిస్థితులకు అనుగుణంగా నిరుద్యోగితను మూడు విధాలుగా విభజించి అంచనా వేస్తోంది. అవి:

1. సాధారణ స్థితి నిరుద్యోగిత
2. వారంవారీ స్థితి నిరుద్యోగిత
3. రోజువారీ స్థితి నిరుద్యోగిత

సాధారణ స్థితి నిరుద్యోగిత: సర్వే చేసే తేదీకి ముందు ఒక సంవత్సర కాలానికి సంబంధించి మొత్తం కాలంలో నిరుద్యోగులుగా ఉన్న వారిని సాధారణ స్థితి నిరుద్యోగులుగా పరిగణిస్తారు. సంవత్సరంలో ఏ కొద్ది రోజులు పనిలో ఉన్నా, వారిని ఈ రకమైన నిరుద్యోగులుగా పరిగణించరు. 1977-78లో ఈ రకమైన నిరుద్యోగిత దేశంలో 4.23 శాతం కాగా, 1980లో ఇది 4.4 శాతానికి పెరిగింది. 2011-12లో ఈ రకమైన నిరుద్యోగం 2.2 శాతంగా నమోదైంది.

వారంవారీ స్థితి నిరుద్యోగిత: నిరుద్యోగితకు సంబంధించిన సర్వే జరిపే రోజుకు ముందు వారంలో ఏ ఒక్క గంట కూడా పని లభించని స్థితిని 'వారంవారీ స్థితి నిరుద్యోగిత' అంటారు. ఈ వారం రోజుల్లో ఏ ఒక్క రోజైనా ఒక్క గంట పని దొరికినా వారిని ఉపాధి పొందిన వారుగానే భావిస్తారు. 1977-78లో ఈ రకమైన నిరుద్యోగిత 4.48 శాతం నుంచి 4.54 శాతానికి పెరిగింది. 2009-10లో ఈ విధమైన నిరుద్యోగిత గ్రామీణ ప్రాంతాల్లో 3.3 శాతంగా, పట్టణ ప్రాంతాల్లో 4.2 శాతంగా, దేశంలో 3.6 శాతంగా నమోదైంది.

రోజువారీ స్థితి నిరుద్యోగిత: నిరుద్యోగులకు సంబంధించి ఏడు రోజుల శ్రమ దినాల్లో నిరుద్యోగిగా ఉన్న శ్రమ దినాలు ఎన్ని ఉన్నాయో లెక్కించి, మొత్తం శ్రమ దినాల్లో నిరుద్యోగిత ఉన్న శ్రమదినాల నిష్పత్తిని 'రోజువారీ స్థితి నిరుద్యోగిత' తెలియజేస్తుంది. 1977-78లో ఈ రకమైన నిరుద్యోగిత 8.18 శాతం కాగా, 1980లో 7.84 శాతానికి తగ్గింది. 2011-12లో ఈ రకమైన నిరుద్యోగం 5.6 శాతంగా నమోదైంది.

ఉపాధి నాణ్యత సూచీలు

1. శ్రామికులు పొందిన వేతనాలు.
2. సంవత్సర కాలంలో క్యాజువల్ శ్రామికులు ఉపాధి పొందిన పని దినాలు.
3. సంఘటిత, అసంఘటిత రంగాల్లో ఉపాధి పొందిన శ్రామికుల వాటా.
4. మొత్తం ఉపాధిలో స్వయం ఉపాధి, శాశ్వతంగా వేతనాలు పొందిన ఉద్యోగస్థులు, క్యాజువల్ శ్రామికుల నిష్పత్తి.
5. ప్రాథమిక, ద్వితీయ, తృతీయ కార్యకలాపాల్లో ఉపాధి పంపిణీ.
6. విద్యా స్థాయి, నేర్పరితనానికి అనుగుణంగా శ్రామిక ఉత్పాదకత.

సంస్కరణల అనంతర కాలంలో ఉపాధి విధానాలు

ఎనిమిదో ప్రణాళిక (1992-97): 1990 ప్రారంభంలో అప్పటికే ఉన్న నిరుద్యోగిత (Backlog of unemployed) 28 మిలియన్లు కాగా, 1990-95 మధ్యకాలంలో శ్రామిక శక్తికి అదనంగా 37 మిలియన్ల మంది తోడవుతారని అంచనా వేశారు. ఎనిమిదో పంచవర్ష ప్రణాళికలో మొత్తం 65 మిలియన్ల మందిని నిరుద్యోగులుగా అంచనా వేశారు. 1995-2000 మధ్యకాలంలో శ్రామికశక్తికి అదనంగా 41 మిలియన్ల మంది తోడవుతారని, 2000 సంవత్సరం నాటికి ఉపాధి కోరుకునే వారి సంఖ్య 106 మిలియన్లకు చేరుకుంటుందని అంచనా వేశారు.

తొమ్మిదో ప్రణాళిక (1997-2002): ఈ ప్రణాళికలో 53 మిలియన్ల మందికి ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉంటుందని భావించారు. 2002-07 మధ్యకాలంలో శ్రామిక శక్తికి అదనంగా 58 మిలియన్లు, 2007-12 మధ్యకాలంలో 55 మిలియన్ల మంది తోడవుతారని అంచనా వేశారు. ఉపాధి నాణ్యత తక్కువగా ఉండటంతో పాటు ఆదాయ స్థాయి తక్కువైనందువల్ల పేదరిక స్థాయి పెరుగుతుందని భావించారు. మొత్తం శ్రామికుల్లో 70 శాతం మంది నిరక్షరాస్యులుగా లేదా ప్రాథమిక స్థాయికంటే తక్కువ విద్యను అభ్యసించిన వారుగా ఉన్నట్లు ప్రణాళిక డాక్యుమెంట్‌లో పేర్కొన్నారు. అధిక ఉపాధి కల్పించే సామర్థ్యం ఉన్న రంగాలపై దృష్టి సారించడం ద్వారా ఉపాధి పెంపొందించాలనే వ్యూహాన్ని రూపొందించారు. ఈ వ్యూహంలో భాగంగా విధాన నిర్ణేతలు వ్యవసాయం, వాణిజ్యం, రవాణా, నిర్మాణ రంగాలపై దృష్టి సారించారు.

పదో ప్రణాళిక (2002-2007): పదో ప్రణాళికలో 50 మిలియన్ల మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలని నిర్ణయించారు. ఈ మొత్తంలో స్వయం ఉపాధి పథకాల ద్వారా 20 మిలియన్లు, ఆర్థిక వృద్ధి రేటు పెంపు ద్వారా వివిధ రంగాల నుంచి 30 మిలియన్ల మందికి ఉపాధి అవకాశాలు లభ్యమవుతాయని అంచనా వేశారు. ఎంపిక చేసిన ప్రత్యేక కార్యక్రమాలు ఒకేసారి కాకుండా క్రమంగా ఉపాధి కల్పించగలవని ప్రణాళిక రచయితలు భావించారు. నూతన ఉపాధి అవకాశాల్లో 90 శాతం వరకు చిన్న, మధ్య తరహా సంస్థలకు, స్వయం ఉపాధికి వాటా ఉండగలదని విధాన నిర్ణేతలు భావించారు.

పదకొండో ప్రణాళిక (2007-2012): పదకొండో ప్రణాళిక ప్రారంభం నాటికి ఉపాధి కోసం వేచి ఉన్నవారి సంఖ్య 35 మిలియన్లు కాగా, పదకొండో ప్రణాళికా కాలంలో శ్రామిక శక్తికి అదనంగా 65 మిలియన్ల మంది తోడవుతారని అంచనా వేశారు. పదకొండో ప్రణాళికలో మొత్తం నిరుద్యోగుల సంఖ్యను 100 మిలియన్లుగా అంచనా వేశారు. ఈ ప్రణాళికలో 58 మిలియన్ల అదనపు ఉపాధి అవకాశాలను సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీంతోపాటు విద్యావంతుల్లో నిరుద్యోగిత రేటును 5 శాతానికి తగ్గించడం, నైపుణ్యం కొరవడిన శ్రామికుల్లో వాస్తవిక వేతనాలను 20 శాతం పెంచడం లక్ష్యాలుగా తీసుకున్నారు.

ఆర్థిక సంస్కరణల కాలంలో ఉపాధి వృద్ధికి సంబంధించిన బలహీనతల గురించి పదకొండో పంచవర్ష ప్రణాళికలో కింది అంశాలను పేర్కొన్నారు.

1. 1993-94లో నిరుద్యోగిత రేటు 6.1 శాతం నుంచి 1999-2000లో 7.3 శాతానికి, 2004-05లో 8.3 శాతానికి పెరిగింది.
2. వ్యవసాయ శ్రామిక కుటుంబాల్లో నిరుద్యోగం 1993-94లో 9.5 శాతం కాగా, 2004-05లో 15.3 శాతానికి పెరిగింది.
3. 2004-05లో సాధారణ స్థితి నిరుద్యోగం 2.60 శాతానికి, రోజువారీ స్థితి నిరుద్యోగం 8.54 శాతానికి పెరిగింది.
4. 1999-2000 నుంచి 2004-05 మధ్యకాలంలో వ్యవసాయేతర ఉపాధి వృద్ధిరేటు 4.7 శాతంగా నమోదైంది. ఈ వృద్ధి అధిక భాగం అసంఘటిత రంగంలో చోటు చేసుకుంది.
5. జి.డి.పి. వృద్ధి రేటులో పెరుగుదల ఏర్పడినప్పటికీ సంఘటిత రంగంలో ఉపాధి క్షీణించింది. తద్వారా చదువుకున్న యువతలో నిరాశ, నిస్పృహ పెరిగింది.

నిరుద్యోగం, అల్ప ఉద్యోగిత తగ్గింపునకు పథకాలు

భగవతి కమిటీ 1973లో ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన తర్వాత ఉపాధి పెంపొందించడం ద్వారా అల్ప ఉద్యోగిత నిర్మూలించడానికి ప్రభుత్వం కింద పేర్కొన్న పథకాలను ప్రవేశపెట్టింది.

1. రూరల్ వర్క్స్ ప్రోగ్రామ్.
2. ఉపాంత రైతులు, వ్యవసాయ కార్మికుల అభివృద్ధి పథకంలో భాగంగా వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు సంబంధించి ఆయా కుటుంబాలకు సబ్సిడీతో కూడిన పరపతిని అందించారు. వ్యవసాయ అనుబంధాలకు సంబంధించి డెయిరీ, పౌల్ట్రీ, ఫిషరీ, హార్టికల్చర్ ఆపరేషన్స్‌ను ప్రోత్సహించడానికి తగిన చర్యలు చేపట్టారు.
3. చిన్న రైతుల అభివృద్ధి ఏజెన్సీలో భాగంగా సాంద్ర వ్యవసాయ పద్ధతులు అవలంబించడానికి, చిన్న రైతులు తమ కార్యకలాపాలను విస్తరించుకోవడానికి తగిన పరపతి కల్పించారు.
4. **ఆగ్రో-సర్వీసు కేంద్రాల ఏర్పాటు:** నిరుద్యోగ గ్రాడ్యుయేట్లు; మెకానికల్, అగ్రికల్చర్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, సంబంధిత రంగాల డిప్లొమా హోల్డర్లకు స్వయం ఉపాధి కల్పించడానికి ఈ పథకం తగిన చేయూతనిస్తుంది.
5. **సమీకృత మెట్ట వ్యవసాయ భూముల అభివృద్ధి:** ఈ పథకంలో భాగంగా భూసార పరిరక్షణ, భూమి అభివృద్ధి, నీటి వినియోగం తదితర పనులు చేపడతారు. ఈ పథకం కింద చేపట్టిన పనులు శ్రమ-సాంద్రతతో కూడినవై తగిన ఉపాధి అవకాశాలను సృష్టిస్తాయి.
6. **క్రాష్ స్కీం ఫర్ రూరల్ ఎంప్లాయ్‌మెంట్:** శ్రమ సాంద్రత, అధిక ఉత్పాదకతతో కూడిన అనేక గ్రామీణ ప్రాజెక్టులను చేపట్టడం ద్వారా అదనపు ఉపాధి కల్పన ఈ పథకం ముఖ్య ఉద్దేశం.

భారతదేశంలో నిరుద్యోగ సమస్యకు కారణాలు

- మానవ వనరుల ప్రణాళికలు సక్రమంగా రూపొందించకపోవడం.
- పారిశ్రామిక రంగంలో అభివృద్ధి వేగవంతం కాకపోవడం.
- పెరుగుతున్న జనాభాతోపాటు శ్రామికశక్తికి అదనంగా తోడవుతున్న జనాభాలో పెరుగుదల.
- ఉపాధి రహిత వృద్ధి.
- చిన్న తరహా, కుటీర పరిశ్రమల్లో రుగ్మత పెరగడం.
- మూలధన కల్పన రేటు తక్కువగా ఉండటం.
- లోపభూయిష్ట విద్యావిధానం.
- శ్రామికుల గమనశీలత తక్కువగా ఉండటం.
- మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా శ్రామికులకు తగిన శిక్షణ అందించకపోవడం.
- వ్యవసాయ రంగ వృద్ధి రేటు తక్కువగా ఉండటం.

Spiral Model was developed by?

BANK EXAMS

COMPUTER AWARENESS

SDLC (Software Development Life Cycle)

SDLC, Software Development Life Cycle is a process used by software industry to design, develop and test high quality softwares. It is also called as Software development process.

- ISO/IEC 12207 is an international standard for software life-cycle processes. It aims to be the standard that defines all the tasks required for developing and maintaining software.
- A typical Software Development life cycle consists of the following stages:


Stage1: Planning and Requirement Analysis
Stage 2: Defining Requirements
Stage 3: Designing the product architecture
Stage 4: Building or Developing the Product
Stage 5: Testing the Product
Stage 6: Deployment in the Market and Maintenance

SDLC Models

- Waterfall Model
- Iterative Model
- Spiral Model
- V-Model
- Big Bang Model

The other related methodologies are Agile Model, RAD Model, Rapid Application Development and Prototyping Models.

SDLC Waterfall Model



The sequential phases in Waterfall model are:

- **Requirement Gathering and analysis:** All possible requirements of the system to be developed are captured in this phase and documented in a requirement specification doc.
- **System Design:** The requirement specifications from first phase are studied in this phase and system design is prepared. System Design helps in specifying hardware and system requirements and also helps in defining overall system architecture.
- **Implementation:** With inputs from system design, the system is first developed in small programs called units, which are integrated in the next phase. Each unit is developed and tested for its functionality which is referred to as Unit Testing.
- **Integration and Testing:** All the units developed in the implementation phase are integrated into a system after testing of each unit. Post integration the entire system is tested for any faults and failures.
- **Deployment of system:** Once the functional and non functional testing is done, the product is deployed in the customer environment or released into the market.
- **Maintenance:** There are some issues which come up in the client environment. To fix those issues patches are released. Also to enhance the product some better versions are released. Maintenance is done to deliver these changes in the customer environment.
- All these phases are cascaded to each other in which progress is seen as flowing steadily downwards (like a waterfall) through the phases. The next phase is started only after the defined set of goals are achieved for previous phase and it is signed off, so the name "Waterfall Model". In this model phases do not overlap.


SDLC Iterative Model



This model is most often used in the following scenarios:

- Requirements of the complete system are clearly defined and understood.
- Major requirements must be defined; however, some functionalities or requested enhancements may evolve with time.
- A new technology is being used and is being learnt by the development team while working on the project.
- Resources with needed skill set are not available and are planned to be used on contract basis for specific iterations.
- There are some high risk features and goals which may change in the future.

SDLC Spiral Model



- **Identification:** This phase starts with gathering the business requirements in the baseline spiral. In the subsequent spirals as the product matures, identification of system requirements, subsystem requirements and unit requirements are all done in this phase.
- At the end of the spiral the product is deployed in the identified market.
- **Design:** Design phase starts with the conceptual design in the baseline spiral and involves architectural design, logical design of modules, physical product design and final design in the subsequent spirals.
- **Construct or Build:** Construct phase refers to production of the actual software product at every spiral. In the baseline spiral when the product is just thought of and the design is being developed a POC (Proof of Concept) is developed in this phase to get customer feedback.
- **Evaluation and Risk Analysis:** Risk Analysis includes identifying, estimating, and monitoring technical feasibility and management risks, such as schedule slippage and cost overrun.

Summary

- Waterfall and V model are traditional SDLC models and are of sequential type. Sequential means that the next phase can start only after the completion of first phase. Such models are suitable for projects with very clear product requirements and where the requirements will not change dynamically during the course of project completion.
- Iterative and Spiral models are more accommodative in terms of change and are suitable for projects where the requirements are not so well defined, or the market requirements change quite frequently.
- Big Bang model is a random approach to Software development and is suitable for small or academic projects.
- Agile is the most popular model used in the industry. Agile introduces the concept of fast delivery to customers using prototype approach.

MODEL QUESTIONS

1. Spiral Model was developed by?
1) Bev Littlewood
2) Berry Bohem
3) Roger Pressman
4) Victor Bisili
5) None of Above

2. Which model is popular for students small projects ?
1) Waterfall Model
2) Spiral Model
3) Quick and Fix model
4) Prototyping Model
5) None of Above

3. Which is not a software life cycle model?
1) Spiral Model
2) Waterfall Model
3) Iterative Model
4) Capability maturity Model
5) V-Shape Model

4. Project risk factor is considered in ?
1) Spiral Model
2) Waterfall Model
3) Prototyping Model
4) Iterative enhancement Model
5) None of Above

5. SDLC stands for?
1) Software design life cycle
2) Software development life cycle
3) System design life cycle
4) System development life cycle
5) None of Above

6. SPIRAL model has?
1) 3 Phases 2) 1 Phase
3) 2 Phases 4) 4 Phases
5) None of Above

7. SRS stands for?
1) Software requirement specification
2) Software requirement solution
3) System requirement specification
4) System requirement ossification 5) None of Above

8. Waterfall model is not suitable for?
1) Small Projects
2) Complex Projects
3) Accommodating change
4) Diminutive Projects
5) None of Above

9. RAD stands for?
1) Rapid Application Development
2) Relative Application Development 3) Ready Application Development
4) Repeated Application Development 5) None of Above

10. RAD Model was purposed by?
1) IBM 2) Motorola
3)Microsoft 4) Lucent Technologies 5) None of Above

11. Software engineering aims at developing?
1) Reliable Software
2) Cost Effective Software
3) Reliable and cost effective Software 4) All of above
5) None of Above

12. A good specification should be?
1) Unambiguous
2) Distinctly Specific
3) Functional 4) All of Above
5) None of Above

13. Which of the following is a tool in design phase?
1) Abstraction 2) Refinement
3) Information Hiding
4) All of Above 5) None of Above

14. Information hiding is to hide from user, details ?
1) That are relevant to him
2) That are not relevant to him
3) That may be maliciously handled by him
4) That are confidential
5) None of Above

15. Which of the following is required to communicate between two computers?
1) Communications software
2) Protocol
3) Communications hardware
4) Access to transmission medium
5) All of the above

16. Devices is used to connect two similar LAN with same protocols
1) Bridges 2) Router
3) Gateway 4) Switch
5) None of these

17. DSL is an example of a (n) ______ connection.
1) Network 2) Wireless
3) Slow 4) Broadband
5) None of these

18. FTP is______
1) used to send email
2) used to browse the Web
3) is part of Netscape
4) Is a protocol for the transfer of files between computers
5) None of these

KEY

1) 2	2) 1	3) 4	4) 1	5) 2
6) 4	7) 1	8) 3	9) 1	10) 1
11) 3	12) 4	13) 4	14) 3	15) 5
16) 1	17) 4	18) 4		